

'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16

సంచిక: 214

బుధవారం 25-10-2023



SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

భద్రత కోసం..

"ఎన్నుకుంటే వెలగబెట్టడం కాదు..
ఇప్పటి దాకా ఏం చేశారో చూడండి"
- కాళోజీ



భవిత కోసం..

బాగు కోసం..

యువ మేధస్సు, కష్టించే రైతు తెలంగాణ సంపద
తెలంగాణ పునర్నిర్మాణం వారితోనే సాధ్యం!



నా తెలంగాణ
"రైతు హలాన.. యువ నరాన.. బిడ్డ భుజాన..
పేదోడి ఆకలి మంటన" నినదించి, కొట్లాడి తెచ్చుకున్నది

పదేండ్లలో ఏం సాధించినం..

ఆకలి సావులు.. నిరుద్యోగ ఛాయలు.. ఆత్మహత్యలు తప్ప..!

అవినీతి పాలకులు.. అసమర్థ ప్రతిపక్షాలు..
అబద్ధపు రాజకీయాల మధ్య..

దశాబ్ద కాలంగా దగా పడ్డ రైతు కోసం, యువత కోసం
మార్పు దిశగా బలహీన వర్గాల గళమై
తెలంగాణాలో అత్యధిక జనాభా ఉన్న
ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల కోసం, బడుగు బలహీన వర్గాల
ఆశాజ్యోతి **రామచంద్ర యాదవ్** గారి నేతృత్వంలో
ఆవిర్భవించి తెలంగాణ ఎన్నికల్లో పోటీ చేయనున్న



"భారత చైతన్య యువజన పార్టీ"కి శుభాకాంక్షలు



చెరకు రైతు గుర్తుకి ఓటేద్దాం.. తెలంగాణ భవితకు బాటేద్దాం..

Telangana State BCY Party Office Address:
No. 8-2-293/82J/28-A, Journalist Colony-A,
Road No.70. Jubilee Hills, Hyderabad - 500 033.

అక్టోబర్ 25 తెలంగాణ రాష్ట్ర కార్యాలయ ప్రారంభం.. అభ్యర్థుల ఎంపికపై కసరత్తు,
ఎన్నికలపై నేతలతో సమీక్ష జరుగును.. ఈ ప్రక్రియ నిమిత్తం మన అధినేత
రామచంద్ర యాదవ్ గారు హైదరాబాద్ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు..

82% ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఉన్న నా తెలంగాణలో ఈ వర్గాలకు చట్టసభల్లో అన్యాయం జరుగుతుంది..
బడుగు బలహీన, పేద వర్గాలన్నిటికి సరైన రాజకీయ వేదిక బీసీవై పార్టీ మాత్రమే..
"సామాన్యుడికి అధికారం - సామాజిక సమతుల్యం బీసీవైతోనే సాధ్యం"

TEAM RCY - తెలంగాణ రాష్ట్రం

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం॥ 25-10-2023


షబ్నమ్ గుప్త

కలల సౌధాన్ని డిజైన్ చేస్తాను! - షబ్నమ్ గుప్త

'ప్రతి ఇంటికీ ఒక వ్యక్తిత్వం ఉంటుంది. ఇంటి యజమాని ప్రాధాన్యతలకు అనుగుణంగా ఆ ఇంటి డిజైనింగ్ ఉండాలి. వారి కలల సౌధాన్ని కళ్ల ముందు నిలప డానికి నేనెప్పుడూ సిద్ధంగా ఉంటాను' అని తన గురించి, తన ప్రాజెక్ట్స్ గురించి వివరించారు ఇటీవల ముంబయ్ నుంచి హైదరాబాద్ వచ్చిన ప్రొఫెషనల్ ఇంటీరియర్ డిజైనర్ షబ్నమ్ గుప్త. 48 ఏళ్ల షబ్నమ్ గుప్త 16 ఏళ్ల వయసు నుంచే ఈ రంగంలోకి వచ్చానని వివరించింది. ఆమె డిజైన్స్ సెలబ్రిటీల ఇళ్లకు మాత్రమే పరిమితం కాలేదు. అపార్ట్‌మెంట్లు, ఫామ్‌హౌజ్‌లు, హాస్పిటల్స్ నుంచి మట్టితో కట్టిన చిన్న రూమ్‌లను కూడా తన విలక్షణ మైన శైలితో ఆవిష్కరిస్తుంటారు. తనే ఇన్నేళ్ల ప్రయాణం గురించి షబ్నమ్ వివరిస్తూ..

''నా జీవితంలో అత్యంత ప్రభావాన్ని కలిగించే వ్యక్తులు ఎవరైనా ఉన్నారంటే అది మా అమ్మానాన్నలు, మా వారు. వాళ్లతో చేసే చర్చలు నాలో ఇంకా స్థిరత్వానికీ, ఎదుగుద లకూ తోడ్పడుతుంటాయి. ఎందుకంటే వాళ్లే నా వర్క్‌లో మొదటి అతిపెద్ద విమర్శకులు. దేనినీ త్వరగా మెచ్చుకోరు. వాళ్లను మెప్పించడం అంటే నేను సూపర్ సక్సెస్ అయినట్టు అనుకుంటాను. అంతగా నా వర్క్‌లో ఇన్‌వాల్వ్ అవుతాను. మొదటిసారి మా నాన్న ఇల్లు కట్టించినప్పుడు నేను చాలా ఆసక్తి కనబరిచాను. చాలా మార్పులు, చేర్పులు చేశాను. నాన్నగారు కూడా నా సూచనలను చాలా బాగా తీసుకున్నారు. అక్కడి నుంచి ఇంటీరియర్, ఆర్కిటెక్చర్ మీద ఇష్టం ఏర్పడింది. దీంతో ఇంటీరియర్ డిజైనింగ్‌లో డిప్లొమా పూర్తి చేశాను. ముంబయ్ రహేజా స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ నుంచి కోర్స్ పూర్తి చేసుకున్నాక సొంతంగా ప్రాక్టీస్ మొదలు పెట్టాను. దీనికి ముందు ప్రముఖ ఆర్కిటెక్ట్ తుషార్ దేశాయ్‌తో కలిసి పనిచేయడం ద్వారా డిజైనింగ్‌లో చాలా నైపుణ్యాలను నేర్చుకున్నాను. ఆ తర్వాత ఫిల్మ్ ప్రొడక్షన్ హౌజ్‌లో ఒక చిన్న పనితో నా లైఫ్ స్టార్ట్ అయ్యింది. అక్కడ నుంచి నా సొంత లేబుల్ పెరుగుతూ వచ్చింది. నా ఖాతాలో ఆదిత్యా చోప్రా, రాణీ ముఖర్జీ, పరిణీతి చోప్రా.. వంటి చాలా మంది బాలీవుడ్ తారల ఇళ్లు, మీడియా హౌజ్‌లు, హాస్పిటల్స్ డిజైన్ చేసినవి ఉన్నాయి.

■ టీమ్ వర్క్..

డిజైనింగ్‌లో ఎప్పుడూ కొత్త కొత్త ఆవిష్కరణలకు స్పేస్ ఉంటుంది. ఇందులో ప్రకృతి, మన సంప్రదాయం, కళలు అన్నింటినుంచి ప్రేరణ పొందవచ్చు. ఈ డిజైనింగ్‌లో ప్రకృతితో మనకు ఒక అనుబంధం ఏర్పడిపోతుంది. ఏ ఒక్కరి జీవిత ప్రయాణం మరొకరితో పోల్చలేం. చాలామంది విజయాలకు వేర్వేరు అర్థాలు ఉంటాయి. మనం చేసే పనిలో సంతృప్తి పొందితే చాలు. మిగతా ట్యాగ్‌లు ఏవీ అక్కర్లేదు. వాటిని నేను సీరియస్‌గా తీసుకోను కూడా. ఇప్పటివరకు నా ప్రయాణం ప్రశాంతతను నేర్పింది. చాలా మందితో కలిసి టీమ్ వర్క్ చేయాల్సి ఉంటుంది. దీనివల్ల మానవ సంబంధాలను తెలుసుకునే వీలుంటుంది. మా టీమ్‌తో పని చేసే సమయంలో చాలా జోవియల్‌గా ఉంటాను. ఎలా అంటే ఒక మానసిక వైద్యుడిలా. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ ఉండటంతో పనిప్రదేశంలో ఉల్లాసంగా ఉంటాం. పట్టణ, నగర వాసాల నుంచి, గ్రామీణ ఇండ్ల వరకు డిజైన్ చేసినవన్నీ నా జాబితాలో ఉన్నాయి. ఈ రంగంలో మన చేత వర్క్ చేయించుకునేవారితో నమ్మకమైన వాతావరణాన్ని సృష్టించుకోవడం ముఖ్యం. అలాగే, వ్యాపారులతో మంచి సంబంధాలు కలిగి ఉండాలి. ఇదే ఇన్నేళ్ల నా ప్రయాణంలో సాధించిన విజయం అనుకుంటాను.

■ ప్రతిదీ సాధనే..

ఆర్కిటెక్చర్‌లో భాగంగా దేశమంతా తిరిగాను. ప్రముఖ ఆర్కిటెక్చురల్ ప్రాధాన్యమున్న స్థలాలన్నీ సందర్శించాను. అవగాహన చేసుకున్నాను. విదేశాల్లోని కట్టడాలు, ఇంటీరియర్ వర్క్ చూస్తూ ప్రయాణించడంతో ప్రతిదానినీ అర్థం చేసుకుంటూ, ఇంకాస్త మెరుగైన పనితనాన్ని నా వర్క్‌లో చూపించడం ఎప్పటికప్పుడూ జరుగుతూనే ఉంటుంది. ఏ ఒక్క రోజు ఇంకో రోజుతో పోల్చలేం. చేయాలనుకున్న పనుల జాబితాను టిక్ చేసుకుంటూ వెళ్లడమే. మొదట్లో గందరగోళంగా ఉండేది. తర్వాత ఏ రోజు పనులు ఆ రోజు చేయడం ఒక అలవాటుగా మారిపోయింది. నా జీవనశైలిలో నా మైండ్ స్పేస్‌ను అర్థం చేసుకోవడం చాలా సవాల్‌గా ఉండేది. జీవితంలో ఏదైనా రూపొందించాలనుకున్నప్పుడు అదొక ప్రాక్టీస్‌గా ఉండాలి.

క్లయింట్స్ ఇళ్లను డిజైన్ చేయడంలో నా స్కిల్‌ని మాత్రమే చూపించాలి. ఇదీ ఒక బాధ్యతాయుతమైన ఉద్యోగమే. ఇంటీరియర్ డిజైనర్‌గా, ఆర్కిటెక్ట్‌గా ఎక్కువ సమయం సిమెంట్, దుమ్ము కొట్టుకుపోయి పనిలో గడిచిపోతుంటుంది. అయినా నాకంటూ కొంత స్పేస్ ఉంచుకుంటాను. ప్రయాణాలు నాకు ఎప్పుడూ ఇష్టం. ఇది ఎల్లప్పుడూ నన్ను పునరుజ్జీవింపజేస్తుంది. చాలాసార్లు పని నుంచి రిలాక్స్ అవడానికి టూర్స్‌ని ఎంచుకుంటుంటాను. వందల ఇళ్లు డిజైన్ చేసి ఉంటాను. ఎన్నో అవార్డులు ఈ రంగంలో అందుకున్నాను. కానీ, నా ఇంట్లో ఏది ఎలా ఉండాలనే నియమం లేదు. అక్కడంతా నా పిల్లల ఇష్టమే. ఎందుకంటే వారి దగ్గర నేను తల్లిని మాత్రమే.

■ భవిష్యత్తు తరాలకు..

దాదాపు ఇరవై ఏళ్ల క్రితం ది ఆరెంజ్ లేన్ ఆ తర్వాత పీకాక్ లైఫ్ పేరుతో ఇంటీరియర్ స్పేస్‌లను క్రియేట్ చేశాను. హైదరాబాద్‌లో కోషా పేరుతో వింటేజ్ స్టైల్ ఫర్నీచర్‌ను లాంచ్ చేశాను. ఇంటీరియర్ డిజైనింగ్‌లో వింటేజ్ స్టైల్ ఇప్పుడు బాగా ట్రెండ్‌లో ఉంది. దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి ముఖ్యంగా రాజస్థాన్, గుజరాత్‌లలోని అతి ప్రాచీన కళా ఖండాలను సేకరించడం, వాటిని రీ మోడలింగ్ చేసి, నేటి తరానికి అందించడంలో నాటి కళను భవిష్యత్తు తరాలకు తీసుకెళుతున్నామనే సంతృప్తి కలుగుతుంది. ఇక నా వ్యక్తిగత విషయానికి వస్తే ప్రయాణాలు అంటే ఎంత ఇష్టమో వ్యక్తిగత అలంకరణ కూడా అంతే ఇష్టం. నా వ్యక్తిగత అలంకరణ కొంచెం బోహో స్టైల్‌లో ఉంటుంది. ఇది స్వేచ్ఛా, స్ఫూర్తిలకు ప్రతీకగా ఉంటుంది. ఎదుటివారు మనల్ని పరిశీలనగా గమనించేంత ప్రత్యేకంగా ఉంటాయి' అని నవ్వుతూ వివరించారు షబ్నమ్.

– నిర్మలారెడ్డి,
ఫొటో: ఎస్.ఎస్.ఠాకూర్

పిల్లలు బాగా చదవాలని తల్లిదండ్రులకు ఉంటుంది. అందుకోసం అదిలించేవారూ బెదిరించేవారూ ఎప్పుడూ నిఘా పెట్టేవారూ ఉంటారు. కాని ప్రయాగ్‌రాజ్‌కు చెందిన ఒక తండ్రి అలా చేయలేదు. 'నీతో పాటు నేనూ చదివి పరీక్ష రాస్తా. చూద్దాం ఎవరికి మంచి ర్యాంక్ వస్తుందో' అన్నాడు. నీట్ - 2023లో కూతురి ర్యాంక్ కోసం తండ్రి చేసిన పని సత్ఫలితం ఇవ్వడమేగాక అందరికీ ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇలా అందరూ చేయకపోవచ్చు. కాని పిల్లల్ని చదివించడానికి పాత విధానాలు పనికి రావని తెలుసుకోవాలి.

కూతురితో పోటీ పడి చదివి...

పేరెంటింగ్


డాక్టర్ ప్రకాష్ ఖైతాన్
మిటాలి

పిల్లల్లో తెలివితేటలు ఉన్నా, సామర్థ్యం ఉన్నా, ఏకాగ్రత ఉన్నా, ఆరోగ్యంగా ఉండి రోజూ కాలేజీకు వెళ్లి పాఠాలు వింటున్నా అంతిమంగా వారిలో 'సంకల్పం' ప్రవేశించకపోతే కావలసిన ఫలితాలు రావు. ముఖ్యంగా పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే తల్లిదండ్రులు బయటి నుంచి పెట్టే వత్తిడి కంటే పిల్లల్లో లోపలి నుంచి వచ్చే పట్టుదల ముఖ్యం. ఆ పట్టుదలను వారిలో ఎలా కలిగించాలో, సంకల్పం బలపడేలా ఎలాంటి మాటలు మాట్లాడాలో తెలుసుకోవడమే తల్లిదండ్రులు ఇప్పుడు చేయవలసింది. 'స్ట్రిక్ట్'గా ఉండటం వల్ల పిల్లలు చదువుతారనే పాత పద్ధతి కంటే వారితో స్నేహంగా ఉంటూ మోటివేట్ చేయడం ముఖ్యం. అలాగే తల్లిదండ్రులు కూడా వారితో పాటు విద్యార్థుల్లాగా మారి, వారు సిలబస్ చదువుకుంటుంటే సాహిత్యమో, నాన్ ఫిక్షనో చదువుతూ కూచుంటే ఒక వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. పిల్లల్ని చదువుకోమని తల్లిదండ్రులు ఫోన్ పట్టుకుంటే, టీవీ చూస్తే... వారికీ అదే చేయాలనిపిస్తుంది. కాబట్టి నీట్, జెఇఇ వంటి కీలకపోటీ పరీక్షలు రాసే పిల్లలున్న తల్లిదండ్రులు తమ పిల్లలకి స్ఫూర్తి కోసం వారి స్వభావాన్ని బట్టి కొత్త విధానాలు వెతకాల్సిందే.

తానే విద్యార్థి అయ్యి

ఈ సంవత్సరం తన కూతురికి నీట్‌లో ర్యాంక్ రావడం కోసం ఒక తండ్రి చేసిన ప్రయత్నం తాజాగా బయటకు వచ్చింది. ఉత్తర ప్రదేశ్‌లో ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్)కు చెందిన డాక్టర్ ప్రకాష్ ఖైతాన్ (49) పెద్ద న్యూరో సర్జన్. అతను 1992లో ఎంట్రన్స్ రాసి మెడిసిన్‌లో సీట్ సంపాదించాడు. 1999లో పీజీ సీట్ సాధించి ఎం.ఎస్.సర్జరీ చేసి, 2003లో న్యూరో సర్జరీ చేశాడు. అంతేకాదు, 2011లో ఎనిమిదేళ్ల పాప మెదడు నుంచి 8 గంటల్లో 296 సిస్టులు తొలగించి గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించాడు. అలాంటి వైద్యుడు తన కుమార్తె మిటాలి నీట్ పరీక్షకు తగినంత సంకల్పంతో చదవడం లేదని గమనించాడు. ఇంటర్ తర్వాత ఎం.బి.బి.ఎస్.లో చేరాలంటే నీట్‌లో ర్యాంక్ సాధించక తప్పదు. 'కోవిడ్ సమయంలో నా కూతురి ఇంటర్ గడిచింది. కోవిడ్ ముగిసినా పాఠాల మీద మనసు లగ్నం చేసే స్థితికి నా కూతురు చేరలేదు. ఆమెను రాజస్థాన్‌లోని కోటాలో కోచింగ్ కోసం చేర్పించాను. కాని అక్కడ నచ్చక తిరిగి వచ్చేసింది. ఏం చేయాలా అని ఆలోచిస్తే ఆమెతో పాటు కలిసి చదవడమే మంచిది అనుకున్నాను. నేను కూడా నీతో చదివి నీట్ రాస్తాను. ఇద్దరం చదువుదాం. ఎవరికి మంచి ర్యాంక్ వస్తుందో చూద్దాం అని చెప్పాను' అన్నాడు డాక్టర్ ప్రకాష్.

ఆమెలో ఉత్సాహం నింపి

ఎప్పుడో 30 ఏళ్ల క్రితం ఎంబిబిఎస్ ఎంట్రన్స్ రాసి సీట్ కొట్టిన తండ్రి తన కోసం మళ్లీసారి పరీక్ష రాస్తాననేసరికి మిటాలికి ఉత్సాహం వచ్చింది. డాక్టర్‌గా బిజీగా ఉన్నప్పటికీ ప్రకాష్ ఉదయం, సాయంత్రం కూతురితో పాటు కూచుని చదివేవాడు. సిలబస్ డిస్కస్ చేసేవాడు. ఏ ప్రశ్నలు ఎలా వస్తాయనేది ఇద్దరు చర్చించుకునేవారు. అలా మెల్లమెల్లగా మిటాలికి పుస్తకాల మీద ధ్యాస ఏర్పడింది. మే 7న జరిగిన నీట్ ఎంట్రన్స్‌లో తండ్రీ కూతుళ్లకు చెరొకచోట సెంటర్ వచ్చింది. ఇద్దరూ వెళ్లి రాశారు. జూన్‌లో ఫలితాలు వస్తే మిటాలికి 90 పర్సెంట్, ప్రకాష్‌కు 89 పర్సెంట్ వచ్చింది. సెప్టెంబర్ చివరి వరకూ అడ్మిషన్స్ జరగ్గా మిటాలికి ప్రతిష్ఠాత్మకమైన మణిపాల్ కస్తూర్బా మెడికల్ కాలేజీలో సీట్ వచ్చింది.

కలిసి సాగాలి

పిల్లలు చదువులో కీలకమైన దశకు చేరినప్పుడు వారితో పాటు కలిసి ప్రయాణం చేయాల్సిన అవసరం తల్లిదండ్రులకు ఉంది. వారితో ఉదయాన్నే లేచి చిన్నపాటి వాకింగ్ చేయడం, బ్రేక్‌ఫాస్ట్ కలిసి చేయడం, కాలేజీలో దిగబెట్టడం, కాలేజీలో ఏం జరుగుతున్నదో రోజూ డిన్నర్ టైమ్‌లో మాట్లాడటం, మధ్యలో కాసేపైనా వారిని బయటకు తీసుకెళ్లడం, వారు చదువుకుంటున్నప్పుడు తాము కూడా ఏదో ఒక పుస్తకం పట్టుకుని కూచోవడం చాలా ముఖ్యం. దీనికంటే ఒక అడుగు ముందుకేసిన డాక్టర్ ప్రకాష్ కూతురుతో పాటు ఏకంగా ఎంట్రన్స్‌కు ప్రిపేర్ అవడం.. ఆ వయసులో తనే చదవగలిగినప్పుడు... నీ వయసులో నువ్వు చదవడానికి ఏమి అనే సందేశం ఇచ్చి కూతురిని గెలిపించుకున్నాడు.


అన్నీ కుమారి

'ఆర్టిస్ట్‌గా అన్నీ కుమారి ప్రత్యేకత ఏమిటి?'
అనే ప్రశ్నకు ఒక ముక్కలో జవాబు చెప్పాలంటే...
'మాథ్స్, ఆర్ట్‌ను మిళితం చేసి సరికొత్త ఆర్ట్‌ను సృష్టించింది'
జీవితం కూడా గణితంలాంటిదే.
కొన్ని సమస్యలు సులభంగా పరిష్కారం అవుతాయి.
కొన్ని ఎంతకీ కావు... ఈ సారాంశం కుమారి చిత్రాల్లో ప్రతిఫలిస్తుంది...

● కళ

చిద్విలాస చిత్రగణితం

మనం పుట్టి పెరిగిన వాతావరణం ఆలోచనల్లో, ఆచరణలో, చివరికి ఆర్ట్‌లో కూడా ప్రభావం చూపుతుంది. దీనికి నిలువెత్తు సాక్ష్యం అన్నీ కుమారి ఆర్ట్. గణితం, సంగీతం, క్రాఫ్ట్‌ల గురించి విలువైన చర్చలు జరిగే ఇంట్లో పెరిగింది కుమారి. చిన్నటిప్పటి నుంచి తనకు లెక్కలు అంటే ఇష్టం. లెక్కలంటే భయపడే పిల్లలకు భిన్నంగా అన్నీ కుమారి గంటల తరబడి లెక్కలు చేస్తూ కూర్చునేది. అంకెలు, సంఖ్యలు తన ప్రియ నేస్తాలుగా మారాయి.

'ఆర్ట్‌కు లెక్కలకు దోస్తు కుదరదు' అంటారు. అయితే అన్నీకి లెక్కలు అంటే ఎంత ఇష్టమో, ఆర్ట్ అంటే కూడా అంతే ఇష్టం. అయితే ఆర్ట్ స్కూల్‌లో మాత్రం అంకెలు నచ్చినంతగా చిత్రాలు నచ్చలేదు. తనకు కావాల్సినదేదో ఆ చిత్రాల్లో లోపించినట్లుగా అనిపించేది. ఆ సమయంలో రకరకాల ప్రయోగాల గురించి ఆలోచించేది. విజువల్ వకాబులరీ సృష్టించాలనే ఆలోచన అలా వచ్చిందే.

ఆర్ట్ స్కూల్ తరువాత...

బొమ్మలు గీస్తూ కూర్చోలేదు. తనలోని శూన్యాన్ని భర్తీ చేసుకోవడానికి ప్రయాణాన్ని సాధనంగా ఎంచుకుంది.

జార్ఖండ్‌లోని హజరీబాగ్‌కు వెళ్లి సోరాయి మ్యూరల్ ఆర్ట్ సంప్రదాయాన్ని, తమిళనాడు వెళ్లి కోలమ్ ఫ్లోర్ డ్రాయింగ్ సంప్రదాయాన్ని అధ్యయనం చేసింది. ఆ కళలో చుక్కలు, గీతలు, వంకలు చూస్తుంటే రకరకాల గణిత సూత్రాలు కంటిముందుకు వచ్చేవి. దీనికితోడు ప్రాచీన భారతీయ ఆలయాలలోని ఆర్కిటెక్చర్‌లో గణితం ఒక భాగమై ఉందనే విషయాన్ని అర్థం చేసుకుంది. ప్రకృతి ప్రపంచానికి, గణిత సూత్రాలకు మధ్య ఉండే అంతర్లీన సంబంధం కుమారిని ఆకట్టుకుంది.

సైన్స్‌కు ఉండే శక్తి అది సృష్టించే వస్తువుల్లో కనబడుతుంది. ఇక ఆర్ట్‌కు ఉండే శక్తి మానవ ఉద్వేగాలను, అనుభవాలను ప్రతిఫలించే వేదికలో కనబడుతుంది. ముఖ్య అంశం ఏమిటంటే గణితానికి సంబంధించిన సంక్లిష్టతను సరళీకరించి జనాలలోకి తీసుకువెళ్లే శక్తి ఆర్ట్‌కు ఉంది. అందుకే ఈ రెండు బలమైన మాధ్యమాలను ఒకేచోటుకి తీసుకురావాలనుకుంది.


> సైన్స్‌కు ఉండే శక్తి అది సృష్టించే వస్తువుల్లో కనబడుతుంది. ఇక ఆర్ట్‌కు ఉండే శక్తి మానవ ఉద్వేగాలను, అనుభవాలను ప్రతిఫలించే వేదికలో కనబడుతుంది.

తను సృష్టించే ఆర్ట్ ఎలా ఉండాలంటే...

మన సంస్కృతీ, సంప్రదాయాలలోకి తిరిగి ప్రయాణించేలా, మన కళలను పండగలా సెలబ్రేట్ చేసుకునేలా, మన మూలాలతో ఆత్మీయంగా కనెక్ట్ అయ్యేలా ఉండాలి అనే లక్ష్యంతో బయలుదేరింది. ఆ లక్ష్యసాధనలో విజయం సాధించి ఆర్టిస్ట్‌గా తనదైన ప్రత్యేకత నిలుపుకుంది. తాజాగా అన్నీ కుమారి ఆర్ట్ ఎగ్జిబిషన్ ముంబైలోని తావో ఆర్ట్ గ్యాలరీలో జరుగుతోంది.

బ్యూటిప్స్

సబ్జాతో మరింత కాంతిమంతం



సబ్జాగింజలను నీటిలో నానబెట్టి , పేస్టు చేయాలి. ఈ పేస్టులో టీస్పూను బాదం నూనె వేసి కలపాలి. ఈ పేస్టుని ముఖానికి పూతలా రాయాలి. పదినిమిషాలు ఆరాక మరోసారి పూత వేయాలి. పూర్తిగా ఆరాక చల్లటి నీటితో ముఖాన్ని కడిగేయాలి. దీంతో మీ ముఖం కాంతిమంతంగా, ఫ్రెష్‌గా కనిపిస్తుంది.

పంటికి జామ



నాలుగు జామ ఆకులని నీటిలో వేసి మరిగించాలి. మరిగిన నీటిని వడగట్టి..గోరువెచ్చగా ఉన్నప్పుడు నోట్లో పోసుకుని పుక్కిలించాలి. ఇలా పుక్కిలించడం వల్ల పంటినొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. జామ ఆకుల రసం పళ్లను మరింత దృఢంగా మారుస్తుంది.

ఆంగ్ల మహా సముద్రంలో ఆనంద విహారం

యూత్ పల్స్

'ఇక నీకు పూర్తిగా వచ్చేసినట్లే' అని ఆంగ్లం ఎప్పుడూ అభయం ఇవ్వదు.

ఆంగ్లభాషను ఎప్పటికప్పుడూ శోధిస్తూ పట్టు సాధిస్తూనే ఉండాలి... ఈ విషయంలో స్పష్టతతో ఉన్న యువతరం ఆంగ్ల మహాసముద్రంలో కలుస్తున్న నదులు, వాగులు, వంకల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే ఉంది.

నిత్యావసర భాష అయిన ఆంగ్లంలో నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి సిట్‌కామ్స్ నుంచి చాట్‌జీపీటి టూల్స్ వరకు ఎన్నో దారులలో ప్రయాణిస్తోంది...



సిట్‌కామ్ (సిచ్యువేషనల్ కామెడీ షో)తో కాసేపు హాయిగా నవ్వుకోవచ్చు అనేది పాత మాట. నవ్వుకోవడమే కాదు పదసంపద, నేటివ్ స్పీచ్‌పై పట్టు సంపాదించడానికి, పదాలతో ముడిపడి ఉన్న భావోద్వేగాల గురించి లోతుగా తెలుసుకోవడానికి సిట్‌కామ్‌లలోని విజువల్ ఎలిమెంట్స్ ఉపయోగపడతాయి అనేది నేటి మాట. అలాంటి సిట్‌కామ్స్‌లో కొన్ని...

చీర్స్ (1982-1993)

థీమ్ సాంగ్ 'ఎవ్రీబడీ నోస్ యువర్ నేమ్' నుంచి చివరి డైలాగ్ వరకు ఏదో ఒక కొత్తపదం పరిచయం అవుతూనే ఉంటుంది. రకరకాల సెట్‌లలో కాకుండా ఒకటే లొకేషన్‌లో చిత్రీకరించడం వల్ల ఒకేచోట పూర్తిగా దృష్టి కేంద్రీకరించవచ్చు. 'చీర్స్'లోని హాస్యాన్ని సులభంగా అర్థం చేసుకోవచ్చు.

ఫ్రైజర్ (1993-2004)

చీర్స్‌లోని ఎపిసోడ్‌లను అర్థం చేసుకున్నవారికి ఫ్రైజర్ కష్టమేమీ కాదు. ఈ సిట్‌కామ్‌లోని ప్రధాన పాత్రలైన ఫ్రైజర్, నీల్ మార్టిన్‌ల క్లీన్ యాక్సెంట్‌ను సులభంగా అర్థం చేసుకోవచ్చు. 'ఫ్రైజర్' నిండా ఇంటెలిజెంట్ హ్యూమర్ వినిపించి కనిపిస్తుంది.

ది సింప్సన్స్ (1980)

ది సింప్సన్ టీవీ సిరీస్ ఇప్పటికీ ప్రేక్షకులను అలరిస్తూనే ఉంది. ఈ యానిమేటెడ్ సిట్‌కామ్‌లో క్యారెక్టర్‌ల మధ్య నడిచే సంభాషణలు ఫ్యామిలీ టాపిక్స్‌పై ఉంటాయి. రియల్-లైఫ్ ఫ్రేజ్‌లపై అవగాహనకు ఉపయోగపడుతుంది. పుస్తకాల కంటే సహజమైన భాషను నేర్చుకోవచ్చు.

> 'ఇక నాకు అంతా వచ్చేసినట్లే' అనే మాట ఆంగ్లం విషయంలో ఎప్పటికీ వినిపించదు. ఎందుకంటే... ఆంగ్ల భాష అనగానే వినిపించే ప్రసిద్ధ మాట... వర్క్ ఇన్ ప్రోగ్రెస్. అందుకే ఆంగ్లంలో ఎప్పటికప్పుడు సరికొత్త నైపుణ్యాన్ని సంపాదించుకోవడానికి యువతరం వివిధ మార్గాలలో ప్రయాణిస్తుంది.

ది వండర్ ఇయర్స్ (1988-93)

మధ్యతరగతి కుటుంబానికి చెందిన కెవిన్ అర్నాల్డ్ అనే టీనేజర్ ప్రధాన పాత్రలో కనిపించే సిట్‌కామ్ ఇది. యువత మానసిక ప్రపంచానికి అద్దం పడుతుంది. కెవిన్ అతని ఫ్రెండ్స్ ఎదుర్కొనే రకరకాల సమస్యలతో యూత్ ఆటోమేటిక్‌గా రిలేట్ అవుతారు. యంగ్ పీపుల్ ఇంగ్లిష్‌లో కమ్యూనికేట్ చేసే పద్ధతిని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది.

ది ఫ్రెష్ ప్రిన్స్ ఆఫ్ బెల్-ఎయిర్ (1990-1996)

ఈ హిట్ కామెడీ షోలో ఎక్కువమందిని ఆకట్టుకునే క్యారెక్టర్ విల్ స్మిత్. ఫన్నీ డైలాగులు, జోక్స్‌ను సులభంగా అర్థం చేసుకోవచ్చు. సోషల్ క్లాస్ స్పీకింగ్ ఇంగ్లిష్ నుంచి స్ట్రీట్ ఇంగ్లీష్ వరకు అవగాహన ఏర్పర్చుకోవచ్చు.

ఫ్యామిలీ మ్యాటర్స్ (1989-1998)

ఈ సిట్‌కామ్‌లో కనిపించే రకరకాల ఎక్స్‌ప్రెషన్‌లు, గెశ్చర్ లెర్నర్స్‌కు ఉపయోగపడతాయి. స్పష్టమైన, సంక్షిప్తమైన యాక్సెంట్ వినిపిస్తుంది. కుటుంబ జీవితానికి సంబంధించి ఇళ్లల్లో వినిపించే ఇంగ్లిష్ ఇడియమ్స్ గురించి తెలుసుకోవచ్చు.

ది నానీ (1993-1999)

రకరకాల యాక్సెంట్‌లను ఈ సిట్‌కామ్‌లో వినవచ్చు. సామాన్య ప్రజలతో పోల్చితే ధనవంతులు ఎలా మాట్లాడతారో చూడవచ్చు... ఇవి మచ్చుకు కొన్ని సిట్‌కమ్స్ మాత్రమే. ఎన్నో కోణాలలో భాషను మెరుగు పరుచుకునే సిట్‌కామ్‌లు ఎన్నో ఉన్నాయి.

అప్-టు-డేట్ ఇంగ్లిష్ లెసన్స్ ప్లాట్‌ఫామ్ 'సెన్సేషన్ ఇంగ్లిష్'పై కూడా యూత్ ఆసక్తి చూపుతుంది. ఇంటర్నేషనల్ న్యూస్ వీడియోలు, ఆర్టికల్స్ ద్వారా 5 లెవెల్స్‌లో భాషను మెరుగు పరుచుకోవచ్చు. 'ప్రాక్టీస్ యువర్ ఇంగ్లిష్ టుడే' అంటోంది లాంగ్వేజ్ లెర్నింగ్ యాప్ ప్రోమోవ. మూడు వేల పదాలతో కూడిన 40 థీమ్డ్ టాపిక్స్, ఇడియమ్స్, స్లాంగ్ వర్డ్స్, ఎవ్రీ డే ఎక్స్‌ప్రెషన్స్ ప్రోమోవలో ఉన్నాయి. లైవ్ లెసన్స్, కాన్వర్‌జేషన్ ఈవెంట్స్, ఏఐ ప్రాక్టీస్ టాస్క్స్, సోషల్ లెర్నింగ్ గేమ్స్, లెర్నింగ్ జర్నీ తమ ప్రత్యేకతగా చెబుతుంది విజువల్ వరల్డ్స్ ఇమార్స్.

లాంగ్వేజ్ లెర్నింగ్‌లో కీలక పరిణామం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ). స్థానిక, స్థానికేతరులను భాష నైపుణ్యం మెరుగుపరుచుకోడానికి, పర్సనలైజ్‌డ్ లాంగ్వేజ్ లెర్నింగ్ ఎక్స్‌పీరియన్స్‌కు ఈ సాంకేతికత ఉపయోగపడుతుంది. ఉదా: లెర్నర్స్ బలాలు, బలహీనతల ఆధారంగా పర్సనలైజ్‌డ్ కరికులమ్‌ను, లాంగ్వేజ్ లెర్నింగ్ గేమ్స్‌ను రూపొందిస్తుంది. తప్పులను ఎత్తి చూపుతుంది.

ఇంగ్లిష్ లిరిక్స్ వినడం ద్వారా కూడా భాషలో నైపుణ్యాన్ని పెంపొందించుకునే ధోరణి పెరుగుతోంది. దీని ద్వారా ఎప్పటికప్పుడు రకరకాల యాక్సెంట్‌లను అర్థం చేసుకోవచ్చు. పదసంపద పెంచుకోవచ్చు. బెటర్ ప్రొనన్సియేషన్‌కు ఉపయోగపడుతుంది.

అలనాటి ప్రసిద్ధ ఇంగ్లిష్ పాటల్లో ఎన్నో ప్రయోగాలు కనిపిస్తాయి. ఎల్విస్ ప్రెస్లీ, మైకెల్ జాక్సన్ నుంచి నిన్న మొన్నటి కుర్రకారు సంగీతకారుల వరకు ఎంతోమంది పాత పదాలను కొత్తగా ప్రయోగించారు.

'ఇంగ్లిష్ భాషలో నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి ఉపకరించే పాటలు' అంటూ ప్రతి సంవత్సరం కొన్ని పాటలను సిఫారసు చేస్తున్నారు ఆంగ్ల భాషా నిపుణులు.

'ఇక నాకు అంతా వచ్చేసినట్లే' అనే మాట ఆంగ్లం విషయంలో ఎప్పటికీ వినిపించదు. ఎందుకంటే... అంగ్ల భాష అనగానే వినిపించే ప్రసిద్ధ మాట... వర్క్ ఇన్ ప్రోగ్రెస్. అందుకే ఆంగ్లంలో ఎప్పటికప్పుడు సరికొత్త నైపుణ్యాన్ని సంపాదించుకోవడానికి యువతరం వివిధ మార్గాలలో ప్రయాణిస్తుంది.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 214

బుధవారం 25-10-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'



దక్షిణాఫ్రికా ధమాకా

డికాక్ భారీ సెంచరీ. బంగ్లాదేశ్‌పై 149 పరుగులతో గెలుపు. - 12లో



మూడో అతిపెద్ద ఎకానమీ..

2030 నాటికి 7.3 ట్రిలియన్ డాలర్ల ఆర్థికశక్తిగా భారత్! - 13లో




సన్నిహిత అధికారికి కేబినెట్ హోదా

ప్రభుత్వ సర్వీస్ నుంచి స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన అధికారికి ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ కేబినెట్ హోదా కట్టబెట్టారు. - వివరాలు 6లో



అరగంటలో 158 కార్లు ఢీ

అమెరికాలో దట్టమైన పొగ కారణంగా భారీ రోడ్డు ప్రమాదం జరిగింది. 158 వాహనాలు ఢీకొట్టుకున్నాయి. ఏడుగురు చనిపోయారు. - వివరాలు 6లో



మణిపూర్ హింసలో బయటి శక్తులు

మణిపూర్‌లో చెలరేగిన జాతుల హింస వెనక విదేశీ శక్తుల ప్రమేయముందని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ అనుమానించారు. - వివరాలు 6లో



తీవ్ర తుపానుగా 'హమూన్'

బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్ప పీడనం తీవ్ర తుపానుగా మారింది. దానికి వాతావరణ శాఖ 'హమూన్' అని పేరు పెట్టింది. - వివరాలు 6లో

బీజేపీకి బిగ్ ఝలక్!

అసంతృప్త నేతలతో టచ్‌లోకి కాంగ్రెస్..

- పార్టీని వీడేందుకు సిద్ధమైన స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి
- కాంగ్రెస్‌లో చేరికపై నేడు నిర్ణయం ప్రకటించే అవకాశం
- తనతో పాటు తన భార్యకు టికెట్లు ఆశించిన రాజగోపాల్
- తొలి జాబితాలో చోటివ్వని జాతీయ నాయకత్వం
- రాజగోపాల్ బాటలో మరో ఇద్దరు, ముగ్గురు కీలక నేతలు కూడా..

కాంగ్రెస్ రెండో జాబితా ఆగింది వీరి కోసమేనా?



రేపు రెండో జాబితా?

బీజేపీ రెండో జాబితాను గురువారం ఢిల్లీలో జాతీ య నాయకత్వం ప్రకటించే అవకాశాలున్నాయని పార్టీవ ర్గాల సమాచారం. ఈ మేరకు 26న జరగనున్న సెం ట్రల్ ఎలక్షన్ కమిటీ భేటీకి రాష్ట్రపార్టీ ముఖ్యనేతలు కూడా హాజరుకానున్నట్టు తెలిసింది. తొలి జాబితాలో 52 మంది అభ్యర్థులను ప్రకటించగా..మిగిలిన 67 సీట్లకు ఒకటి లేదా రెండు జాబితాలు ప్రకటించే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ఇలావుండగా తొలి జాబితాలో పార్టీ టికెట్లు దక్కించుకున్నవారు ఈ 28న మంచిరోజు కావడంతో అప్పటి నుంచి ప్రచారం ప్రారంభించాలని నాయకత్వం సూచించింది. ఈలోగా నామినేషన్ దాఖలుకు సంబంధించిన డాక్యు మెంట్లు, అఫిడవిట్లు, ఇతరత్రా సమాచారం సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేసినట్టు సమాచారం.

సాక్షి, హైదరాబాద్: బీజేపీలో సద్దుమణిగిందని అనుకుంటున్న అసంతృప్తి మళ్లీ రాజుకుందా? అం టే.. తాజా పరిణామాలు అవుననే సమాధానమే ఇస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే పార్టీ అభ్యర్థుల తొలి జాబితా ప్రకటించి రెండో జాబితా విడుదలకు కసరత్తు చేస్తుండగా, మరికొన్ని రోజుల్లోనే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న సమయంలో.. కొందరు కీలక నేతలు బీజేపీని వీడేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు, ఎన్నికల స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నేడో, రేపో తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు విశ్వస నీయ సమాచారం. మరో ఇద్దరు ముగ్గురు నేతలు కూడా ఆయన బాటలో నడవనున్నారని తెలిసింది.

కాంగ్రెస్ సంప్రదింపులతో సుముఖత!

కార్యకర్తలు, శ్రేయోభిలాషులతో సమావేశమైన తర్వాత తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని రాజ్‌గోపాల్ రెడ్డి చెప్పడం ప్రాధాన్యత సంతరించుకుంది. మొదటి జాబితాలో తనకు (ఎల్‌బీనగర్), తన భార్య లక్ష్మికి (మునుగోడు) టికెట్లను రాజ్‌గోపాల్ రెడ్డి ఆశించారు. కానీ నాయకత్వం ప్రకటించిన జాబితాలో ఆ స్థానాలతో పాటు వీరి పేర్లు చోటు చేసుకోలేదు. రాష్ట్ర పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్‌కు మాత్రం రెండు సీట్లలో (హుజూరాబాద్, గజ్వేల్) పోటీకి అధిష్టానం అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలో రాజగోపాల్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారని భావించిన కాంగ్రెస్ పార్టీ, ఆయనతో సంప్రదింపులు జరిపినట్టు తెలిసింది. రాజగోపాల్ కూడా సానుకూలంగా స్పందించారని, బుధవారం ఆయన తన నిర్ణ యాన్ని ప్రకటిస్తారని విశ్వసనీయ సమాచారం.

ఇదే బాటలో మరికొందరు!

రాజగోపాల్‌రెడ్డితో పాటు మరో ఇద్దరు ముగ్గురు కీలక నేతలు కూడా పార్టీని వీడనున్నట్లు తెలుస్తోం ది. వీరిలో గతంలో రెండుసార్లు ఎంపీగా ఉన్న ఉత్తర తెలంగాణకు చెందిన ఓ నేత అసెంబ్లీకి

మిగతా 2వ పేజీలో ▶

మేడిగడ్డకు కాఫర్ డ్యాం!

నీటిపారుదల శాఖ నిర్ణయం

- కుంగిన బ్యారేజీకి మరమ్మతులు చేయాలంటే నిర్మాణం తప్పనిసరి
- ఒకట్రెండురోజుల్లో పనులు..
- 19, 20 నంబర్ పియర్లు కుంగినట్లు, 18, 21 పియర్లకూ నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా
- డీవాటరింగ్ తర్వాత నష్టంపై స్పష్టత

సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీకి మర మ్మతుల్లో భాగంగా తాత్కాలికంగా కాఫర్ డ్యాం నిర్మించాలని నీటిపారుదల శాఖ నిర్ణ యించింది. ఇందుకు సంబంధించిన ప్రక్రి యను నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ ఒకటి రెండు రోజుల్లో ప్రారంభించే అవకాశాలున్నాయి. మేడిగడ్డ బ్యారేజీని ఏడు బ్లాకులుగా విభజించి నిర్మించగా, ఒక్కో బ్లాక్‌లో 12 పియర్లున్నాయి. ఏడో బ్లాక్‌లోని 19, 20వ నంబర్ పియర్లకు

మిగతా 5వ పేజీలో ▶



బ్యారేజీని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

2 గంటలు.. క్షుణ్ణంగా

- మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించిన కేంద్ర బృందం
- ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ నేతృత్వంలో ఆరుగురు సభ్యులు రాక
- 15 నుంచి 22వ పియర్ వరకు క్రస్ట్ గేట్ల పనితీరు పరిశీలన
- అంతా గోప్యంగానే.. పోలీసు పహారాలో బ్యారేజీ ప్రాంతం -5లో

జంగ్ తెలంగాణ

- లేడీస్ ఫస్ట్

ఉమెనిఫెస్టో ప్లీజ్

ఎండమావిగానే సమాన అవకాశాలు

- ఆస్తులు సరే.. ఆరోగ్యం సంగతేంటి?

ఫిట్టా.. ఫట్టా?

నేతలు వెల్లడించాలన్న ఐఎంఏ

పచ్చ నోట్ల మధ్య పదునెక్కని ఓటు

మారుతున్న ఎన్నికల తీరుపై మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

ఇద్దరికీ ఇబ్బందులే..

రాజస్తాన్‌లో ఆసక్తికరంగా ఎన్నికల పోరు

- వివరాలు 7,8లో

న్యూస్‌రీల్

కేసీఆర్ సభల షెడ్యూల్లో స్వల్ప మార్పు



సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచార షెడ్యూల్‌లో స్వల్పమార్పులు జరిగాయి. దీని ప్రకారం.. 26న వనపర్తి, అచ్చంపేట, మునుగోడు, 27న మహబూబాబాద్, వర్ధన్నపేట, పాలేరులో జరిగే సభల్లో కేసీఆర్ ప్రసంగిస్తారు.

- వివరాలు 2లో

దివికేగిన దిగ్గజం



భారత స్పిన్ లెజెండ్ బిషన్ సింగ్ బేడీ(77) సోమవారం న్యూఢిల్లీలో కన్నుమూశారు. 1967 నుంచి 1979 వరకు కొనసాగిన తన అంతర్జాతీయ కెరీర్‌లో 67 టెస్టులు ఆడి 266 వికెట్లు పడగొట్టారు. భారత్‌కు 22 టెస్టుల్లో కెప్టెన్‌గా వ్యవహరించారు.

- వివరాలు 12లో

ఇదండీ సంగతి



సీఎం ఎవరు కాదో నిర్ణయిస్తే చాలు! ఎందుకంటే అందరూ సీఎం అభ్యర్థులే

27న సూర్యాపేట ఎన్నికల సభకు అమిత్‌షా

- సభ అనంతరం ముఖ్య నేతలతో భేటీ
- ఎన్నికల్లో పోటీకి విముఖంగా ఉన్న నేతలతో చర్చ!
- 28, 29 తేదీల్లో అస్సాం సీఎం, 31న యూపీ సీఎం రాక



సాక్షి, హైదరాబాద్: కేంద్ర హోం మంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా ఈ నెల 27న సూర్యాపేటలో నిర్వహిస్తున్న అసెంబ్లీ ఎన్నికల బహిరంగ సభకు హాజరుకాను న్నారు. సభ ముగిశాక నగరంలో రాష్ట్ర పార్టీ ముఖ్యనేతలతో ఆయన భేటీ కానున్నట్టు సమాచారం. ఈ సందర్భంగా ఎన్నికల్లో పోటీ చేసేందుకు విముఖంగా ఉన్న నేతలను అమిత్‌షా ప్రత్యేకంగా పిలిపిం చి మాట్లాడనున్నట్టు తెలిసింది. అప్పటికి అభ్యర్థుల రెండోజాబితా కూడా వెలువడే అవకాశాలున్నందున 28వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించడం, ప్రస్తావించాల్సిన విషయాలు, ప్రచార శైలి తదితర అంశాలపై ఆయన స్పష్టతనివ్వనున్నట్టు తెలుస్తోం ది. పార్టీపరంగా అభ్యర్థుల ఎన్నికల ప్రచారాన్ని కూడా ఈ నెల 28 నుంచి ప్రారంభించాలని నిర్ణయించిన నేపథ్యంలో దీనికి సంబంధించి న సూచనలు చేయనున్నారు. కాగా, 28, 29 తేదీల్లో ఎన్నికల ప్రచారా నికి అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ, 31న యూపీ సీఎం యోగి ఆది త్యనాథ్ రాష్ట్రానికి రానున్నారు. అయితే వారు పాల్గొనే ప్రచార సభ లు, రోడ్‌షోలపై ఒకట్రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

మళ్లీ రాష్ట్రానికి రాహుల్

- వచ్చే నెల మొదటి వారంలో పర్యటన
- ఈనెల 26, 27 తేదీల్లో రోజుకు రెండు నియోజకవర్గాల్లో పర్యటించనున్న సీనియర్లు
- షెడ్యూల్ రూపొందిస్తున్న కాంగ్రెస్
- 31న పాలమూరులో ప్రియాంక ప్రజాభేరి సభ



సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అగ్ర నేత రాహుల్‌గాంధీ మరోమారు రాష్ట్రానికి రానున్నారు. రెండో విడత బస్సు యాత్రను ఆయన వచ్చే నెల మొదటి వారంలో ప్రారంభిస్తారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. అయితే రాహుల్‌గాంధీ ఎక్కడ పాల్గొం టారనేది ఖరారు కావాల్సి ఉంద న్నాయి. మొదటి విడత బస్సు యాత్రలో భాగంగా మూడు రోజు లపాటు ఉత్తర తెలంగాణలోని 8 నియోజకవర్గాల్లో పర్యటించిన రాహుల్ ఈసారి దక్షిణ తెలంగాణలో పర్యటించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఇక, ప్రియాంకాగాంధీ ఈనెల 31న కొల్లాపూర్‌లో జరిగే పాలమూరు ప్రజాభేరి సభకు హాజరు కానున్నారు. ఆ రోజున సాయం త్రం శంషాబాద్ విమానాశ్రయానికి రానున్న ఆమె అక్కడి నుంచి నేరుగా వెళ్లి కొల్లాపూర్ సభలో పాల్గొంటారని పార్టీ వర్కింగ్ ప్రెసిడెం ట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. మరోవైపు రాష్ట్ర నేతలు మొదటి విడత బస్సు యాత్రను ఈనెల 26, 27 తేదీల్లో కొనసాగిం చేలా పార్టీ షెడ్యూల్ రూపొందించింది. ఈ రెండు రోజుల్లో మాణి క్‌రావ్ ఠాక్రే, రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమ టిరెడ్డి, వీహెచ్‌తోపాటు మొత్తం 10 మంది నాయకులు రోజుకు రెండు నియోజకవర్గాల చొప్పున 40 నియోజకవర్గాల్లో పర్యటించేలా షెడ్యూల్ తయారు చేస్తున్నారు. ఈ రెండు రోజులపాటు ఆయా నియో జకవర్గాల్లో గడప గడపకూ వెళ్లి

మిగతా 2వ పేజీలో ▶



ఒక్కరోజులో 704 మంది బలి

- గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఉధృతం
- 24 గంటల్లో 400 వైమానిక దాడులు
- మొత్తం 6,487కి చేరిన మృతులు
- వీరిలో 2.055 మంది చిన్నారులు..
- మరో ఇద్దరు బందీలను విడుదల చేసిన హమాస్ మిలిటెంట్లు

6లో

బంధించారు.. కర్రలతో కొట్టారు

- హమాస్ చెరనుంచి విడుదలైన లిఫ్‌షిట్జ్ వెల్లడి

56% యువత, ఉద్యోగులే..

- వందేభారత్ ప్రయాణికులపై రైల్వే సర్వే.. తక్కువ ప్రయాణ సమయం.. విలాసవంతమైన అనుభూతే కారణం -14లో



రామగుండం విద్యుత్ కేంద్రంలో మంటలు

- షార్ట్ సర్క్యూట్‌తో బీ–థర్మల్ ఉత్పత్తి కేంద్రంలో అగ్నిప్రమాదం.. తప్పిన ప్రాణాపాయం -5లో

యూత్ కాంగ్రెస్ 'నారాజ్'

- టికెట్ల కేటాయింపులో తమను పట్టించుకోవడం లేదంటున్న కాంగ్రెస్ యువ నాయకులు
- కనీసం 3 టికెట్లు ఇవ్వాలని పట్టు
- మూకుమ్మడి రాజీనామాలు చేసే యోచన
- నేడు గాంధీభవన్ వేదికగా కీలక భేటీ - 2లో



ప్రగతిభవన్‌లో దసరా సంబురాలు

➤ సీఎం కేసీఆర్ అధికారిక నివాసం ప్రగతిభవన్‌లో సోమవారం విజ యదశమి వేడు కలు ఘనంగా జరి గాయి. సీఎం కేసీఆర్.. తన సతీ మణి శోభమ్మ, కుమారుడు మం త్రి కేటీఆర్, కోడలు శైలిమ, మన వడు హిమాన్షుతో కలిసి ప్రగతిభ వన్‌లోని నల్లపోచమ్మవారి ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించి, పాల పిట్టను దర్శించుకుని వాహన, ఆయుధ పూజల్లో పాల్గొన్నారు.

- వివరాలు 14లో

క్లుప్తంగా...

టికెట్ల కేటాయింపుపై ఎవరూ మాట్లాడొద్దు

అలా మాట్లాడితే చర్యలు తీసుకుంటాం: ఏఐసీసీ కార్యదర్శి మన్సూర్ అలీఖాన్



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ టికెట్ల కేటాయింపు విషయంలో బహిరంగంగా ఎవరూ మాట్లాడవద్దని తమ పార్టీ నేతలను కాంగ్రెస్ పార్టీ హెచ్చరించింది. పార్టీలో ఏవైనా విభేదాలుంటే అంతర్గత వేదికల్లో మాత్రమే మాట్లాడాలని, ఎవరూ పార్టీకి వ్యతిరేకంగా, నాయకత్వానికి వ్యతిరేకంగా బహిరంగ ప్రకటనలు చేయవద్దని ఏఐసీసీ కార్యదర్శి మన్సూర్ అలీ ఖాన్ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. పార్టీ టికెట్ల కేటాయింపు విషయంలో ఇంకా సంప్రదింపులు కొనసాగుతున్నాయని, ఈ సమయంలో కొందరు నేతలు పత్రికా సమావేశాలు ఏర్పాటు చేసి మాట్లాడుతున్నారని, అలా మాట్లాడటం కాంగ్రెస్ పార్టీ నిబంధనలకు వ్యతిరేకమని, పార్టీ నియమావళికి వ్యతిరేకంగా వెళితే సదరు నేతలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కేసీఆర్‌కు మద్దతుగా యూపీ రైతు నేతల ప్రచారం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా ప్రచారం చేస్తామని ఉత్తరప్రదేశ్ రైతు సంఘం నాయకులు ప్రకటించారు. యూపీ రైతు సంఘం నాయకులు రాఘవేంద్ర కుమార్ బలియా నుంచి తన మద్దతుదారులతో కలిసి మంగళవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. రాఘవేంద్ర కుమార్ బృందాన్ని దక్షిణ భారత రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కోటపాటి నరసింహం నాయుడు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా యూపీ రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో మూడోసారి కె.చంద్రశేఖర్‌రావు ప్రభుత్వం ఏర్పడాలని హైదరాబాద్ కేంద్రంగా ప్రచారం చేస్తామన్నారు.

కోడ్ పేరిట సామాన్యులను ఇబ్బంది పెట్టొద్దు

కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాస్తాం: కాంగ్రెస్ నేత నిరంజన్



సాక్షి, హైదరాబాద్: ఓటర్లను ప్రలోభ పెట్టకుండా డబ్బు కట్టడి చేయాలని మాత్రమే ఎన్నికల సంఘం చెప్పిందని, రోడ్ల మీద తనిఖీలు చేసి ఎన్నికల కోడ్ పేరిట సామాన్యులను ఇబ్బంది పెట్టాలని సూచించలేదని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్ వ్యాఖ్యానించారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి పోలీసులు తనిఖీల పేరుతో డబ్బు సీజ్ చేస్తున్నారని, డబ్బు సీజ్ చేయడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, కానీ సామాన్యులు చెప్పే సరైన కారణాలు వినకుండా స్వాధీనం చేసుకుని ఇబ్బంది పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రతి దీపావళికి బంగారం కొనుగోలు చేసే సంప్రదాయం తెలంగాణలో ఉందని, రెండు తులాల బంగారం కొనాలన్నా కనీసం లక్ష రూపాయలు అవుతుందని, అలాంటప్పుడు కొనుగోలు దారులు డబ్బులు, బంగారాన్ని తీసుకెళుతుంటే పట్టుకోవడమేమిటని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల నియమావళి పేరుతో అధికారులు అతిగా ప్రవర్తించి ప్రజలను ఇబ్బందులకు గురి చేయవద్దని, ఆచరణ సాధ్యం కాని నిబంధనలు పెట్టవద్దని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ పార్టీ తరఫున లేఖ రాస్తామని వెల్లడించారు.

నేటి భవితలో..

- టాప్ స్టోరీ: ఆర్మీ జాబ్స్:
  బీటెక్‌తో.. ఆర్మీలో లెఫ్టినెంట్ కొలువు
  సైనిక దళాల్లో సేవలందించాలనుకునే ఇంజనీరింగ్ పట్టభద్రులకు ఇండియన్ ఆర్మీ స్వాగతం పలుకుతోంది. ఇండియన్ మిలటరీ అకాడమీ (ఐఎంఏ), డెహ్రాడూన్‌లో.. 2024, జూలైలో ప్రారంభించే 139వ టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సు(టీజీసీ)కు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతుంది. ఎంపికైన వారు లెఫ్టినెంట్ హోదాతో ఆకర్షణీయ వేతనాలు అందుకోవచ్చు.
- స్కూల్ ఎడ్యుకేషన్:
  నాణ్యమైన విద్యకు 'నవోదయ'
  జవహర్ నవోదయ విద్యాలయాలు.. వీటికి ఎంపికైతే 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు భోజన, వసతి సదుపాయాలతో ఉచితంగా చదువుకోవచ్చు. ప్రస్తుతం తొమ్మిదో తరగతిలో ఉన్న ఖాళీల భర్తీకి నవోదయ విద్యాలయ సమితి ప్రకటన విడుదల చేసింది. పూర్తి వివరాలతో కథనం..
- జాబ్ పాయింట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల సమాచారం; యూపీఎస్సీ, ఎస్ఎస్సీ, త్రివిధ దళాలు, రైల్వేలు, బ్యాంకింగ్, ప్రభుత్వ రంగ సంస్థలు, అటానమస్ ఇన్‌స్టిట్యూట్స్‌లో జాబ్ నోటిఫికేషన్లు, అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాలతో జాబ్ పాయింట్.
- విద్య, ఉద్యోగ సమాచారం

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

బీజేపీకి బిగ్ ఝలక్!



▶ మొదటి పేజీ తరువాయి

పోటీ చేసేందుకు విముఖత వ్యక్తం చేసినా బరిలో నిలవాల్సిందేనని నాయకత్వం ఒత్తిడి తేవడంతో పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ మాజీ ఎంపీ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ తరఫున గెలిచి కేంద్రమంత్రి కావాలని కోరుకుంటున్నారే తప్ప అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా లేరని ఆయన సన్నిహితుల్లో చర్చ సాగుతోంది. మరోవైపు తనకు పట్టున్న ఉమ్మడి జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తన విజయావకాశాలపై సర్వేలు చేయించుకున్న ఆయనకు ఎక్కడా సానుకూల వాతావరణం కన్పించక పోవడంతో పార్టీని వీడాలనే ఆలోచనకు వచ్చినట్టు చెబుతున్నారు. కొంత కాలంగా నాయకత్వం తీరుపై అసంతృప్తితో ఉన్న మరో మహిళా నేత కూడా పార్టీ మారేందుకు సన్నాహాలు చేసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. వీరితో పాటు మరికొందరు సైతం ఎన్నికలకు ముందు బీజేపీని వీడినా ఆశ్చర్యపోనవసరం లేదని అంటున్నారు. ఇలావుండగా ఇప్పటికే తొలి జాబితాను ప్రకటించిన కాంగ్రెస్, రెండో జాబితా విడుదలలో జాప్యం చేయడం.. బీజేపీ నుంచి వచ్చే నేతల కోసమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతుండటం గమనార్హం.

తొలి జాబితాపై అసంతృప్తే రాజుకుంటోందా?

తొలి జాబితాలో రాజగోపాల్‌రెడ్డితో పాటు కిషన్‌రెడ్డి, కె.లక్ష్మణ్, డీకే అరుణ, ఇతర ముఖ్య నేతలకు టికెట్లను ఖరారు చేయకపోవడం, పార్టీ బలంగా ఉన్న సీట్లకు కూడా అభ్యర్థులను ప్రకటించకపోవడం, ఇటీవల పార్టీలో చేరిన వారికి సీట్లివ్వడం లాంటి అంశాలు బీజేపీ నేతల్లో అసంతృప్తికి కారణమౌతున్నాయి. మొత్తంగా బీసీ వర్గాలకు 19 సీట్లు కేటాయించినా వాటిలో కొన్ని ప్రాధాన్యత లేనివి ఇచ్చారనే అసంతృప్తి ఉన్నట్టు చెబుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో అత్యధిక సీట్లు రెడ్డి సామాజికవర్గానికి కేటాయించడం, కొంతకాలంగా టికెట్‌ను ఆశిస్తూ ఆయా నియోజకవర్గాల్లో డబ్బు ఖర్చు చేస్తూ కార్యక్రమాలు చేపడుతున్న నాయకులకు టికెట్ నిరాకరించడం, కనీసం వారిని పిలిచి పరిస్థితిని వివరించి, బుజ్జగించే పరిస్థితి లేకపోవడాన్ని పలువురు తప్పుబడుతున్నట్టు తెలిసింది. హిందుత్వవాదం బలంగా ఉన్న నిర్మల్ జిల్లాలోని ఓ సీటును పార్టీలో చేరేదాకా ఎంఐఎంతో చెట్టాపట్టాలేసుకుని తిరిగిన ఒకరికి ఇవ్వడంపై స్థానిక నేతల్లో అంతర్మథనం సాగుతున్నట్టు సమాచారం. ఇక ముథోల్ నుంచి టికెట్ ఆశించి భంగపడిన రమాదేవి ఇప్పటికే పార్టీకి రాజీనామా చేశారు. మరోనేత మోహన్‌రావు పాటిల్ కూడా టికెట్ కోరుకున్నా రాలేదు. వరంగల్ (పశ్చిమ) టికెట్‌ను పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న అధికార ప్రతినిధి రాకేష్‌రెడ్డికి కాకుండా రావు పద్మకు ఇచ్చినా, కనీసం పిలిపించి మాట్లాడకపోవడంతో ఆయన రెబెల్‌గా పోటీకి సిద్ధమౌతున్నట్టు తెలిసింది. జనగామ నుంచి జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డికి అవకాశం కల్పించినా, అక్కడ టికెట్ కోరుకున్న బీరప్ప, మరో ఇద్దరు నేతలకు ఈ విషయాన్ని తెలియజేసి బుజ్జగించే ప్రయత్నం చేయపోవడంతో వారు అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పార్టీ అధికార ప్రతినిధి రాణి రుద్రమను సిరిసిల్లలో కేటీఆర్‌పై పోటీకి దింపడం ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

కారెక్కనున్న సోమారపు?

- రామగుండం సీటు కోసం బీఆర్ఎస్ అధిష్టానంతో చర్చలు!
- టికెట్ ఇస్తే కచ్చితంగా గెలుస్తానని వెల్లడి
- ప్రస్తుతం పోటీలో ఉన్న నేతకు ఎమ్మెల్సీ ఇవ్వాలని ప్రతిపాదన



గోదావరిఖని: రామగుండం నియోజకవర్గానికి చెందిన కీలక నేత, మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ కారెక్కనున్నట్లు తెలుస్తోంది. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో వేర్వేరుగా భేటీ అయినట్లు సమాచారం. తనకు పార్టీ టికెట్ ఇస్తే కచ్చితంగా గెలుస్తానని.. ప్రస్తుతం పోటీలో ఉంటున్న నాయకుడికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని సోమారపు ప్రతిపాదించినట్లు తెలిసింది. కొద్దిరోజుల క్రితం కాంగ్రెస్ ఎమ్మెల్యే టికెట్ కోసం ఢిల్లీ వెళ్లిన ఆయనకు.. పార్టీ అధిష్టానం నుంచి సానుకూల సాంకేతాలు రాలేదు. దీంతో నియోజకవర్గానికి చేరుకొని స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగేందుకు సిద్ధమయ్యారు. అందుకు అనుగుణంగా ప్రచారం కూడా చేపట్టారు. ఆయన మంగళవారం అకస్మాత్తుగా ప్లేట్ ఫిరాయించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే బీఆర్ఎస్ మాత్రం ఆ నాయకుడికి ఎమ్మెల్సీ ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు చెబుతున్నారు.

కాంగ్రెస్, టీడీపీ, బీఆర్ఎస్, బీజేపీ.. మళ్లీ బీఆర్ఎస్..

1998లో జరిగిన రామగుండం మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా రాజకీయ అరంగేట్రం చేసిన సోమారపు... ఆ తర్వాత 2004 అసెంబ్లీ ఎన్నికల్లో మంథని టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడారు. అటునుంచి తిరిగి కాంగ్రెస్‌లో చేరి 2009 అసెంబ్లీ ఎన్నికల్లో రామగుండం నుంచి గెలుపొందారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నేపథ్యంలో బీఆర్ఎస్ (నాటి టీఆర్ఎస్)లో చేరి 2014 అసెంబ్లీ ఎన్నికల్లో రామగుండం నుంచి మళ్లీ గెలిచారు. కానీ 2018 ఎన్నికల్లో మాత్రం ఓటమిపాలయ్యారు. అనంతరం బీజేపీలో చేరారు. ఆ తర్వాత బీజేపీకి రాజీనామా చేసి ఇండిపెండెంట్‌గా బరిలో ఉంటానని ప్రకటించారు. ఆ తర్వాత కొద్దిరోజులకే ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ నేతలను కలిశారు. ఎమ్మెల్యే టికెట్‌పై కాంగ్రెస్ నుంచి గ్రీన్‌సిగ్నల్ రాకపోవడంతో మళ్లీ ఇండిపెండెంట్‌గా బరిలో ఉంటూ ప్రచారం చేశారు. మంగళవారం అకస్మాత్తుగా హైదరాబాద్ వెళ్లి బీఆర్ఎస్ అధిష్టానంతో చర్చలు జరిపారు.

మిసెస్ ఏసియా వరల్డ్‌వైడ్‌గా విజయారెడ్డి



పులివెందుల రూరల్: మిసెస్ సింగపూర్–2023 పోటీల్లో ఏసియా వరల్డ్‌వైడ్ కేటగిరిలో వైఎస్సార్ జిల్లా మహిళ విజేతగా నిలిచారు. పులివెందుల మండలంలోని నల్లపురెడ్డి పల్లె గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి, రమాదేవిల కుమార్తె విజయారెడ్డి సింగపూర్‌లో ఎంబీఏ చదివే సమయంలో విజయవాడకు చెందిన సుంకర ప్రదీప్‌ను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఓ కుమారుడు. ప్రస్తుతం విజయ, ప్రదీప్‌లిద్దరూ 15 ఏళ్లుగా సింగపూర్‌లోనే ఉంటూ, అక్కడ సిటీ బ్యాంక్‌లో పనిచేస్తున్నారు. అక్టోబర్ 21న సింగపూర్‌లో లూమియర్ అంతర్జాతీయ సంస్థ నిర్వహించిన అందాల పోటీల్లో విజయారెడ్డి పాల్గొని, విజయం సాధించారు. తొలి ప్రయత్నంలోనే విజేత కావడం ఆనందంగా ఉందని విజయ అన్నారు. భర్త, తల్లిదండ్రులు, అత్తమామలు, స్నేహితుల అపారమైన ప్రేమ, ప్రోత్సాహం, మద్దతువల్ల ఈ విజయం సాధ్యమైందని ఆమె తెలిపారు. ఈ స్ఫూర్తితో సమాజ సేవాకార్యక్రమాలు చేపడతానని పేర్కొన్నారు. అయితే విజయారెడ్డి మామ దివంగత కొమ్మా శివప్రసాదురెడ్డి వైఎస్సార్‌సీపీలో ప్రముఖ నాయకులుగా ఉండేవారు.

తెలంగాణ పాలపిట్ట కేసీఆర్

కేసీఆర్ హ్యాట్రిక్ సీఎంగా ఉండటం రాష్ట్రానికి శుభప్రదం: హరీశ్‌రావు

- రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి డీఎన్‌ఏ మ్యాచ్ కావట్లేదు
- కేసీఆర్ తలుచుకుంటే రేవంత్‌రెడ్డిని ఓటుకు నోటు కేసులో జైల్లో వేసేవారు
- బీఆర్ఎస్ తెలంగాణ ప్రజల టీమ్



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి డీఎన్‌ఏ ఏంటో రాహుల్‌గాంధీ తెలుసుకోవాలని ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి టి.హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. రాహుల్, రేవంత్ డీఎన్‌ఏలు మ్యాచ్ కావడం లేదన్నారు. బీజేపీపై పోరాడే డీఎన్‌ఏ తనదని చెప్పుకున్న రాహుల్.. రేవంత్ డీఎన్‌ఏ తెలుసుకోవాలని చెప్పారు. గతంలో సోనియాగాంధీని బలిదేవత.. ఇటలీబొమ్మ అంటూ నోరు పారేసుకుని.. ఇప్పుడు సోనియాను దేవత అంటున్న రేవంత్ నోటికి మొక్కాలన్నారు. హరీశ్‌రావు మంగళవారం సంగారెడ్డి, నారాయణఖేడ్‌లలో పర్యటించారు. 30న నారాయణఖేడ్‌లో జరగనున్న ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగసభ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వేర్వేరు ప్రాంతాల్లో హరీశ్‌రావు మాట్లాడారు. టీడీపీలో ఉన్నప్పుడు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంట్ సరిగ్గా ఇవ్వలేదని అసెంబ్లీలో వ్యాఖ్యానించిన రేవంత్‌రెడ్డి.. ఏ ఎండకు ఆ గొడుగు పట్టే రకమని మండిపడ్డారు. కుర్చీల కోసం పార్టీలు మారే వ్యక్తి అని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ఎవ్వరికీ బీ టీమ్ కాదన్న హరీశ్.. తాము తెలంగాణ ప్రజల టీమ్ అని స్పష్టం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ ఎప్పటికీ ఒక్కటి కాదంటూ.. నీళ్లు, నూనె కలుస్తాయా అని ప్రశ్నించారు. కేసీఆర్ తలుచుకుంటే రేవంత్ రెడ్డిని ఓటుకు నోటు కేసులో జైల్లో వేసేవారన్నారు. కాంగ్రెస్ నేతలపై నాడు ఓటుకు నోటు కేసు ఉండగా.. నేడు నోటుకు సీటు అమ్ముకుంటున్నారని ధ్వజమెత్తారు. బీజేపీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని హరీశ్ విమర్శించారు.

కిషన్‌రెడ్డి వెన్నుచూపి పారిపోయారు

పాలపిట్టను శుభప్రదంగా భావిస్తామని, తెలంగాణ పాలపిట్ట కేసీఆర్ రాష్ట్రానికి హ్యాట్రిక్ సీఎంగా ఉండటం కూడా అంతే శుభమని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమకారులను తుపాకీతో బెదిరించిన రేవంత్‌రెడ్డి వంటి ద్రోహులు ఒకవైపు., రాష్ట్రం కోసం పదవులను త్యాగం చేసి, ప్రాణత్యాగానికి సైతం సిద్ధమైన కేసీఆర్ మరోవైపు ఉన్నార న్నారు. తెలంగాణ కోసం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ వస్తే వెన్ను చూపి పారిపోయిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తెలంగాణకు ఏం మంచి చేస్తారని ప్రశ్నించారు.

కేసీఆర్‌కు దమ్ముంటే కొడంగల్‌లో పోటీ చేయాలి

- పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సవాల్
- పోలీసుల సాయంతో మళ్లీ ఓడించేందుకు కుట్రపన్నారని ఆరోపణ
- తన హయాంలోనే నియోజకవర్గ అభివృద్ధి జరిగినట్లు వెల్లడి



కొడంగల్: ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దమ్ముంటే కొడంగల్‌లో పోటీ చేయాలని పీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. దసరా పండుగను పురస్కరించుకుని సోమవారం ఆయన కొడంగల్‌కు వచ్చారు. మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి నివాసానికి వెళ్లి దేశ్‌ముఖ్ కుటుంబ సభ్యులకు జమ్మి పెట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఆపై తన నివాసానికి చేరుకొని అభిమానులు, పార్టీ శ్రేణులతో ముచ్చటించారు. అనంతరం రేవంత్ మీడియాతో మాట్లాడుతూ కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి తన హయాంలోనే జరిగిందన్నారు. నియోజకవర్గంలో కొత్తగా నిర్మించిన అన్ని ప్రభుత్వ భవనాలను తానే మంజూరు చేయించినట్లు చెప్పారు. 2018లో పోలీసులను అడ్డు పెట్టుకొని తనను ఓడించారని, ఇప్పుడు కూడా పోలీసుల సాయంతో దొంగ దెబ్బ తీయాలని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

కొడంగల్‌కు కేసీఆర్ అన్యాయం

అన్ని విషయాల్లోనూ సీఎం కేసీఆర్ కొడంగల్ నియోజకవర్గానికి అన్యాయం చేశారని రేవంత్ ఆరోపించారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గానికి సాగునీరు తెచ్చి రైతుల కాళ్లు కడుతానని కేసీఆర్ ఇచ్చిన హామీ ఏమైందని రేవంత్ ప్రశ్నించారు. డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూపంపిణీ ఊసేలేదని మండిపడ్డారు. కొడంగల్‌ను కేసీఆర్ రెండు ముక్కలు చేసి పాలనాపరమైన ఇబ్బందులు సృష్టించారని ఆరోపించారు. ఉద్యోగులంతా ఏకమై కేసీఆర్‌ను ఇంటికి పంపాలని రేవంత్ పిలుపునిచ్చారు. త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని రేవంత్ హామీ ఇచ్చారు. ఆసరా పింఛన్లు నెలకు రూ.4 వేలు ఇస్తామని, కేసీఆర్ చేసిన రుణమాఫీ బ్యాంకుల మిత్తీకి కూడా సరిపోలేదన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని 8 మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మళ్లీ రాష్ట్రానికి రాహుల్

▶ మొదటి పేజీ తరువాయి

ఆరు గ్యారంటీ పథకాల కార్డులను పంపిణీ చేయడంతోపాటు స్థానికంగా ఏర్పాటు చేసే సభల్లో కూడా నేతలు పాల్గొననున్నారు.

సీఈసీ నిర్ణయమే ఫైనల్: మహేశ్‌కుమార్‌గౌడ్

పార్టీ అభ్యర్థుల ఖరారు కోసం బుధవారం ఢిల్లీలో కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) సమావేశమవుతోందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. అభ్యర్థుల ఎంపికలో అధిష్టానమే నిర్ణయం తీసుకుంటుందని, సీఈసీ నిర్ణయమే ఫైనల్ అని ఆయన గాంధీభవన్‌లో మంగళవారం విలేకరులకు చెప్పారు. ఆదిలాబాద్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ అసెంబ్లీ స్థానాలను మైనార్టీ నేతలు అడుగుతున్నారని, పార్టీ కూడా మైనార్టీలకు న్యాయం చేస్తుందని చెప్పారు. తాను ఆశిస్తున్న నిజామాబాద్ అర్బన్ స్థానాన్ని ఎవరికి కేటాయించాలన్న దానిపై స్క్రీనింగ్ కమిటీ నిర్ణయం తీసుకుంటుందన్నారు. అనంతరం మహేశ్‌కుమార్‌గౌడ్ ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. బుధవారం జరగనున్న సీఈసీ సమావేశానికి అందుబాటులో ఉండాలని పార్టీ నుంచి పిలుపు రావడంతో ఆయన ఢిల్లీ వెళ్లారని, రాష్ట్ర నాయకత్వం ఆయనకు టికెట్ ఇచ్చేందుకు సానుకూలంగానే ఉన్నా ఆయనకు మైనార్టీ సెగ తప్పదని తెలుస్తోంది. ఇదే స్థానం తనకు కేటాయించాలని మాజీ పీసీసీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్ తనయుడు ధర్మపురి సంజయ్ కూడా గట్టిగా పట్టుపడుతుండటం, అధిష్టానం ఆశీస్సుల కోసం ప్రయత్నాలు చేస్తుండటం గమనార్హం.

కేసీఆర్ సభల షెడ్యూల్లో స్వల్ప మార్పు

- 26న నాగర్‌కర్నూలు, 27న స్టేషన్ ఘన్‌పూర్ సభలు వాయిదా
- 26న వనపర్తి, 27న మానుకోట, వర్ధన్నపేటలో సభలు



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో స్వల్పవిరామం తర్వాత తిరిగి గురువారం నుంచి బీఆర్ఎస్ నిర్వహించే బహిరంగ సభల్లో పార్టీ అధినేత, సీఎం కె.చంద్రశేఖరరావు పాల్గొంటారు. అయితే గతంలో ప్రకటించిన షెడ్యూల్లో స్వల్ప మార్పులు చేస్తూ బహిరంగ సభల ఏర్పాట్లు కొనసాగిస్తున్నారు. ఈ నెల 26న నాగర్‌కర్నూలు, 27న స్టేషన్ ఘన్‌పూర్‌లో నిర్వహించ తలపెట్టిన సభలను వాయిదా వేస్తున్నట్లు బీఆర్ఎస్ తాజాగా ప్రకటించింది. రద్దయిన సభల స్థానంలో 26న వనపర్తి, 27న మహబూబాబాద్, వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రాల్లో జరిగే సభల్లో కేసీఆర్ ప్రసంగిస్తారు. 26న వనపర్తితోపాటు అచ్చంపేట, మునుగోడులో, 27న మహబూబాబాద్, వర్ధన్నపేటతోపాటు పాలేరులో జరిగే బహిరంగ సభల్లో కేసీఆర్ పాల్గొంటారు.

28న విరామం

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 15 నుంచి నవంబర్ 9 వరకు 17 రోజుల్లో 41 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేసీఆర్ పాల్గొనే బహిరంగ సభల షెడ్యూల్‌ను గతంలో బీఆర్ఎస్ ప్రకటించింది. ఈనెల 15 మొదలుకుని 18 వరకు కేసీఆర్ హుస్నాబాద్, జనగామ, భువనగిరి, సిరిసిల్ల, సిద్దిపేట, జడ్చర్ల, మేడ్చల్‌లో జరిగిన సభల్లో ప్రసంగించారు. సద్దుల బతుకమ్మ, దసరా నేపథ్యంలో ఈనెల 19 నుంచి 25 వరకు కేసీఆర్ పాల్గొనే సభలకు విరామం ప్రకటించారు. 26 నుంచి తిరిగి కేసీఆర్ ఎన్నికల ప్రచార సభలు ప్రారంభమై వచ్చే నెల 9 వరకు కొనసాగుతాయి. ఈ నెల 28న ప్రచారానికి విరామం ఇచ్చి 29న కోదాడ, తుంగతుర్తి, ఆలేరు 30న జుక్కల్, బాన్సువాడ, నారాయణ్‌ఖేడ్‌లలో, 31న హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండ సభల్లో కేసీఆర్ ప్రసంగిస్తారు. తిరిగి నవంబర్ 1న సత్తుపల్లి, ఇల్లెందు, 2న నిర్మల్, బాల్కొండ, ధర్మపురి 3న భైంసా (ముథోల్), ఆర్మూర్, కోరుట్ల, 5న కొత్తగూడెం, ఖమ్మం, 6న గద్వాల్, మక్తల్, నారాయణపేట, 7న చెన్నూరు, మంథని, పెద్దపల్లి, 8న సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, 9న కామారెడ్డి సభల్లో ప్రసంగిస్తారు. 9న గజ్వేల్, కామారెడ్డిలో కేసీఆర్ నామినేషన్ పత్రాలు సమర్పిస్తారు.

నేడు కాంగ్రెస్ రెండో జాబితాకు 'సీఈసీ ఆమోదం'!

- ఢిల్లీలో భేటీ కానున్న కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ
- వామపక్షాలతో పొత్తులు, పోటీ ఉన్న స్థానాలపై రానున్న స్పష్టత

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో గత కొన్ని రోజులుగా ఉత్కంఠకు తెరలేపిన కాంగ్రెస్ పార్టీ తుది జాబితాపై స్పష్టత వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో బుధవారం జరగనున్న కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ (సీఈసీ) సమావేశంలో తెలంగాణ అభ్యర్థులను ఖరారు చేయనున్నారు. రాష్ట్ర స్క్రీనింగ్ కమిటీ సిద్ధం చేసిన జాబితాకు కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ ఆమోదముద్ర వేయనుంది. ఇప్పటికే పొత్తులు సహా తుది జాబితాపై ఏఐసీసీ పెద్ద ఎత్తున కసరత్తు చేసింది. సీఈసీ సమావేశంలో వామపక్షాలతో సీట్ల సర్దుబాటు విషయంలోనూ ఒక స్పష్టత రానుంది. ఇప్పటివరకు కొన్ని స్థానాల్లో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఇద్దరిద్దరి పేర్లను స్క్రీనింగ్ కమిటీ ప్రతిపాదించింది. ఇప్పటికే 55 మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదల తర్వాత మిగతా స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై తెలంగాణ స్క్రీనింగ్ కమిటీ శని, ఆదివారాల్లో ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) కేసీ వేణుగోపాల్ నివాసంతోపాటు కాంగ్రెస్ వార్ రూంలో తెలంగాణ నేతల సమావేశమైనా పోటీ ఎక్కువగా ఉన్న స్థానాలపై ఏకాభిప్రాయం రాలేదు. సీనియర్ నాయకులు పోటీకి సిద్ధమైన చోట అంతర్గత పోటీ ఉన్నందున స్క్రీనింగ్ కమిటీలో మరోసారి ఈ స్థానాల్లో పోటీకి సంబంధించి సమీక్ష జరిగింది. కమ్యూనిస్టు పార్టీలు అడుగుతున్న స్థానాల్లో పోటీకి కాంగ్రెస్ అభ్యర్థులు సిద్ధంగా ఉండటంతో ఏ స్థానాలు కేటాయించాలన్న అంశంపై కమిటీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయని సమాచారం. కాగా, అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన తుది నిర్ణయాన్ని కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీకి స్క్రీనింగ్ కమిటీ అప్పగించిన విషయం తెలిసిందే. దీంతో బుధవారం జరుగనున్న సీఈసీ సమావేశం కీలకంగా మారింది.

యూత్ కాంగ్రెస్ 'నారాజ్'

- టికెట్ల కేటాయింపులో తమను పట్టించుకోవడం లేదంటున్న కాంగ్రెస్ యువ నాయకులు
- కనీసం 3 టికెట్లు ఇవ్వాలని పట్టు
- మూకుమ్మడి రాజీనామాలు చేసే యోచన
- నేడు గాంధీభవన్ వేదికగా కీలక భేటీ



సాక్షి, హైదరాబాద్: టికెట్ల కేటాయింపు విషయంలో పార్టీ అధిష్టానం అనుసరిస్తున్న వైఖరితో యూత్ కాంగ్రెస్ నాయకత్వం నారాజ్ అవుతోంది. ప్రతి ఎన్నికల్లోనూ యూత్ కోటాలో 3–7 టికెట్లు కేటాయిస్తారని, కానీ ఈసారి మాత్రం తమను పరిగణనలోకి తీసుకోకపోవడంతో యూత్ కాంగ్రెస్ నేతలు నైరాశ్యంలో మునిగిపోతున్నారు. ఇందుకు నిరసనగా యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధం కావాలని భావిస్తున్నారు. ఈసారి యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి వనపర్తి టికెట్ ఆశిస్తున్నారు. ఒకవేళ వనపర్తి కాకపోయినా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎక్కడైనా పోటీ చేసే అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రెండేళ్లుగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేసి విద్యార్థులు, యువత పక్షాన నిలబడ్డామని, ఈ ఎన్నికల్లో తమకు పోటీ చేసే అవకాశం కల్పించాలని అడుగుతున్నారు. తద్వారా యువకులకు పార్టీ ప్రాధాన్యతమిస్తుందనే సంకేతాలను పంపాలని చెబుతున్నారు. వనపర్తితో పాటు దేవరకొండ, అంబర్‌పేట లాంటి సీట్లను తమకు కేటాయించాలని యూత్ కాంగ్రెస్ నేతలు కోరుతున్న నేపథ్యంలో అధిష్టానం ఏం చేస్తుందో వేచిచూడాల్సిందే.

నేడు 'బుజ్జగింపు' భేటీ?

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం గాంధీభవన్‌లో కీలక సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. అయితే, చాలామంది యూత్‌కాంగ్రెస్ నేతలు నిరాశలో ఉన్న మాట వాస్తవమేనని, వారందరూ రాజీనామాలు చేయాలనే భావనలో ఉన్నప్పటికీ పార్టీ నిర్ణయానికి కట్టుబడి కాంగ్రెస్‌లోనే ఉంటారని, వారిని బుజ్జగించేందుకే ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారనే చర్చ జరుగుతోంది.

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం: టీటీడీపీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో తెలుగుదేశం పార్టీ ఈసారి ఎన్నికల్లో పోటీ చేయడం లేదని వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని, ఆ వార్తలను ఖండిస్తున్నట్లు టీటీడీపీ నేతలు వెల్లడించారు. కొన్ని పార్టీలకు లబ్ధి చేకూర్చేందుకు, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ పోటీలో ఉండకూడదన్న కుట్ర కోణంలోనే ఇలాంటి తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్నారని ఆ పార్టీ నేతలు షేక్ ఆరీఫ్, జీవీజీ నాయుడు, శ్రీనివాస్ నాయుడు, రామేశ్వర్‌రావు, భవనం షకీలారెడ్డి మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ పోటీ చేస్తుందని ఇప్పటికే తమ రాష్ట్ర అధ్యక్షుడు స్పష్టంగా చెప్పారని, 119 నియోజకవర్గాలకు సంబంధించిన అభ్యర్థుల దరఖాస్తులను ఇప్పటికే తీసుకున్నామని, త్వరలోనే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వివరాలను ప్రకటిస్తామని వారు స్పష్టం చేశారు.

పొంగులేటి, పువ్వాడకు గుణపాఠం చెప్పండి

మావోయిస్టు పార్టీ నేత ఆజాద్ పేరిట లేఖ విడుదల

చర్ల: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒకవైపు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మరోవైపు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తమ అభ్యర్థులను గెలిపించుకొనేందుకు రూ. వేల కోట్లు ఖర్చు పెట్టాలని చూస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో వారికి ప్రజలు బుద్ధి చెప్పాలని మావో యిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం–అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన లేఖ విడుదల చేశారు. పొంగులేటి, పువ్వాడ కార్పొరేట్ రాజకీయ నాయకులేనని, ప్రధాన పార్టీలు ఇలాంటి వారికే సీట్లు ఇస్తున్నాయని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమదే గెలుపంటూ రెండు ప్రధాన పార్టీలు ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నాయని, అమలు సాధ్యంకాని హామీలతో మేనిఫెస్టోలు తయారు చేసి ఉచిత తాయిలాలు ప్రకటించడంలో పోటీ పడుతున్నాయని మండిపడ్డారు. ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం రూ. 800 కోట్లు ఖర్చు చేసేందుకు పువ్వాడ డబ్బు సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోందని, పొంగులేటి కూడా నియోజకవర్గానికి రూ. 40 కోట్ల చొప్పున రూ.400 కోట్లు ఖర్చు చేస్తానని అధిష్టానానికి ఆశ చూపిస్తున్నారని ఆరోపించారు. ఈ బూటకపు ఎన్నికలతో ప్రజలకు ఉపయోగం లేదని, దొంగ ఓట్లకు, దొంగ నోట్ల రాజ్యానికి గుణపాఠం చెప్పాలంటే ఈ ఎన్నికలను బహిష్కరించాలని ఆజాద్ పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌లో గౌడ సంఘం నేత కేఎల్ఎన్ ప్రసాద్ చేరిక



కేఎల్ఎన్ ప్రసాద్‌కు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు

కోదాడ: గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు కేఎల్ఎన్ ప్రసాద్‌తోపాటు ఆయన అనుచరులు సూర్యాపేట జిల్లా కోదాడలో మంగళవారం ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మావతిలు ప్రసాద్‌కు కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. కోదాడలో అరాచక పాలనకు తెరదించి ప్రజాపాలనకు పట్టం కట్టడానికి బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్న నేతలందరికీ స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు. త్వరలోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామని ఉత్తమ్ చెప్పారు. కార్యక్రమంలో నాయకులు యరగాని నాగన్న గౌడ్, వంగవేటి రామారావు, వంటిపులి వెంకటేశ్, కందుల కోటేశ్వరరావు, గంధం యాదగిరి, షుబుద్దీన్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

కవితకు ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ ఆహ్వానం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కీలకోపన్యాసం చేయాలని లండన్‌లోని ప్రసిద్ధ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఆహ్వానించింది. ఈ నెల 30న ఆక్స్‌ఫర్డ్‌లో 'డెవలప్‌మెంట్ ఎకనామిక్స్' ఇతివృత్తంతో జరిగే ప్రత్యేక సదస్సులో కవిత ప్రసంగిస్తారు. ఇటీవల లండన్‌లో బ్రిడ్జ్ ఇండియా సంస్థ నిర్వహించిన సదస్సులో ప్రసంగించిన కవిత ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులతోనూ భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో తెలంగాణ మోడల్‌పై మాట్లాడాలని తాజాగా ఆక్స్‌ఫర్డ్ ఆహ్వానించింది. తెలంగాణ వ్యవసాయ రంగం పురోగతి, రైతుబంధు, 24 గంటల ఉచిత విద్యుత్ తదితర అంశాలపై కవిత ప్రసంగిస్తారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరిస్తారు.

పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలి: ఆర్.కృష్ణయ్య



సాక్షి, హైదరాబాద్: పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి, బీసీలకు జనాభా ప్రకారం చట్టసభలలో 50% రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మంగళవారం ఆయన లేఖ రాశారు. మహిళా బిల్లు పెట్టిన మాదిరిగా బీసీ బిల్లు పెట్టాలన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో అన్ని పార్టీల కంటే బీసీలకు ఎక్కువ సీట్లు ఇస్తామని బీజేపీ చెబుతోందని, అయితే ఎక్కువ సీట్లు ఇవ్వడమనేది సరికాదని, బీసీ బిల్లు పెట్టడమే శాశ్వత పరిష్కారమని వివరించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వమే అధికారంలో ఉందనీ, బీసీ బిల్లు పెట్టడానికి అవరోధం ఏముందని అని ఆయన ప్రశ్నించారు. బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసి, ఏటా రూ.రెండు లక్షల కోట్లు బడ్జెట్ కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో బీసీ వాదం బలంగా ఉందనీ, వచ్చే ఎన్నికల్లో బీసీలు తమ సత్తాను చూపిస్తామని హెచ్చరించారు.


సొసైటీ ప్రయోజనాలు దెబ్బతీస్తే చర్యలు తీసుకుంటాం

జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో పనిచేసే పాత్రికేయుల మూడు దశాబ్దాల సొంతింటి కలపై రాజకీయ క్రీనీడలు తగదని జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టుల మ్యూచ్యువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి ఎస్.వంశీ శ్రీనివాస్ అన్నారు. అధికార పార్టీకి వ్యతిరేకంగా నామినేషన్లు వేయాలని, పార్టీ ఓటమికి సొసైటీ సభ్యులు కృషి చేయాలని పిలుపునివ్వడాన్ని సొసైటీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఒకరిద్దరు రాజకీయ కారణాలతో సొసైటీ ప్రయోజనాలు దెబ్బతీస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 32 ఎకరాలు అప్పగించే అంశంలో సొసైటీకి అనుకూలమైన ఉత్తర్వులు (ఈ ఏడాది ఆగస్టు 22) వచ్చే క్రమంలో ప్రభుత్వం దన్నుగా నిలిచిందని గుర్తు చేశారు. అయితే మిగిలిన 38 ఎకరాలు సొసైటీకి ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరిగిందని, ఇంటి స్థలాలు రాకముందే దాదాపు 70 మంది జర్నలిస్టులు మరణించిన విషయాన్ని ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లినా..సమస్య పరిష్కారం కాకపోవడం బాధాకరమన్నారు. దీంతో కొందరు సభ్యులు ఆవేదనతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా చర్యలు చేపట్టినా వారించామన్నారు. రాజకీయ కారణాలతో సొసైటీ ప్రయోజనాలను దెబ్బతీస్తే.. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీనివాస్ పేర్కొన్నారు.

అనారోగ్యంతోనే చిన్నబ్బనాయుడు మృతి!

చంద్రబాబు అరెస్టుతో మనస్తాపం చెందాడంటూ టీడీపీ డ్రామా



తిరుపతి రూరల్: చంద్రబాబు అరెస్టు అనంతరం టీడీపీ సానుభూతిపరులు ఎవరు మృతి చెందినా బాబు జైలుకి వెళ్లడంతో మనస్తాపం చెంది మరణించినట్లు ఆ పార్టీ ప్రచారం చేస్తోంది. వారు ఏ కారణంతో మృతి చెందినా బాబు అరెస్టే కారణంగా చూపెడుతోంది. ఇందుకు పాకాల మండలం నేంద్రగుంటకు చెందిన కనుమూరి చిన్నబ్బనాయుడు (70) మరణమే ఓ ఉదాహరణ. బుధవారం చిన్నబ్బనాయుడు కుటుంబాన్ని నారా భువనేశ్వరి పరామర్శిస్తారని టీడీపీ చెబుతోంది. అయితే, చిన్నబ్బనాయుడు అనారోగ్య కారణాలతోనే మరణించినట్లు స్థానికులు చెబుతున్నారు. టీడీపీ సానుభూతిపరుడైన ఆయన అదే పార్టీకి చెందిన మాజీ జెడ్పీటీసీ సురేష్‌కు స్వయానా పెదనాన్న. ఆయన కొన్నేళ్లుగా షుగర్, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. షుగర్ వ్యాధి ఎక్కువ కావడంతో కాలి వేలు కూడా తొలగించారు. వ్యాధి ముదరడంతో డాక్టర్లకు చూపించినా ఫలితం లేకపోయింది. రెండు నెలలుగా మంచానికే పరిమితమైనట్లు పంచాయతీ సిబ్బంది తెలిపారు. ఈ నేపథ్యంలో గత నెల 24న ఆయన మృతి చెందాడు. వెంటనే టీడీపీ నేతలు చంద్రబాబు జైలుకు వెళ్లడంతో మనస్థాపం చెంది చిన్నబ్బ నాయుడు మృతి చెందినట్లు డ్రామాకు తెరతీశారు.

• శ్రీ భద్రకాళి నిజరూప దర్శనం



హన్మకొండ కల్చరల్ : వరంగల్ శ్రీ భద్రకాళి ఆలయంలో సోమవారం విజయదశమి సందర్భంగా అమ్మవారి నిజరూప దర్శనం కల్పించారు. సాయంత్రం భద్రకాళి తటాకంలో శ్రీభద్రకాళీ అమ్మవారికి హంసవాహనంపై తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు.

• భద్రాద్రిలో వైభవంగా 'విజయో'త్సవం



భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం విజయోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో స్వామివారిని ఊరేగింపుగా తీసుకొచ్చి అర్చకులు స్వామివారి ఆయుధాలకు ఆయుధ పూజ, శమీ పూజ చేశారు. ఉత్సవాలకు పూర్ణాహుతితో ముగింపు పలికారు.

• భ్రమరాంబాదేవిగా అమ్మవారు



శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలో ఆధ్యాత్మికభరితంగా సాగిన దసరా మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. అమ్మవారు నిజరూప అలంకారంలో భ్రమరాంబాదేవిగా దర్శనమిచ్చారు. నంది వాహన సేవలో ఆది దంపతులు విహరించారు.

• తెప్పోత్సవానికి దుర్గమ్మ..



తెప్పోత్సవానికి వెళుతున్న కనకదుర్గమ్మ

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై నిర్వహిస్తోన్న దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం దుర్గమ్మ ఉదయం మహిషాసురమర్దినిగా.. మధ్యాహ్నం శ్రీ రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చారు. సోమవారం రాత్రి ఆది దంపతులకు కృష్ణా నదిలో తెప్పోత్సవాన్ని నిర్వహించారు.

విప్లవాన్ని వివరిద్దాం

రేపటి నుంచి ఏపీలో వైఎస్సార్‌సీపీ 'సామాజిక సాధికారత' బస్సు యాత్ర

గత 53 నెలల సామాజిక విప్లవాన్ని, సంక్షేమాభివృద్ధిని వివరించనున్న నేతలు

ఒకరేమో ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అంటూ ఆ వర్గాన్ని హేళన చేసే నాయకుడు. మరొకరేమో ఆ వర్గానికి ఉప ముఖ్యమంత్రి, శాసన మండలి ఛైర్మన్.. రాష్ట్ర హోంమంత్రి వంటి పదవులిచ్చి గౌరవించిన నేత.

ఒకరేమో న్యాయం చేయాలని అభ్యర్థించిన నాయీ బ్రాహ్మణులను తోకలు కత్తిరిస్తానంటూ.. మత్స్యకారులను తోలుతీస్తానంటూ బెదిరించిన నాయకుడు. మరొకరేమో కేబినెట్ నుంచి నామినేటెడ్ వరకూ పదవుల్లో, సంక్షేమాభివృద్ధి పథకాల్లో సింహభాగం బీసీలకే ఇచ్చిన నేత.

ఇదే... మౌలికంగా చంద్రబాబు నాయుడికి, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఉన్న తేడా. అసలు ఎస్సీలను హేళన చేసి, బీసీలను బెదిరించి తన సామాజిక వర్గానికే, తన లాబీయిస్టులకే రాజ్యసభ పదవుల్లో అగ్రభాగం కట్టబెట్టిన చంద్రబాబుకు.... అధికారంలోకి వచ్చాక వైఎస్సార్‌సీపీకి దక్కిన రాజ్యసభ పదవుల్లో 50 శాతాన్ని బీసీలకే ఇచ్చిన జగన్‌తో పోలికే లేదు. బీసీలంటే వెనుకబడిన వర్గాలు కాదు రాష్ట్రానికి వెన్నెముక అంటూ చాటిచెప్పిన జగన్‌కు దరిదాపుల్లో కూడా లేని నాయకుడు చంద్రబాబు. అలాంటి చంద్రబాబు సైతం తనకున్న మీడియా బలంతో అన్నివర్గాలకూ న్యాయం చేస్తున్నట్లుగా కొన్నాళ్లు చెలామణి కాగలిగారు. కాకపోతే రోజులు మారి.. ఎప్పటికప్పుడు జనాలకు నిజాలు తెలుస్తున్నాయి.

ఇదిగో... ఇలా వాస్తవాలు వివరించే క్రమంలోనే గత 53 నెలలుగా సీఎం వైఎస్ జగన్ చేస్తున్న సామాజిక న్యాయాన్ని.. 2014-19 మధ్య చంద్రబాబు చేసిన సామాజిక ద్రోహాన్ని ప్రజల ముందు పెట్టడానికి 'సామాజిక సాధికారత యాత్ర' మొదలు కాబోతోంది. గురువారం నుంచి రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో ఒకే సారి వైస్సార్ సీపీ ఈ బస్సుయాత్రకు శ్రీకారం చుడుతోంది.



సాక్షి, అమరావతి: వైఎస్సార్ సీపీ 'సామాజిక సాధికార యాత్ర' గురువారం ఉత్తరాంధ్రలో ఇచ్ఛాపురం, కోస్తాలో తెనాలి, రాయలసీమలో శింగనమల నియోజకవర్గాల్లో ఒకే సారి ప్రారంభం కాబోతోంది. ఈ మూడు ప్రాంతాల్లోనూ రోజుకు ఒకో నియోజకవర్గం చొప్పున యాత్ర కొనసాగుతుంది. యాత్రలో భాగంగా ఆ నియోజకవర్గంలో సభనూ నిర్వహిస్తారు. అంటే రోజూ మూడు ప్రాంతాల్లో మూడు సభలు. స్థానిక ఎమ్మెల్యే లేదా నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త సారథ్యంలో ఈ యాత్ర జరుగుతుంది. రాష్ట్రంతోపాటు ఆ నియోజకవర్గంలో సంక్షేమాభివృద్ధి పథకాలు, పదవుల పంపకంలో గతంలో ఎన్నడూ లేని రీతిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చేసిన ప్రయోజనాన్ని ఈ యాత్ర ద్వారా ఆయా వర్గాలకు చెందిన మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలు వివరిస్తారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమాభివృద్ధి పథకాలు, పదవుల పంపకంలో చంద్రబాబు చేసిన సామాజిక ద్రోహాన్ని.. టీడీపీ సర్కార్ అవినీతి, అక్రమాలు, దాష్టీకాలను ప్రజలకు గుర్తు చేస్తారు. సీఎం వైఎస్ జగన్ పేదల పక్షాన నిలిస్తే.. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, ఎల్లో మీడియాతో జట్టుకట్టి పెత్తందారీ వ్యవస్థకు దన్నుగా ఎలా నిలుస్తున్నారన్నది చూపిస్తారు. పేదల పక్షాన నిలిచిన సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీని గెలిపించాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరిస్తారు. వైఎస్సార్‌సీపీ గెలిచిన నాటి నుంచీ రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి నాలుగు కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఈనెల 9న విజయవాడలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సభలో సీఎం వైఎస్ జగన్ చెప్పారు. ఆ నాలుగింట్లో.. గురువారం నుంచి డిసెంబరు 31 వరకు జరిగే ఈ యాత్ర ఒకటి.

చంద్రబాబుకు ఎన్నికల ముందు మాత్రమే జనం కనిపిస్తారు. అందుకే ఆయన శంకుస్థాపనలు చేసినా, పదవులిచ్చినా, జీవోలిచ్చినా అన్నీ ఎన్నికలకు నాలుగైదు నెలల ముందు మాత్రమే జరుగుతాయి. అది కూడా కొన్ని కాగితాలపైనే!!. 2014లో గెలిచిన చంద్రబాబు... 2019 ఎన్నికలకు రెండు నెలల ముందు మాత్రమే ఎస్టీకి తన కేబినెట్లో స్థానమిచ్చారు. గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేసిందీ అప్పుడే. గత ఎన్నికలకు రెండునెలల ముందు వరకూ ముస్లింలకు సైతం చంద్రబాబు కేబినెట్లో స్థానం లేదు. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రభుత్వం ఏర్పాటవుతూనే ఎస్టీలకు ఉపముఖ్యమంత్రి స్థానాన్నిచ్చారు. ముస్లిం వర్గానికి చెందిన వ్యక్తిని సైతం ఉప ముఖ్యమంత్రిని చేయటంతో పాటు ముస్లిం మహిళను శాసనమండలి ఛైర్‌పర్సన్‌గా నియమించారు. సంక్షేమాభివృద్ధి పథకాల నుంచి కేబినెట్–నామినేటెడ్ వరకూ ఆ వర్గాలకు పెద్దపీట వేశారు. అంతేకాదు!! కోడలు మగ పిల్లాణ్ణి కంటానంటే అత్త వద్దంటుందా? అంటూ మహిళల పుట్టుకనే హేళన చేసింది చంద్రబాబయితే... హోంమంత్రిగా, శాసనమండలి ఛైర్‌పర్సన్‌గా మహిళలను నియమించడమే కాక కేబినెట్ నుంచి నామినేటెడ్ వరకూ వారికి సింహభాగం పదవులిచ్చి, ఆసరా, చేయూత వంటి పథకాలతో ఆర్థికంగా తోడ్పాటునందిస్తున్నది వైఎస్ జగన్. సామాజిక న్యాయంలో వీళ్లకసలు పోలిక ఉందా?

ఇదీ... సామాజిక న్యాయం అంటే

సామాజిక న్యాయంలో వైఎస్ జగన్ దార్శనికతను ఇపుడు దేశం మొత్తం ప్రశంసిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సంక్షేమ పథకాలతో ఆర్థికంగా చేయూతనిచ్చి పేదరికం నుంచి గట్టెక్కించడం ద్వారా ఆర్థిక సాధికారత.. అమ్మ ఒడి, విద్యాదీవెన వంటి పథకాలతో ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడం ద్వారా విద్యా సాధికారత.. నామినేటెడ్ నుంచి కేబినెట్ వరకూ సింహభాగం పదవులు ఇచ్చి పరిపాలనలో భాగస్వామ్యం ఇవ్వడం ద్వారా రాజకీయ సాధికారత.. సంక్షేమ పథకాల నుంచి పదవుల వరకూ మహిళలకు పెద్దపీట వేయడం ద్వారా మహిళా సాధికారతకు కృషి చేస్తుండటాన్ని సామాజిక వేత్తలూ ప్రశంసిస్తున్నారు.

- సామాజిక న్యాయమనేది తమ నినాదం కాదని, తమ విధానమని నిరూపిస్తున్న వైఎస్ జగన్... ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 95 శాతాన్ని అమలు చేసి చూపించారు. ఇప్పటిదాకా 99.5 శాతం హామీలను అమలు చేసి... దేశ చరిత్రలోనే ఎన్నికల మేనిఫెస్టోకు కొత్త నిర్వచనం ఇచ్చారు.
- సంక్షేమ పథకాల కింద... ఒక్క పైసా అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి ఇప్పటిదాకా రూ.2.38 లక్షల కోట్లను జమ చేశారు. ఇందులో 75 శాతం నిధులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చేరాయి. నగదు బదిలీ కాకుండా ఇతర పథకాల ద్వారా రూ.2.33 లక్షల కోట్ల ప్రయోజనాన్ని చేకూర్చారు.
- నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు ధీటుగా అభివృద్ధి చేసిన సీఎం వైఎస్ జగన్.. పేద పిల్లలు ప్రపంచంతో పోటీ పడేలా ఇంగ్లీషు మీడియం బోధనను ప్రవేశపెట్టారు. అమ్మ ఒడి, గోరుముద్ద, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు విద్యా సాధికారత సాధించడానికి మార్గం సుగమం చేశారు.
- వైఎస్సార్ ఆసరా, చేయూత వంటి పథకాల ద్వారా ఆర్థికంగా తోడ్పాటును అందించి.. కేబినెట్ నుంచి నామినేటెడ్ వరకూ పదవుల్లో మహిళలకు పెద్దపీట వేసి మహిళా సాధికారతకు మార్గం వేశారు.
- నామినేటెడ్ పదవుల్లో 50 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారికి రిజర్వేషన్ చేస్తూ చట్టం చేసి మరీ ఆ వర్గాలకు పదవులిచ్చారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్. నామినేటెడ్ పదవుల్లో 50 శాతం ఆ వర్గాలకు రిజర్వేషన్ చేస్తూ చట్టం చేయడం దేశంలో ఇదే తొలిసారి.

తిరుమలలో ఘనంగా పార్వేట ఉత్సవం



నూతన మండపంలో నిర్వహణ

ముగిసిన శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు

తిరుమల: తిరుమలలో శ్రీ మలయప్పస్వామివారి పార్వేట ఉత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ ఉత్సవం మకర సంక్రాంతి మరుసటిరోజైన కనుమ నాడు జరుగుతుంది. అధికమాసం కారణంగా శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల మరుసటి రోజు కూడా దీన్ని నిర్వహిస్తారు. శ్రీవారి ఆలయంలో ప్రాతఃకాలారాధన పూర్తయిన తరువాత శ్రీమలయప్పస్వామి తిరుచ్చిపై పాపవినాశన మార్గంలో నూతనంగా నిర్మించిన పార్వేట మండపానికి ఊరేగింపుగా చేరుకున్నారు. అనంతరం పంచాయుధమూర్తిగా దర్శనమిచ్చిన శ్రీ మలయప్పస్వామి శంఖం, చక్రంతోపాటు ఖడ్గం, గద, ఈటె, విల్లు, బాణం తదితర ఆయుధాలు ధరించి పారువేటకు వెళ్లారు. స్వామి వారి తరపున టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డితో పాటు అర్చకులు రామకృష్ణ దీక్షితులు ఈటెను 3 సార్లు విసిరారు. ఆ తరువాత స్వామివారు పార్వేట మండపం నుంచి మహాద్వారానికి వచ్చి హాతీరాంజీవారి బెత్తాన్ని తీసుకొని సన్నిధికి వేంచేయడంతో పారువేట ఉత్సవం ముగిసింది. ఈ ఉత్సవం కారణంగా ఆలయంలో ఆర్జిత సేవలను రద్దు చేశారు.

వేడుకగా బంగారు తిరుచ్చి ఉత్సవం

శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన సోమవారం స్వామివారికి చక్రస్నానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి బంగారు తిరుచ్చి ఉత్సవం వైభవంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామివారు శ్రీరామ పట్టాభిషేకం అలంకారంలో ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించారు. దీంతో 9 రోజుల పాటు జరిగిన నవరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

వైద్యులకు స్టైపెండ్ అందడం లేదు!



70% యూజీ ఇంటర్న్స్, పీజీలకు స్కాలర్‌షిప్ ఇవ్వని ప్రైవేట్ మెడికల్ కాలేజీలు

జాతీయ మెడికల్ కమిషన్ ఆధ్వర్యంలో గూగుల్ ఫాం సర్వే
దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తం చేస్తున్న జూనియర్ డాక్టర్లు

సాక్షి, హైదరాబాద్: ప్రైవేట్ మెడికల్ కాలేజీలు ఎంబీబీఎస్ ఇంటర్న్లకు, పీజీ వైద్య విద్యార్థులకు స్టైపెండ్ ఇవ్వడం లేదని తేలింది. ఈ సమస్యపై జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ఆధ్వర్యంలో గూగుల్ ఫాం ద్వారా ఆన్‌లైన్ సర్వే నిర్వహించింది. మరోవైపు దేశవ్యాప్తంగా వైద్య విద్యార్థులు ఎన్ఎంసీకి ఫిర్యాదులు చేస్తున్నారు. మొత్తంగా 70 శాతం మంది యూజీ ఇంటర్న్లకు, పీజీ విద్యార్థులకు స్టైపెండ్ అందడం లేదని తేలింది. దీంతో ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లోని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు జోక్యం చేసుకొని స్టైఫండ్ ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

10,178 మందితో ఆన్‌లైన్ సర్వే...

ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ ఇంటర్న్లు, పీజీ వైద్య విద్యార్థులకు స్టైపెండ్ చెల్లించే సమస్యపై గూగుల్ ఫాం ద్వారా ఆన్‌లైన్ సర్వే జరిగింది. పీజీ విద్యార్థుల నుంచి మొత్తం 10,178 మంది నుంచి ఫీడ్ బ్యాక్ వచ్చింది. అందులో 7,901 మంది వివరాలను విశ్లేషించారు. దేశవ్యాప్తంగా 19 రాష్ట్రాలలోని 213 ప్రైవేట్ మెడికల్ కాలేజీల నుంచి ఫీడ్‌బ్యాక్ స్వీకరించారు. అందులో 2,110 మంది పీజీ విద్యార్థులు తమకు స్టైపెండ్ అందడం లేదని స్పష్టం చేశారు. 4,288 మంది విద్యార్థులు తమకు చెల్లించే స్టైపెండ్ ఆయా రాష్ట్రాల్లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలు చెల్లిస్తున్న స్టైపెండ్‌తో సమానంగా ఉండటం లేదని వెల్లడించారు. తమకు వచ్చే స్టైపెండ్‌ను ఆయా ప్రైవేట్ మెడికల్ కాలేజీల యాజమాన్యాలే వెనక్కి తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. అనేక కాలేజీలు కాగితాలపై మాత్రం విద్యార్థులకు స్టైపెండ్ ఇస్తున్నట్లు రాసుకుంటున్నాయి. కానీ వాస్తవంగా వారికి ఒక్క పైసా ఇవ్వడంలేదు.

ఆందోళనలకు సిద్ధమవుతున్న జూ.డాక్టర్లు...

తెలంగాణలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని జూనియర్ డాక్టర్లు స్టైపెండ్ చెల్లింపులో జాప్యంపై సమ్మెకు సిద్ధమవుతున్నారు. మెజారిటీ ప్రైవేట్ కాలేజీలు స్టైపెండ్‌లు చెల్లించడం లేదని, ఈ సమస్యపై ఎన్ఎంసీని ఆశ్రయించినట్లు విద్యార్థులు చెబుతున్నారు. అయితే ప్రైవేట్ కాలేజీల విద్యార్థులు సమ్మెకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. వారు యూనియన్లు ఏర్పాటు చేసుకుంటే యాజమాన్యాలు సహించడంలేదు. గత్యంతరం లేక అప్పులు చేయాల్సి వస్తుందని హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ మెడికల్ కాలేజీకి చెందిన ఒక జూనియర్ డాక్టర్ అభిప్రాయపడ్డారు. ఏదేమైనా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి స్టైపెండ్ వచ్చేలా ఆందోళనలు చేస్తామని కొందరు విద్యార్థులు అంటున్నారు. కాగా, వైద్య విద్యార్థులకు స్టైపెండ్ చెల్లించక పోవడంపై వైద్యవిద్య అధికారులను 'సాక్షి' వివరణ కోరేందుకు ప్రయత్నించగా అధికారులు అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

బాబు కోసం పుట్టిన పార్టీ జనసేన



- సున్నా సున్నా కలిసినా, హెచ్చించినా సున్నానే
- పవన్ కళ్యాణ్ టీడీపీతో విడిపోయింది ఎప్పుడు..?
- రాష్ట్రానికి తెలుగుదేశం తెగులు పట్టుకుని చాలా కాలమైంది
- ఈ తెగులుకు త్వరలో అంతిమ సంస్కారం
- ఏపీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ధ్వజం

సాక్షి, అమరావతి: చంద్రబాబు కోసమే పుట్టిన పార్టీ జనసేన అని ఏపీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. సున్నా సున్నా కలిసినా, హెచ్చించినా సున్నానే అవుతుందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పాత కలయికకు రాజమండ్రిలో కొత్త రూపువచ్చిందన్నారు. ఇప్పుడు వీరిద్దరూ కొత్తగా కలిసినట్లు మాట్లాడుతున్నారని.. అసలు వాస్తవానికి వీరిద్దరూ ఎప్పుడు విడిపోయారని ప్రశ్నించారు. ప్రజల సమస్యలపై చర్చించామంటారని, చంద్రబాబు అరెస్టు తర్వాత మాత్రమే సమస్యలు గుర్తొచ్చాయా అని నిలదీశారు. ఇలాంటి కలయికను ప్రజలు హర్షించరని స్పష్టం చేశారు. టీడీపీకి ఏదైనా నష్టం జరుగుతుందనుకుంటే వెంటనే కాపాడటానికి పవన్ వస్తారని మండిపడ్డారు. చంద్రబాబుకు మనోధైర్యం ఇవ్వడం కోసమే తప్ప రెండు పార్టీలు రాజమండ్రి భేటీలో ప్రజల కోసం ఏమీ చర్చించలేదన్నారు. రాష్ట్రానికి తెలుగుదేశం తెగులు పట్టుకుని చాలా సంవత్సరాలైందన్నారు. ఆ తెగులును కాపాడటానికి పవన్ ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఆ తెగులుకు త్వరలో అంతిమ సంస్కారం జరగబోతుందన్నారు. లోపల చంద్రబాబు ఊసలు లెక్కేసుకోవడం, బయట ఉన్న పుత్రుడు, దత్తపుత్రుడు రోజులు లెక్కేసుకోవడం ఇదే తంతు నడుస్తోందని ఎద్దేవా చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే..

పవన్, లోకేశ్ భేటీ అట్టర్ ఫ్లాప్..: టీడీపీ ఇచ్చిన దిష్టిబొమ్మల దహనం పిలుపు, రాజమండ్రిలో పుత్రుడు, దత్తపుత్రుడు భేటీ అట్టర్ ఫ్లాప్. తానేమీ వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకం కాదు.. వారి విధానాలకే వ్యతిరేకమని పవన్ అంటున్నారు. మరి మేం మాత్రం ఆయనకు వ్యతిరేకమా? పవన్‌కు, మాకూ ఏమన్నా తగాదా ఉందా? అసలు ఆయన విధానం ఏంటి? 2014లో టీడీపీతో కలిసి ముందుకు వెళ్లారు.. 2019లో టీడీపీతో కాకుండా విడిగా పోటీ చేశారు.. ఇప్పుడు మళ్లీ కలిసి పోటీ చేస్తున్నారు.. అందుకే పవన్‌ను ప్యాకేజీ స్టార్ అంటున్నాం.

ఏ తప్పూ లేకుండా 42 రోజులు జైల్లో పెడతారా?

చంద్రబాబు తన లేఖలో 'నేను జైల్లో లేను..ప్రజల గుండెల్లో ఉన్నా' అని అంటున్నారు. ఆయన అరెస్ట్ వార్త విని 154 మంది మరణించారనేది ఎంత నిజమో.. ప్రజల గుండెల్లో ఉన్నారనేది కూడా అంతే నిజం. ఈ దేశంలో ఏ తప్పూ లేకుండా 42 రోజులు జైల్లో పెట్టడం సాధ్యమా? బాబు బయట ఉండగానే ఆయన పీఏ శ్రీనివాస్ దేశం దాటిపోయాడు. వ్యవస్థలను మేనేజ్ చేయడంలో దేశంలోనే బాబు నంబర్‌వన్. ఇక లోకేశ్, అమిత్‌షా కలయిక విషయంలో లోకేశ్ బండారమంతా కిషన్ రెడ్డి బయటపెట్టారు. లోకేశ్‌ను అమిత్‌షా రమ్మనలేదని.. ప్రాధేయపడితే తానే లోకేశ్‌కు అపాయింట్‌మెంట్ ఇప్పించానని చెప్పారు. ప్రగల్భాలు పలకడం దేనికి.. అభాసుపాలవ్వడం దేనికి లోకేశ్? పురందేశ్వరి మాత్రం తేలు కుట్టిన దొంగలా మాట్లాడటం లేదు.

1న జనసేన, టీడీపీ ఉమ్మడి మేనిఫెస్టో

ఇరు పార్టీల సమన్వయ కమిటీ తొలి భేటీలో పవన్ కళ్యాణ్



మీడియాతో మాట్లాడుతున్న జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, పక్కన టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్

సాక్షి, రాజమహేంద్రవరం: జనసేన, టీడీపీ ఉమ్మడి మేనిఫెస్టోను నవంబర్ 1న ప్రకటిస్తామని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తెలిపారు. ఆ తర్వా త ఇంటింటికీ ప్రచారం ప్రారంభిస్తామ న్నారు. రాజమహేంద్రవరంలో సోమవారం టీడీపీ, జన సేన సమన్వయ కమిటీ తొలి భేటీ జరిగింది. అనంతరం టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌తో కలిసి పవన్ మీడియాతో మాట్లాడారు. మేనిఫెస్టో రూపకల్పనపై యనమల రామకృష్ణుడు, నాదెండ్ల మనోహర్ లోతుగా చర్చలు జరిపినట్లు తెలిపారు. మేనిఫెస్టోలో ఎలాంటి అంశాలు ఉండాలి? ఉమ్మడి పార్టీల ప్రాధాన్యత అంశాలు చర్చకు వచ్చాయన్నారు. జనసేన, టీడీపీ కలయిక కోసం ప్రజలు మూడేళ్లుగా ఎదురుచూస్తున్నారని చెప్పారు చంద్రబాబును అక్రమంగా జైల్లో పెట్టారని, సాంకేతిక సమస్యలు చూపుతూ బెయిల్ రాకుండా అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఆయనకు ధైర్యాన్ని ఇవ్వడానికే రాజమహేంద్రవరంలో జనసేన–టీడీపీ తొలి భేటీ నిర్వహించామన్నారు. జనసేన, టీడీపీ కలయిక రాష్ట్రానికి మేలు చేస్తుందని, రాష్ట్ర ప్రయో జనాలే లక్ష్యంగా ముందుకెళ్తామని లోకేశ్ తెలిపారు. రెండు పార్టీల ఉమ్మడి సమావేశంలో చంద్రబాబు అరెస్టుకు నిరసన తెలపడం, వైఎస్సార్‌సీపీ అరాచక పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడటం, రెండు పార్టీల కలయికతో అన్ని వర్గాల అభివృద్ధికి సంబంధించి మూడు తీర్మానాలు చేశామన్నారు.

ప్రతిదానిలో ఏదైనా మంచిని చూడటానికి మీ మనస్సుకు శిక్షణ ఇవ్వండి.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 25 అక్టోబర్ 2023

తటస్థతకు తూట్లు పొడవొద్దు!

పాలనా ప్రక్రియలో పాలుపంచుకునే ఉన్నతాధికార వర్గం ఆ ప్రక్రియలో పెనవేసుకుని వుండే రాజకీయ పార్శ్వానికి ఎప్పుడూ దూరంగా ఉంటుంది. ప్రజాస్వామ్య మూలస్తంభాల్లో ఒకటైన కార్యనిర్వాహక వ్యవస్థ (ఎగ్జిక్యూటివ్)లో మంత్రులతోపాటు ఉన్నతాధికారవర్గం కూడా భాగస్వామే. ప్రభుత్వాలు మారినప్పుడల్లా మంత్రులు మారతారు. కానీ ఉన్నతాధివర్గం మాత్రం శాశ్వతం. అందుకే పాలనాపరమైన విధి నిర్వహణ వేరు... రాజకీయ ప్రచారం వేరు అనే స్పృహ అధికార యంత్రాంగానికి ఎప్పుడూ ఉంటుంది. సివిల్ సర్వీసు నిబంధనలు సైతం ఉన్నతాధికారులు రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనటానికి అంగీకరించవు. కానీ కేంద్ర ప్రభుత్వం ఇటీవల జారీచేసిన ఒక సర్క్యులర్ ఆ విభజనను కాస్తా మటుమాయం చేస్తోంది. గత తొమ్మిదేళ్లలో సాధించిన ప్రగతిని ప్రచారం చేసేందుకు సీనియర్ అధికారులు దేశంలోని 765 జిల్లాలకూ, ఆ జిల్లాల్లోని 26 కోట్ల 90 లక్షల గ్రామాలకూ తరలివెళ్లాలని ఆ సర్క్యులర్ నిర్దేశించింది. జాయింట్ సెక్రటరీ, డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ స్థాయి ఉన్నతాధికారులు ఈ యజ్ఞంలో పాలుపంచుకోవాలట. వీరికి రథ్ ప్రభారీస్ (ప్రత్యేక అధికారులు)గా నామకరణం చేశారు. కేంద్రంలోని రక్షణ మంత్రిత్వ శాఖ సహా అన్ని శాఖలూ ఈ మాదిరి సర్క్యులర్‌నే విడుదల చేశాయి. రక్షణ శాఖ ఈ నెల 9న జారీ చేసిన ఉత్తర్వు మరింత విడ్డూరమైనది. వార్షిక సెలవుల్లో వెళ్లే సైనికులు తమ తమ సెలవుల్లో 'సైనిక దూతలు'గా ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలని ఆ ఉత్తర్వు పిలుపునిచ్చింది. నవంబర్ 20 మొదలుకొని జనవరి 25 వరకూ 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర' పేరుతో దీన్ని కొనసాగించాలన్నది సర్క్యులర్ సారాంశం. సరిగ్గా ఈ తేదీల మధ్యనే తెలంగాణ, రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికలుంటాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాక, ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చాక ఇలాంటి యాత్రలు ఎంతవరకూ సమంజసమన్న సంగతలావుంచి... అసలు ఉన్నతాధికార వర్గం ఈ మాదిరి ప్రచారకర్తలుగా పని చేయటం సరైనదేనా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

పథకాల గురించి అందరికీ తెలిసేలా అవసరమైన ప్రచార ఉపకరణాలను సంసిద్ధపరచుకోవటం ఏ ప్రభుత్వానికైనా అవసరం. అందుకోసమే ప్రభుత్వంలో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఉంటుంది. ఆ శాఖ ప్రభుత్వ పథకాల సమాచారాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్తుంది. తమ ప్రభుత్వమే మరో దఫా అధికారంలో కొనసాగేందుకు కావలసినదంతా చేస్తుంటుంది. ఇందుకు బడ్జెట్‌లో కేటాయింపులుంటాయి. తమది ప్రపంచంలోనే అత్యధిక కార్యకర్తలున్న రాజకీయ పార్టీ అని బీజేపీ చెప్పుకుంటుంది. ఆ పార్టీకి నోరున్న రాజకీయ నాయకుల లోటు కూడా లేదు. వీరందరినీ కాదని ప్రభుత్వ పథకాలనూ, వాటి ద్వారా సాధించిన ప్రగతినీ ప్రచారం చేసేందుకు ఉన్నతాధికార వర్గాన్ని దించాలనటంలో ఆంతర్యమేమిటన్నది అంతుపట్టని విషయం. కార్యకర్తలు, నాయకుల కంటే ఈ అధికారులకే విశ్వసనీయత ఉంటుందని పాలకులు అనుకుంటున్నారా? 'అధికారులు కేవలం ప్రభుత్వ కార్యాలయాల్లోని కుర్చీలకు అతుక్కుపోవాలా? తాము రూపొందించిన పథకాల ప్రభావం క్షేత్ర స్థాయిలో ఎలా ఉందో తెలుసుకోవద్దా?' అంటూ బీజేపీ నేతలు చేస్తున్న తర్కం అర్థరహితమైనది. అలా తెలుసుకోవటానికీ, అవసరమైన మార్పులు చేసుకోవటానికీ పకడ్బందీ వ్యవస్థ అమల్లో ఉంది. రాష్ట్రాల్లో ప్రభుత్వాలున్నాయి. అవసరమైన సమాచారాన్ని సత్వరం పొందేందుకు ఎన్నో మార్గాలున్నాయి. ప్రభుత్వ పథకాల సమాచారం ప్రజలందరికీ అందించటానికి, అవి కేవలం లక్షిత వర్గాలకు మాత్రమే చేరేలా, దుర్వినియోగానికి తావులేకుండా చేయటానికి ఎన్నో నిబంధనలు అమల్లోకొచ్చాయి. కానీ ఉన్నతాధికారులే స్వయానా ప్రచారకర్తలుగా మారాలనడం, అందువల్ల మాత్రమే ప్రజలంతా అన్నీ తెలుసుకోగలుగుతారనడం సమంజసం కాదు. ఈ క్రమంలో ఉన్నతాధికార వర్గం రాజకీయాలను అంటించుకుంటే పాలనావ్యవస్థకుండే తటస్థతకు జరిగే నష్టం తీవ్రమైనది. వచ్చే ఎన్నికల్లో మరోసారి అధికారాన్ని కైవసం చేసుకోవడం ఎలాగన్నది కార్యనిర్వాహక వర్గంలోని మంత్రులకు సంబంధించిన ప్రశ్న. అదే వ్యవస్థలో భాగస్థులైన ఉన్నతాధికారవర్గం పాలనా ప్రక్రియ సజావుగా సాగటానికి, పాలకుల విధానాలూ, వారి పథకాలూ లక్షిత వర్గాలకు చేరేలా చేయటం వరకూ పూచీ పడుతుంది. అంతకుమించి ఏం చేసినా దానికి రాజకీయ మకిలి అంటుతుంది.

బ్రిటిష్ వలస పాలకుల హయాంలో ఉన్నతాధివర్గం పని... కేవలం శాంతిభద్రతలను పర్యవేక్షించటం, ఖజానాకు ఆదాయం సమకూర్చటం మాత్రమే! కానీ స్వాతంత్ర్యం వచ్చాక అదంతా మారింది. సంక్షేమ రాజ్య భావన బలపడటంతో జాతీయ స్థాయిలోనూ, రాష్ట్రాల స్థాయిలోనూ పాలకుల సంక్షేమ విధానాల అమలు, ప్రణాళికాబద్ధ అభివృద్ధి ఉన్నతాధికార వర్గం ప్రధాన కర్తవ్యాలయ్యాయి. రాజకీయ అస్థిరత అలుముకున్న దశలో కూడా ఉన్నతాధికార వ్యవస్థ తటస్థంగా వ్యవహరిస్తూ రాజకీయ నాయకత్వానికి అవసరమైన సలహాలిస్తూ పాలన సజావుగా సాగేందుకు దోహద పడుతోంది. సివిల్ సర్వీసు అధికారులు ఎట్టిపరిస్థితుల్లోనూ రాజకీయాల్లో లేదా మతసంబంధ అంశాల్లో తలదూర్చరాదని ఈ సర్వీసు పథ నిర్దేశకుడైన స్వర్గీయ సర్దార్ పటేల్ హితవు చెప్పారు. అందుకు పూర్తి భిన్నంగా పోయి పాలనావ్యవస్థకూ, సైనిక వ్యవస్థకూ రాజకీయ మకిలి అంటించి మన పొరుగునున్న పాకిస్తాన్ చివరికెలా అఘోరించిందో కనబడుతూనే ఉంది. అందువల్ల ఉన్నతాధికార గణాన్ని ప్రచారకర్తలుగా ఉరికించాలన్న సంకల్పాన్ని కేంద్రం విడనాడాలి. దాని తటస్థతను కాపాడాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు
ఆశ్వయుజ మాసం., **తిథి:** శు.ఏకాదశి ఉ.10.24 వరకు
తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** శతభిషం ప.12.26 వరకు
తదుపరి పూర్వాభాద్ర. **వర్జ్యం:** సా.6.23 నుండి 7.54 వరకు,
దుర్ముహూర్తం: ప.11.20 నుండి 12.09 వరకు,
అమృత ఘడియలు: రా.3.21 నుండి 4.33 వరకు.

సూర్యోదయం: 5.59
సూర్యాస్తమయం: 5.31
రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు

బాధితుల గోడు వినేదెవరు?

అభిప్రాయం



డా॥ మహ్మద్ హసన్

ఒకప్పుడు ప్రపంచంలో తన కంటూ ఒక చిరునామా లేని జాతి అది. అనేక రకాలుగా చరిత్రలో అవమానాలూ, బాధలూ ఎదుర్కొని చివరికి పాలస్తీనియన్ల చెంతకు చేరింది. తాము ఉండడానికి కాసింత స్థలం అడిగింది. తమ పవిత్ర గ్రంథం ఆ ప్రాంతం తమ పూర్వీకులదని చెబుతోందనీ, అందువల్ల ఈ ప్రాంతం తమదేననీ పేచీపెట్టి పాలస్తీనియన్లతో కయ్యానికి దిగింది. అమెరికా వెన్నుదన్నుతో ఐక్యరాజ్యసమితి చేత తాను ఆక్రమించుకున్న ప్రాంతాన్ని 1947లో ఒక దేశంగా ప్రకటింపజేసుకొంది. ఆ జాతే యూదు జాతి. వారిదేశమే 'ఇజ్రాయెల్'. ఇక ఆతిథ్యం ఇచ్చి మోసపోయిన అరబ్ ప్రజలు మాత్రం 'పాలస్తీనా' పేరుతో ఉన్న అతి చిన్న ప్రాంతానికి పరిమితమై అనేక అగచాట్లు పడుతూ ఇజ్రాయెల్‌పై దాడులకు దిగుతున్నారు.

మానవాళిని పట్టి పీడిస్తున్న యుద్ధాలు మానవత్వాన్ని మట్టుపెడుతున్నాయి. జంతుదశ నుంచి నాగరికత కలిగిన ఆధునిక మానవునిగా ఎదిగిన మానవుడు తాను అభివృద్ధి చేసుకున్న ఆయుధాలు, శాస్త్ర విజ్ఞానంతో తన అభివృద్ధిని తానే నాశనం చేసుకొంటున్నాడు. ఇందుకు తాజా ఉదాహరణ ఇజ్రాయెల్–పాలస్తీనా మధ్య చెలరేగిన ప్రస్తుత యుద్ధం. ప్రపంచంలో ఏ యుద్ధం జరిగినా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అమెరికా వంటి అగ్రరాజ్య హస్తం ఉండడం మామూలయ్యింది. ఇజ్రాయెల్‌ను మొదటి నుంచీ అమెరికా అన్ని విధాలా వెనకేసుకొస్తోంది. అమెరికా, దాని మిత్రదేశాలు పాలస్తీనాను భౌగోళికంగా గుర్తించకుండా కేవలం ఇజ్రాయెల్‌ను మాత్రమే ఒక దేశంగా గుర్తిస్తూ 1948లో ఐక్యరాజ్య సమితితో ప్రకటన చేయించటం అగ్నికి ఆజ్యం పోసినట్లయింది.

ఇజ్రాయెల్‌తో పాటుగా పాలస్తీనాను కూడా భౌగోళికంగా గుర్తించి ఉంటే ఈ యుద్ధం జరిగేదే కాదు. వారి నిర్లక్ష్య ఫలితమే నేడు ఇజ్రాయెల్–పాలస్తీనా యుద్ధం. ఇజ్రాయెల్ రిపబ్లిక్ అయిన తర్వాత పాలస్తీనియన్లు ఇజ్రాయెల్‌పై యుద్ధం ప్రకటించటం అనంతరం పాలస్తీనా ఓడిపోవటం జరిగింది. అయితే అప్పటినుంచీ పాలస్తీనా ప్రజల్లో అసంతృప్తి, ఆవేశం, అస్థిరత గూడు కట్టుకోవడం క్రమంగా పెరిగింది. దీంతో అవకాశం దొరికినప్పుడల్లా పాలస్తీనా తిరుగుబాటు దారులు ఇజ్రాయెల్‌పై దాడిచేసి హింసకు పాల్పడుతున్నారు. అందులో భాగమే ఇటీవల వందలాది రాకెట్లను ప్రయోగించి ఇజ్రాయెల్‌ను బెంబేలెత్తించిన ఘటనను చూడాలి.

1948లో ఇజ్రాయెల్ ఏర్పడిన వెంటనే పాలస్తీనాకు మద్దతుగా ఐదు అరబ్ దేశాలు ఇజ్రాయెల్‌పై యుద్ధానికి దిగాయి. కాని, ఇజ్రాయెల్ అరబ్ దేశాలపై విజయం సాధించింది. ఐక్యరాజ్య సమితి పాలస్తీనా సమస్యను ప్రపంచ శాంతి భద్రతల సమస్యగా పరిగణించి పరిష్కరించకపోవటం చారిత్రక తప్పిదంగా చెప్పుకోవాలి. తమ సొంత భూభాగంలోనే ఒక మూల పరాయి వాళ్లుగా జీవించవలసి రావడం, గాజాను దాటాలంటే ఇజ్రాయెల్ అధికారుల అనుమతి తీసుకోవలసి ఉండడం, తనిఖీల పేరుతో పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ సైన్యం ఇబ్బంది పెట్టడం, తమ ఆంక్షలను ధిక్కరిస్తే అమానవీయంగా చంపివేయడం, ఇళ్లను కూల్చడం వంటి అనేక అంశాలు స్వతంత్ర పాలస్తీనా కోరికను మరింత బలపడేలా చేసింది. గాజాలోని ''అల్ అఖ్సా'' మసీదులోకి వెళ్ళాలంటే కూడా ఇజ్రాయెల్ పోలీసుల అనుమతి తీసుకొని రావాల్సి ఉండటం పాలస్తీనియన్లకు అత్యంత బాధ కల్గిస్తున్న విషయం.

ఈ క్రమంలోనే 'పాలస్తీనా లిబరేషన్ ఫ్రంట్', 'పాపులర్ ఫ్రంట్ ఫర్ ది లిబరేషన్ ఆఫ్ పాలస్తీనా', 'పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్' వంటి సంస్థలు ఆవిర్భవించాయి. యాసర్ అరాఫత్ నేతృత్వంలో (1969–2004) ఇజ్రాయెల్–పాలస్తీనా మధ్య 1993, 1995లలో



శాంతి ఒప్పందాలు కుదిరాయి. దీంతో 1994లో ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి ఇత్జాక్ రాబిన్, ఆ దేశ విదేశాంగ మంత్రి షిమన్ పెరెస్, పాలస్తీనా విమోచనా సంస్థ నాయకుడు యాసర్ అరాఫత్‌లకు నోబెల్ శాంతి బహుమతి సంయుక్తంగా లభించింది. అయితే 1995లో రాబిన్ హత్యకు గురయ్యాడు. అనంతరం జరిగిన పరిణామాల్లో 2004లో యాసర్ అరాఫత్ అనుమానాస్పదంగా మరణించాడు. ఫలితంగా సమస్య మళ్ళీ మొదటి కొచ్చింది. రెండు వైపులా రైట్ వింగ్‌కు చెందిన వారు సమస్యను ప్రస్తుత స్థితికి సాగదీస్తూ వచ్చారు.

ఇజ్రాయెల్ – పాలస్తీనా సమస్యను రెండు ప్రాంతాల మధ్య మత ఘర్షణలుగా చూడడం సరికాదు. పాలస్తీనియన్లు భౌగోళికమైన ఉనికి, అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం చేస్తున్న పోరాటంగా మాత్రమే పరిగణించాలి. 'భద్రతలను కలిగి ఉండటం వలన వ్యక్తిలో ఉద్భవించే మానసిక ప్రశాంతతయే స్వేచ్ఛ' అంటాడు అమెరికన్ రాజకీయవేత్త మాంటెస్క్యూ. ఇక్కడ పాలస్తీనీయన్లు అభద్రతాభావానికి గురైన సందర్భంలోంచి వచ్చినదే నేటి 'హమాస్' సంస్థ. 'ఆరు భద్రతా మండలి తీర్మానాల'నూ, 1993 పాలస్తీనాతో జరిగిన ''ఓస్లో'' ఒప్పందాన్ని కూడా ఇజ్రాయెల్ తుంగలో తొక్కింది. పైగా ఐక్యరాజ్యసమితిలోని వీటో అధికారం కల్గిన దేశాల మద్దతుతో తరచుగా ఇజ్రాయెల్ పాలస్తీనియన్లను ఉగ్రవాదం పేరుతో వేధించటం, చంపటం, పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించటం చేసింది. పాలస్తీనాతో ఘర్షణ తలెత్తిన దాదాపు ప్రతిసారీ ఎంతో కొంత వారి భూభాగాన్ని ఆక్రమించడం పనిగా పెట్టుకొంది ఇజ్రాయెల్ ఆ విధంగా ఇజ్రాయెల్ తన భూభాగాన్ని విస్తరిస్తూపోయి పాలస్తీనా ప్రజలను కొన్ని మైళ్ల భూభాగానికి పరిమితం చేసింది. అందుకే పాలస్తీనియన్లలో ఇజ్రాయెల్ అంటే విపరీతమైన ద్వేషం! ఆ ద్వేషం మరోసారి ప్రకోపించి ఇజ్రాయెల్‌పై తాజా దాడికి దారితీసింది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ఈ సందర్భాన్ని అచ్చమైన రాజకీయ నాయకునిగా తనకు అనుకూలంగా మలచుకొంటున్నాడని విశ్లేషకుల మాట. తనపై ప్రజలలో పెరుగుతున్న అసమ్మతిని పాలస్తీనియన్లపై భీకర యుద్ధం చేయడం ద్వారా తగ్గించి, వారిని మళ్ళీ తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారనేది వారి అభిప్రాయం. యుద్ధం ఎవరి వైపు నుండి మొదలైనా నష్టపోయేది సాధారణ పౌరులే, సంవత్సరాలుగా కష్టపడి నిర్మించుకున్న ఇళ్లు, ఇతర భవనాలూ పేకమేడల్లా కూలుతున్న దృశ్యాలూ, శిథిల భవనాల్లోంచి వినిపిస్తున్న చిన్న పిల్లల, మహిళల, వృద్ధుల హాహాకారాలూ మనసును చలింపజేసే విధంగా ఉన్నాయి.

ప్రపంచ శాంతి కోసం పుట్టుకొచ్చిన ఐక్యరాజ్య సమితి కోరలు లేని సింహం అయినందు వల్లనే ఇవాళ ప్రపంచంలో అనేక చోట్ల అశాంతి, అభద్రతలు రాజ్యమేలుతున్నాయి, ఒక్క ఇజ్రాయెల్ – పాలస్తీనా ప్రాంతమే కాదు... రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, చైనా – వియత్నాం సమస్య, ఉత్తర కొరియా – దక్షిణ కొరియా, చైనా – అమెరికా, ఉత్తర కొరియా – అమెరికాల మధ్య కొనసాగుతున్న వివాదాలూ, అలాగే భారత్ – చైనా సరిహద్దు వివాదం, భారత్ – పాకిస్తాన్ మధ్య కొనసాగుతున్న 'కశ్మీర్' సరిహద్దు వివాదం... వంటివన్నీ ఐక్యరాజ్యసమితి నిష్క్రియాపరత్వం, బలహీనతల కారణంగా భవిష్యత్తులో ఏదో ఒకరోజు అగ్ని పర్వతం బద్దలైనట్లుగా హింసకు దారి తీసేవే అనేది విశ్లేషకుల అంచనా.

2001 సెప్టెంబర్ 11న అమెరికాలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ జంట భవనాలపై జరిగిన దాడి తర్వాత అమెరికా 'అల్ ఖైదా' ఉగ్రవాదులపై యుద్ధం పేరుతో ఒసామా బిన్ లాడెన్‌ను మట్టుబెట్టడం పైకి చూడడానికి బాగానే ఉన్నా ఈ పని చేయవలసింది ఐక్యరాజ్యసమితి. కానీ అమెరికా ఆర్థిక సహాయంపై అధికంగా ఆధారపడి ఉన్న ఐరాస నోరు మెదపకుండా ఉండిపోయింది. అలాగే ఇరాక్ ప్రమాదకర జీవ రసాయన ఆయుధాలు తయారు చేసిందని దానిపై దాడిచేసి పాలకుడైన సద్దాం హుస్సేన్‌ను ఉరితీయించడం వంటి దుశ్చర్యలు సూపర్ పవర్‌గా ఎదిగిన దేశం తన ఇష్టం వచ్చినట్లు చిన్న దేశాలపైనా, ప్రజా ఉద్యమాలపైనా ఉక్కుపాదం మోపిందని చెప్పడానికి ఉదాహరణ. ఐక్యరాజ్య సమితి బలంగా ఉంటే ఇటువంటి సంఘటనలు చోటు చేసుకునేవేనా?

ఇక ఇజ్రాయెల్ – పాలస్తీనా సమస్య దగ్గరకు వస్తే... దీన్ని అత్యంత ప్రాధాన్యం గల అంతర్జాతీయ సమస్యగా అన్ని దేశాలూ పరిగణించాలి. పాలస్తీనాను ఒక దేశంగా గుర్తిస్తే ఐక్యరాజ్య సమితి కొంత వరకూ పాలస్తీనియన్లకు అండగా నిలిచే అవకాశం ఉంది. పది సంవత్సరాల పాలస్తీనా బాలిక నేలమట్టమైన ఇంటి ముందు నిలబడి 'నేను ఏం పాపం చేశాను? ఏం తప్పు చేశాను? నా వాళ్ళందరూ ఇజ్రాయెల్ సైన్యం దాడిలో చనిపోయారు. ఇప్పుడు నా పరిస్థితి ఏమిటి' అని ప్రపంచాన్ని ప్రశ్నించింది. దీనికి ఎవరు, ఏమని సమాధానం చెబుతారు ఆ చిట్టి తల్లికి?

వ్యాసకర్త నల్గొండ ప్రభుత్వ మహిళా కళాశాల అధ్యాపకుడు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

హృదయ మందిరం



అందరికీ దసరా, శుభో బిజోయ, విజయ దశమి శుభాకాంక్షలు! మన హృదయాలు ద్వేషాన్ని, భయాన్ని, నిస్సహాయతను పారద్రోలాలని, ప్రపంచవ్యాప్తంగా చెడుపై మంచి విజయం సాధించాలని ప్రార్థిస్తున్నాను.

– సుహాసినీ హైదర్, ప్రముఖ పాత్రికేయురాలు

అసలు – కొసరు



అఫ్గానిస్తాన్ ఆటగాడు ఇబ్రహీం జద్రాన్ తన మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును పాకిస్థాన్ తమ దేశం నుంచి వెళ్లగొట్టిన అఫ్గానిస్తాన్ శరణార్థులకు అంకితం ఇచ్చాడు. అఫ్గానిస్తాన్ చేతిలో ఓడిన పాక్ క్రికెట్ జట్టుకు ఇది... ఒకే ఆటలో రెండు ఓటములు!

– మిస్టర్ సిన్హా, రాజకీయ వ్యాఖ్యాత

డాక్టర్‌ని నమ్మండి



కమీషన్ల కోసమే డాక్టర్లు టెస్టులు రాస్తారని అనుమానించకండి. తీవ్రమైన ఛాతీ నొప్పితో వచ్చిన ఒక వ్యక్తికి అత్యవసర చికిత్స చేసి ఆ వ్యక్తిని బతికించింది ఎవరంటే... తక్షణం కరొనరీ యాంజియోగ్రఫీ చేయించుకోవాలని 2 నెలల క్రితమే ఆ వ్యక్తికి సిఫారసు చేసిన డాక్టరే! వైద్యునిపై నమ్మకం అనేది మీ వ్యాధికి ప్రథమ చికిత్స వంటిది.

– డాక్టర్ ధ్రువ్ చౌహాన్, ఆరోగ్య కార్యకర్త

ఐక్యరాజ్య నిర్మాణం



ఈ ఐక్యరాజ్యసమితి దినోత్సవం (24 అక్టోబర్) నాడు మెరుగైన ప్రపంచాన్ని నిర్మించుకోవాలన్న ఆశకు, సంకల్పానికి కట్టుబడి ఉందామని ప్రతిన పూనుదాం. 79వ వసంతంలోకి అడుగు పెడుతున్న యు.ఎన్.కు వార్షికోత్సవ శుభాకాంక్షలు. ఇక థాయ్‌లాండ్‌కు ఈ డిసెంబరులో యు.ఎన్.లో చేరి 77 ఏళ్లు పూర్తవుతాయి.

– గీతా సభర్వాల్, థాయ్ రెసిడెంట్ కోఆర్డినేటర్

నీచమైన సాకు



ఇజ్రాయెల్ ఈ యుద్ధాన్ని ముగించడానికి శీఘ్ర మార్గాన్ని కనుగొనకపోతే, గాజాపై బాంబులు వేస్తూ ఉంటే... హమాస్ దాడి చేసినప్పుడు వారికి లభించిన ప్రజాదరణను వారు కోల్పోతారు. ప్రతీకారం అనేది యుద్ధానికి నీచమైన సాకు. కంటికి కన్ను అనే పిల్లలాటకు మించిన రాజకీయ నాయకత్వం ఇప్పుడు ఇజ్రాయెల్‌కు అవసరం.

– ప్రీతిష్ నంది, ప్రఖ్యాత కవి – జర్నలిస్టు

దేశం గుర్తు లేదు!



డొనాల్డ్ ట్రంప్ తన ఎన్నికల ప్రచారంలో.. హంగేరీ ప్రధాన మంత్రి ఓర్బన్‌ను గొప్ప 'టర్కీ నాయకుడు' అని శ్లాఘించారు. "ఒక వ్యక్తి ఉన్నాడు అతను బహుశా ప్రపంచంలోని బలమైన నాయకులలో ఒకరు. అతనే టర్కీ ప్రధాని ఓర్బన్. రష్యాకు స్నేహితుడు..." అని ట్రంప్ ప్రసంగిస్తున్న ఆ వీడియోను దయచేసి ఎవరూ కూడా ఎర్డోగన్‌కు పంపకండి. (ఎర్డోగన్ టర్కీ అధ్యక్షుడు)

– మారియా డ్రుట్‌స్కా, ఉక్రెయిన్ యూట్యూబర్

పరిపూర్ణ ఉత్సాహం



ఎదుగుతున్నప్పుడు మన జీవితాలు మన చుట్టూ మనం చూసే, అభిమానించే వ్యక్తుల పరిపూర్ణ ఉత్సాహంతో రూపుదిద్దుకుంటాయి. అలాంటి వ్యక్తులలో క్రికెటర్ బిషన్‌సింగ్ బేడీ ఒకరు. క్రీడలు, జీవితం వంటి వాటి గురించి మాకెంతో నేర్పిన మీకు ధన్యవాదాలు సర్. దేవుడు మీ ఆత్మను ఆశీర్వదిస్తాడు.

– షారుఖ్ ఖాన్, బాలీవుడ్ స్టార్

హెచ్చరికను పట్టించుకోవాల్సిందే!

సందర్భం



రాఘవ్ చంద్ర

జోషీమఠ్ మునిగిపోవడానికి, అలాగే సిక్కిం, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో ఇటీవలి వరదలకు హైవేలు కొట్టుకుపోవడానికి చాలా కాలం ముందే, మన పర్వత ప్రాంత పట్టణాలు చాలావరకు వేరే విధంగా 'మునగడం' ప్రారంభమైంది. హిల్ స్టేషన్‌లకు వెళ్లే మార్గాలపై ట్రాఫిక్ జామ్‌లు, చెత్త కుప్పలు, ఇరువైపులా కనిపించే దుకాణాలను ఆ పట్టణాలు 'మునిగి' పోవడానికి తగిన నిదర్శనాలుగా మనం చూడవచ్చు. వాటికి ఉండే బరువు మోత సామర్థ్యాన్ని పక్కన పెడితే హిల్ స్టేషన్‌లను మెరుగ్గా నిర్వహించడానికి ఏం చేయాలో ఆలోచించడం చాలా కీలకం. జోషీమఠ్ క్షీణత, విరిగి పడుతుండే కులుమనాలీ కొండచరియల దృష్ట్యా... లక్షలాది మంది యాత్రికులు, వేల వాహనాలను తీసుకు వెళతారనే అంచనాతో వేలాది కోట్ల ఖర్చుతో నిర్మించిన చార్‌ధామ్ హైవే వంటి ప్రాజెక్ట్‌లను రక్షించడం తక్షణావసరం.

నిర్మాణం దాదాపుగా పూర్తి అయిన ఈ కొత్త పర్వత రహదారి పర్యావరణపరంగానూ సున్నితమైనది. మట్టిని గట్టిగా పట్టి ఉంచే పాత చెట్లను పెకిలించి, డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ చేయడం భూమిని డొల్లబరుస్తుంది. హిమాలయాల దుర్బలత్వం కారణంగా రహదారిని 5.5 మీటర్ల వెడల్పునకు మించి విస్తరించాలా, వద్దా అనే చర్చ ఉన్నప్పటికీ, తగిన భూ వినియోగ ప్రణాళిక, నేల సంరక్షణ... సమర్థమైన హైవే నిర్వహణకు అత్యవసరం. రహదారిపై పూర్తి స్థాయి రాకపోకలు మొదలైన తర్వాత అనూహ్యమైన నిరంతర వాహనాల రాకపోకలకు చెందిన అధిక ఒత్తిడి ఉంటుంది, దీంతో పరిస్థితిని పునరుద్ధరించడం, పరిష్కరించడం అసాధ్యం అవుతుంది. పరిస్థితి అంతవరకు రాకుండా కొన్ని పరిష్కారాలు ఉన్నాయి.

ఒకటి... ప్రభుత్వం టౌన్ ప్లానర్ ఆర్కిటెక్ట్‌ల సహాయంతో మాస్టర్ ప్లానింగ్ చేసేవరకు పర్వత రహదారులకు ఇరువైపులా భూ వినియోగాన్ని స్తంభింపజేయాలి. ఇది చాలా అవసరం, ఎందుకంటే అలైన్‌మెంట్ ప్రకటించిన వెంటనే... హైవే వెంట షాపులు, రెస్టారెంట్లు, దాబాలు, హోర్డింగ్‌లను ప్లాన్ చేయడానికి పెద్ద ఎత్తున ప్రయత్నం జరుగుతుంది. ఇక రోడ్డు పక్కనే ఉండే ప్రయోజనాన్ని పొందడానికి నిర్మాణాలు నేరుగా హైవేకు ఆనుకుని వచ్చేస్తాయి. ఇది ట్రాఫిక్‌ని పెంచి, పర్యావరణానికి నష్టం కలిగిస్తుంది.

రెండు... రహదారికే కాక, రహదారి కోసం గుర్తించిన ప్రాంతం పైన ఉన్న కొండలను స్థిరీకరించడానికి కూడా ఒక ప్రణాళిక ఉండాలి. అలా లేకుంటే మట్టిని బంధించి ఉంచే మొక్కలు, డ్రెస్సింగ్ స్థానభ్రంశం చెందే అవకాశం ఉంది. తరచు కొండచరియలు విరిగి పడవచ్చు కూడా! ఫలితంగా దీర్ఘకాలంలో, భారీ వర్షాల ప్రభావం ప్రమాదకరంగా ఉంటుంది, రహదారి భాగాలు కొట్టుకుపోతాయి. అందుకే సాంకేతిక లక్షణాలు కూడా బలోపేతం కావాలి.

మూడు... పట్టణ కేంద్రాలను, నివాస ప్రాంతాలను హైవే కలుస్తున్న చోట, హైవే ట్రాఫిక్‌ను సిటీ ట్రాఫిక్ నుండి వేరు చేయడం, రెండు వైపులా 20–30 మీటర్ల లోతువరకు భూ వినియోగాన్ని నియంత్రించడం అవసరం. ఎలివేటెడ్ కారిడార్‌లు, సర్వీస్ లేన్ లు, స్లిప్ రోడ్‌లను ప్లాన్ చేసి ట్రాఫిక్ సజావుగా సాగకుండా రూపొందించాలి.

నాలుగు... ప్రయివేట్ భూమిని ప్రీమియంతో నిర్బంధంగా కొనుగోలు చేసినప్పటికీ, పక్క సౌకర్యాలు... అంటే రెస్టారెంట్లు, టాయిలెట్లు, కార్ల మరమ్మతులు, ఇతర సహాయక సేవల కోసం నిర్దేశించిన పాయింట్లను మాస్టర్ ప్లాన్ చేయడం, గుర్తించడం అవసరం. దుకాణాలు, సంబంధిత వినియోగ కేంద్రాలను నోడ్‌ల వద్ద తప్ప ఇతర పాయింట్ల వద్ద నిషేధించాలి. వాహనాలను మరే ఇతర పాయింట్ల వద్దా ఆపడానికి అనుమతించకూడదు.

ఐదవది... నీటి ఎద్దడి, వేగవంతమైన నేల కోత, రహదారిని దెబ్బతీసే మెరుపు వరదలను ఎదుర్కొనేందుకు ప్లాన్ చేయడానికి 20 సంవత్సరాల డేటా అధ్యయనం ద్వారా పర్వత ప్రాంత సమగ్ర లక్షణాల మ్యాపింగ్



చేయాలి. కొండ ప్రాంతాల ప్రత్యేక భద్రతా చర్యలను చేపట్టేటప్పుడు ఈ ప్రాంత కఠినమైన ల్యాండ్ స్లయిడ్ మ్యాపింగ్ సహాయపడుతుంది.

ఆరవది... పక్కనే ఉండే వన్యప్రాణుల హాట్‌స్పాట్‌ల దృష్ట్యా నాయిస్ మ్యాపింగ్ చేపట్టాలి. ప్రమాదాల నివారణ, పాదచారుల భద్రతను పెంపొందించడానికే కాక సహజ వాతావరణానికి అనవసరమైన ఒత్తిడిని తగ్గించడానికి వాహన వేగాన్ని నియంత్రించడం చాలా చాలా ముఖ్యం.

ఏడవది... ట్రాఫిక్ నిర్వహణ కోసం ఒక ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌ని ఏర్పాటు చేయాలి, దానితో పాటు బలమైన ప్రయాణికుల సమాచార వ్యవస్థను నిరోధించడానికి హైవేలోని హాని కలిగించే విభాగాల వెంట పరిమిత సంఖ్యలో వాహనాలనే అనుమతించాలి.

ఎనిమిది... ప్రమాదాలను నివారించడానికి, శిథిలాలను తొలగించడానికి పూర్తి సన్నద్ధమైన విపత్తు నిర్వహణ బృందం, హైవే పెట్రోలింగ్ స్థానంలో ఉండాలి. జ్యామితీయ లోపాలను, ఎలక్ట్రిక్ ఫిట్టింగ్‌లలో లోపాలు, క్రాష్–బారియర్ సిగ్నేజ్‌లను సత్వర పద్ధతిలో సరిచేయడానికి హైవేను సరిచేసే సూత్రంపై పని చేయాలి, మొదట మరమ్మతులు చేయాలి. తరువాత ఖర్చులను తిరిగి పొందాలి.

తొమ్మిది... ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం ద్వారా వాతావరణ సంక్షోభ వ్యూహాల సందర్భంలో పర్వత రవాణాను డీకార్బొనైజ్ చేయాలి. (మొదటి రెండు సంవత్సరాల్లో వాటిని టోల్‌ల నుండి మినహాయించాలి.) తగిన ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను సృష్టించాలి. హిల్ స్టేషన్ సందర్శకులపై ప్రత్యేక సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ ట్యాక్స్ (భూటాన్ లో చేసినట్లు ఎస్‌డీటీ) విధించవచ్చు. డీజిల్, పెట్రోల్ వాహనాలు పొల్యూటర్–పేస్ సూత్రం ప్రకారం అధిక ఎస్‌డీటీని వసూలు చేయాలి.

పదవది... ప్రధాన పర్వత రహదారుల కోసం పర్యావరణ పరిరక్షణ, భద్రత నిర్వహణ కంపెనీని స్థాపించడం మంచిది. టోల్ రాబడిలో ముందుగా నిర్ణయించిన శాతం, ఎస్‌డీటీ, ఇతర పీనల్ లెవీలు ఈ కంపెనీని నిలకడగా ఉంచడానికి నిధులు సమకూర్చాలి.


పర్యాటకుల తీవ్రమైన రద్దీని, సున్నితమైన హిమాలయ భౌగోళికతను దృష్టిలో ఉంచుకుని, హిల్ స్టేషన్‌లు మాత్రమే కాకుండా వాటి విధానాలను కూడా మెరుగ్గా నిర్వహించడం ముఖ్యం. పైన పేర్కొన్న చర్యలన్నీ కూడా సహజ పర్యావరణానికి అయ్యే ఖర్చును తగ్గించగలవు.

వ్యాసకర్త భారత ప్రభుత్వ మాజీ కార్యదర్శి, 'నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా' మాజీ ఛైర్మన్
('హిందుస్తాన్ టైమ్స్' సౌజన్యంతో)

నమస్కార ఫలితం

నమస్కారం... భారతీయ ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రతీక. ప్రాచీన కావ్యాలలో పెద్దవారికి చిన్నవారు నమస్కరించటం, వారు వీరికి ఆశీస్సులను ఇవ్వటం, అవి నిజంగా జరగటం చూస్తాము. నమస్కారానికి అంతటి శక్తి ఉంది, అంతటి విలువ ఉంది అనేది భారతీయుల నమ్మకం. తల్లితండ్రులు ప్రత్యక్ష దైవాలు. కొన్ని ప్రాంతాలలో ఉదయాన్నే తల్లితండ్రులకు నమస్కరించే పద్ధతి ఉంది.

ఇహ పరాలలో జ్ఞానమే శాశ్వతమని బోధించే వ్యక్తి గురువు. శిష్యుడి ఎదుగుదలను తృప్తిగా ఆస్వాదించే నిస్వార్థ జీవి గురువు. అటువంటి గురువులకు చేసే నమస్కారం, ఆ గురువులు ఇచ్చే ఆశీస్సులు శిష్యుల జీవితానికి పూలబాట వేస్తాయి.



జ్యోతిర్మయం

మిత్రులకు హృదయం దగ్గర, గురువులకు, దేవతా మూర్తులకు నుదురు దగ్గర చేతులు చేర్చి నమస్కరించటం పద్ధతి. గురువులకూ, దేవతలకూ మనస్ఫూర్తిగా నమస్కరిస్తూ ప్రార్థిస్తే అనుకున్నవి సక్రమంగా జరిగిపోతాయంటారు.

మహాభారతంలో ధర్మరాజు అరణ్యవాసం ముగిశాక, ధర్మదేవతను దైవంగా, తండ్రిగా భావించి చేతులు ఫాల భాగంలో చేర్చి నిండు మనసుతో నమస్కరించాడు. నిర్మల భావంతో ధ్యానించి మనసులో ధర్ముని అంతర్దర్శనం చేసుకున్నాడు. ధర్మరాజు నమస్కారంలో నిష్ఠ, శ్రద్ధ, భక్తి ఉన్నాయి. ఆ ధ్యాన ఫలితంగా పాండవులకు అజ్ఞాత వాస రూపాలు ధర్మరాజుకు కంకుభట్టు, అర్జునునికి బృహన్నల, భీమునికి వలలుడు, నకులునికి దామగ్రంథి, సహదేవునికి తంత్రీపాలుడు ఇత్యాది రూపాలు అప్రయత్నంగా వచ్చాయి. కంకుభట్టుకు కమండలం, సన్యాసి ధరించే వస్త్రాలు, మిగతా వారికి, వారికి తగిన వస్త్రాలు, ఆభరణాలు ఎదురుగా కనిపించాయి. వారు వాటిని ధరించి తమ అజ్ఞాత వాస ప్రయాణాన్ని ప్రారంభించారు. ఆ దైవానుగ్రహఫలమే విరటుడు అందరికీ సులభంగా దర్శనం ఇచ్చేటట్లు ప్రజల మధ్య కొలువు తీరి ఉంటాడు.

నిర్మలమైన భక్తి, విశ్వాసాలతో దైవానికి చేసే నమస్కారం సత్ఫలితాన్ని, సత్వర ఫలితాన్ని ఇస్తుంది. కేవలం యాంత్రికంగా, మొక్కుబడిగా, ఒంటిచేత్తో చేసే నమస్కారాల వల్ల ఫలితం ఉండదు.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

క్లుప్తంగా...

నేడు రైతులు, మేధావులతో కాళేశ్వరం సందర్శన



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ అర్భాటపు ప్రచారానికి వేదికగా మారిన కాళేశ్వరం ప్రాజెక్టు లోపాల పరిశీలనకు బుధవారం ప్రాజెక్టును సందర్శించనున్నట్టు మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి చెందిన రైతులు, మేధావులతో కలిసి ఏడు వాహనాల్లో కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శిస్తామని మంగళవారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. కాళేశ్వరం నిజాలను ప్రజలకు చూపించాలన్న బాధ్యతల్లో భాగంగా నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని పొన్నం విజ్ఞప్తి చేశారు.

పీఠాధిపతి దినకర్ మహరాజ్ కన్నుమూత



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ నగరంలోని బడా రాంమందిర్ పీఠాధిపతి దినకర్ మహరాజ్ (93) సోమవారం రాత్రి పరమపదించారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ గురువు సమర్థ రామదాసు స్వామి ఆధ్వర్యంలో ఇందూరులో స్థాపించబడిన గాజుల్‌పేట్ బడా రాంమందిర్ పీఠాధిపతిగా 40 ఏళ్ల క్రితం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. అప్పటినుంచి ఇందూరు సంస్థానానికి ధర్మాన్ని, హిందుత్వాన్ని బోధిస్తూ వచ్చారు. పుణేకి చెందిన దినకర్ మహరాజ్ 15 ఏళ్ల నుంచే ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొనేవారు. నలుగురు అన్న దమ్ముల్లో దినకర్ మహరాజ్ రెండోవారు. పెద్ద రాంమందిరం పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన నాటినుంచి రామాయణం, భాగవతం, ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతోపాటు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో మంచి ప్రవచకుడిగా గుర్తింపు పొందారు.

రాంమందిర్ ఆవరణలోనే అంత్యక్రియలు

దినకర్ మహరాజ్ అంత్యక్రియలు గాజుల్‌పేట్‌లోని పెద్ద రాంమందిరం వెనక ఖాళీ స్థలంలో మంగళవారం జరిగాయి. ఈ కార్యక్రమంలో మహారాష్ట్రలోని ఔరంగాబాద్, నాందేడ్ జిల్లాల నుంచి మహరాజ్‌లు, భక్తులు హాజరయ్యారు.

దళితులు బతుకమ్మ ఆడొద్దంటూ వివక్ష

సూర్యాపేట జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

ఆత్మకూర్. ఎస్(సూర్యాపేట): అగ్రకులాల వారు బతుకమ్మ ఆడే చోట దళితులు బతుకమ్మ ఆడొద్దంటూ అడ్డుకున్న ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లాలో జరిగింది. ఆత్మకూరు(ఎస్) మండలం మిద్దపల్లిలో దళిత మహిళలు బతుకమ్మలతో చెరువు వద్దకు వచ్చారు. దళితులు బతుకమ్మలు తీసుకురావడాన్ని నిరసిస్తూ అగ్రకులాల మహిళలు హడావుడిగా తమ బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేసి వెంటనే వెళ్లిపోయారు. దళితులు బతుకమ్మ ఆడే విషయంపై మాట్లాడాలని దళితులను అగ్రకులాల వారు మంగళవారం గ్రామపంచాయతీ వద్దకు పిలిపించారు. అయితే తమపై కొందరు అగ్ర కులాలవారు దౌర్జన్యం చేశారంటూ పోలీసులకు దళితులు ఫిర్యాదు చేశారు. దళితులపట్ల కులవివక్ష చూపినవారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు దళిత నాయకుడు జ్ఞానసుందర్ తెలిపారు.

ద్వారకాతిరుమలలో మాడ వీధులు

ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి క్షేత్రంలో త్వరలో మాడ వీధులు నిర్మించనున్నట్లు ఏపీ ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. ఆలయంలో జరుగుతోన్న శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంత్రి కొట్టు స్వామివారికి ప్రభుత్వం తరపున మంగళవారం పట్టు వస్త్రాలను సమర్పించారు. మీడియాతో మంత్రి మాట్లాడుతూ.. ద్వారకాతిరుమల క్షేత్ర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించినట్లు చెప్పారు.

పురుగులమందు తాగి రైతు ఆత్మహత్య

ఓదెల (పెద్దపల్లి): పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం చిన్నకొమిర గ్రామానికి చెందిన రైతు పచ్చిక రవీందర్‌రెడ్డి (35) మంగళవారం సాయంత్రం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి తనకున్న మూడు ఎకరాల్లో ఈ వానాకాలంలో వరి పంట వేశాడు. పంట ప్రస్తుతం కోత దశకు చేరింది. అయితే ఏమైందో ఏమోకానీ మంగళవారం సాయంత్రం ఇంటి వెనుకాలకు వెళ్లి గడ్డివాములో నిల్వ చేసిన పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చూసి వెంటనే కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ఆత్మహత్యకుగల కారణాలు తెలియరాలేదు. మృతుడికి భార్య సాత్విక, ఇద్దరు కుమారులు ఉన్నారు. రైతు ఆత్మహత్యపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పొత్కపల్లి ఎస్సై శ్రీధర్ తెలిపారు.

2 గంటలు.. క్షుణ్ణంగా

మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించిన కేంద్ర బృందం

- ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ నేతృత్వంలో ఆరుగురు సభ్యుల బృందం రాక
- మహారాష్ట్ర వైపు కాలి నడకన వెళ్లిన అధికారులు
- బ్యారేజీ కుంగిన ప్రాంతం, పగుళ్లు ఏర్పడిన 20వ పియర్ తనిఖీ
- 15 నుంచి 22వ పియర్ వరకు, క్రస్ట్ గేట్ల పనితీరు పరిశీలన
- ఇరిగేషన్ అధికారులు, ఎల్‌అండ్‌టీ ప్రతినిధులతో చర్చలు
- అంతా గోప్యంగానే .. పోలీసు పహారాలో బ్యారేజీ ప్రాంతం



దిగువన పగుళ్లు తేలిన 20వ పియర్

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీలో కుంగిన ప్రాంతాన్ని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ బృందం మంగళవారం పరిశీలించింది. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) సభ్యుడు, అథారిటీ చైర్మన్ అనిల్‌జైన్, డైరెక్టర్లు కె.శర్మ, తంగమణి, రాహుల్ కె.సింగ్ తదితరులు స్థానిక అధికారులతో కలిసి మధ్యాహ్నం 12.10 గంటలకు బ్యారేజీ వద్దకు చేరుకున్నారు. బ్యారేజీ పూర్తిగా పోలీసు దిగ్బంధంలో ఉంది. రాకపోకలు నిలిపివేశారు. బ్యారేజీ పైకి ఎవరినీ అనుమతించడం లేదు. ఈ నేపథ్యంలో కేంద్ర బృందం సభ్యులు కుంగిన బ్యారేజీని, రోడ్డును, బ్యారేజీలో పగుళ్లు ఏర్పడిన 7వ బ్లాక్‌లోని 20వ పియర్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. అదే బ్లాక్‌లోని 15 నుంచి 22వ పియర్ వరకు, క్రస్ట్ గేట్ల పనితీరును తనిఖీ చేసినట్లు తెలిసింది. బృందం సభ్యులు 20వ పియర్ దగ్గరి నుంచి మహారాష్ట్ర వైపునకు కాలినడకన వెళ్లారు. కొలతలు తీసుకున్నారు. దిగువకు దిగేందుకు ప్రయత్నం చేసినా తేనె తుట్టెలు ఉండడంతో ఆగిపోయినట్లు సమాచారం. బ్యారేజీ వివరాలపై ఇరిగేషన్ అధికారులు, ఎల్‌అండ్‌టీ ప్రతినిధులతో చర్చించినట్లు తెలిసింది. మధ్యాహ్నం 2 గంటల వరకు తనిఖీ కొనసాగింది. కానీ ఒక్క ఇరిగేషన్ శాఖ ఈఎన్‌సీతో తప్ప ఇతర అధికారులెవరితోనూ వారు మాట్లాడలేదు. తమ వెంట రానివ్వలేదు. తమ పరిశీలనలో ఏం తేలిందో కూడా వారు వెల్లడించలేదు. కాగా బ్యారేజీ పరిస్థితి, ఇతర వివరాలతో తమ నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి బృందం సభ్యులు సమర్పించనున్నారు. ఎల్‌అండ్‌టీ గెస్ట్‌హౌస్‌లో భోజనానంతరం ఈ బృందం అక్కడి నుంచి వెనుదిరిగింది. కాగా బ్యారేజీ పరిస్థితి, సంబంధిత వివరాలను ఇరిగేషన్ శాఖ, ఎల్‌అండ్‌టీ సంస్థ గోప్యంగానే ఉంచుతున్నాయి. ఫొటోలు తీసేందుకు ప్రయత్నించిన అధికారులను కూడా వద్దని నిలువరించినట్లు సమాచారం. కేంద్రం బృందం వెంట ఈఎన్‌సీ నల్ల వెంకటేశ్వర్లు, ఎల్ అండ్‌టీ ప్రతినిధులు, స్థానిక ఇరిగేషన్, పోలీసు అధికారులు ఉన్నారు.

మళ్లీ కుంగిన వంతెన!

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ ఈనెల 21న సాయంత్రం భారీ శబ్దంతో ఓ అడుగు మేర కుంగడం కలకలం రేపింది. తెలంగాణతో పాటు పక్కనున్న మహారాష్ట్ర వాసులు ఆందోళనకు గురయ్యారు. కాగా ఆది, సోమ, మంగళవారం మూడు రోజుల్లో మళ్లీ కొంతమేర వంతెన, పియర్ కుంగినట్లు తెలిసింది. అర మీటరు లోతుకు కుంగినట్లు సమాచారం.

ఎఫ్ఐఆర్ నమోదు..

బ్యారేజీ కుంగిన ఘటనపై మహదేవపూర్‌తో పాటు మహారాష్ట్రలోని పోలీసు స్టేషన్లలో అసిస్టెంట్ ఇంజనీర్ రవికాంత్ ఇప్పటికే ఫిర్యాదు చేశారు. దీంతో మహదేవపూర్ పోలీసులు 174/2023 యూ/ఎస్ ఐపీసీ 427, సెక్షన్ 3 పీడీపీపీ యాక్ట్ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే ఒక ప్రకటనలో తెలిపారు.

జనం ఇబ్బందులు

మేడిగడ్డ నుంచి మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచ తాలూకా పోచంపల్లి వరకు గోదావరిపై 1.6 కిలోమీటర్ల మేర బ్యారేజీని నిర్మించారు. ప్రస్తుతం వంతెన కొంత కుంగడంతో రాకపోకలు నిలిపివేసిన సంగతి తెలిసిందే. దీంతో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు వెళ్లే ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. వారంతా కాళేశ్వరం మీదుగా తిరిగి వెళ్లాల్సి వస్తోంది. నిత్యం తెలంగాణ వైపు పత్తి, మిరప తోటలకు వచ్చే కూలీలు కూడా పని లేక ఇబ్బందులు పడుతున్నారు.

రబీ పంటకు నీరెట్లా?

మేడిగడ్డను ఖాళీ చేస్తుండటంతో రబీ పంటకు నీరెట్లా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. మూడు రోజుల క్రితం వరకు బ్యారేజీలో 10 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన మహారాష్ట్ర ప్రాణహిత నది ద్వారా ప్రస్తుతం 22 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. అయితే బ్యారేజీ 57 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పూర్తిగా మరమ్మతులు చేసే వరకు ఇందులో నీటిని నిల్వ చేయడం వీలు కాదు. ఈ నేపథ్యంలోనే ఈసారి రబీ సీజన్‌లో ఎగువ ప్రాంతాలకు నీటిని తరలించడం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మేడిగడ్డకు కాఫర్ డ్యాం!

▶ మొదటి పేజీ తరువాయి

పగుళ్లు వచ్చి కుంగిపోయాయని, వీటికి మరోవైపు ఉన్న 18, 21వ నంబర్ పియర్లకు సైతం కొంత వరకు నష్టం జరిగినట్టు ప్రాథమిక అంచనాకు వచ్చారు. పియర్లు కుంగడంతో బ్రిడ్జికి సంబంధించిన రాఫ్ట్‌లు సైతం దెబ్బతిన్నాయి. అయితే బ్యారేజీ పూర్తిగా ఖాళీ అయిన తర్వాతే నష్టం తీవ్రతపై పూర్తి స్థాయిలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. సంఘటన జరిగిన తర్వాత గత మూడు రోజులుగా బ్యారేజీ గేట్లను ఎత్తి నీళ్లను కిందికి విడుదల చేస్తున్నారు. గేట్ల ద్వారా బయటకు వెళ్లలేని కనీస స్థాయి నిల్వలను డీవాటరింగ్ ద్వారా బయటకి పంపించే ప్రక్రియను నిర్మాణ సంస్థ ప్రారంభించనుంది. దెబ్బతిన్న పియర్లకు జాకెటింగ్ పరిజ్ఞానం ద్వారా పటిష్టత పెంచేందుకు అవకాశం ఉందా? అన్న విషయాన్ని సైతం పరిశీలించనున్నారు. భవనాల పిల్లర్లు, బీమ్స్‌ల పటిష్టతను పెంచేందుకు వాటి చుట్టూ అదనపు స్టీల్, కాంక్రీట్‌తో జాకెటింగ్ చేస్తుంటారు. ఇదే తరహాలో బ్యారేజీ పియర్లను బలోపేతం చేసేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలను సైతం పరిశీలిస్తున్నారు. పియర్లకు మరమ్మతులు సాధ్యంకాని పక్షంలో వాటిని పూర్తిగా తొలగించి కొత్తగా నిర్మించాల్సి ఉంటుందని నిపుణులు అంటున్నారు. అవసరమైతే ఏడో నంబర్ బ్లాక్‌ను పూర్తిగా నిర్మించకతప్పదనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.

కాఫర్ డ్యామ్ ఎందుకంటే..?

మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతు పనులకు ఎగువ నుంచి నిరంతరంగా వచ్చే వరద అడ్డంకిగా మారుతుంది. దీంతో మరమ్మతు పనులు జరపాల్సి ఉన్న 7వ బ్లాక్‌కు ఎగువ నుంచి ప్రవాహం రాకుండా కాఫర్ డ్యామ్‌ను నిర్మించనున్నారు. మట్టి కరకట్టలను కట్టి ఎగువ నుంచే ప్రవాహాన్ని దారి మళ్లించనున్నారు. కాఫర్ డ్యామ్‌ను నిర్మిస్తే బ్యారేజీలో నీటిని నిల్వ చేసేందుకు కూడా అవకాశం కలుగుతుందని భావిస్తున్నారు. మరమ్మతు పనులు పూర్తైన తర్వాత కాఫర్ డ్యామ్‌ను తొలగిస్తారు. కాఫర్ డ్యామ్ నిర్మాణ వ్యయంతో పాటు మరమ్మతుల భారాన్ని నిర్మాణ సంస్థ ఎల్‌ఎండ్‌టీ భరించనుందని అధికారవర్గాలు తెలిపాయి. ప్రాజెక్టును నిర్మించిన తర్వాత ఐదేళ్ల డిఫెక్ట్ లయబిలిటీ కాలపరిమితిలో చేపట్టే మరమ్మతుల భారాన్ని నిర్మాణ సంస్థే భరించాల్సి ఉండనుంది.

నేడు ఇరిగేషన్ అధికారులతో కేంద్ర బృందం భేటీ

మంగళవారం మేడిగడ్డను పరిశీలించిన నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్ జైన్ నేతృత్వంలోని కేంద్ర బృందం.. బుధవారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని జలసౌధలో రాష్ట్ర నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులతో సమావేశం కానుంది. అనంతరం బ్యారేజీ కుంగడానికి కారణాలు, నష్ట నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై కేంద్ర జలశక్తి శాఖకు నివేదిక ఇవ్వనుంది.

మేడిగడ్డపై వాస్తవాలు వెలికి తీయండి

బ్యారేజీ కుంగడానికి ఎవరు బాధ్యులో తేల్చండి: కేంద్రానికి కిషన్‌రెడ్డి లేఖ



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో ముఖ్య భాగమైన మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీ పిల్లర్లు కుంగడానికి ఎవరు బాధ్యులో తేల్చాలని కోరుతూ కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి సోమవారం కేంద్ర జలవనరుల శాఖ మంత్రి గజేంద్ర షెకావత్‌కు లేఖ రాశారు. బ్యారేజీ భద్రతను పరిశీలించేందుకు కేంద్ర బృందాన్ని పంపాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర జల సంఘం సభ్యుడు అనిల్ జైన్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల కమిటీ మంగళవారం మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించింది. కాగా గతేడాది పార్లమెంటులో ఆమోదం పొందిన 'డ్యామ్ సేఫ్టీ బిల్లు'లో భాగంగా.. 'కేంద్ర డ్యామ్ సేఫ్టీ అథారిటీ' నిపుణుల బృందాన్ని తెలంగాణకు పంపించి మేడిగడ్డ వద్ద క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా వాస్తవాలను వెలికి తీయాలని కేంద్రానికి రాసిన లేఖలో కిషన్‌రెడ్డి కోరారు. మేడిగడ్డ పిల్లర్లు కుంగిపోవడం దురదృష్టకరమని పేర్కొంటూ, 6వ బ్లాక్‌లోని గేట్ నంబర్ 15 నుంచి 20 వరకు కుంగిపోయాయని తెలిపారు. పెద్దగా శబ్దాలు వచ్చినట్లు స్థానికులు తెలిపాక, బ్యారేజీ గేట్లను తెరిచి నీటిని దిగువకు వదులుతున్నారని వివరించారు. సాగునీటి కోసం నిల్వ చేసిన నీళ్లన్నీ ఇలా వృథాగా కిందికి వదలాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో బ్యారేజీ భద్రతకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానంగా.. ప్రాజెక్టు నిర్మాణానికి ముందు బోర్ హోల్ శాంపిల్స్ తీసుకుని భూమి సామర్థ్యాన్ని నిర్ణయించే పరీక్షలు నిర్వహించారా? లేదా తేల్చాలని విజ్ఞప్తి చేశారు. వర్షాకాలానికి ముందు, వర్షాకాలం తర్వాత ఏర్పడే పరిస్థితులకు అనుగుణంగా.. పైనుంచి వచ్చే వరద, దిగువకు వదిలే నీటి ప్రవాహానికి సంబంధించి రివర్ క్రాస్ సెక్షన్ పరీక్షలు, అధ్యయనాన్ని నిర్వహించారా? ఈ సందర్భంగా ఏమైనా ఇబ్బందులను గమనించారా? వాటన్నింటినీ పరిశీలించాలని కోరారు.

ఫౌండేషన్లో నాణ్యత లోపం

'పిల్లర్ల కింద వేసిన ఫౌండేషన్ (పియర్స్) నాణ్యతతో నిర్మించలేదని స్పష్టమైంది. పియర్స్ నిర్మించే సమయంలో అక్కడ సాయిల్ ట్రీట్మెంట్ జరగలేదనేది అర్థమవుతోంది. ఫౌండేషన్ తనిఖీ వైఫల్యం కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని స్పష్టమవుతోంది..' అని కిషన్‌రెడ్డి ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రాజెక్టును ఈపీసీ (ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ – కన్‌స్ట్రక్షన్) పద్ధతిలో కాంట్రాక్ట్ కంపెనీ చేసిందా? లేక రాష్ట్ర నీటిపారుదల విభాగానికి చెందిన సీడీవో (సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్) ద్వారా చేయించారా? అన్న విషయాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

రామగుండం విద్యుత్ కేంద్రంలో మంటలు

షార్ట్ సర్క్యూట్‌తో బీ-థర్మల్ ఉత్పత్తి కేంద్రంలో అగ్నిప్రమాదం

ఉద్యోగుల అప్రమత్తతతో తప్పిన ప్రాణాపాయం



కాలిపోతున్న బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం

రామగుండం: పెద్దపల్లి జిల్లా రామగుండంలోని 50 ఏళ్ల నాటి బీ-థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి దాటాక భారీ అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో టర్బయిన్, బాయిలర్ కేంద్రంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రాణాపాయం తప్పింది.

నిప్పురవ్వలు ఎగసిపడటంతో...

రామగుండంలోని బీ-థర్మల్ విద్యుత్ కేంద్రంలో కాలం చెల్లిన పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. ఇందులోని మిల్స్ నుంచి బాయిలర్‌లోకి బొగ్గును డంపింగ్ చేస్తుంటారు. ఈ క్రమంలో వివిధ యంత్రాలు, కంట్రోల్ రూం వరకు బొగ్గుపొడి (కోల్‌డస్ట్) వెదజల్లినట్లుగా నిండిపోతూ ఉంటుంది. అయితే బాయిలర్ ప్రాంగణంలో షార్ట్ సర్క్యూట్ జరిగిందని, నిప్పురవ్వలు బొగ్గుపొడిపై పడటంతో మంటలు చెలరేగి సమీపంలోని రబ్బర్ కేబుల్స్‌కు అంటుకొని విద్యుత్ కేంద్రం ట్రిప్ అయిందని అధికారులు తెలిపారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సకాలంలో ఫైరింజన్ ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చిందని చెప్పారు.

పునరుద్ధరించిన కొన్ని గంటల్లోనే ట్రిప్..

ఈ కేంద్రంలో సెప్టెంబర్ 12 నుంచి వార్షిక మరమ్మతులు ప్రారంభించిన అధికారులు వాటిని నెల రోజుల్లో పూర్తిచేసి విద్యుత్ కేంద్రాన్ని తిరిగి ఉత్పత్తి దశలోకి తీసుకురావాలనుకున్నా పరిస్థితులు అనుకూలించక 45 రోజులు పట్టింది. ఈ నెల 20న అర్ధరాత్రి ఉత్పత్తి దశలోకి తీసుకురాగా కొన్ని గంటలపాటు విద్యుత్ ఉత్పత్తి జరిగింది. ఈ క్రమంలోనే భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో మరోసారి విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. మళ్లీ పునరుద్ధరణ పనులు పూర్తి చేసేందుకు కనీసం 10 రోజులపైనే పడుతుందని అధికారులు అంటున్నారు. మరోవైపు ఆస్తి నష్టం వివరాలను అధికారులు ఇంకా వెల్లడించలేదు. సాధారణంగా విద్యుత్ కేంద్రం జీవితకాలం 25 ఏళ్లుకాగా బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం స్థాపించి సుమారు 50 ఏళ్లు గడుస్తోంది. విద్యుత్ సౌధకు చెందిన పలువురు నిపుణులు ఇటీవల ఈ ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించి 2029 వరకు దీన్ని కొనసాగించేందుకు అవకాశం ఉందని అంచనా వేశారు.

మేడిగడ్డ ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తమ్మినేని డిమాండ్



సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ పిల్లర్ కుంగిన ఘటనపై సమగ్ర విచారణ జరపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన జారీ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఎత్తిపోతల పథకంలో కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ 20వ పిల్లర్ కుంగుబాటులో నాణ్యతా లోపాలవల్ల నష్టం, ఇతర వాస్తవాలను ప్రజలకు బహిర్గతం చేయాలని, డ్యాంసేఫ్టీ అధికారుల నివేదిక ఆధారంగా బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నిర్మాణం జరిగిన సంతోషం మూణ్నాళ్ల ముచ్చటగా మారిందన్నారు. ప్రాజెక్టు పూర్తయిన రెండు సంవత్సరాలకు గోదావరికి వరదలు రావడంతో ఇదే బ్యారేజీలోని 7 పంపులు నీట మునిగాయని, వాటి రిపేర్లు, నష్టం ఎవరు భరించాలన్న మీమాంస ముందుకొచ్చిందన్నారు. ఆ సంఘటన మర్చిపోక ముందే మూడో సంవత్సరం వరదలు తగ్గిన తర్వాత 18 నుండి 21 వరకు గల బ్యారేజీ పిల్లర్లు అడుగున్నర లోతు కుంగిపోయాయన్నారు. వీటితో పాటు ప్రాజెక్టు నిర్మాణంలో వివిధ లోపాలు ఇప్పుడిప్పుడే వెలుగులోకి వస్తున్నాయని చెప్పారు. పగుళ్లు, లీకేజీలు, పెచ్చు లూడటం వంటివి కన్పిస్తున్నాయని, నాలుగేళ్ల నుంచి 8 ఏళ్లలోపు నిర్మాణం చేసిన ప్రాజెక్టులకు నాణ్యతా లోపాలు వెలుగుచూస్తుండటం ఆందోళనకరమన్నారు. యాసంగిలో ప్రాజెక్టులోని నీటిని వినియోగించుకోలేని పరిస్థితి వచ్చిందన్నారు. ఇంత భారీ స్థాయిలో బ్యారేజీకి నష్టం జరిగినా ఇప్పటివరకు ప్రభుత్వం నుంచిగానీ, ఇంజనీర్ల వైపు నుంచిగానీ వాస్తవాలు బయటపెట్టడంలేదన్నారు.

'మేడిగడ్డ' కుంగిపోవడంపై విచారణ జరపండి

పోలీస్‌స్టేషన్‌లో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ఫిర్యాదు



ఎస్ఐ మహేశ్‌కు ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ తదితరులు

హుస్నాబాద్: మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిపోవడంపై విచారణ జరిపించి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ... రీడిజైన్ పేరిట రూ.కోట్ల ప్రజాధనంతో ప్రాజెక్టును కట్టారని తెలిపారు. అధికారులు మాత్రం ప్రాజెక్టు కుంగిపోవడంలో కుట్ర కోణం ఉందని చెబుతున్నారని, కుట్రకు బాధ్యులెవరో తేల్చాలని డిమాండ్ చేశారు. బాంబు శబ్దంతో ప్రాజెక్టు కుంగిపోయిందని చెబుతున్నారని, బాంబుతో అయితే పూర్తిగా కూలిపోతుందన్న కనీస జ్ఞానం లేకుండా ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ఏటీఎం లాంటి ప్రాజెక్టు కుంగిపోతే విచారణ జరపకుండా కేంద్రం మౌనం వహిస్తోందని, ఇద్దరి మధ్య ఒప్పందం ఉందనడానికి ఇదే నిదర్శనమని చెప్పారు. ప్రాజెక్టు కుంగిపోవడానికి కుట్ర కోణమా, కేసీఆర్ వైఫల్యమా అనే దానిపై కేంద్ర ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

లక్ష్మీ బ్యారేజీ కుంగిపోవడానికి సీఎం కేసీఆరే పూర్తి బాధ్యత వహించాలి

- నిజాయితీ ఉంటే పదవికి రాజీనామా చేయాలి
- ప్రజలకు సరైన సమాచారం చెప్పకుండా తప్పుదోవ పట్టిస్తున్నారు
- బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్



సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీ కుంగిపోవడానికి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావే పూర్తి బాధ్యత వహించాలని, ఏమాత్రం నిజాయితీ ఉన్నా సీఎం పదవికి రాజీనామా చేయాలని బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ టెండర్ పిలిచినప్పటి నుంచి ఇప్పటిదాకా జరిగిన పరిణామాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. సోమవారం పార్టీ నేతలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, నరహరి వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఐఏఎస్ అధికారి రామచంద్రుడు, మాజీ ఐపీఎస్ అధికారి కృష్ణప్రసాద్‌తో కలిసి ఈటల మీడియాతో మాట్లాడుతూ...సీఎం కేసీఆర్‌కు నష్టపోయిన ప్రాజెక్ట్ చూపించేందుకు గానీ, ఏమైందో చెప్పేందుకు నిపుణుల కమిటీ వేసి దానిని బయటకు వివరించే దమ్ముగానీ లేదన్నారు. ప్రజలకు సరైన సమాచారం ఇవ్వకుండా తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ప్రజాధనంతో ప్రభుత్వం కట్టిన ప్రాజెక్టుకు ఏం జరిగిందో చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరంపై గతంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఇరిగేషన్ నిపుణులు అనేక అనుమానాలు వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. లక్ష్మీ బ్యారేజీని ఇసుక మీదనే ఫౌండేషన్ వేశారని, పిల్లర్ల కింద ఉన్న ఇసుక కొట్టుకుపోవటంతో ప్రాజెక్టు కుంగిపోయే పరిస్థితి వచ్చిందని వివరించారు. ప్రాజెక్టు నింపే సమయంలో కూడా వన్ బై ఫోర్త్ మొదట, హాఫ్ ట్యాంక్ రెండవసారి నింపుతారని చెప్పారు. కానీ మొదటి రోజు నుంచి ఈ ప్రాజెక్టు లీక్ అవుతున్నా కూడా పట్టించుకోలేదని ఈటల ఆరోపించారు.

నామినేషన్లు వేస్తాం..

మాస్టర్ ప్లాన్ బాధిత రైతుల ప్రకటన



సమావేశమైన మాస్టర్ ప్లాన్ బాధిత రైతులు


సాక్షి, కామారెడ్డి: తమ హక్కుల సాధన కోసం భారీ సంఖ్యలో నామినేషన్లు వేస్తున్నామని, అది కూడా సీఎం కేసీఆర్ పోటీ చేయనున్న కామారెడ్డి నియోజక వర్గం నుంచేనని వివిధ వర్గాలు ప్రకటిస్తున్నాయి. ఇప్పటికే పలు సంఘాలు నామినేషన్ల అస్త్రం ప్రయోగిస్తామని వెల్లడించాయి. తాజాగా కామారెడ్డి మున్సిపల్ మాస్టర్ ప్లాన్ బాధిత రైతులు మంగళవారం సమావేశమై సీఎం మీద వంద మంది రైతులు నామినేషన్లు వేస్తామని ప్రకటించారు. లభాన్ లంబాడాలు ఏళ్లుగా తమను ఎస్టీ జాబితాలో చేర్చాలన్న డిమాండ్‌తో అనేక ఉద్యమాలు చేశారు. ఇటీవల జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి తమ సమస్యను పరిష్కరించకుంటే భారీ సంఖ్యలో నామినేషన్లు వేస్తామని ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తామని ప్రకటించి మాట తప్పారని, రాష్ట్రం ఏర్పాటైన తర్వాత కూడా వందలాది మంది కార్మికుల ప్రాణాలు పోయినా వారిని ఆదుకోలేదని గల్ఫ్ కార్మిక సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. గల్ఫ్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గల్ఫ్‌లో మృతి చెందిన వారి భార్యలతో నామినేషన్లు వేయించేందుకు రెడీ అవుతున్నారు. అలాగే పౌల్ట్రీ బాయిలర్ రైతులు కూడా ఎన్నికల బరిలో దిగుతామన్న ప్రకటనలు చేశారు. నిరుద్యోగ యువత కూడా నామినేషన్లతో నిరసన తెలిపేందుకు రెడీ అవుతున్నారు.

మాస్టర్ ప్లాన్ రద్దుపై పోరు...

కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేస్తున్నామని ప్రకటించిన తర్వాతే సీఎం కామారెడ్డికి రావాలని మాస్టర్ ప్లాన్‌తో నష్టపోతున్న గ్రామాల రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని లింగాపూర్‌లో ఆయా గ్రామాల రైతులు సమావేశమయ్యారు. మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేస్తున్నట్లు గవర్నర్ ద్వారా ప్రకటించాలని లేనిపక్షంలో ప్రతి గ్రామం నుంచి 15 మంది చొప్పున వంద మంది రైతులు నామినేషన్లు వేస్తామని ప్రకటించారు. తొమ్మిది గ్రామాల్లోని బాధిత రైతులందరూ కలిసి నియోజకవర్గం మొత్తం కలియతిరిగి సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా ఉద్యమం చేస్తామని, తమ ఉద్యమానికి మద్దతు ఇచ్చిన వ్యక్తికే ఓటు వేస్తామన్నారు. కాగా మాస్టర్‌ప్లాన్‌పై అప్పట్లో కామారెడ్డి రైతులు భారీ ఎత్తున ఆందోళనలు నిర్వహించిన విషయం తెలిసిందే. అప్పుడే మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే మాస్టర్ ప్లాన్ రద్దు కాలేదని రైతులు ఆరోపిస్తున్నారు. కాగా వివిధ వర్గాలకు చెందిన వారు కామారెడ్డిలో సీఎం కేసీఆర్ మీద పోటీకి సిద్ధమవుతుండడంతో అందరి దృష్టి కామారెడ్డి మీదే ఉంది.

ఏపీలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త హత్య

దాడిచేసి చంపిన టీడీపీ నేతలు



గురజాల: వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ నేతలు విచక్షణారహితంగా దాడి చేసి నరికి చంపారు. ఈ ఘటన పల్నాడు జిల్లాలో జరిగింది. జంగ మహేశ్వరపురం గ్రామానికి చెందిన కూనిరెడ్డి కృష్ణారెడ్డి (32) ఇదే గ్రామంలో వైఎస్సార్‌సీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. సోమవారం రాత్రి ఆయన ఇంటికి వెళ్తుండగా పులిపాడు గ్రామం వద్ద టీడీపీ నేతలు కాపుకాసి కత్తులు, వేటకొడవళ్లతో దాడి చేసి పరారయ్యారు. 26 కత్తిపోట్లు శరీరంపై పడటంతో కృష్ణారెడ్డికి తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. మృతదేహానికి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నివాళులర్పించారు. గురజాల ఎమ్మెల్యే కాసు మహేశ్‌రెడ్డి ఫోన్‌లో కృష్ణారెడ్డి కుటుంబీకులతో మాట్లాడి నిందితులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని, బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నిందితులను పోలీసులు గాలిస్తున్నారు. ఘటనాస్థలాన్ని పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి పరిశీలించారు. కృష్ణారెడ్డి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కృష్ణారెడ్డికి భార్య ఉంది.

క్లుప్తంగా...

చైనా రక్షణ మంత్రి షాంగ్ తొలగింపు

బీజింగ్: రెండు నెలల నుంచి కనిపించకుండా పోయిన రక్షణ మంత్రి జనరల్ లీ షాంగ్‌ఫూను పదవి నుంచి తొలగిస్తున్నట్టు చైనా మంగళవారం లాంఛనంగా ప్రకటించింది. ఆయన అదృశ్యంపై మాత్రం ఎలాంటి వివరణా ఇవ్వకుండా తొలగింపు ప్రకటనకే పరిమితమైంది. అలాగే ఆర్థిక, ఐటీ శాఖల మంత్రులు లియు కున్, వాంగ్ జీ గాంగ్‌లను కూడా తొలగిస్తున్నట్టు పేర్కొంది. వారిద్దరి స్థానంలో కొత్తవారిని నియమించినా, రక్షణ శాఖకు మాత్రం ఎవరి పేరునూ ప్రకటించలేదు. గత మార్చిలోనే కేబినెట్ పునర్ వ్యవస్థీకరణ సందర్భంగా లీ రక్షణ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆగస్టు 29న చివరిసారిగా బయటి ప్రపంచానికి కనిపించారు. చైనాలో ఈ ఏడాది ఇలా అనూహ్య పరిస్థితుల్లో మాయమైన రెండో పెద్ద నేత లీ. గత జూలైలో చైనా విదేశాంగ మంత్రి క్విన్ గాంగ్‌ను కూడా ఇలాగే తొలగించడం తెలిసిందే. ఆయన కూడా నాటినుంచీ కనిపించకుండా పోయారు. అధ్యక్షుడు షిన్‌పింగ్ చుట్టూ ఉన్న అధికార కేంద్రంపై ప్రశ్నలు లేవనెత్తిన రోజుల వ్యవధిలోనే వారికి ఈ గతి పట్టింది. గత చైనా అధినేతలందరి మాదిరిగానే జిన్‌పింగ్ కూడా కేవలం విధేయతకే పెద్ద పీట వేస్తారని చెబుతారు.

గొణుక్కోకండి!

గుజరాత్ హైకోర్టులో జడ్జీల వాగ్వాదం

అహ్మదాబాద్: ఇద్దరు న్యాయమూర్తుల వాగ్వాదానికి గుజరాత్ హైకోర్టు వేదికైంది. న్యాయమూర్తులు జస్టిస్ బీరేన్ వైష్ణవ్, జస్టిస్ మౌనా భట్ ధర్మాసనం సోమవారం ఓ కేసును విచారిస్తున్న సందర్భంగా ఈ ఉదంతం జరిగింది. కేసుకు సంబంధించిన కొన్ని అంశాలపై వారిద్దరూ విభేదించారు. అనంతరం జస్టిస్ వైష్ణవ్ వెలువరించిన తీర్పుతో జస్టిస్ భట్ ఏకీభవించలేదు. దాంతో, 'కావాలంటే మీరు విభేదించండి. ఇప్పటికే ఒక కేసులో మనం విభేదించాం. ఇందులోనూ అలాగే చేయవచ్చు' అని జస్టిస్ వైష్ణవ్ అన్నారు. ఇది కేవలం విభేదించడానికి సంబంధించిన విషయం కాదంటూ జస్టిస్ భట్ ఏదో చెప్పబోగా, 'మరైతే గొణగకండి. విడి తీర్పు వెలువరించండి. మనమిక తదుపరి కేసులు చేపట్టబోవడం లేదు' అంటూ తన స్థానం నుంచి లేచారు. ధర్మాసనం తదుపరి కేసులు ఆలకించబోదని చెబుతూ కోర్టు రూమ్ నుంచి వెళ్లిపోయారు. ఇదంతా కోర్టు రూములోని సీసీ కెమెరాలో రికార్డయింది. గుజరాత్ హైకోర్టులో అన్ని బెంచ్‌లు జరిపే విచారణలూ ప్రత్యక్ష ప్రసారం అవుతున్నాయి. జడ్జిల వాగ్వాదానికి సంబంధించిన వీడియోను కాసేపటికే యూట్యూబ్ నుంచి తొలగించారు. కానీ ఆ వీడియో అప్పటికే సామాజిక మాధ్యమాల వేదికనెక్కి తెగ చక్కర్లు కొడుతోంది.

మణిపూర్ హింసలో బయటి శక్తుల ప్రమేయం!


ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్య

నాగ్‌పూర్: మణిపూర్‌లో చెలరేగిన జాతుల హింస వెనక విదేశీ శక్తుల ప్రమేయముందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ అనుమానాలు వెలిబుచ్చారు. అక్కడ మెయితీ, కుకీలు ఎప్పట్నుంచో శాంతియుతంగా సహజీవనం చేస్తున్నారని గుర్తు చేశారు. 'అలాంటి చోట హింస చెలరేగింది. ఇక సద్దుమణుగుతోందనగా ఏదో ఒక రూపంలో మళ్లీ రాజుకుంటూ వస్తోంది. ఒక సరిహద్దు రాష్ట్రంలో ఇలాంటి కల్లోలం, వేర్పాటువాదంతో ఎవరికి లాభం? బయటి శక్తులకే' అని ఆయన అభిప్రాయపడ్డారు. మంగళవారం నాగపూర్‌లో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన దసరా ర్యాలీని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.

పద్మనాభుని కోసం ఆగిన విమానాలు

తిరువనంతపురం: కేరళలోని విఖ్యాత అనంత పద్మనాభ స్వామి అరత్తు ఉత్సవం సోమవారం తిరువనంతపురంలో వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా సంప్రదాయ ఊరేగింపు అంతర్జాతీయ విమానాశ్రయం రన్‌వే మీదుగా సాగింది. దీంతో విమానాల రాకపోకలను తెల్లవారుజాము నుంచి 5 గంటల పాటు పూర్తిగా నిలిపేశారు. ఊరేగింపు ఆలయానికి చేరిన అనంతరం ఉదయం 9 గంటల నుంచి వాటిని పునరుద్ధరించారు. భారీ వర్షంలోనూ ట్రావెన్‌కోర్ రాజ సంస్థాన వారసుడు శ్రీమూలం తిరునాళ్ రామ వర్మ ముందుండి ఊరేగింపును రన్‌వే మీదుగా కొనసాగించారు. పద్మనాభ స్వామి, నరసింహ మూర్తి, కృష్ణ స్వామి ఉత్సవ విగ్రహాలను ఏనుగులతో వేడుకగా తీసుకెళ్లారు. వాటిని విమానాశ్రయం వద్ద కాసేపు ఆరత్తు మండపంలో ఉంచారు. తర్వాత పవిత్ర స్నానం కోసం బీచ్‌కు తీసుకెళ్లారు. ఈ ఉత్సవం వందలాది ఏళ్ల సంప్రదాయం. 1932లో స్థానికంగా విమానాశ్రయం నిర్మించారు. ఎయిర్‌పోర్ట్ నిర్మించకముందు ఇదే ప్రాంతం మీదుగా ఊరేగింపు జరిగేది. అందుకే ఇప్పటికీ అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

అత్యంత వృద్ధ శునకం 'బాబి' ఇకలేదు



లిస్బన్: ప్రపంచంలోనే అత్యంత వృద్ధ శునకంగా పేరున్న 'బాబి' 31 ఏళ్ల వయస్సులో శనివారం తుదిశ్వాస విడిచింది. పోర్చుగల్‌లోని కాన్క్వెయిరోస్ అనే ఊళ్లో 1992 మే 11న ఈ కుక్క పుట్టింది. అప్పటికి బాబి యజమాని లియోనెల్ కోస్టా వయస్సు 8 ఏళ్లే. మంచి ఆహారం, స్వచ్ఛమైన గాలి, అమితమైన ప్రేమ..ఇవే బాబి ఇన్నేళ్లపాటు జీవించడానికి కారణాలని లియోనల్ చెప్పారు. బాబి మొత్తం 31 సంవత్సరాల 165 రోజులపాటు జీవించినట్లు తెలిపింది. బాబి స్వచ్ఛమైన రఫీరో డో అలెంటెజో జాతికి చెందింది. ఈ జాతి శునకాల సగటు ఆయుర్దాయం 10 నుంచి 14 ఏళ్లు.

ఒక్కరోజులో 704 మంది బలి

గాజాపై దాడులు ఉధృతం చేసిన ఇజ్రాయెల్ సైన్యం

- 24 గంటల వ్యవధిలో 400 వైమానిక దాడులు
- ఖాన్ యూనిస్‌లో 100 మంది ఉంటున్న నాలుగు అంతస్తుల భవనం ధ్వంసం
- 32 మంది మృతి.. మరికొందరికి గాయాలు
- యుద్ధంలో 6,487కి చేరిన మృతుల సంఖ్య

రఫా/టెల్అవీవ్/న్యూఢిల్లీ: గాజా స్ట్రిప్‌లో హమాస్ మిలిటెంట్లే లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం దాడులు మరింత ఉధృతం చేసింది. గత 24 గంటల వ్యవధిలో 400 వైమానిక దాడులు నిర్వహించామని మంగళవారం ప్రకటించింది. బాంబు దాడులతో హమాస్ స్థావరాలను, సొరంగాలను ధ్వంసం చేశామని పేర్కొంది. ఈ దాడుల్లో పలువురు హమాస్ కమాండర్లు హతమయ్యారని వెల్లడించింది. కానీ, ఇజ్రాయెల్ దాడుల్లో గత 24 గంటల వ్యవధిలో 704 మందికిపైగా పాలస్తీనియన్లు మరణించినట్లు పాలస్తీనా ఆరోగ్య శాఖ తెలియజేసింది. వీరిలో 305 మంది చిన్నారులు, 173 మంది మహిళలు ఉన్నారని వివరించింది. సోమవారం రాత్రి ఇజ్రాయెల్ దాడుల్లో ఖాన్ యూనిస్ సిటీలో నాలుగు అంతస్తుల భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో 32 మంది మరణించారు. మరికొందరు గాయపడ్డారు. ఈ భవనంలో 100 మంది నివసిస్తున్నారు. వీరిలో చాలామంది ఉత్తర గాజా నుంచి వచ్చినవారే.

గాజాలో 2,055 మంది చిన్నారులు మృతి

ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో గాజాలో పెద్ద సంఖ్యలో చిన్నారులు మృత్యువాత పడుతున్నారని స్వచ్ఛంద సంస్థలు వెల్లడించాయి. ఈ మారణహోమం ఆపేందుకు అంతర్జాతీయ సమాజం వెంటనే చొరవ చూపాలని కోరాయి. సామాన్య ప్రజల ప్రాణాలు బలి కాకుండా చర్యలు తీసుకోవాలని, కాల్పుల విరమణ పాటించాలని, ఘర్షణకు తెరదించాలని ఇజ్రాయెల్ సైన్యానికి, హమాస్ మిలిటెంట్లకు విజ్ఞప్తి చేశాయి. ఈ నెల 7వ తేదీన మొదలైన ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం మంగళవారం 18వ రోజుకు చేరుకుంది. ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో ఇప్పటిదాకా గాజాలో 5,087 మంది మృతిచెందారని పాలస్తీనా ఆరోగ్య శాఖ వెల్లడించింది. వీరిలో 2,055 మంది చిన్నపిల్లలు ఉన్నారని పేర్కొంది. హమాస్ దాడుల్లో ఇజ్రాయెల్‌లో 1,400 మందికిపైగా చనిపోయారు. మిలిటెంట్ల అధీనంలో 200 మందికిపైగా బందీలు ఉన్నట్లు ఇజ్రాయెల్ అధికారులు చెప్పారు. ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో గాజాలో సాధారణ నివాస గృహాలు, పాఠశాలలు, మసీదులు నేలమట్టయ్యాయి. ఎటుచూసినా శిథిలాలే కనిపిస్తున్నాయి. గాజాలో 10 లక్షల మందికిపైగా మైనర్లు నిర్బంధంలో చిక్కుకుపోయారని 'సేవ్ ద చిల్డ్రన్' సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. దాడుల్లో వెస్ట్‌బ్యాంక్‌లో 27 మంది బాలలు మరణించారని వెల్లడించింది. ఇజ్రాయెల్ విచక్షణారహితంగా దాడులు చేస్తోందని, చిన్నారుల్ని బలి తీసుకుంటోందని ఆరోపించింది.

ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల్లో సేవలు బంద్

ఇజ్రాయెల్ సైన్యం వైమానిక దాడుల వల్ల గాజాలో క్షతగాత్రుల సంఖ్య నానాటికీ పెరుగుతుండగా, మరోవైపు ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల్లో వైద్య సేవలు నిలిచిపోతున్నాయి. ఇప్పటికే మూడింట రెండొంతుల ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల్లో ఎలాంటి సేవలు అందడం లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్ఓ) ఆందోళన వ్యక్తం చేసింది. 72 ఆరోగ్య కేంద్రాలకు గాను 46, 35 ఆసుపత్రులకు గాను 12 ఆసుపత్రుల్లో సేవలు పూర్తిగా నిలిచిపోయాయని మంగళవారం ప్రకటించింది. ఔషధాలు, విద్యుత్, ఇంధన కొరత కారణంగా క్షతగాత్రులకు సేవలందించలేకపోతున్నామని పాలస్తీనా ఆరోగ్య శాఖ అంటోంది. ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో కొన్ని ఆరోగ్య కేంద్రాలు దారుణంగా దెబ్బతిన్నాయి. దీనికితోడు ఆసుపత్రుల్లో వైద్య సేవలు నిలిచిపోవడంతో మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉందని డాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గాజాలో ఆరోగ్య వ్యవస్థ అత్యంత అధ్వాన స్థితికి చేరుకుందని ఆరోగ్య శాఖ ప్రతినిధి ఒకరు చెప్పారు.



ధ్వంసమైన నుస్సెయిరత్ శరణార్థి శిబిరం వద్ద శిథిలాల్లో చిక్కుకున్న వారి కోసం వెతుకులాట

బందీల సమాచారం ఇవ్వండి

గాజాపై భూతల దాడులకు సిద్ధమవుతున్న ఇజ్రాయెల్ ప్రస్తుతానికి వైమానిక దాడులపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. భూతల దాడులు ప్రారంభమైతే గాజాలో పెద్ద సంఖ్యలో జనం ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. అంతర్జాతీయ సమాజం నుంచి వస్తున్న ఒత్తిళ్లకి హమాస్ మిలిటెంట్లు స్పందిస్తున్నారు. అమెరికాకు చెందిన ఇద్దరు బందీలను ఇప్పటికే విడుదల చేయగా, సోమవారం రాత్రి ఇజ్రాయెల్‌కు చెందిన ఇద్దరు వృద్ధ మహిళలను విడుదల చేశారు. బందీల సమాచారం తెలిస్తే తమకు తెలియజేయాలని సూచిస్తూ ఇజ్రాయెల్ సైన్యం గాజాలో కరపత్రాలు జారవిడిచింది. సమాచారం అందజేసేవారికి ఆపద రాకుండా కాపాడుతామని హామీ ఇచ్చింది.

నిండిపోయిన శ్మశాన వాటికలు

ఇజ్రాయెల్–హమాస్ ఘర్షణ ప్రారంభమైన తర్వాత గాజాలో 14 లక్షల మంది ఇళ్లు విడిచి వెళ్లిపోయారు. వీరిలో దాదాపు 5.80 లక్షల మంది ఐక్యరాజ్యసమితి శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్నారు. ఈజిప్టు నుంచి గాజాలోకి ఆహారం, ఇతర సహాయక సామాగ్రిని అనుమతిస్తున్న ఇజ్రాయెల్ పెట్రోల్, డీజిల్‌ను మాత్రం అనుమతించడం లేదు. గాజాలో మరణాల సంఖ్య పెరుగుతుండడంతో శ్మశాన వాటికలు నిండిపోతున్నాయి. ఒకే సమాధిలో ఐదు మృతదేహాలను ఖననం చేస్తున్నారు. పాత సమాధులను తవ్వేసి, కొత్త మృతదేహాలను సమాధి చేస్తున్నారు.

ఎదగడానికి.. పుస్తకం చాలు!



ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో గాజా మరుభూమిలా తయారవుతోంది. కుప్పకూలిన భవనాల శిథిలాల నుంచి క్షతగాత్రులను రక్షించడంలో కొందరు, ధ్వంసం కాని విలువైన వస్తువుల కోసం వెతికే పనిలో కొందరు నిమగ్నమై ఉంటే... ఈ అమ్మాయి తన పుస్తకాలను వెతుక్కుంది. పుస్తకాలను తన నుంచి ఎవరైనా లాక్కుంటే ఎలా అన్న భయంతో గుండెకు హత్తుకుని కాపాడుకుంది. మనసుకు గాయమైనా పుస్తకాలను చెక్కుచెదరనివ్వలేదు. చదువంటే ఎంత మక్కువో!!

ఇజ్రాయెల్‌కు ఫ్రాన్స్ అధ్యక్షుడు

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ మంగళవారం ఇజ్రాయెల్ చేరుకున్నారు. ఇజ్రాయెల్‌కు మద్దతు ప్రకటించడానికి వచ్చానని చెప్పారు. ఉగ్రవాదంపై జరుగుతున్న పోరాటంలో ఇజ్రాయెల్ ఒంటరి కాదన్నారు. హమాస్ దాడుల్లో గాయపడిన ఫ్రాన్స్ జాతీయులను, మృతుల కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. అనంతరం ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూతో సమావేశమయ్యారు. తనను తాను రక్షించుకొనే హక్కు ఇజ్రాయెల్‌కు ఉందని స్పష్టంచేశారు. పౌరులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఇజ్రాయెల్‌కు సూచించారు. గాజాలో ప్రజల మరణానికి హమాస్ మిలిటెంట్లే కారణమని నెతన్యాహూ నిందించారు. శత్రువులపై యుద్ధం చాలాకాలం కొనసాగే అవకాశం ఉందని సంకేతాలిచ్చారు. ఇజ్రాయెల్‌లో దాడుల్లో గాజాలో ఇప్పటిదాకా తమ కార్యకర్తలు 35 మంది మృతిచెందారని ఐక్యరాజ్యసమితి పాలస్తీనియన్ ఏజెన్సీ ప్రకటించింది.

జోర్డాన్ రాజుకు మోదీ ఫోన్

ప్రధానమంత్రి మోదీ జోర్డాన్ రాజు అబ్దుల్లా–2తో ఫోన్‌లో మాట్లాడారు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం, తాజా పరిణామాలపై చర్చించారు. ఈ యుద్ధంలో సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోతుండడం పట్ల ఇరువురు నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. గాజాలో హింసాకాండ ఆగిపోవాలని ఆకాంక్షించారు. ఇజ్రాయెల్–హమాస్ మధ్య సమస్యకు సాధ్యమైనంత త్వరగా పరిష్కారం కనుగొనాలని చెప్పారు. ఇందుకోసం చిత్తశుద్ధితో కూడిన ప్రయత్నాలు అవసరమని మోదీ అభిప్రాయపడ్డారు.

బంధించారు.. కర్రలతో కొట్టారు

- గాజా సొరంగంలోకి చేరుకున్నాక బాగానే చూసుకున్నారు
- హమాస్ చెరనుంచి విడుదలైన మహిళ లిఫ్‌షిట్జ్ వెల్లడి



టెల్ అవీవ్: 17 రోజులుగా తమ చెరలో ఉన్న యోచెవెడ్ లిఫ్‌షిట్జ్(85), నురిట్ కూపర్(79) అనే ఇద్దరు మహిళలను హమాస్ మిలిటెంట్లు సోమవారం విడుదల చేశారు. మానవతా దృక్పథంతోపాటు వృద్ధాప్యంలో ఉన్న వారిద్దరి అనారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని విడుదల చేసినట్లు తెలిపారు. స్నేహితులైన వారిద్దరూ ఇజ్రాయెల్–గాజా సరిహద్దులోని కిబుట్జ్ నిర్ ఓజ్ నివాసితులు. మంగళవారం టెల్ అవీవ్‌కు చేరుకున్నారు. మిలిటెంట్ల అధీనంలో తనకు ఎదురైన అనుభవాలను యోచెవెడ్ లిఫ్‌షిట్జ్ మీడియాతో పంచుకున్నారు. 'ఈ నెల 7న మిలిటెంట్లు నన్ను బంధించారు. మోటార్‌బైక్ ఎక్కించుకొని తీసుకెళ్లారు. ప్రతిఘటించినందుకు కర్రలతో కొట్టారు. రోదించినా పట్టించుకోలేదు. గాజాకు బలవంతంగా తరలించారు. ఒక సొరంగంలోకి తీసుకెళ్లారు. భూగర్భంలో సాలెగూళ్లలాంటి సొరంగాలు ఉన్నాయి. మేము వెళ్లేసరికి డాక్టర్లు, వైద్య సిబ్బంది అక్కడున్నారు. తాము ఖురాన్‌ను విశ్వసిస్తామని, ఎలాంటి హాని కలిగించబోమంటూ మిలిటెంట్లు మాతో చెప్పారు. డాక్టర్లు మాకు వైద్య సేవలు అందించారు. కావాల్సిన ఔషధాలు ఇచ్చారు. సొరంగాలు తడిగా, తేమగా ఉన్నాయి. అక్కడ పారిశుధ్య సౌకర్యాలు ఫరవాలేదు. మాకు ఎలాంటి అస్వస్థత కలగలేదు. పరుపులపై నిద్రించాం. మిలిటెంట్లు మొదట్లో గాజాకు తీసుకెళ్లేటప్పుడు హింసించినా అక్కడికి వెళ్లిన తర్వాత మమ్మల్ని బాగా చూసుకున్నారు. ఇజ్రాయెల్–గాజా సరిహద్దులో నిర్మించిన రక్షణ కంచె గురించి చెప్పాలి. లక్షల డాలర్లు ఖర్చుచేసి ఇజ్రాయెల్ సైన్యం ఈ నిర్మించిన ఈ కంచెతో ఉపయోగం శూన్యం. దేశానికి అది ఏమాత్రం రక్షణ కల్పించట్లేదు. అత్యంత ఖరీదైన ఈ ఫెన్సింగ్‌ను మిలిటెంట్లు సులభంగా ధ్వంసం చేసి వచ్చి, మమ్మల్ని అపహరించారు. హమాస్ నుంచి ఎదురవుతున్న ముప్పును ఇజ్రాయెల్ సీరియస్‌గా తీసుకోవడం లేదు' అని లిఫ్‌షిట్జ్ ఆక్షేపించారు. లిఫ్‌షిట్జ్, నురిట్ కూపర్ భర్తలు ఇంకా హమాస్ వద్ద బందీలుగా ఉన్నారు.

విచ్ఛిన్న శక్తులను ఏరేద్దాం

- ఢిల్లీలో దసరా వేడుకల్లో ప్రధాని మోదీ సందేశం
- శ్రీరామ నవమికల్లా అయోధ్యలో రామాలయం పూర్తవుతుందని ప్రకటన



దసరా వేడుకలో విల్లు ఎక్కుపెట్టిన మోదీ

న్యూఢిల్లీ: మత, ప్రాంతీయవాదాలతో దేశాన్ని విభజించాలని చూస్తున్న విచ్ఛిన్న శక్తులను తుదముట్టించాలని ప్రజలకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. దసరా సందర్భంగా మంగళవారం ఢిల్లీలో దసరా వేడుకల్లో పాల్గొని అక్కడి వారినుద్దేశించి ప్రధాని ప్రసంగించారు. కేవలం రావణ దిష్టిబొమ్మల దహనానికే పరిమితం కాకుండా, దేశాభివృద్ధిని గాలికొదిలి స్వీయ ప్రయోజనాల సాధనకు తాపత్రయపడే సిద్ధాంతాలనూ దహనం చేయాలని హితవు పలికారు. విభజన శక్తులపై దేశభక్తి సాధించిన విజయంగా దసరాను జరుపుకోవాలన్నారు. విలక్షణ ఇండియా కూటమిని ఉద్దేశించే మోదీ ఈ వ్యాఖ్యలు చేశారని భావిస్తున్నారు. వివక్ష, సామాజిక రుగ్మతలను నిర్మూలించాల్సి ఉందని ఆయన ఈ సందర్భంగా అన్నారు. అయోధ్యలో రామాలయ వచ్చే రామనవమి నాటికి పూర్తవుతుందని ప్రకటించారు. శతాబ్దాల ఎదురుచూపుల తర్వాత రాముడు అయోధ్యలో కొలువుదీరనున్నాడని చెప్పారు. దసరా సందర్భంగా ప్రతి ఒక్కరూ కనీసం పది మంచి పనులు చేస్తామని ప్రతిజ్ఞ చేయాలన్నారు. సామాజికంగా కనీసం ఒక పేద కుటుంబాం పైకి ఎదిగేందుకు చేయూత ఇవ్వాలని హితవు పలికారు. మన సరిహద్దులను ఎలా కాపాడుకోవాలో తమకు బాగా తెలుసన్నారు. 'దసరా నాడు ఆయుధ పూజ జరుగుతుంది. భారత్ ఎప్పుడూ ఆయుధాలను స్వీయ రక్షణకే ఉపయోగిస్తుంది' అని స్పష్టంచేశారు.

తీవ్ర తుఫాన్‌గా హమూన్

భువనేశ్వర్/సాక్షి, విశాఖపట్నం: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్ప పీడనం తీవ్ర తుఫాన్‌గా మారింది. దానికి ఇరాన్ సూచించిన 'హమూన్'అని పేరు పెట్టారు. అయితే ఒడిశాకు దాని వల్ల పెద్ద నష్టమేమీ లేదని వాతావరణ శాఖ పేర్కొంది. ఒడిశా తీరానికి 200 కిలోమీటర్ల దూరం నుంచి బంగ్లాదేశ్ కేసి సాగుతూ మంగళవారం రాత్రికి బలహీనపడింది. బంగ్లాదేశ్‌లో తీరం దాటేసరికి మరింత బలహీనపడుతుందని అధికారులు తెలిపారు. హమూన్ ప్రస్తుతం ఒడిశాలోని పారదీప్‌కు 230 కిలోమీటర్లు, పశ్చిమ బెంగాల్లోని దిఘాకు 240 కి.మీ.ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. దీనివల్ల తీరం వెంబడి గంటకు 85 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో కోస్తాంధ్రలో రానున్న మూడు రోజులు, రాయలసీమలో ఈనెల 29వ తేదీ వరకు పొడి వాతావరణం ఉంటుంది. 28 నుంచి కోస్తాంధ్రలో, 30 నుంచి రాయలసీమలో అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.

నేత్రపర్వంగా మైసూరులో దసరా

మైసూరు: కర్ణాటకలో మైసూరు పట్టణంలో దసరా ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన జంబూ సవారీ ఏనుగుల ఊరేగింపు మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రముఖుల పూజలు, వేలాది మంది జనం మధ్య గజరాజులు ప్యాలెస్ నుంచి బన్ని మండపం వరకూ సుమారు 5 కిలోమీటర్లు ఊరేగింపుగా వెళ్లి వచ్చాయి. చాముండేశ్వరి అమ్మవారి విగ్రహంతో కూడిన 750 కిలోల బరువైన బంగారు అంబారీని అభిమన్యు ఏనుగుపై ప్రతిష్ఠించారు. మరో 13 ఏనుగులకు సీఎం సిద్దరామయ్య, మైసూరు రాజవంశీకులు తదితరులు ప్యాలెస్ వద్ద పూజలు చేసి మధ్యాహ్నం ఊరేగింపునకు నాంది పలికారు. అంతకుముందు, సీఎం సిద్దరామయ్య నంది ధ్వజ పూజలో పాల్గొన్నారు. సాయుధ బలగాల కవాతు, మేళతాళాలు, కళాకారుల ప్రదర్శనలు, 31 జిల్లాకు చెందిన శకటాల నడుమ ఏనుగులు ముందుకు సాగాయి. కర్ణాటక ప్రభుత్వం రాష్ట్ర ఉత్సవం(నాదహబ్బ)గా దసరా వేడుకలను నిర్వహిస్తుంది. 10 రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. వీటిని తిలకించేందుకు విదేశాల నుంచీ జనం తరలివచ్చారు.

మంగళవారం మైసూరు నగరంలో జంబూ సవారీ ఊరేగింపు



సన్నిహిత అధికారికి కేబినెట్ మంత్రి హోదా

ప్రకటించిన ఒడిశా సీఎం పట్నాయక్



భువనేశ్వర్: ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ సర్వీస్ నుంచి స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన అధికారికి 24 గంటల్లో కేబినెట్ మంత్రి హోదా కట్టబెట్టి, 5టీ విభాగానికి చైర్మన్‌గా నియమించారు. 'ఒడిశా కేడర్ 2000 బ్యాచ్‌కు చెందిన వీకే పాండియన్ అక్టోబర్ 20న పెట్టుకున్న స్వచ్ఛంద పదవీ విరమణ దరఖాస్తుకు అక్టోబర్ 23న ప్రభుత్వ ఆమోదం లభించింది. ఆ వెంటనే పాండియన్‌కు కేబినెట్ మంత్రి హోదా ఇచ్చారు. 5టీ, 'అమ ఒడిశా–నబిన్ ఒడిశా' కార్యక్రమాల చైర్మన్‌గా సీఎం పట్నాయక్ నియమించారు. పాండియన్ ఇకపై నేరుగా సీఎం ఆధ్వర్యంలో పని చేయనున్నారు'అంటూ రాష్ట్ర సాధారణ పరిపాలనా విభాగం ఉత్తర్వులు విడుదల చేసింది. కలహండి జిల్లా ధర్మాగఢ్ సబ్ కలెక్టర్‌గా జాయినయిన పాండియన్ మయూర్‌భంజ్, గంజాం జిల్లాలకు కలెక్టర్‌గా పనిచేశారు. సీఎం పట్నాయక్ సొంత జిల్లా గంజాం. ఆ జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పుడే సీఎంతో పాండియన్‌కు పరిచయం ఏర్పడింది. అనంతరం 2011లో ఆయన్ను తన కార్యాలయం(సీఎంవో)లో వ్యక్తిగత కార్యదర్శిగా నియమించుకున్నారు. అప్పటి నుంచి అక్కడే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

'అమ ఒడిశా–నబీన్ ఒడిశా' ఏందుకు?

'అమ ఒడిశా–నబీన్ ఒడిశా(మన ఒడిశా–నవీన ఒడిశా)' పథకానికి రూ.4 వేల కోట్లు కేటాయిస్తూ మంగళవారం సీఎం నవీన్ పట్నాయక్ అధ్యక్షతన సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం తీర్మానించింది. రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి, శ్రీ జగన్నాథుని సంస్కృతిని వ్యాపింపజేయడమే ఈ పథకం లక్ష్యం. రాష్ట్రంలోని 6,794 గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతులు, పూరీలోని ప్రఖ్యాత జగన్నాథుని ఆలయంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గుడుల అభివృద్ధికి ఉద్దేశించిన 90 వేలకుపైగా ప్రాజెక్టులను గుర్తించారు.

అరగంటలో 158 కార్లు ఢీ.. ఏడుగురి మృతి



న్యూ ఆర్లియెన్స్: అమెరికాలోని లూసియానాలో దట్టమైన పొగ కారణంగా సంభవించిన భారీ రోడ్డు ప్రమాదంలో ఏడుగురు చనిపోయారు. న్యూ ఆర్లియన్స్‌కు సమీపంలోని ఇంటర్ స్టేట్–55(ఐ–55) రహదారిపై సోమవారం ఉదయం ఘటన చోటుచేసుకుంది. పెద్ద సంఖ్యలో కార్లు ఒకదానినొకటి ఢీకొనడంతో మంటలు కూడా చెలరేగాయి. మొత్తం అరగంటపాటు వాహనాలు ఢీకొనడం కొనసాగింది. ఇలా మొత్తం 158 వాహనాలు ప్రమాదానికి గురయ్యాయి. ఒక కారు వంతెన పైనుంచి నీళ్లలోకి పడిపోయింది. రసాయనాలతో కూడిన ట్యాంకర్ కూడా కార్ల మధ్యన ఇరుక్కుపోయింది. ఈ ఘటనల్లో ఏడుగురు చనిపోగా మరో 30 మంది వరకు గాయాలపాలయ్యారు. ప్రమాదం కారణంగా వాహనాలు కుప్పగా పడ్డాయి. కొన్ని పూర్తిగా నుజ్జయ్యాయి. మంటలు చెలరేగి కొన్ని దగ్ధమయ్యాయి. ప్రమాదంతో 11 మైళ్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది.

నవాజ్ పోటీకి మార్గం సుగమం

ఇస్లామాబాద్: పాకిస్తాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌కు వచ్చే పాక్ సార్వత్రిక ఎన్నికల్లో పోటీకి మార్గం సుగమం అయినట్లుగా కనిపిస్తోంది. గతంలో అల్–అజీజియా కేసులో ఆయనకు పడ్డ ఏడు సంవత్సరాల జైలు శిక్షను అక్కడి పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. మరో మూడు అవినీతి కేసుల్లో రెండు ప్రత్యేక కోర్టులు ఆయనకు బెయిల్ మంజూరు చేశాయి. బ్రిటన్‌లో నాలుగేళ్ల స్వీయ ప్రవాసం అనంతరం ఆయన తాజాగా స్వదేశం తిరిగి రావడం తెలిసిందే. దీని వెనక సైన్యం మద్దతుందని వార్తలొచ్చాయి. అల్–అజీజియా కేసులో 2018లో నవాజ్ షరీఫ్‌కు ఏడేళ్ల శిక్ష పడింది. మూడేళ్ల జైలు జీవితం తర్వాత చికిత్స కోసమని లండన్ వెళ్లిన ఆయన అక్కడే ఉండిపోయారు. దాంతో ఆయనను పారిపోయిన ఖైదీగా ప్రకటించారు.



జమ్మిచెట్టుకు పువ్వాడ చిట్టా!

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామికి దసరా సందర్భంగా భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు చేయడమే కాక పల్లకీ సేవగా జమ్మిబండపైకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పల్లకీసేవ, పూజల్లో కుటుంబ సమేతంగా జిల్లాకు చెందిన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం జమ్మిచెట్టు కొమ్మకు అందరు భక్తుల్లాగే ఆయన కూడా కోర్కెల కాగితాన్ని కట్టారు. అసలే ఇది అసెంబ్లీ ఎన్నికల సమయం కావడంతో భక్తులు ఈ సన్నివేశాన్ని ఆసక్తిగా గమనించారు.



ఇంకో పదేళ్లకైనా సీఎం అవుతా..

ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ఇంకో పదేళ్లకైనా సరే తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయి తీరుతానని సంగారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి జగ్గారెడ్డి పేర్కొన్నారు. దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం సంగారెడ్డిలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 'ఒక నాయకుడిగా ఎదుగుతూ వస్తున్న.. ఈ విజయదశమి రోజు నా మనసులో ఉన్న కోరికను, మాట చెబుతున్నా.. కోరుకోవడం తప్పు కాదు.. కానీ కోరుకుంటున్నా.. ఇంకో పదేళ్లకైనా సరే తెలంగాణకు ముఖ్యమంత్రినై తీరుతా.. నేనన్నది ఇంకా పదేళ్లకు.. మీరందరూ కడుపులో పెట్టుకుని కాపాడుకోండి.. మీ అందరి ఆశీర్వాదం ఇట్లాగే ఇవ్వండి' అని జగ్గారెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డి అంటే జగ్గారెడ్డి.. జగ్గారెడ్డి అంటే సంగారెడ్డి.. ఈ రెండు రాష్ట్రాల్లో దీన్ని ఎవరైనా కాదనగలరా అని ప్రశ్నించారు. తాను ప్రజలకు అందుబాటులో లేకపోయినప్పటికీ, తన భార్య నిర్మల తన అనుచరులు ఫోన్‌లో అందుబాటులో ఉంటారని చెప్పారు.

పోటీ చేస్తే చేస్తా.. లేదంటే..

'ఇక్కడ స్పెషల్ స్క్వాడ్.. ఎలక్షన్ కమిషన్ అన్నీ ఉన్నాయి.. రికార్డు చేస్తరు.. ఎన్నికల్లో నిలబడకుండా చేస్తే నా భార్యను రెడీగా పెట్టిన.. నాకంటే ఆమెనే బెటర్.. ధైర్యం చేసి మాట్లాడుతున్నా.. పోటీ చేస్తే చేస్తా.. పోటీలో ఉంటనో లేదో తర్వాత సంగతి' అని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు.



50 వేలకు ఒక్క ఓటు తగ్గినా రాజకీయాలకు సెలవు

నల్లగొండ ఎంపీ ఉత్తమ్

హుజూర్‌నగర్ రూరల్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో హుజూర్‌నగర్ నియోజకవర్గంలో తనకు 50 వేల ఓట్ల మెజారిటీకి ఒక్క ఓటు తగ్గినా రాజకీయాల నుంచి తప్పుకుంటానని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండల పరిధిలోని వేపలసింగారంలో మంగళవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెక్కెర వీరారెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన హుజూర్‌నగర్ బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు, ఎంపీటీసీ ముడెం గోపిరెడ్డి, ఉప సర్పంచ్ కర్నె సావిత్రి, గ్రామశాఖ అధ్యక్షుడు గోపిరెడ్డి వెంకటరెడ్డితో పాటు మరో 200 మంది కార్యకర్తలకు కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 3న 70 నుంచి 75 స్థానాలతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తనకు చిన్న, పెద్ద పదవి వచ్చినా సంతోషిస్తానన్నారు. ఏ పదవి ఆశించని రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలను విమర్శించే అర్హత కేటీఆర్, కవితలకు లేదని, వారిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఉత్తమ్ చెప్పారు.

గాసిప్ టైమ్

ఇదో వ్యాపారం...

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆయన దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం మరోపార్టీతో పొత్తు కారణంగా ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆయన గెలిచింది ఒక్కసారే. తర్వాత కాలం కలిసిరాలేదు. మళ్లీ ఒక్కసారి కూడా ఎమ్మెల్యే కాలేకపోయారు. ప్రతీసారి టికెట్ల కోసం పార్టీ అధినేతల చుట్టూరా తిరగడం ఎందుకు అనుకున్నారో ఏమో.. ఈసారి కొత్త అవతారం ఎత్తారు. తానే టికెట్లు ఇస్తానని, బీ ఫామ్‌లు ఇస్తానంటూ బయల్దేరారు. తద్వారా ఎంతో కొంత వెనకేసుకోవచ్చనుకున్నారు. దాన్నో వ్యాపారంగా మార్చుకోవాలన్నది ఆ నాయకుని అభిమతం. మహారాష్ట్ర కేంద్రంగా ఉండే పార్టీకి రాష్ట్రంలో తానే కన్వీనర్ అని చెప్పుకుంటూ జిల్లాల్లో పర్యటించడం ప్రారంభించారు. ఈసారి ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పక్షాల్లో సీట్లు లభించని వారు రెబెల్‌గా పోటీ చేయాలంటే.. ఒక గుర్తింపు ఉన్న పార్టీ నుంచి బీ ఫామ్ తీసుకుని బరిలోకి దిగితే.. గుర్తు(సింబల్) సమస్య రాదని ప్రచారం చేసుకుంటున్నారు. దీంతో తమ పార్టీ గుర్తుతో ఎన్నికల్లో పోటీ చేస్తే ప్రజల్లోకి వెళ్లడం సులభం అనుకునే వారిని టార్గెట్‌గా సదరు నాయకుడు కార్యక్రమాలు ప్రారంభించారు. వివిధ పార్టీల్లోని అసంతృప్త నేతలకు బీ ఫామ్‌లు ఇస్తామని చెప్పడం ప్రారంభించారు. అయితే ఈ విషయం బయటకు పొక్కడంతో పార్టీలోని మరికొందరు నాయకులు ఆయనకు అసలు ఆ పోస్టును తమ పార్టీ నాయకత్వం ఇవ్వనేలేదని, ఆయన మాటలు నమ్మొద్దని అంటూ ఏకంగా పత్రికా ముఖంగా ప్రకటన ఇవ్వడంతో ఆ మాజీ ఎమ్మెల్యే కంగుతిన్నారట.

• లేడీస్ ఫస్ట్

ఉమెనిఫెస్టో ప్లీజ్!

పగిడిపాల ఆంజనేయులు

ఎండమావిగానే సమాన అవకాశాలు
నినాదాలుగానే మహిళల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి, సామాజిక భద్రత
ఎన్నికల నేపథ్యంలో మరోసారి చర్చ
మహిళా మేనిఫెస్టోను ముందుకు తెస్తున్న హక్కుల సంఘాలు
రాజకీయ పార్టీలు దృష్టి సారించాలని డిమాండ్

హక్కులు, అవకాశాల్లో మహిళలకు సమాన భాగస్వామ్యం ఎండమావిగానే మిగిలింది. ఐదేళ్లకోసారి జరిగే ఎన్నికల్లో రాజకీయపార్టీలు హామీల వర్షం కురిపిస్తూనే ఉన్నాయి. ప్రభుత్వాలు వస్తున్నాయి..పోతున్నాయ్. కానీ మహిళల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి, సామాజిక భద్రత ఇప్పటికీ నినాదాలకే పరిమితమవుతున్నాయి. ఇల్లు, బడి, కార్యాలయంతో పాటు రోడ్డు ఇతర బహిరంగ ప్రదేశాల్లో.. ఎప్పుడూ ఏదో ఒక చోట ఏదో రకమైన వివక్ష, వేధింపులు, అణచివేత నిత్యకృత్యంగానే ఉంటున్నాయి. మహిళల రక్షణ కోసం గృహహింస చట్టం, నిర్భయ చట్టం వంటివి ఎన్ని వచ్చినా, షీటీమ్స్, భరోసా కేంద్రాలు, సఖి వంటి ప్రత్యేక రక్షణ బృందాలు ఎన్ని ఉన్నా లైంగిక దాడులు, హింస కొనసాగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా కోటి దాటిన గ్రేటర్ హైదరాబాద్ జనాభాలో సగం మంది మహిళలే. కాగా ప్రస్తుత ఎన్నికల వేళ.. రాజకీయ పార్టీలు ఏ మేరకు మహిళల ఆకాంక్షలకు, మహిళా సంబంధిత అంశాలకు పెద్ద పీట వేస్తున్నాయనేది చర్చనీయాంశంగా మారింది. పలు మహిళా సంఘాలు, హక్కుల సంఘాలు, వివిధ విభాగాల్లో మహిళల సంక్షేమం కోసం పని చేసే స్వచ్ఛంద సంస్థలు 'మహిళా మేనిఫెస్టో'పై దృష్టి సారించాయి. మహిళల సంక్షేమం లక్ష్యంగా అన్ని రాజకీయ పార్టీలు మహిళా మేనిఫెస్టోను రూపొందించాలని డిమాండ్ చేస్తున్నాయి.

సమాన అవకాశాలు లభించాలి....

స్త్రీలపై జరుగుతున్న అన్ని రకాల హింసను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని రంగాల్లో మహిళలకు 50 శాతం అవకాశాలు లభించాల్సిందేనని మహిళా సంఘాలు కోరుతున్నాయి. 'అన్నిచోట్లా స్త్రీల ప్రాతినిధ్యం పెరగాలి. విద్య, ఆరోగ్యం, జీవిత బీమా, బ్యాంకింగ్, పోలీసు, రవాణా, న్యాయ, వైద్య, ఎయిర్‌ఫోర్స్, నావిక, తదితర అన్ని రంగాల్లో మహిళలు రాణించే విధంగా సమాన అవకాశాలను కల్పించి ప్రోత్సహించాలి. సమాజంలో మహిళలపై హింసకు మద్యపానం కూడా ఒక కారణమే. మద్యాన్ని ఆదాయ వనరుగా భావించే ప్రభుత్వాల దృక్పథం పూర్తిగా మారాలి. మద్యం దుకాణాలను తగ్గించాలి. కచ్చితమైన నియంత్రణ పాటించాలి. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల లోపే మద్యం షాపులు తెరిచి ఉంచాలి. ప్రధాన హైవేలు, బస్టాపులు, ఆలయాలు, బడులు, ప్రార్థనాస్థలాలకు సమీపంలో ఉన్నవాటిని తొలగించాలి..' అని డిమాండ్ చేస్తున్నాయి.

నిర్భయ సెల్ ఏర్పాటు చేయాలి

'ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలలు, తదితర అన్ని విద్యాసంస్థల్లో బాలికలు, యువతులు నిశ్చింతగా చదువుకొనేందుకు అనువైన వాతావరణం, మౌలిక సదుపాయాలు కల్పించాలి. అన్ని విద్యాసంస్థల్లో ఇందుకోసం ప్రత్యేకంగా 2013 నిర్భయ చట్టానికి అనుగుణంగా నిర్భయ సెల్ ఏర్పాటు చేయాలి. కానీ ఇప్పటివరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అమ్మాయిల అవసరాలకు అనుగుణమైన మౌలిక సదుపాయాలు కల్పించాలి. టాయిలెట్లు, రక్షిత మంచినీళ్లు, పౌష్టికాహారం అందజేయాలి. చాలామంది పిల్లలు ముఖ్యంగా బాలికలు తీవ్రమైన పోషకాహార లేమితో బాధపడుతున్నారు. అమ్మాయిల్లో రక్తహీనత ఒక సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో స్కూళ్లలో తృణ ధాన్యాలతో కూడిన పోషకాహారాన్ని అందజేయాలి. స్కూళ్లలో తప్పనిసరిగా చైల్డ్ హెల్త్ కేర్ రికార్డులను అమలు చేయాలి. ఇందులో ఉపాధ్యాయులు, ఆరోగ్యకార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు భాగస్వాములు కావాలి. యుక్త వయస్సు బాలికలకు చక్కటి ఆరోగ్య విద్య అందజేయాలి. శానిటరీ ప్యాడ్స్, న్యాప్‌కిన్స్ అందుబాటులో ఉంచాలి. యుక్త వయస్సులో వచ్చే మార్పుల గురించి అమ్మాయిలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించే విధంగా జెండర్ సెన్సిటైజేషన్ వర్క్‌షాపులను ఏర్పాటు చేయాలి. వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణ ఇప్పించి అమ్మాయిలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందుకొనేలా చర్యలు తీసుకోవాలి. స్వీయ రక్షణకు నిరంతర శిక్షణ ఉండాలి. ఈ మేరకు మేనిఫెస్టోలో పొందుపరచాలి..' అని పలు సంఘాలు, సంస్థలు సూచిస్తున్నాయి.

మహిళలకు పెద్దపీట వేసేది కాంగ్రెస్ పార్టీనే..

'తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక మహిళల హక్కులకు భంగం కలుగుతోంది. దిశ లాంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. రాష్ట్ర కేబినెట్‌సహా ఏ అంశంలోనూ మహిళలకు బీఆర్‌ఎస్ తగిన ప్రాధాన్యత కల్పించలేదు. కాంగ్రెస్ పార్టీ చరిత్ర చూస్తే మహిళలకు పెద్దపీట వేసేది తామేనని అర్థమవుతుంది. మహిళలను ప్రధానిగా, రాష్ట్రపతిగా చేసింది కాంగ్రెస్ పార్టీనే. జాతీయ పార్టీ అధ్యక్షురాలిగా కూడా బాధ్యతలు అప్పగించింది కూడా మేమే. రాబోయే ఎన్నికల్లో ప్రజలకు మేమిచ్చిన ఆరు గ్యారంటీల్లో కూడా మహిళాసాధికారత కోసం పథకాలు ప్రకటించాం. ప్రతి మహిళకు నెలకు రూ.2,500 నగదు, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆసరా పింఛన్ల పెంపు, చదువుకునే విద్యార్థినులకు మోటారు సైకిళ్లు లాంటి పథకాలతో రాష్ట్రంలో మహిళాభ్యున్నతికి పాటుపడతాం'

– మచ్చా వరలక్ష్మి, గ్రేటర్ హైదరాబాద్ మహిళాకాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు



మెరుగైన ప్రజా రవాణా అవసరం

'ప్రస్తుతం గ్రేటర్‌లో వివిధ రకాల రవాణా సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. కానీ మెట్రోతో సహా అన్ని సేవలు రాత్రి 11కే ముగుస్తాయి. దీంతో రాత్రివేళల్లో విధులు నిర్వహించే సాఫ్ట్‌వేర్ ఉద్యోగినులు, కాల్‌సెంటర్లలో పని చేసే అమ్మాయిలు, రాత్రి పూట ఆలస్యంగా ఇళ్లకు చేరవలసిన సమయాల్లో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆటోలు, క్యాబ్‌లలో మహిళల భద్రత ప్రశ్నార్థకంగానే ఉంది. రాత్రి 9 దాటితే ఇలాంటి వాహనాల్లో ప్రయాణం చేయడం దుస్సాహసమే. ఈ పరిస్థితుల్లో సిటీ బస్సులు 24 గంటల పాటు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి..' అని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. రాజకీయ పార్టీలు ఈ అంశాలు దృష్టిలో ఉంచుకోవాలని కోరుతున్నాయి.

అవకాశం ఇస్తే.. అమలు చేసి చూపిస్తాం

'అమ్మాయిలకు ఉచిత విద్య. వైద్యం కేటాయిస్తే చాలు సాధికారత అనేది దానంతట అదే వస్తుందని మేము నమ్ముతున్నాం. విద్యాపరంగా బలోపేతమైతే..కెరీర్ పరంగా నిర్ణయాలు తీసుకొని జీవితంలో స్థిరపడగలుగుతారు. రాష్ట్రంలో బీజేపీకి ఒక్కసారి అవకాశం లభిస్తే దీనిని అమలు చేయడం ద్వారా చేసి చూపేందుకు సిద్ధంగా ఉన్నాం. జాతీయ స్థాయిలో బీజేపీ ఇచ్చిన మేనిఫెస్టోను ఒకసారి పరిశీలిస్తే...అనేక కీలకమైన అంశాలు పూర్తిస్థాయిలో అమలుచేసే ప్రయత్నాలు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేస్తోంది. అందులో భాగంగానే మహిళా సాధికారతను సంబంధించిన గతంలో ఇచ్చిన హామీని అమలుచేసేందుకు పూనుకున్నాము.



– గీతామూర్తి, బీజేపీ మహిళామోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు

జంగ్ తెలంగాణ

ఆస్తులు సరే... ఆరోగ్యం సంగతేంటి?

ఫిట్టా.. ఫట్టా

రాజకీయనేతలు వెల్లడించాలన్న ఐఎంఏ
అది ప్రజల హక్కు అంటూ స్పష్టీకరణ

ఎస్. సత్యబాబు

ఎన్నికల్లో పోటీ చేయనున్న రాజకీయ నేత గెలవడం అంటే...తనకు ఓటేసిన లక్షల మంది ప్రజల ఆశల్ని మోయడం. అంతటి బరువు బాధ్యతల్ని మోసే నేత ఆరోగ్యంగా ఉండాలి.. అంతకన్నా ముందు ఆ నేత ఆరోగ్యం గురించి ప్రజలకు తెలిసి ఉండాలి...అది వారి హక్కు అంటోంది ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ). ఏళ్లనాటి ఈ డిమాండ్ ఇంకా డిమాండ్‌గానే మిగిలి ఉన్న నేపథ్యంలో నేతల ఆరోగ్యంపై అవగాహన నిజంగా ప్రజల హక్కుగానే భావించాలా? అయితే ఎందుకు?

2015లో జరిగిన ఎన్నికల సందర్భంలో రాజకీయ నాయకులు తమ ఆర్థిక పరమైన ఆస్తులను ప్రకటించినట్లే తమ ఆరోగ్య స్థితిగతుల్ని కూడా ప్రకటించాలని ఐఎమ్ఎ ప్రతినిధులు పిలుపునిచ్చారు. రాబోయే ఐదేళ్లపాటు రాజకీయ ఒత్తిడిని తట్టుకుంటూ ప్రజాసేవ చేయగలరా లేదా అని తెలుసుకోవడం తమ అభ్యర్థుల ఆరోగ్య స్థితిని తెలుసుకోవడం ఓటరు హక్కు '' అని అప్పటి ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెకె అగర్వాల్ స్పష్టం చేశారు.

అది తప్పనిసరి చేయాలి..

ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగంలో చేరాలనుకున్నప్పుడు, అభ్యర్థి ఫిట్‌నెస్ పరీక్ష చేయించుకోవాలి. వైద్య పరీక్షలో ముందుగా ఉన్న ఏదైనా తీవ్రమైన వ్యాధిని గుర్తిస్తే సదరు అభ్యర్థి ఉద్యోగానికి అనర్హులవుతారనేది మనకి తెలుసు. అలాగే క్రీడల్లో కూడా ఫిట్‌నెస్ పరీక్ష జరపకుండా ఆడటానికి అనుమతించరు. అలాంటప్పుడు పాలనకు బాధ్యత వహించే రాజకీయ నేతను ఎలా అనుమతిస్తారు? ప్రపంచంలోని అదిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో నేత ఆరోగ్యాన్ని తనిఖీ చేయకుండా ఎన్నికలలో పోరాడటానికి అనుమతివ్వడం సరైనదేనా? అనేవి కచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలే. దీనిని దృష్టిలో ఉంచుకునే... ''ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వైద్య పరీక్షలు చేయించుకుని తమ ఆరోగ్య వివరాలు వెల్లడించడం తప్పనిసరిగా మార్చి దీని కోసం ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది'' అని నొక్కి చెప్పారు అప్పటి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎ మార్తాండ పిళ్లై.

యువతపై ప్రభావం...

మన దేశంలో రాజకీయ నాయకులను సెలబ్రిటీలుగా పరిగణిస్తారని, వారి ఆహారపు అలవాట్లు జీవనశైలి యువ తరాన్ని ప్రభావితం చేస్తాయని ఐఎంఏ అంటోంది. నేతలు ఊబకాయంతో ఉండడం అలాగే పొగ తాగటం లేదా మద్యపానం వంటి దురలవాట్లు కలిగి ఉండడం... యువ తరానికి తప్పుడు సందేశం ఇస్తుందనేది తమ ఆందోళనగా పేర్కొంది.

- రాజకీయ నేత... అట్టడుగు స్థాయిలో పని చేయగలమని, శారీరకంగా చురుగ్గా ఉన్నామని, ఏ సమయంలోనైనా ఆకస్మిక విపత్తు సంభవించిన ప్రదేశాలకు రాగలమని, మైళ్ల దూరం నడిచి ప్రజలకు కావలసిన సేవలు అందించగలమనే నమ్మకం ప్రజలకు అందించాలి. ఐఎంఏ నాటి ప్రతిపాదనలోని ఔచిత్యాన్ని నేతలు ఇప్పటికైనా గుర్తించి...తప్పనిసరి నిబంధన రాకున్నా... ఆస్తుల వెల్లడి తరహాలోనే స్వచ్ఛందంగానైనా తమ ఆరోగ్య వివరాలు వెల్లడిస్తే... అది గొప్ప మార్పుకు దారి తీయవచ్చు.

అనారోగ్యంతో మరణిస్తే...



ఒక నేత తన అనారోగ్యాన్ని దాచిపెట్టి ఎన్నికల్లో గెలిచిన తర్వాత దురదృష్టవశాత్తూ మరణిస్తే... ఉపఎన్నిక అనివార్యమై. అది ప్రజాధనం వృథాకి కారణం అవుతుంది. నాయకులు అంటే ప్రజలకు సేవకులు అనేది అందరూ చెప్పే మాటే... అయితే ఒడిదుడుకులను ఎదుర్కొని తమకు 5ఏళ్ల పాటు సేవలు అందించే శారీరక మానసిక సామర్థ్యం నేతలకు ఉందో లేదో తెలుసుకోవడం ప్రజల హక్కు కూడా.

–డా.బీఎస్‌రావు, రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షుడు

ఆరోగ్యంగా ఉంటేనే కదా... చెప్పింది చేయగలరు..



ఏ మనిషైనా ఆరోగ్యం అత్యవసరం అనేది తెలిసిందే. నేతలు ఇచ్చిన హామీలు అమలు చేస్తారనే కదా ప్రజలు గెలిపిస్తారు. ఆరోగ్యం ఉంటేనే కదా నేతలు తాము ఇచ్చిన హామీలు అమలు చేయగలరు. కాబట్టి... నేతల ఆరోగ్య వివరాలు ప్రజల హక్కు అనేది నిర్వివాదం.. దీనిపై తాజాగా ఐఎంఏ ఎటువంటి ప్రకటనా చేయనప్పటికీ...గతంలో చేసిన ఈ డిమాండ్ ఎప్పటికీ సజీవమే అని నేను భావిస్తున్నా.

–డా.గుత్తా సురేష్, జాతీయ ఉపాధ్యక్షులు, ఐఎంఏ.

ఓట్ దిస్ పాయింట్

తగ్గిన థర్డ్‌జెండర్ ఓటర్లు

మంచిర్యాల డెస్క్: తెలంగాణ రాష్ట్రంలో గత ఎన్నికల నాటికి.. ఇప్పటికి థర్డ్‌జెండర్ (ఇతరులు) ఓటర్ల సంఖ్య తగ్గింది. 2018 నాటి ఓటర్ జాబితా ప్రకారం రాష్ట్రంలో 2,739 మంది ఓటర్లు ఉన్నారు. ఇటీవల వెలువడిన తుది జాబితా ప్రకారం 2,557 మంది ఓటర్లుగా ఉన్నారు. ఈ లెక్కన ఓటర్ల సంఖ్య 182 మందికి తగ్గింది. అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 404 మంది ఉండగా, అత్యల్పంగా నారాయణపేట్ జిల్లాలో ముగ్గురు ఉన్నారు. కాగా, 2014 నుంచి భారత ఎన్నికల సంఘం థర్డ్‌జెండర్లను 'ఇతర' ఓటర్లు'గా గుర్తిస్తూ ప్రత్యేకంగా నమోదు చేస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా గత అసెంబ్లీ ఎన్నికల్లో గోషామహల్ నుంచి థర్డ్‌జెండర్ ఎం.సంతోష్ అలియాస్ మువ్వల చంద్రముఖి బీఎల్‌ఎఫ్‌పీ(బహుజన లెఫ్ట్ ఫ్రంట్ పార్టీ) అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పొందింది.

ఇట్లు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఎమ్మెల్యే అభ్యర్థి



సాక్షి, కామారెడ్డి : కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు నియోజకవర్గంలోని ఓటర్లకు వాట్సాప్ ద్వారా దసరా శుభాకాంక్షలు పంపారు. భారత్ అనలైటికా పేరుతో వాట్సాప్ గ్రూప్ నుంచి నియోజకవర్గంలోని ఓటర్లందరికీ వాట్సాప్ ద్వారా సీఎం సందేశం పంపించారు. అందులో 'గౌరవనీయులైన.....గారికి, మీకు, మీ కుటుంబ సభ్యులకు విజయదశమి (దసరా) శుభాకాంక్షలు. ఇట్లు మీ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, ఎమ్మెల్యే అభ్యర్థి, కామారెడ్డి నియోజకవర్గం, సీఎం, తెలంగాణ రాష్ట్రం'అని పేర్కొన్న సందేశాలు రావడంతో కొందరు ఓటర్లు తబ్బిబ్బవుతున్నారు. సీఎం కేసీఆర్ తన పేరుతో గ్రీటింగ్స్ చెప్పారంటూ గొప్పగా అందరితో ఆనందం పంచుకుంటుండగా, మాకూ వచ్చాయి లెండీ! అంటూ ఎదుటి వాళ్లు కూడా చెప్పడం కొసమెరుపు.

మీకు తెలుసా?

కేసీఆర్‌ను ఓడించిన ఒకేఒక్కడు..

సిద్దిపేట జోన్: సీఎం కేసీఆర్‌ను ఓడించిన ఏకైక వ్యక్తి మాజీ మంత్రి అనంతుల మదన్‌మోహన్. సిద్దిపేట నియోజకవర్గం నుంచి 1983లో తెలుగుదేశం అభ్యర్థిగా అప్పట్లో పోటీచేసిన కేసీఆర్‌పై కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ 887 ఓట్ల తేడాతో గెలుపొందారు. టీడీపీ అభ్యర్థి కేసీఆర్‌కు 27,889 ఓట్లు రాగా, మదన్ మోహన్‌కు 28,766 ఓట్లు వచ్చాయి. అప్పట్లో ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చి ఎన్టీఆర్ సీఎం కాగా, కేసీఆర్ మీద గెలిచిన మదన్ మోహన్ ప్రతిపక్ష నాయకుడు అయ్యారు. తరువాత జరిగిన 1989, 1994 ఎన్నికల్లో కేసీఆర్ వరుసగా మదన్ మోహన్ మీద విజయం సాధించారు. తర్వాత రాజకీయాలకు దూరమైన మదన్ మోహన్ 2004లో మరణించారు. సీఎం కేసీఆర్‌కు అదే తన రాజకీయ జీవితంలో ఇప్పటివరకు మొదటి, చివరి ఓటమి. తరువాత జరిగిన ఎన్నికల్లో కేసీఆర్ ఐదుసార్లు ఎంపీగా, ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు.



మదన్‌మోహన్

కేసీఆర్ తరువాత ఈటలే...

ఈటల రాజేందర్ కూడా తెలంగాణ శాసనసభ ఎన్నికలలో తనకంటూ ఒక చరిత్ర సృష్టించుకున్నారు. ఆయన ఇంతవరకు ఏడుసార్లు విజయం సాధించారు. 2004 నుంచి ఇంతవరకు ఆయనకు అపజయం లేదు. సీఎం కేసీఆర్‌తో వచ్చిన విభేదాల కారణంగా మంత్రివర్గం నుంచి ఈటల బర్తరఫ్ అయ్యారు. ఆ తర్వాత ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి బీజేపీ పక్షాన పోటీ చేసి సైతం గెలవడం ఒక సంచలనం. ప్రస్తుతం పోటీచేస్తున్న నేతలలో ముఖ్యమంత్రి కేసీఆర్ తర్వాత అత్యధికసార్లు గెలిచిన నేతగా ఈటల ఉన్నారు.

ఎన్నికల బరిలో డజను మంది డాక్టర్ బాబులు!

కోరుట్ల ఓపెనర్ అరవింద్, హుజూరాబాద్ బౌలర్ పాడి

ఉమ్మడి కరీంనగర్ జిల్లా బరిలో అభ్యర్థుల అర్హతలు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: తెలంగాణ ఎన్నికల బరిలో ఉమ్మడి కరీంనగర్ నుంచి అసెంబ్లీకి పోటీ పడుతున్న అభ్యర్థుల నేపథ్యం ఆసక్తికరంగా ఉంది. ఇక్కడ బరిలో దిగబోయేవారిలో డజనుమంది డాక్టర్లు ఉండటం విశేషం. వీరిలో ఎనిమిది మంది ఎంఎస్, ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి వైద్యశాస్త్రం చదివిన విద్యావంతులు ఉన్నారు. అదే సమయంలో కొందరు పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ పొందిన అభ్యర్థులూ ఉన్నారు. ఈసారి అసెంబ్లీ బరిలో నిలిచేవారిలో ఉమ్మడి కరీంనగర్‌లోని పలు అసెంబ్లీ స్థానాల నుంచి 12 మంది పేర్లలో తొలుత డాక్టర్ ఉండటం గమనార్హం. అదే సమయంలో ఇద్దరు రంజీ ప్లేయర్లు కూడా అసెంబ్లీ బరిలో నిలవడం విశేషం.

ఎనిమిది మంది వైద్యులు

- డాక్టర్ సంజయ్ ఎంఎస్, ఎమ్మెల్యే (బీఆర్ఎస్-జగిత్యాల)
- డాక్టర్ సంజయ్ ఎంఎస్, (బీఆర్ఎస్- కోరుట్ల)
- డాక్టర్ భోగశ్రావణి బీడీఎస్ (బీజేపీ-జగిత్యాల)
- డాక్టర్ వికాస్‌బాబు ఎంబీబీఎస్ (బీజేపీ- వేములవాడ)
- డాక్టర్ కే.సత్యనారాయణ ఎంఎస్ (కాంగ్రెస్-మానకొండూరు)
- డాక్టర్ బల్మూరి వెంకట్ ఎంబీబీఎస్ (కాంగ్రెస్-హుజూరాబాద్)
- డాక్టర్ జేఎస్ వెంకట్ ఎంబీబీఎస్ (బీజేపీ - కోరుట్ల)
- డాక్టర్ నగేశ్ ఎంబీబీఎస్ (వైఎస్సార్ టీపీ- కరీంనగర్)

నలుగురు డాక్టరేట్‌లు

- డాక్టర్ రసమయిబాలకిషన్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే (మానకొండూరు)
- డాక్టర్ కొనగాల మహేశ్ (కాంగ్రెస్-కరీంనగర్)
- డాక్టర్ మేడిపల్లి సత్యం (కాంగ్రెస్-చొప్పదండి)
- డాక్టర్ గోలి మోహన్ (సైంటిస్ట్) (బీఎస్పీ-వేములవాడ)

ఇద్దరు క్రికెటర్లు.. అర్వింద్ / పాడి

సెకండ్ ఇన్నింగ్స్ విజయంపై..



కోరుట్ల నుంచి అసెంబ్లీ బరిలో నిలిచిన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ రంజీ క్రికెటర్. 1995లో హైదరాబాద్ జట్టుకు ఓపెనింగ్ బ్యాట్స్‌మన్‌గా ఆడారు. గత ఎన్నికల్లో తాను ఓపెనింగ్ చేసిన తొలి ఎన్నికల్లో అప్పటి నిజామాబాద్ ఎంపీ కవితను ఓడించి సంచలనం రేపిన సంగతి తెలిసిందే. తాజాగా రెండో ఇన్నింగ్స్‌లోనూ సంచలన విజయంపై అర్వింద్ కన్నేశారు.

బెస్ట్ ఫెర్ఫామెన్స్ కోసం..



ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి...2018లో ఈటల రాజేందర్‌పై కాంగ్రెస్ నుంచి పోటీ చేశారు. ప్రస్తుతం బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా అదే ప్రత్యర్థిపై బరిలో నిలిచారు. రాజకీయాల్లోకి రాకముందు పాడి కౌశిక్‌రెడ్డి సైతం రంజీ ఆటగాడు. 2004 నుంచి 2007 వరకు హైదరాబాద్ జట్టులో ఫాస్ట్‌బౌలర్‌గా కొనసాగారు. వీణవంక ఎక్స్‌ప్రెస్‌గా పేరున్న కౌశిక్‌రెడ్డి తన కెరీర్‌లో 47 వికెట్లు తీసి, ఒక అర్ధసెంచరీని తన ఖాతాలో వేసుకున్నాడు. ఒక మ్యాచ్‌లో 10 వికెట్లు పడగొట్టిన రికార్డు కూడా కౌశిక్ పేరిట ఉండటం విశేషం.



పచ్చనోట్ల మధ్య.. పదునెక్కని ఓటు

మారుతున్న ఎన్నికల తీరుపై మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

Interview

వనం దుర్గాప్రసాద్

ఆకాశాన్ని తాకే ఆశయం, గుండె గొంతుకలోంచి పుట్టుకొచ్చే భావోద్వేగం, కష్టమైన, నిష్ఠూరమైనా సైద్ధాంతిక ఆలోచనా విధానమే అప్పట్లో రాజకీయ నేపథ్యంగా ఉండేది అంటున్నారు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య. వామపక్ష ఉద్యమమే గీటురాయిగా పనిచేసిన సీపీఐ (ఎంఎల్) పార్టీ అంటే గుర్తుకొచ్చేది గుమ్మడి నర్సయ్యే. విలువలు, నిరాడంబర జీవితం ఆయన సొంతం. ఇల్లెందు నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన.. నాటి నుంచి ఇప్పటివరకు అత్యంత సాధారణ జీవితాన్నే గడుపుతున్నారు. అప్పటికి ఇప్పటికి ఎన్నికల సరళి పూర్తిగా మారిపోయిందని.. పదునైన ఓటు ఆయుధం పచ్చనోట్ల మధ్య మొద్దుబారిపోతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని ధనస్వామ్యం అపహాస్యం చేస్తోందని వాపోయారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో.. మారిన ఎన్నికల తీరుపై గుమ్మడి నర్సయ్య 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే..

దోచుకున్నా గుర్తించరేం?

దోపిడీ విధానాలపై ఉక్కు పిడికిలితో ఉద్యమించిన ప్రజల్లో మార్పు వచ్చింది. దీన్ని ఆకర్షణ పేరుతో పాలకులు అణచివేస్తున్నారు. తాయిలాలు, సంక్షేమానికి ఆకర్షితులవుతున్న జనం.. వాటి కోసం తమ జేబుకే చిల్లు పెడుతున్నారని గుర్తించడం లేదు. మద్యం పేరుతో సర్వం హరిస్తున్నా తెలుసుకోకపోవడం దారుణం. అభివృద్ధి, సంక్షేమానికి చాలా తేడా ఉంటుంది. అభివృద్ధి వల్ల శాశ్వత ఉపాధి అవకాశం లభిస్తుంది. అప్పుడు ఏ సంక్షేమ పథకాలకూ ప్రజలు ఆకర్షితులుకారు.

మారిన లెఫ్ట్ పంథా..

వామపక్ష ఉద్యమ పంథాలో మార్పు వచ్చిందనేది నిజమే. సామాజిక మార్పులను గుర్తించకపోవడం నష్టమే. ఉద్యమ నేపథ్యం ఉన్న పక్షాలు ఐక్యంగా ముందుకెళ్లలేని స్థితి ఏర్పడింది. దీంతో ప్రజలు పోరాడే విధానానికి దూరమయ్యారు. ఒకప్పుడు పోడు భూముల కోసం ప్రాణాలు పణంగా పెట్టి పోరాడిన చరిత్ర ఉంది. ఇప్పుడు నేతలు పోటీపడి ఇస్తామంటే ఆకర్షితులవుతున్నారు. తేలికగా వచ్చే దానికి ఆకర్షితులవుతున్నారు. పోరాటానికి వెనకాడుతున్నారు. ఈ ముసుగులోనే సోకాల్డ్ నేతలు ప్రజలను వంచిస్తున్నారు.

రాజకీయమా.. వ్యాపారమా..?

"1983 నుంచి నేను ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నాను. అప్పట్లో ప్రజల్లో మమేకమైతేనే పార్టీలు సీట్లు ఇచ్చేవి అప్పట్లో. పోటీచేసే వ్యక్తిని జనం అదే రీతిలో సొంతం చేసుకునే వాళ్లు. పోస్టర్లు, గోడమీద రాతలు అవే ఆ కాలంలో అతిపెద్ద ఎన్నికల ఖర్చు. ప్రచారం కోసం వచ్చే వాళ్లకు ప్రజలే అన్నంపెట్టే వారు. ఆశ్రయం కల్పించేవారు. అంతా కలిపి రూ.లక్షన్నర వరకూ ఎన్నికల ఖర్చు ఉండేది. ప్రజలు పైసలు ఆశించేవాళ్లు కాదు. 1994 నుంచి రాజకీయాలు మారిపోయాయి. కోట్లు గుమ్మరిస్తేనే గెలుస్తామని పార్టీలు కూడా భావిస్తున్నాయి. ప్రజలకు, నాయకులకు మధ్య ధన సంబంధం ఏర్పడింది. రాజకీయాలు కలుషితమయ్యాయి. రూ.కోట్లు ఖర్చుపెట్టి గెలిచిన ఎమ్మెల్యేలు ఆ తర్వాత తమకు ఏది లాభమో దాన్నే అనుసరిస్తున్నారు. అవసరమైతే పార్టీలు మారుతున్నారు.

మౌనం ఉరుముతున్న వేళ..

ఎన్నికల మహాభారతంలో ప్రజలే నిర్ణేతలు. ఎవరు డబ్బులు ఎక్కువిస్తే వాళ్లకే ఓట్లేసే ఆలోచన విధానం కొన్నేళ్లుగా పెరిగింది. కానీ ఒక తరం ఇలా చేయడం వల్ల దాని ప్రభావం భవిష్యత్ తరాలపై పడింది. అందుకే యువతలో ఇప్పుడు నిర్వేదం, నైరాశ్యం కొట్టొచ్చినట్టు కన్పిస్తున్నాయి. ఉపాధి లేని జీవితం.. సర్కారీ ఉద్యోగం ఎండమావేనని భావించే యువతలో ఆగ్రహం క్రమంగా కట్టలు తెంచుకుంటోంది. ఇది రానురాను రాజకీయ సమీకరణాలను మారుస్తుంది. ఒక తరం కోల్పోయిన పోరాట పంథాకు ఊపిరిపోస్తోంది. వామపక్ష ఉద్యమ నేపథ్యాన్ని తిరిగి తెలుసుకుంటోంది. పోరాటమే అంతిమ లక్ష్యమన్న ధోరణిలోంచే ఎన్నికల విధానంలోనూ మార్పు వస్తుందనేది వాస్తవం.."అని గుమ్మడి నర్సయ్య పేర్కొన్నారు.

4 సార్లు ఎమ్మెల్యే.. 3 నియోజకవర్గాలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్‌రూరల్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అయితే ఆయన మూడు వేర్వేరు నియోజకవర్గాల్లో ఈ ఘనత సాధించారు. 1999లో కాంగ్రెస్ తరఫున ఆర్మూర్ ఎమ్మెల్యేగా, 2004లో బాన్సువాడ స్థానంలో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. ఇదే సెగ్మెంట్ నుంచి 2009లో ఓటమి పాలయ్యారు. తర్వాత 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

రాహుల్‌గాంధీ దోసె.. ఎన్నికల క్లాసు!



ఇటీవల రాష్ట్రంలో ప్రచారానికి వచ్చిన రాహుల్‌గాంధీ దోసెలేశాడు. అలా ఆయన దోసెలేస్తూ ఉండగా..అంకితభావంతో క్రమశిక్షణతో మెలిగే ఓ కార్యకర్తకు ఆ చర్య ద్వారా అందిన సందేశమిది...

"పరిశీలనగా చూడాలేగానీ..ఎన్నికల ఉపదేశాలెన్నో ఉన్నాయి దోసెలో"అన్నాడు రాహుల్ గాంధీ గిన్నెడు పిండిని పెనమ్మీద పోస్తూ.

"దోసెల్లో ఎన్నికల క్లాసులా?!" ఆశ్చర్యపోయారు రాష్ట్ర నేతలూ, కార్యకర్తలు.

"కాదా మరి..ఎన్నికల వాతావరణం వేడెక్కిందంటూ జర్నలిస్టులు తరచూ అంటుంటారు. ఎందుకనీ?..ఎందుకంటే వేడెక్కిన పెనం మీద సత్రుమంటూ నీళ్ల జల్లగానే 'సుయ్యి'మంటుంది కదా. ఎన్నికల వాతావరణం కూడా అలాగే వేడెక్కుతుందన్నమాట"

"ఇక... పిండి కలపడమూ, నియోజకవర్గాలకు అభ్యర్థుల ఎంపికా ఒక్కలాంటివే. ఎన్నికల తయారీకవి కసరత్తుల్లాంటివన్నమాట. ఇకమరి మన దోసెపెనం అన్నది నియోజకవర్గమనుకుందాం. పోసిన పిండి పోసిందగ్గరే ఉండకూడదు. అభ్యర్థన్నవాడు ఒకేచోట అలాగే ఉండిపోకుండా.. నియోజకవర్గ నలుమూలలా నాలుగు దిక్కులకు తిరుగుతూ, విస్తృతంగా ప్రచారం చెయ్యాలి. పెనం మూలమూలలకూ విస్తరించే పిండి ఇచ్చే సందేశమిదే" పెనమ్మీద పోసిన పిండిని అన్నివైపులకూ గుండ్రంగా విస్తరింపజేస్తూ వివరించాడు.

"రవ్వదోసెలోని రంధ్రాల్లా అభ్యర్థి వ్యక్తిగత జీవితం కూడా అవతలకీ ఇవతలకీ కనిపించేటంత ట్రాన్స్‌పరెంట్‌గా ఉండాలి. ఇక మసాలాదోసె.... మధ్యనున్న మసాలాని అన్నివైపుల్నుంచీ కవర్ చేసినట్టుగానే..మన సొంత కార్యకర్తల ప్రయోజనాల్ని అన్నివైపులా కవర్ చేసుకుంటూ, కాపాడుకోవాలన్న స్ఫూర్తినిస్తుంది మసాలాదోసె"

"దోసె పోసిన కాసేపటికి సలాటంతో చకచకా నూనె జల్లినట్టు చేయడమే మన ఈ డబ్బులూ, సారా పంచడమన్నది. ఇక పోసినది పోసినట్టుగా అట్టు పెనానికంటుకుపోకుండా దోసె కింద కస కసా, కర కరామంటూ సరాటంతో సరసరలాడించడమే ఓటరింటికి మాటిమాటికీ పోయి, మన గుర్తును గుర్తు చేసి రావడం"

"ఓటమి అన్నది ఒక్కోసారి మాడిపోయే మసాలాదోసె లాంటిది. రుచి, పచీ ఉండదు. పెనమ్మీద మాడిన పెరసట్టంటే గ్రహణం పట్టిన సూర్యుడి లాంటిది. గ్రహణం ఎల్లకాలమూ ఉండదు. ఇవ్వాళ ఓడిన అభ్యర్థి..అట్టు తిరగేసినట్టుగా... ఆవలితట్టున అంటే... రెండోవైపున తెల్లటి చంద్రుడిలా మెరుస్తూ గెలవచ్చు. దోసెకిరువైపులా ఉండే కలరుమార్పుల్లాంటివే గెలుపూ, ఓటమి అనుకోవాలి"

"ఇక సర్వింగులో కూడా ఓ సందేశముండాలి.." అంటుండగానే చుట్టూ మూగి చూస్తున్న ప్రజల్లోంచి ఎవరో గబుక్కున అరిచారు.

"అవును..కొందరు నేతలు 'కోన్' షేపులో..అంటే టోపీ రూపంలో సర్వ్ చేస్తుంటారు. గెలిచాక అచ్చం ఓటరు నెత్తిన టోపీ పెట్టినట్టుగానే.." అంటూ అరుస్తూ ఆ కోణంగి కొంటెగా..చుట్టూ ఉన్న కార్యకర్తలు పట్టుకునేలోపే తుర్రుమంటూ పరుగందుకున్నాడు.

జంగ్ తెలంగాణ పంచతంత్రం

అవినీతి రావణుడిగా బఘేల్

ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ కార్టూన్ ప్రచారం

రాయ్‌పూర్: కాంగ్రెస్‌కు చెందిన ఛతీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్‌పై బీజేపీ ప్రచారం తీవ్రతరం చేసింది. ఆయన్ను అవినీతి రావణుడిగా చిత్రీకరిస్తూ వేసిన కార్టూన్‌ను కాషాయ పార్టీ మంగళవారం సామాజికమాధ్యమాల్లో పోస్ట్ చేసింది. రాక్షస రాజు రావణుడిపై శ్రీరాముడి విజయాన్ని పురస్కరించుకుని దసరా జరుపుకోవడం ఆనవాయితీ. ఈసారి అవినీతి రావణుని దిష్టిబొమ్మలను దహనం చేద్దాం..అంటూ 10 తలలు కలిగిన రావణుడిగా సీఎం బఘేల్‌ను చిత్రీకరించిన కార్టూన్‌పై 'భగేశ్' (మోసగాడు) అంటూ పేర్కొంది. పది తలలకు వేర్వేరు స్కాములు, హత్య, రేప్ వంటి నేరాలను, చేతిలోని ఆయుధానికి అవినీతి అనే పేరు పెట్టింది. ఛత్తీస్ గర్హియా అనే వ్యక్తి రావణుడి వైపు విల్లు ఎక్కుపెట్టినట్లుగా కూడా అందులో ఉంది. ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీకి వచ్చే నెల 7, 17వ తేదీల్లో రెండు విడతలుగా పోలింగ్ జరగనున్న విషయం తెలిసిందే.



భార్యాభర్తల ముఖాముఖి పోరు

రాజస్తాన్‌లోని దాంతా రామ్‌గఢ్‌లో విచిత్ర పరిస్థితి

జైపూర్: రాజస్తాన్‌లో అసెంబ్లీ ఎన్నికల గడువు దగ్గరపడుతున్న వేళ రాజకీయ సమీకరణాలు చిత్రవిచిత్రంగా మారుతున్నాయి. శికార్ జిల్లా దాంతా రామ్‌గఢ్ నియోజకవర్గంలో వేర్వేరు పార్టీల నుంచి భార్యాభర్తలు ముఖాముఖి తలపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అల్వార్ జిల్లాలోని రామ్‌గఢ్‌లో సిట్టింట్ ఎమ్మెల్యే షఫియా జుబేర్‌కు బదులుగా ఆమె భర్త, మాజీ ఎమ్మెల్యే జుబేర్‌ఖాన్‌కు టికెట్టివ్వాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. 200 మంది సభ్యులున్న రాజస్తాన్ అసెంబ్లీకి నవంబర్ 25వ తేదీన పోలింగ్ జరగనున్న విషయం తెలిసిందే. పీసీసీ మాజీ చీఫ్, దాంతా రామ్‌గఢ్ నియోజకవర్గం నుంచి ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన నారాయణ్ సింగ్ కుటుంబం దశాబ్దాలుగా కాంగ్రెస్‌లో కొనసాగుతోంది. ఆయన కొడుకు వీరేంద్ర సింగ్ 2018లో దాంతా రామ్‌గఢ్ నుంచి కాంగ్రెస్ తరఫున బరిలోకి దిగారు. వీరేంద్ర సింగ్ భార్య రీటా చౌదరి ఆగస్టులో జననాయక్ జనతా పార్టీ(జేజేపీ)లో చేరారు. ఆ పార్టీ ఆమెను రాష్ట్ర మహిళా విభాగం ప్రెసిడెంట్‌గా నియమించింది. తాజాగా రీటా చౌదరికి దాంతా రామ్‌గఢ్ టికెట్టించింది. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రీటా చౌదరి దాంతా రామ్‌గఢ్ నుంచి కాంగ్రెస్ టిక్కెట్ ఆశించారు. కానీ కాంగ్రెస్ పార్టీ ఆమె భర్త వీరేంద్ర సింగ్‌కు టిక్కెట్టిచ్చింది. అప్పటి నుంచి ఆమె ప్రజల మధ్య తిరుగుతూ పేరు సంపాదించుకున్నారు. అనూహ్యంగా ఆమె జేజేపీలో చేరడం, తాజాగా ఆ పార్టీ ఆమెకు టికెట్టివ్వడం జరిగిపోయాయి. వచ్చే ఎన్నికల్లో తన గెలుపు ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేస్తున్నారు. భర్త వీరేంద్ర సింగ్ కూడా పోటీకి దిగే అవకాశముందన్న వార్తలపై ఆమె స్పందిస్తూ.. 'నేను దీనిపై ఏమీ మాట్లాడాలనుకోవడం లేదు. ప్రజలు మార్పు కోరుతున్నారన్నది మాత్రం వాస్తవం'అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మళ్లీ తనకే అవకాశమిస్తుందని భావిస్తున్నానని వీరేంద్ర సింగ్ చెప్పారు. అలాంటి పరిస్థితుల్లో తమ భార్యాభర్తల మధ్య ముఖాముఖి పోరు ఖాయమంటున్నారు.

భార్యకు బదులు భర్తకు అవకాశం

అల్వార్ జిల్లాలోని రామ్‌గఢ్ నియోజకవర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే షఫియా జుబేర్. ఆమె భర్త జుబేర్ ఖాన్ ఇదే స్థానం నుంచి 1990, 1993, 2003 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచారు. తాజాగా కాంగ్రెస్ పార్టీ షఫియాకు బదులుగా జుబేర్‌కు టికెట్ ప్రకటించింది. ఈ నిర్ణయంపై షఫియా హర్షం వ్యక్తం చేశారు. పార్టీ మంచి నిర్ణయం తీసుకుందని చెప్పారు. కలిసి పనిచేసి, భారీ మెజారిటీతో విజయం సాధిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ తనకు టికెట్ నిరాకరణపై ఆమె స్పందించేందుకు నిరాకరించారు.

200 స్థానాలున్న రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల పోరు తారస్థాయికి చేరింది. బీజేపీ, పాలక కాంగ్రెస్ హోరాహోరీగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వ వ్యతిరేకత, మోదీ మేనియా తమను ఈసారి కచ్చితంగా గట్టెక్కిస్తాయని బీజేపీ ఆశపడుతోంది. ఇక అశోక్ గెహ్లోత్ ప్రభుత్వం సంక్షేమ పథకాలపైనే నమ్మకం పెట్టుకుంది. మరోవైపు రెండు పార్టీలూ అంతర్గత కుమ్ములాటలతో సతమతమవుతున్నాయి. పైగా అవతలి పార్టీలోని తలనొప్పులు తమకే మేలు చేస్తాయన్న భావనలో ఉన్నాయి...!

ఇద్దరికీ ఇబ్బందులే!

రాజస్తాన్‌లో ఆసక్తికరంగా ఎన్నికల పోరు | **సమస్యలతో కాంగ్రెస్, బీజేపీ సతమతం**

- పథకాలనే నమ్ముకున్న గెహ్లోత్ సర్కారు
- ప్రభుత్వ వ్యతిరేకతపై బీజేపీ ఆశలు
- ఎవరికీ అంతుచిక్కని ఓటరు నాడి

ఐదేళ్లకోసారి అధికార పార్టీని మార్చడం రాజస్తాన్ ఓటర్లకు ఆనవాయితీ. 1993 మధ్యంతర ఎన్నికల నాటినుంచి ఏ పార్టీ కూడా అధికారాన్ని నిలబెట్టుకున్న చరిత్ర లేదు. అలా చూస్తే ఈసారి బీజేపీకి అవకాశం దక్కాలి. దీనికి తోడు కాంగ్రెస్‌లో సీఎం గెహ్లోత్, ఆ పార్టీ అసమ్మతి నేత సచిన్ పైలట్ మధ్య విభేదాలను వీలైనంతగా ప్రచారం చేయడం ద్వారా మరింత లబ్ధి పొందాలని కమలనాథులు ప్రయత్నిస్తున్నారు. అంతేగాక కొన్నేళ్లుగా ఎన్నో శాంతిభద్రతల సమస్యలను రాజస్తాన్ చవిచూడటాన్ని ప్రచారంలో పదేపదే ప్రస్తావిస్తున్నారు. ఇక అవినీతి విచ్చలవిడిగా మారిపోయిందంటూ విమర్శలు గుప్పిస్తున్నారు.

అయినా గెహ్లోత్‌కే మొగ్గు...!

అవినీతి ఆరోపణలు, శాంతిభద్రతల సమస్యలు, అంతర్గత కుమ్ములాటల వంటివి ఎన్నున్నా గెహ్లోత్ సర్కారుపై ప్రజల్లో వ్యతిరేకత పెద్దగా కనిపించడం లేదని పరిశీలకులు అభిప్రాయపడుతుండటం విశేషం! ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గెహ్లోత్ పలు ప్రజాకర్షక పథకాలను వరుసబెట్టి ప్రకటించారు. ఇవన్నీ జనాన్ని బాగా ఆకట్టుకుంటున్నట్టు చెబుతున్నారు. 2014లో రాష్ట్రంలో కనిపించిన మోదీ వేవ్ ఇప్పుడు దాదాపుగా లేనట్టేనన్న అభిప్రాయం వినిపిస్తోంది. నిత్యావసరాల ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటివాటి వల్ల మోదీపై రాష్ట్ర ప్రజలకు భ్రమలు తొలగాయంటూ కాంగ్రెస్ జోరుగా ప్రచారం చేస్తోంది. ముఖ్యంగా కేంద్రం పట్ల మహిళల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, ఇది తమకు బాగా అనుకూలిస్తుందని ఆ పార్టీ నేతలంటున్నారు.

అధికార ఎమ్మెల్యేల్లో అసంతృప్తి

కానీ కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో నెలకొన్న తీవ్ర అసంతృప్తి ఆ పార్టీకి బాగా చేటుచేయవచ్చన్న అభిప్రాయం అంతర్గతంగా వినిపిస్తోంది. పైగా చాలామందిపై ప్రజలు అసంతృప్తితో ఉన్నట్టు వస్తున్న వార్తలు నాయకత్వానికి సమస్యగా మారాయి. ఇవన్నీ అంతిమంగా పుట్టి ముంచితే ఎలాగన్న ఆందోళన కాంగ్రెస్ అధిష్టానంలో నెలకొంది. అందుకే బీజేపీ బాటలోనే ఆ పార్టీ ఈసారి గెహ్లోత్‌ను సీఎం అభ్యర్థిగా ఎక్కడా పెద్దగా ప్రచారం చేయడం లేదు. అయితే ఈ ఎత్తుగడ అంతిమంగా బెడిసికొట్టి వారికే చేటు చేసే ప్రమాదం లేకపోలేదంటూ వస్తున్న వార్తలు పార్టీ పెద్దలను చికాకు పరుస్తున్నాయి.



గుజ్జర్లు ఏం చేస్తారో?

- 24 అసెంబ్లీ స్థానాల్లో నిర్ణాయకంగా ఉన్న గుజ్జర్లు, మీనా సామాజిక వర్గం ఓటర్లు ఈసారి కాంగ్రెస్‌ను ఆదరించడం కష్టమేనంటున్నారు.
- ఇక ఓబీసీ సామాజికవర్గంలో ప్రధానమైన జాట్‌లు గెహ్లోత్‌తో ఎప్పుడూ సంతృప్తిగా లేరు పైగా జాట్ ప్రాబల్య స్థానాల్లో రాష్ట్రీయ లోక్ తాంత్రిక్ పార్టీ పోటీకి దిగుతుండటం కాంగ్రెస్ అవకాశాలను దెబ్బ తీసేలా కనిపిస్తోంది.
- గుజ్జర్ సామాజిక వర్గానికి చెందిన సచిన్ పైలట్ సీఎం అవుతారన్న భావనతో గత అసెంబ్లీ ఎన్నికల్లో వారు కాంగ్రెస్‌కు జైకొట్టారు. ఈసారి వారు బీజేపీకేసి మొగ్గితే కాంగ్రెస్‌కు కష్టమేనని చెబుతున్నారు.
- భారతీయ ఆదివాసీ పార్టీ 2018లో రెండు స్థానాలే గెలిచినా పలు గిరిజన ప్రాంతాల్లో గణనీయంగా ఓట్లు సాధించింది. బీఎస్పీ సైతం కాంగ్రెస్ ఓటు బ్యాంకు నుంచి 5 శాతం ఓట్లు కొల్లగొట్టినట్టు గత ఎన్నికల ఫలితాల విశ్లేషణలో తేలింది. ఈసారి ఈ ట్రెండ్ కొనసాగితే కాంగ్రెస్‌కు మరింత నష్టమే.

బీజేపీకీ ఇంటి పోరు

బీజేపీ ఇంటి పోరుతో సతమతమవుతోంది. ముఖ్యంగా మాజీ సీఎం వసుంధర రాజే వర్గం స్థానిక బీజేపీ ముఖ్యులకు సహాయ నిరాకరణ చేస్తూ చిక్కులు సృష్టిస్తోంది. ఈ గొడవలు ముదిరితే మొదటికే మోసమని గ్రహించిన అధిష్టానం ఈసారి సీఎం అభ్యర్థిగా ఎవరినీ ప్రకటించకుండా జాగ్రత్త పడింది. రాజే సూచించిన వారిలో పలువురికి టికెట్లు నిరాకరించింది. కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించే ప్రయత్నాల్లో పడింది.

- హిందూత్వ కార్డుతో పాటు మోదీ ఛరిష్మాపైనే బీజేపీ ప్రధానంగా నమ్మకం పెట్టుకుంది.
- కానీ వసుంధర రాజే మాదిరిగా రాష్ట్రమంతటా జనాకర్షణ ఉన్న మరో నాయకుడంటూ ఎవరూ లేకపోవడం బీజేపీకి పెద్ద మైనస్ పాయింట్‌గా మారింది.

కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు

100 యూనిట్లదాకా ఉచిత కరెంటు	రూ.500కే ఎల్పీజీ వంటగ్యాస్ సిలిండర్
వృద్ధాప్య పింఛన్ల మొత్తం పెంపు	ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం

\- సాక్షి, నేషనల్ డెస్క్

దిగ్విజయ్ సింగ్ సంస్కారం ఇదేనా?

మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్‌సింగ్ ఆగ్రహం



భోపాల్: దసరా నవరాత్రుల సంప్రదాయంలో భాగంగా కన్యాపూజ చేస్తే అదంతా నాటకం అంటూ విమర్శించడం ఏమిటని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్‌పై మధ్యప్రదేశ్ సీఎం, బీజేపీ నాయకుడు శివరాజ్‌సింగ్ చౌహాన్ మండిపడ్డారు. నవరాత్రుల్లో కన్యాపూజ చేసే సంప్రదాయం దేశమంతటా ఉందని గుర్తుచేశారు. ఆడబిడ్డలను దేవతులుగా భావిస్తూ పూజించడం మన సనాతన సంస్కారమని చెప్పారు. తాను సోమవారం తన ఇంట్లో కన్యాపూజ చేస్తే దిగ్విజయ్ సింగ్ తప్పుపట్టడం విచారకరమని అన్నారు. ఆయన సంస్కారం ఇదేనా? అని మంగళవారం నిలదీశారు. కన్యాపూజ చేయడం నాటకం అని దిగ్విజయ్ వ్యాఖ్యానించడం తనను బాధించిందని చౌహాన్ అన్నారు.

మళ్లీ అధికారంలోకి వస్తే రుణమాఫీ: భూపేష్ భఘేల్



రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత భూపేష్ భఘేల్ కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో తాము మళ్లీ అధికారంలోకి వస్తే రైతుల రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించారు. ఆయన సోమవారం ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించారు. 2018 ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని, 18.82 లక్షల మంది రైతులకు చెందిన రూ.2,270 కోట్ల రుణాలు మాఫీ చేశామని వెల్లడించారు. ఈసారి ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌ను గెలిపిస్తే రైతులను రుణ విముక్తులను చేస్తామని ఉద్ఘాటించారు. అలాగే ఎకరాకు 20 క్వింటాళ్ల చొప్పున రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పారు.

ఛత్తీస్ మొదటి విడత ఎన్నికల బరిలో 223 మంది



రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ వచ్చే నెల 7న మొదటి విడతలో 20 సీట్లకు ఎన్నిక జరగనున్న విషయం తెలిసిందే. మావోయిస్టు ప్రభావిత బస్తర్ డివిజన్‌లోని ఏడు జిల్లాలతోపాటు మరో నాలుగు జిల్లాల్లో పోలింగ్ జరగనుంది. 20 స్థానాలకు గాను 294 మంది నామినేషన్లు వేశారు. పరిశీలన అనంతరం 253 మంది మిగిలారు. వీరిలో 30 మంది సోమవారం తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో, 20 సీట్లకు గాను 223 మంది ఎన్నికల బరిలో నిలిచారని అధికారి ఒకరు చెప్పారు.

సాక్షి హైదరాబాద్

బుధవారం । 25 । అక్టోబర్ । 2023

సంబరంగా దసరా వేడుకలు



ఘట్‌కేసర్‌లోని గురుకుల్ మైదానంలో మంగళవారం రాత్రి రావణ దహనం






ట్యాంక్‌బండ్ వద్ద అమ్మవారి విగ్రహాల నిమజ్జన దృశ్యం



ఉప్పల్ మున్సిపల్ గ్రౌండ్‌లో రావణ దహనం కార్యక్రమానికి హాజరైన జనం



అంబర్‌పేటలో...

దేవీనవరాత్రి ఉత్సవాలు, దసరా సంబరాలను నగరవాసులు వైభవంగా జరుపుకొన్నారు. సోమ, మంగళవారాల్లో ఈ ఉత్సవాలు కొనసాగాయి. తొమ్మిది రోజులు పూజలందుకున్న అమ్మవారి విగ్రహాలను హుస్సేన్‌సాగర్, సరూర్‌నగర్ చెరువు తదితర ప్రాంతాల్లో నిమజ్జనం చేశారు. ఇక సోమవారం రాత్రి పలుచోట్ల రావణ దహనం కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నుంచే జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి, చార్మినార్ భాగ్యలక్ష్మి తదితర ప్రముఖ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా..భక్తుల రద్దీతో కిక్కిరిసిపోయాయి. పలుచోట్ల శమీపూజను ఘనంగా నిర్వహించారు. ఇక అమ్మవారి ఊరేగింపు సందర్భంగా నిర్వహించిన దాండియా ఆట పాటలు, కోలాటాలు ఆధ్యాత్మిక శోభను పెంచాయి. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఈసారి విజయదశమి వేడుకల్లో రాజకీయ నాయకుల సందడి విశేషంగా కనిపించింది. సంబరాలు జరిగిన అన్ని ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్లు మొదలు ప్రస్తుత ఎమ్మెల్యేలు, వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థులు పాల్గొని సందడి చేశారు.

– సాక్షి, సిటీబ్యూరో

కీలక విధుల్లో కేంద్ర బలగాలు

నిఘా, తనిఖీలు, చెక్‌పోస్టుల్లోనూ వినియోగం

- ఇప్పటికే నగరానికి చేరుకున్న 11 కంపెనీలు
- కమాండింగ్ అధికారులతో కొత్వాల్ సమావేశం

సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల క్రతువును ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి నగర పోలీసు విభాగం ముమ్మర కసరత్తు చేస్తోంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, పక్షపాతానికి తావు లేకుండా కొత్వాల్ సందీప్ శాండిల్య చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా కీలక ఎలక్షన్ డ్యూటీల్లో స్థానిక పోలీసులతో పాటు కేంద్ర బలగాలను మోహరించాలని నిర్ణయించారు. ఎన్నికల విధుల కోసం ఇప్పటి వరకు నగరానికి 11 కంపెనీల కేంద్ర సాయుధ బలగాలు వచ్చాయి. వీటికి నేతృత్వం వహించే కమాండింగ్ ఆఫీసర్లతో సందీప్ శాండిల్య సోమవారం భేటీ అయ్యారు. బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో జరిగిన ఈ కీలక సమీక్షలో అదనపు సీపీ (శాంతిభద్రతలు) విక్రమ్ సింగ్ మాన్ సైతం పాల్గొన్నారు.

- నగరంలో ఉన్న కీలక పోలింగ్ స్టేషన్లు, సమస్యాత్మక, సున్నిత ప్రాంతాలపై కేంద్ర బలగాల అధికారులకు అవగాహన కల్పించారు. వీరిని నిఘా, తనిఖీలతో పాటు చెక్‌పోస్టుల్లోనూ వినియోగించాలని నిర్ణయించిన కొత్వాల్ శాండిల్య ఆ అంశాలను వారికి వివరించారు.
- ఫ్లైయింగ్ స్క్వాడ్స్ విధులు, బాధ్యతలను వారికి తెలియజేశారు. ఈ బలగాలకు అవసరమైన సదుపాయాలు, బస ఏర్పాటు చేసే బాధ్యతలను స్థానిక ఏసీపీలకు అప్పగించారు.
- విధి నిర్వహణ, తనిఖీల సమయంలో సాధారణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సీపీ స్పష్టం చేశారు.
- మరోపక్క ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రెవెన్యూ జిల్లాను యూనిట్‌గా నిర్ణయించారు. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ ఎత్తున నగర కమిషనరేట్ నుంచి ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. అనేక ఠాణాలకు కొత్త ఇన్‌స్పెక్టర్లు రాగా వీరిలో చాలామంది నగరానికి, ఏరియాకు పూర్తి కొత్త.
- అత్యంత కీలక పరిణామాల మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల నేపథ్యంలోనే కొత్తగా వచ్చిన ఇన్‌స్పెక్టర్లకు తమ పరిధిలోని ప్రాంతాలపై పట్టు వచ్చేలా చేయాలని నగర పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్య నిర్ణయించారు.
- ఇందులో భాగంగానే ఫ్లాగ్ మార్చ్‌లుగా పిలిచే పాదయాత్రలు చేపట్టాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల సందర్భంలో కమిషనరేట్‌లో ఉన్న పోలింగ్ బూత్ సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక, సున్నితమైనవిగా విభజించారు.
- వీటిలో పోలింగ్ సందర్భంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటారు. మరోపక్క పోలింగ్ స్వేచ్ఛగా జరుగుతుందని ప్రజల్లో స్థైర్యాన్ని నింపడంతో పాటు అసాంఘిక శక్తులకు చెక్ చెప్పడానికీ భారీ కసరత్తులు చేస్తారు.
- ఇందుకు ఉపకరించే ఫ్లాగ్‌మార్చ్‌లుగా పిలిచే కవాతులను పోలింగ్ ముగిసే వరకు నిర్వహించనున్నారు. కేంద్ర బలగాలతో కలిసి చేసే ఈ కవాతులు చేయాలని అధికారులకు కొత్వాల్ స్పష్టం చేశారు.
- తమ పరిధిలో ఎక్కడ సమస్యాత్మక ప్రాంతాలు ఉన్నాయి? ఎటు నుంచి అసాంఘికశక్తులు విరుచుకుపడే అవకాశం ఉంది? అనే అంశాలపై ఇన్‌స్పెక్టర్లకు పట్టుండాల్సిందేనని కొత్వాల్ స్పష్టం చేశారు.



పోలీస్ అధికారులకు సూచనలిస్తున్న సీపీ సందీప్ శాండిల్య

కోడ్‌తో కొరడా!

- హైదరాబాద్‌లో రూ.40.48 కోట్లు సీజ్
- నగదు రూ.14.39 కోట్లు
- రూ.26.09 కోట్ల విలువైన ఫ్రీబీస్

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో ఎన్నికల కోడ్ నిబంధనలకు విరుద్ధంగా తరలుతున్న నగదు, ఫ్రీబీస్ (ఉచిత బహుమతులు), మద్యం తదితరమైన వాటిపై నిఘా బృందాలు తనిఖీలు ముమ్మరం చేశాయి. దీంతో హైదరాబాద్ జిల్లా పరిధిలో ఇప్పటి వరకు రూ.14,39,71,320 నగదు పట్టుకున్నారు. ఫ్రీబీస్, తదితర వస్తువుల్ని సైతం సీజ్ చేశారు. వాటి విలువ రూ.26,09,17,766. రెండింటి విలువ మొత్తం రూ.40,48,89,080. వీటితోపాటు 15474 లీటర్ల మద్యాన్ని అధికారులు పట్టుకున్నారు.

24 గంటల వ్యవధిలో..

సోమవారం ఉదయం 6 గంటల నుంచి మంగళవారం ఉదయం 6 గంటల వకకు 24 గంటల వ్యవధిలో ఫ్లయింగ్ స్క్వాడ్స్ ద్వారా రూ.6,72,430 నగదును సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల ఎన్నికల అధికారి రొనాల్డ్‌రాస్ పేర్కొన్నారు. పోలీసుబృందాల ద్వారా మరో రూ.67,60,431 సీజ్ చేశారు. పట్టుకున్న నగదు, ఫ్రీబీస్, తదితరమైన వాటికి సంబంధించి ఈ ఒక్కరోజే 25 ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా, కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి మొత్తం 315 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. లైసెన్సు లేని 4,416 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు.

గోడరాతల చెరిపివేత...

ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ప్రభుత్వ భవనాలపై ఉన్న 5,090 గోడ రాతలను చెరిపి వేశారు. ఇంకా 70,145 పోస్టర్లు, 22,764 బ్యానర్లు తొలగించారు. ప్రైవేట్ భవనాలపై 1171 గోడరాతలు చెరిపివేయడంతోపాటు 19,105 పోస్టర్లు, 4,652 బ్యానర్లు తొలగించారు. అనుమతి లేని సమావేశాలు, ఫ్రీబీస్‌కు సంబంధించి 18 కేసులు నమోదు చేశారు. 16 ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు జిల్లా ఎన్నికల అధికారి పేర్కొన్నారు.



- విద్యావంతులైన యువతకు గాలం
- పోటీ చేసేందుకు ముందుకు రావాలని పిలుపు
- రెండింటిలోనైనా గెలిచేలా పథకరచన

ఈసారైనా వ్యూహం ఫలించేనా?

పాతబస్తీలో పాగాకు ఎంబీటీ పడరాని పాట్లు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని పాతబస్తీలో పాగా వేసేందుకు మజ్లిస్–బచావో –తహరిక్ (ఎంబీటీ) పార్టీ వ్యూహాత్మకంగా అడుగులేస్తోంది. మూడు దశాబ్దాల కిందటి వైభవం కోసం పడరాని పాట్లు పడుతోంది. రాజకీయ శత్రుపక్షమైన ఆల్ ఇండియా మజ్లిస్ ఏ–ఇత్తేహదుల్ ముస్లిమీ(ఏఐఎంఐఎం)ను మట్టి కరిపించడమే లక్ష్యంగా శక్తియుక్తులను ఒడ్డుతోంది. మజ్లిస్ తరహాలో నిరంతరం ప్రజాసేవలో నిమగ్నమైనా ఎన్నికలలో ఆ పార్టీకి పరాభవం తప్పడం లేదు. ఎప్పటి మాదిరిగా పార్టీ సీనియర్ బాధ్యులను కాకుండా ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో విద్యావంతులైన యువతకు పెద్ద పీట వేసి కొన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలోనైనా పాగా వేయాలని యోచిస్తోంది. ప్రధానంగా మజ్లిస్ పార్టీ వైఫల్యాలను ఎండగట్టడంతోపాటు పాత బస్తీలో అక్షరాస్యత, అభివృద్ధిపై ఫోకస్ పెట్టి ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ఎంబీటీ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అందులో భాగంగా ముస్లిం సామాజికవర్గంలో మార్పు కోసం ఎన్నికల బరిలో దిగేందుకు విద్యావంతులైన యువకులు ముందుకు రావాలని పిలుపునిస్తోంది. ముఖ్యంగా ఐటీ, ఇంజనీరింగ్, మెడికల్ రంగాలకు చెందిన యువత ముందుకు వచ్చి ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే వరకు వ్యవస్థను సరిదిద్దలేమని పేర్కొంటోంది. పోటీకి ఆసక్తిగల అభ్యర్థులు పాతబస్తీ చంచల్‌గూడలోని ఎంబీటీ ప్రధాన కార్యాలయంలో సంప్రదించాలని సూచిస్తోంది.

పట్టు వదలకుండా..

పాతబస్తీలో మజ్లిస్ పార్టీని దెబ్బతీసి గట్టెక్కేందుకు ఎంబీటీ పట్టు వదలని విక్రమార్కునిలా ప్రయత్నాలు చేస్తూనే ఉంది. గతంలో పార్టీ ప్రాతినిధ్యం వహించిన చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా అసెంబ్లీ స్థానాలు దక్కించుకునేందుకు వరుసగా ఎన్నికల్లో ప్రయత్నిస్తూ విఫలమవుతోంది. మూడు దశాబ్దాల క్రితం అప్పటి ఎఐఎంఐఎం అధినేత సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీతో ఏర్పడ్డ విభేదాలతో అమానుల్లాఖాన్ నాయకత్వంలో 1993లో ఏర్పడిన మజ్లిస్–బచావ్ తహరీక్ (ఎంబీటీ) 1994లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తొలి విజయం సాధించింది. మజ్లిస్ కంచు కోటలైన చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా అసెంబ్లీ స్థానాల్లో ఎంబీటీ విజయకేతనం ఎగురవేసింది. అయితే 1999 ఎన్నికల్లో ఎంబీటీ తన బలాన్ని నిలుపుకోలేకపోయింది. రాజకీయ పరిస్థితులు తారుమారయ్యాయి. పార్టీ అధినేత అమానుల్లా ఖాన్ వరుసగా ఐదు పర్యాయాలు విజయం సాధించిన చాంద్రాయణగుట్ట నుంచి ఓటమి చవిచూడక తప్పలేదు. మరోవైపు ముంతాజ్ అహ్మద్‌ఖాన్, విరాసత్ రసూల్ ఖాన్ కూడా ఎంఐఎం గూటికి చేరారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో చాంద్రాయణగుట్ట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి క్రమంగా అమానుల్లాఖాన్ పెద్ద కుమారుడు ఖయ్యూం ఖాన్, యాకుత్‌పురా నుంచి ఫర్హాతుల్లా ఖాన్, మిగతా నియోజకవర్గాల నుంచి అభ్యర్థులు బరిలో దిగి గట్టిపోటీ ఇచ్చినప్పటికీ స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో చాంద్రాయణగుట్ట సెగ్మెంట్‌పై ఆశలు వదలుకొని యాకుత్‌పురాపై దృష్టి సారించినా.. అక్కడా పరాభవం తప్పలేదు. అయితే ఈసారి సరికొత్త వ్యూహంతో విద్యావంతులైన యువతను రంగంలోని దింపాలని మరోమారు ఎంబీటీ గెలుపు ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

డీఆర్‌సీల ఎంపిక

15 ప్రాంతాలు గుర్తింపు

- పటిష్ట బందోబస్తుకు ఏర్పాట్లు

సాక్షి, సిటీబ్యూరో: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం పోలింగ్ సామాగ్రిని భద్రపరిచి పోలింగ్ రోజున సంబంధిత కేంద్రాలకు తరలించేందుకు అనువైన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లను (డీఆర్‌సీ)ఎంపిక చేశారు. హైదరాబాద్ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన డీఆర్‌సీలను పోలీసు ఉన్నతాధికారుల సూచనల మేరకు జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్‌రాస్ గుర్తించారు. డీఆర్‌సీ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయనున్నారు. జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల కోసం ఏర్పాట్లు జరుగుతున్న డీఆర్‌సీ సెంటర్ల వివరాలిలా ఉన్నాయి.

మరోమారు శిక్షణ

ఆయా నియోజకవర్గాలకు నియమితులైన ఎన్నికల అధికారులు, సిబ్బందికి సంబంధిత డీఆర్‌సీలలో మరోమారు ఎన్నికల నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు రొనాల్డ్‌రాస్ పేర్కొన్నారు.



యూసఫ్‌గూడ స్టేడియం

నియోజకవర్గం	డీఆర్‌సీ సెంటర్లు
ముషీరాబాద్	ఏవీ కాలేజ్, దోమల గూడ
మలక్‌పేట	జీహెచ్ఎంసీ ఇండోర్ స్టేడియం, అంబర్‌పేట
అంబర్‌పేట	ఆర్‌బీవీఆర్ మహిళా కళాశాల, నారాయణగూడ
ఖైరతాబాద్, జూబ్లీహిల్స్	కోట్ల విజయభాస్కరరెడ్డి ఇండోర్ స్టేడియం, యూసుఫ్‌గూడ
సనత్‌నగర్	కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కాలేజ్, ఓయూ
నాంపల్లి	జేఎన్ఏఎఫ్ఏయూ ఫైనార్ట్స్ కాలేజ్, మాసాబ్‌ట్యాంక్
కార్వాన్	ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్, మాసాబ్‌ట్యాంక్
గోషామహల్	తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం(ఉమెన్స్ కాలేజ్), కోఠి
చార్మినార్	కమలానెహ్రూ పాలిటెక్నిక్ మహిళా కళాశాల, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్
చాంద్రాయణగుట్ట	నిజాంకాలేజ్ లైబ్రరీ హాల్, బషీర్‌బాగ్
యాకుత్‌పురా	సరోజినీ నాయుడు వనితా మహావిద్యాలయ, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్
బహదూర్‌పురా	ఆరోరాస్ లీగల్ సైన్సెస్ అకాడమీ, హైదరాబాద్
సికింద్రాబాద్	ప్రొఫెసర్ జి.రామిరెడ్డి దూరవిద్యాకేంద్రం(పీజీఆర్ఆర్‌సీడీఈ–ఓయూ)
కంటోన్మెంట్	సీఎస్ఐఐటీ, వెస్లీకాలేజ్ గ్రౌండ్, సికింద్రాబాద్

'ఇజ్రాయెల్ దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలి'

సాక్షి, సిటీబ్యూరో: భారత ప్రభుత్వం చొరవ తీసుకొని ఇజ్రాయెల్–పాలస్తీనా సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించాలని ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు. గాజాపై జరుగుతున్న ఇజ్రాయెల్ దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి హైదరాబాద్ దారుస్సలాంలో పాలస్తీన్‌పై ఇజ్రాయెల్ దాడులకు నిరసనగా జరిగిన సభలో అసదుద్దీన్ ఒవైసీ పెద్ద ఎత్తున 'పాలస్తీనా జిందాబాద్' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇజ్రాయెల్ దాడులపై ముస్లిం దేశాలు నోరుమెదపక పోవడం విచారకరమన్నారు. పాలస్తీనాకు తమ సంఘీభావం ప్రకటించారు. హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ పాలస్తీనాపై ఏళ్లుగా దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలస్తీనాకు న్యాయం జరగాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లిం దేశాలు ఏకతాటిపైకి వచ్చి పాలస్తీనాకు అండగా నిలిచి ధైర్యం చెప్పాలని ముస్లిం మత పెద్దలు విజ్ఞప్తి చేశారు. ఇజ్రాయిల్ ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా గాజా ప్రజల కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

బోరబండ ఇన్‌స్పెక్టర్‌పై వేటు

- విధి నిర్వహణలో నిర్లక్ష్యంపై సీపీ సీరియస్
- సిటీ కమిషనరేట్‌కు అటాచ్

సాక్షి, సిటీబ్యూరో: బోరబండ పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.రవికుమార్‌పై వేటు పడింది. ఆయన్ను సిటీ కమిషనరేట్‌కే ఎటాచ్ చేస్తూ కొత్వాల్ సందీప్ శాండిల్య మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. విధి నిర్వహణలో అలసత్వం, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం తదితర కారణాల నేపథ్యంలో సీపీ ఈ నిర్ణయం తీసుకున్నారు. మరోపక్క ఎస్సార్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగులోకి వచ్చిన యువకుడి హత్య కారణంగా మరో ఇన్‌స్పెక్టర్‌పై చర్యలకు కమిషనర్ రంగం సిద్ధం చేశారు. దీనికి సంబంధించి బుధవారం ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. ఎన్నికల నేపథ్యంలో ప్రతి స్టేషన్ హౌస్ ఆఫీసర్ తమ పరిధిలో ఉన్న రౌడీషీటర్లు వంటి అసాంఘిక శక్తులపై కన్నేసి ఉంచాలని కొత్వాల్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. రౌడీషీటర్లకు సంబంధించిన రికార్డులు కలిగి ఉండాలని, వీటిని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడంతో పాటు ఇన్‌స్పెక్టర్లే స్వయంగా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. వీరిని బైండోవర్ చేయడంతో పాటు క్రమం తప్పకుండా కౌన్సిలింగ్ ఇవ్వడం, వారి ఇళ్లను సందర్శించి కదలికలపై నిఘా ఉంచడం సైతం ఇన్‌స్పెక్టర్ల బాధ్యతగా సందీప్ శాండిల్య స్పష్టం చేశారు. దైనందిన విధుల నేపథ్యంలో ఈ వ్యవహారాల్లో ఎస్సై సహాయం తీసుకోవాలే తప్ప పూర్తిగా వారిపై విడిచిపెట్ట కూడదని ఆదేశాలు జారీ చేశారు. వీటి అమలును పర్యవేక్షించడానికి ఆయన మంగళవారం నుంచి ఠాణాల తనిఖీలు ప్రారంభించారు. వెస్ట్‌జోన్ పరిధిలోని పలు పోలీసుస్టేషన్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. బోరబండ ఠాణాలో సరైన రికార్డులు లేకపోవడం, రౌడీషీటర్ల వ్యవహారం ఎస్సైలే పర్యవేక్షించడం వంటివి సందీప్ శాండిల్య దృష్టికి వచ్చాయి. దీంతో ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌ను నిలదీసిన ఆయన రౌడీషీటర్ల ఇళ్లకు వెళ్లారా? అంటూ ప్రశ్నించారు. తన వెంట వచ్చి కనీసం నలుగురి ఇళ్లైనా చూపాల్సిందిగా ఆదేశించారు. కొత్వాల్ వాహనం వరకు వెళ్లిన రవికుమార్ ఆ వ్యవహారాలను ఎస్సైలు పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. దీంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సందీప్ శాండిల్య అయన్ను కమిషనరేట్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మరోపక్క రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని కొత్వాల్ పదేపదే స్పష్టం చేస్తున్నారు. వాళ్లు ఏం చేస్తున్నారు? ఎవరితో వైరాలు ఉన్నాయి? తదితర అంశాలపై కన్నేయాల్సిందిగా ప్రత్యేక విభాగాలకు ఆదేశించారు. అయితే ఎస్సార్‌నగర్ రౌడీషీటర్ షేక్ షరీఫ్ సోమవారం రాత్రి యువకుడు తరుణ్‌ను హత్య చేశాడు. ఇది మంగళవారం వెలుగులోకి వచ్చింది. గతంలోనూ వీరి మధ్య వైరం ఉన్నా, పలుమార్లు ఘర్షణలు జరిగినా రౌడీషీటర్‌పై నిఘా ఉంచడం, చర్యలు తీసుకోవడంలో ప్రత్యేక విభాగాలు నిర్లక్ష్యం వహించాయని కొత్వాల్ భావిస్తున్నారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఆయన మరో ఇన్‌స్పెక్టర్‌పై వేటుకు రంగం సిద్ధం చేశారు. దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు బుధవారం వెలువడే అవకాశం ఉంది.

మద్యం షాపులపై నజర్

- రోజుకో కేసు నమోదు చేయాల్సిందేనా..
- పోలీసుల తీరుతో బెంబేలెత్తుతున్న జనం
- ఫంక్షన్లకు మద్యం తీసుకెళ్లడమూ తప్పేనా అని నిలదీత..



బంజారాహిల్స్: ఎన్నికల అధికారులు ఇచ్చే ఆదేశాలను పాటించే క్రమంలో పోలీసులు చూపిస్తున్న అత్యుత్సాహం ప్రజల పాలిట శాపంగా మారుతున్నది. గత రెండు వారాల నుంచి పోలీసులు తమ పరిధిలోని వైన్‌షాపులు, బ్యాంకులు, ఆభరణాల దుకాణాలు, దుస్తుల దుకాణాల వద్ద తిష్టవేస్తూ బ్యాంకులో డిపాజిట్ చేయడానికి వచ్చిన డబ్బులను, వైన్ షాపుల నుంచి నాలుగు బాటిళ్లకు మించి తీసుకెళ్తున్న మద్యాన్ని సీజ్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. తాజాగా ఓ యువకుడు దసరా సందర్భంగా తన ఇంట్లో విందు కోసం సోమవారం సాయంత్రం 6 మద్యం సీసాలు, 20 బీర్లు తీసుకుని వెళ్తుండగా అప్పటికే అక్కడ తిష్టవేసిన పోలీసులు ఆయన వెళ్తున్న దారిలో కొద్ది దూరం అనుసరించి..కారును ఆపి మద్యం సీజ్ చేయడమే కాకుండా ఆయనపై కేసు కూడా నమోదు చేశారు. ఇదేమిటని ఆ యువకుడు ప్రశ్నించగా నువ్వు ఓటర్లకు పంచడానికే మద్యం తీసుకెళ్తున్నావంటూ పోలీసులు జవాబు ఇవ్వడంతో ఆ యువకుడు నోరెళ్లబెట్టాడు. ఇలా ప్రతి వైన్‌షాపు వద్ద పోలీసులు తిష్టవేస్తూ ఓవర్ యాక్షన్‌కు దిగుతున్నారు. ఎవరు ఎంత మద్యాన్ని కొనుగోలు చేస్తున్నారో నిఘా వేసి వారు కొద్ది దూరం వెళ్లాక ఆపి మద్యాన్ని సీజ్ చేసి దాన్ని ఎన్నికల లెక్కల్లో చూపిస్తున్నారు. అంతే కాదు..మద్యం దుకాణాలు, ఆభరణాల దుకాణాలు, దుస్తుల షాపుల యజమానులు రాత్రి షాపు బంద్ చేసి ఆ రోజు కలెక్షన్ తీసుకెళ్లాలనుకున్నా అక్కడ మఫ్టీలో నిఘా ఉంటున్న పోలీసులు వారిని వేటాడి వెంబడిస్తున్నారు. చాలా మంది షాపుల యజమానులు తమ రోజువారీ వసూలు చేసిన డబ్బులను బ్యాంకుల్లో జమ చేయలేని పరిస్థితులు తలెత్తున్నాయి. ప్రతి రోజూ ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో ఒక లిక్కర్ కేసు నమోదు చేయాలని ఇటీవల ఉన్నతాధికారులు టార్గెట్ విధించారు. దీంతో పోలీసులు ఠాణాలను వదిలి వైన్‌షాపుల వద్ద తిష్టవేయాల్సిన పరిస్థితులు తలెత్తున్నాయి. ఇంకా ఎన్నికలకు ఆరువారాల సమయం ఉండగా ఇప్పటి నుంచి ఓటర్లకు మద్యం పంపిణీ చేస్తారని అధికారులు ఎలా భావిస్తున్నారో ఆ దేవుడికే తెలియాలి. మొత్తానికి అటు వ్యాపారులు, ఇటు ప్రజలు పోలీసుల తీరుతో విసిగిపోతున్నారు. చాలా చోట్ల తీవ్ర వాగ్వాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. పోలీసుల తీరును చాలా చోట్ల జనం ఎండగడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ అనాలోచిత, అసమర్థ నిర్ణయాలపై పునరాలోచించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

'ఆమె'పై అకృత్యాలు

చట్టాలు ఎంత కఠినతరం చేసినా మహిళలు, చిన్నారులపై అకృత్యాలు ఆగడం లేదు. నగరంలో రోజూ ఏదో ఒక చోట బాలికలు అఘాయిత్యాల బారిన పడుతున్నారు. కన్నతండ్రులే కామాంధులై కాటేస్తున్నారు... ముక్కుపచ్చలారని 'చిరు'నవ్వుల్ని మృగాళ్లు చిదిమేస్తున్నారు. చివరికి నిస్సహాయ స్థితిలో ఉన్న మహిళకు మరో మహిళే శత్రువవుతోంది...మహిళా శక్తికి ప్రతీకగా దసరా పండుగ నృత్యాలతో హోరెత్తుతోంది..అదే నగరంలో 'ఆమె'పై పైశాచిక కృత్యాల విలయతాండవం .. విషాదం నింపుతోంది. నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఆలస్యంగా వెలుగు చూసిన ఉదంతాలివీ..



కుమార్తెపై తండ్రి లైంగిక దాడి

- స్కూల్ నుంచి తీసుకెళ్లి దారుణం
- బాధితురాలి తల్లి ఫిర్యాదు
- పోక్సో చట్టం కింద కేసు నమోదు
- నిందితుడి రిమాండ్

మీర్‌పేట: కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రి.. మృగంలా వ్యవహరించాడు. కన్న కూతురిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. మీర్‌పేట పీఎస్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల జిల్లాకు చెందిన మహిళ సుమారు 18 ఏళ్ల క్రితం కేబుల్ ఆపరేటర్‌గా పనిచేసే బత్తుల దుర్గాప్రసాద్ (43)ను ప్రేమ వివాహం చేసుకుంది. బతుకుదెరువు కోసం కుటుంబం కొన్నేళ్ల క్రితం నగరానికి వచ్చిన వీరు ప్రస్తుతం అల్మాస్‌గూడ ఓ కాలనీలో అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె (17) రెండు నెలలుగా హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటోంది. ఈ క్రమంలో బాలిక ఉంటున్న హాస్టల్ సిబ్బంది తల్లికి ఫోన్ చేసి, మీ కుమార్తె కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోందని, పరీక్షలు సరిగా రాయడం లేదని చెప్పారు. దీంతో తల్లి హాస్టల్‌కు వచ్చి బాలికను ఆరాతీసింది. ఆగస్టు 18న తండ్రి దుర్గాప్రసాద్ హాస్టల్‌కు వచ్చి తనను ఇంటికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడని, ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించినట్లు చెప్పింది. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి తండ్రి దుర్గాప్రసాద్‌ను అరెస్ట్ చేశారు. అతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్రేమ పేరుతో మోసం

బంజారాహిల్స్: జూనియర్ ఆర్టిస్టును మోసం చేసిన ఘటనలో నిందితుడిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2 ఇందిరానగర్‌లో నివసించే యువతి(29) జూనియర్ ఆర్టిస్టుగా పనిచేస్తుంది. అదే ప్రాంతంలో ఉంటున్న ఫయాజ్ అలియాస్ మాసాన్ ఖాన్ ఆమెను ప్రేమిస్తున్నట్లు చెప్పడంతో ఇద్దరు కలిసి సహజీవనం చేస్తున్నారు. ఆమె రెండు సార్లు గర్భం దాల్చగా తనకు పిల్లలు ఇష్టం లేదంటూ గర్భస్రావం చేయించాడు. అయితే 2021 నవంబరు 25న ఆమె నిలోఫర్ ఆసుపత్రిలో శిశువుకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి ఫయాజ్ ఆమెను మరింత వేధిస్తున్నాడు. దీంతో మనస్తాపానికి లోనైన బాధితురాలు ఫయాజ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బంజారాహిల్స్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆశ్రయమిస్తామంటూ..

- మత్తు మందు కలిపి మహిళపై లైంగిక దాడికి యత్నం
- ఇద్దరు మహిళలతో కలిసి ఓ వ్యక్తి ఘాతుకం
- భర్తతో కలిసి బాధితురాలి ఫిర్యాదు
- పోలీసుల అదుపులో అనుమానితురాలు

వెంగళరావునగర్ : ఓ మహిళకు మత్తుమందు ఇచ్చి లైంగిక దాడికి యత్నించిన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రహమత్‌నగర్ డివిజన్ శ్రీరామ్‌నగర్‌కు చెందిన మహిళ ఈనెల 13న భర్తతో గొడవపడి ఇంటి నుంచి వచ్చి యూసుఫ్‌గూడ బస్టాప్ వద్దకు చేరుకుంది. సాయంత్రం నుంచి ఆమెను గమనిస్తున్న ముగ్గురు వ్యక్తులు (ఇద్దరు మహిళలు, మరో పురుషుడు) ఆమె వద్దకు వచ్చి నిద్ర లేపారు. ఇక్కడ నిద్రించడం క్షేమం కాదని తమ ఇంటికి వచ్చి నిద్రపోయి ఉదయాన్నే వెళ్లి పోవచ్చని నమ్మబలికారు. దీంతో వారి మాటలు నమ్మిన బాధితురాలు వారితో పాటు ఎస్‌పిఆర్‌హిల్స్‌లోని బ్రహ్మశంకర్‌నగర్‌కు వెళ్ళింది. ఆ సమయంలో వారు ఆమెకు కూల్ డ్రింక్‌లో మత్తుమందు కలిపి ఇచ్చారు. ఆమె మత్తులోకి జారుకోగానే ముగ్గురు కలిసి ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. అంతేగాక ఆమె చెవి దుద్దులు లాక్కున్నారు. స్పృహలోకి వచ్చిన ఆమె వారి బారినుంచి తప్పించుకుని ఇంటికి వెళ్ళి తన భర్తకు ఈ విషయం చెప్పింది. కొద్ది రోజుల పాటు ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆమె ఆదివారం రాత్రి భర్తతో కలిసి మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు సోమవారం బాధితురాలు చెప్పిన ఆనవాళ్ల ఆధారంగా ఒక మహిళను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చాక్లెట్ ఇచ్చి చిన్నారిపై లైంగిక దాడి

బంజారాహిల్స్: ఆడుకుంటున్న చిన్నారికి(7) చాక్లెట్ ఇస్తానని గదిలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 5లో ఓ ఇంటికి వాచ్‌మెన్‌గా వ్యవహరిస్తున్న మనోహర్ అనే వ్యక్తి ఈ నెల 23న మధ్యాహ్నం ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారికి మాయమాటలు చెప్పి, చాక్లెట్ ఇస్తానని చెప్పి తన గదిలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. చిన్నారి రోదిస్తూ బయటకు వచ్చి తన తల్లికి విషయం చెప్పడంతో ఆమె మనోహర్‌ను నిలదీయగా సదరు ఇంటి యజమాని బయటికి వచ్చి తన వాచ్‌మెన్ ఏ తప్పు చేయ లేదని ఏదైనా ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేసుకోవచ్చని సమాధానమిచ్చాడు. దీంతో బాధితురాలి తల్లి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుతు మనోహర్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు.

జేహెచ్‌పీఎస్ మాజీ చైర్మన్ మురళీ ముకుంద్ రిమాండ్

కుమారుడి కోసం పోలీసుల గాలింపు



బంజారాహిల్స్: పని మనిషిపై లైంగికదాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైన ఘటనలో జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ మాజీ చైర్మన్ మురళీ ముకుంద్‌ను మంగళవారం సీసీఎస్ పోలీసులు కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. దీంతో ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు. కోర్టు ఆదేశాల మేరకు అతడి పాస్‌పోర్టు, సెల్‌ఫోన్‌ను సీజ్ చేశారు. కాగా ఇదే కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అతడి కుమారుడు ఆకర్ష్ కృష్ణ పరారీలో ఉన్నారు. ఆయన కోసం గాలింపు చేపట్టారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12, మిథిలానగర్‌లో ఉంటున్న మురళీ ముకుంద్, ఆయన కుమారుడు తమ ఇంట్లో పనిచేస్తున్న యువతి (22)పై లైంగిక దాడికి పాల్పడినట్లు బాధితురాలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు సోమవారం రాత్రి కేసును సీసీఎస్‌కు బదిలీ చేశారు. మంగళవారం ఉదయం సీసీఎస్ పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత



శంషాబాద్: ఇద్దరు వేర్వేరు ప్రయాణికులు అక్రమంగా తీసుకొచ్చిన బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఉదయం రస్‌అల్‌ఖైమా నుంచి వచ్చి ప్రయాణికుడి లగేజీని తనిఖీ చేయగా 483 గ్రాముల బంగారు ఆభరణాలు బయటపడ్డాయి. దాని విలువ రూ.29.48 లక్షలుంటుందని నిర్ధారించారు. దుబాయ్ నుంచి మరో ప్రయాణికుడి లగేజీలో 610 గ్రాముల బంగారు ఆభరణాలు బయటపడ్డాయి. బంగారం విలువ రూ.32 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


భరత్‌రెడ్డి (ఫైల్)

సుభాష్‌నగర్: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది... సీఐ వెంకటేశ్వరరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సూరారం కాలనీ ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన భరత్‌రెడ్డి గత కొద్ది రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. దసరా పండుగను పురస్కరించుకుని సోమవారం అతని భార్య, పిల్లలు గుడికి వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న భరత్‌రెడ్డి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుడి నుంచి ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు ఫ్యాన్‌కు వేలాడుతున్న అతడిని కిందకు దింపి సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితురాలు పెళ్లి చేసుకుని వెళ్లి పోయిందని..

యువతి ఆత్మహత్య

మేడ్చల్‌రూరల్: గదిలో తనతోపాటు ఉంటున్న స్నేహితురాలు వివాహం చేసుకుని వెళ్లి పోవడంతో మానసిక ఒత్తిడికి గురైన ఓ యువతి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ నవీన్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అస్సాం రాష్ట్రానికి చెందిన యాస్మినా సుల్తానా(18) గత కొంత కాలంగా మేడ్చల్ కిందిబస్తీలో నివాసం ఉంటూ ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసేది. కాగా కొద్ది రోజుల క్రితం ఆమె రూమ్మేట్ సనా వివాహం చూసుకుని వెళ్లిపోయింది. అప్పటినుంచి మానసికంగా ఒత్తిడిని ఎదుర్కొంటున్న సుల్తానా మంగళవారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

నగరంలో బ్యాడ్మింటన్ టోర్నీకి 'ప్రపంచ' గుర్తింపు..

సాక్షి, సిటీబ్యూరో: పీఎస్‌బీ మెట్‌లైఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్, ప్రపంచంలోనే అతిపెద్ద జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌గా నిలిచిందని సంస్థ ప్రతినిధి చంద్రశేఖర్ తెలిపారు. వరల్డ్ రికార్డ్ సర్టిఫికేషన్ ఏజెన్సీ ఈ గుర్తింపును అందించిందన్నారు. నగరంలోని రైల్వేస్ ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియంలో 3 రోజుల పాటు జరిగిన జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చాంపియన్ షిప్‌కు రాష్ట్ర నలుమూలల నుంచి 1200 మంది క్రీడాకారులు హాజరయ్యారని, 8 మంది విజేతలుగా నిలిచారని ఆయన వివరించారు.

రాళ్లతో కొట్టి యువకుడి దారుణ హత్య

పాత కక్షల నేపథ్యంలో రౌడీ షీటర్ ఘాతుకం


తరుణ్ (ఫైల్)


నిందితుడు షేక్ షరీఫ్

అమీర్‌పేట: పాత కక్షలు మనసులో పెట్టుకున్న రౌడీ షీటర్ మరో ఇద్దరితో కలిసి ఓ యువకుడిని రాళ్లతో కొట్టి దారుణంగా హత్య చేసిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దాసారం బస్తీలో మంగళవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది.పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎస్ఆర్‌నగర్ బాపూనగర్‌కు చెందిన తరుణ్ (22) డిగ్రీ చదువుతూ మధ్యలోనే ఆపేశాడు. సోమవారం రాత్రి అతను బాపూనగర్‌లో దుర్గామాత పూజలో పాల్గొని ఇంటికి తిరిగి వెళుతుండగా ఓ స్నేహితుడు వచ్చి దాసారం బస్తీకి వెళ్లి వద్దామని చెప్పి తీసుకెళ్లాడు. అప్పటికే అక్కడ రౌడీ షీటర్ షేక్ షరీఫ్, మరో ముగ్గురితో కలిసి మద్యం తాగుతూ ఉన్నాడు. తరుణ్ కూడా వారితో కూర్చున్నాడు. కొద్ది సేపటి తర్వాత షరీఫ్ తరుణ్ మధ్య గొడవ చోటు చేసుకుంది. ఇద్దరి మధ్య మాటా మాటా పెరగడంతో షరీఫ్ వెంట ఉన్న వ్యక్తులు తరుణ్‌పై దాడి చేశారు. దీంతో బాపూనగర్‌కు వెళ్లిన తరుణ్ దాడి విషయాన్ని తన స్నేహితుడికి చెప్పడంతో ఒక్కడిని చేసి ఎలా కొడతారంటూ అతను తరుణ్‌ను వెంట పెట్టుకుని మళ్లీ దాసారం బస్తీకి వచ్చాడు. తరుణ్ రాయితో షరీఫ్‌ను కొట్టడంతో అతను తరుణ్ కణతపై బలంగా కొట్టాడు. కిందపడి పోయిన తరుణ్‌పై మరో ఇద్దరు యువకులు రాళ్లతో దాడి చేశారు. అతడి అరుపులు స్థానికులు అక్కడికి చేరుకునేలోగా షరీఫ్ అతడి అనుచరులు పారి పోయారు. రక్తపు మడుగులో పడి ఉన్న తరుణ్‌ను పోలీసులతో కలిసి అమీర్‌పేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అమీర్‌పేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నిందితుడు షరీఫ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్, ఏసీపీ వెంకటేశ్వర్‌రావు, సీఐ రాంప్రసాదరావు పరిశీలించారు.

పథకం ప్రకారమే హత్య:
హత్యకు గురైన తరుణ్ ,రౌడీ షీటర్ షరీఫ్ మధ్య పాత గొడవలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.ఈ నేపథ్యంలో తరుణ్‌ను హత్య చేసి ఉండవచ్చని నిర్ధారణకు వచ్చారు. నాలుగు నెలల క్రితం కూడా షరీఫ్ తరుణ్‌కు కొట్టి సెల్ ఫోన్ పగలకొట్టాడు. ఈ ఘటనపై ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. దీంతో తరుణ్‌పై మరింత ఆగ్రహం పెంచుకున్నాడు. ఇటీవల జరిగిన బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణ సమయంలో సైతం ఇద్దరి మధ్య గొడవ జరిగింది.నీ అంతు చూస్తానంటూ షరీఫ్ తరుణ్‌ను తరుచూ బెదిరించేవాడని స్నేహితులు తెలిపారు. ఇందులో భాగంగానే పథకం ప్రకారం దసరా పండుగ రోజున తరుణ్‌ను దాసారం బస్తీకి పిలిపించి హత్య చేసి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

మంత్రి తలసాని పరామర్శ

అమీర్‌పేట: దాసారం బస్తీలో హత్యకు గురైన తరుణ్ కుటుంబ సభ్యులను రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మంగళవారం పరామర్శించారు. విషయం తెలుసుకున్న ఆయన నేరుగా గాంధీ ఆసుపత్రికి వెళ్లి మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు కోరారు.


తరుణ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి తలసాని

'యాన్ ఇన్వాల్యుబుల్ ఇన్వొకేషన్' పుస్తకావిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచ శాంతి, మానవత్వం, సమానత్వాలను ఆకాంక్షిస్తూ ప్రముఖ రచయిత, గిన్నిస్ రికార్డ్ విజేత వంగీపురం శ్రీనాథాచారి రచించిన 'యాన్ ఇన్వాల్యుబుల్ ఇన్వొకేషన్' ఆంగ్ల పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం జూబ్లీహిల్స్‌లోని దస్‌పల్లా హోటల్‌లో జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న డిఐజీ బి.సుమతి మాట్లాడుతూ విశ్వవ్యాప్త దృక్పథంతో ఈ రచన సాగిదంటూ రచయితను ప్రశంసించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత మాట్లాడుతూ ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఈ బుక్‌గా అందుబాటులో ఉన్న ఈ పుస్తకం ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన పుస్తకంగా పేర్కొన్నారు. దీని ఖరీదు రూ.5 కోట్లుగా నిర్ణయించామని, ఈ పుస్తకాన్ని ఐక్యరాజ్యసమితికి అంకితమిస్తూ పుస్తకంపై వచ్చే ఆదాయంలో 50శాతం అందిస్తున్నామన్నారు. అదే విధంగా సేవా కార్యక్రమాలకు తోడ్పాటుగా భారత ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలకు 25శాతం చొప్పున అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సినీ రచయిత జేకే భారవి, భిన్న రంగాల ప్రముఖులు, పుస్తక ప్రియులు పాల్గొన్నారు.

ప్రలోభాలపై నిఘా!

- మద్యం, నగదు, బహుమతుల పంపిణీకి అడ్డుకట్ట
- 13 చెక్ పోస్టులు, 3 ఫ్లయింగ్ స్క్వాడ్‌లతో చెకింగ్
- సామాజిక మాధ్యమాల పోస్టులపై సీరియస్
- రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల నేపథ్యంలో మోడల్ కాండక్ట్ ఆఫ్ కోడ్ ను సమర్థవంతంగా అమలు చేసేందుకు అధికారులు, సిబ్బంది కోసం న్యాయ నిపుణులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పోలీసు కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఫూట్ ఆన్ గ్రౌండ్ సిద్ధాంతాన్ని పాటిస్తున్నామన్నారు. ఈ సిద్ధాంతం ప్రకారం ప్రతి పోలీసు ఆఫీసర్ ఎన్నికల విధులతో పాటు శాంతి భద్రతలు, పౌరుల రక్షణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎప్పుడూ ఒక కాలును ఫీల్డ్‌లో పెట్టే విధంగా సిద్ధంగా ఉండేలా ప్రణాళికలను రూపొందించామన్నారు. రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో మొత్తం 13 నియోజకవర్గాలు వస్తాయని, ఇందులో 7 నియోజకవర్గాలు పూర్తిగా, 6 నియోజకవర్గాల పరిధి కొంత వస్తుందన్నారు. ఈ మేరకు ఆయా నియోజకవర్గాలకు సంబంధించిన పరిస్థితులపై ఇప్పటికే మూడు సార్లు సమీక్షించడమేగాక వాటి పరిధిలో నెలకొన్న పరిస్థితులపై ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకుగాను 13 చెక్ పోస్టులు, 3 ఫ్లైయింగ్ స్క్వాడ్లతో తనిఖీలను ముమ్మరం చేస్తున్నామని సీపీ చౌహాన్ వివరించారు.

సోషల్ మీడియాపై నిఘా...
సోషల్ మీడియా పోస్టింగ్ లపై నిరంతర పర్యవేక్షణను నిర్వహిస్తున్నామన్నారు. రాజకీయ నాయకులు, కార్యకర్తలు రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకోవద్దని సీపీ కోరారు. ఒక వ్యక్తిని కించపర్చే విధంగా పోస్టింగ్‌లు పెట్టినా, వాట్సాప్ తో పాటు ఇతర సోషల్ మీడియా మధ్యమాల్లో ప్రచారం చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పౌరులు ఎవరైనా ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలతో పాటు ఇతర సమాచారాన్ని డయల్ 100కు అందించాలన్నారు.

ఓటర్లను ప్రలోభ పెట్టే అంశాల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఈ ఫిర్యాదుల పై తక్షణ చర్యలు ఉంటాయని సీపీ స్పష్టం చేశారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునే విధంగా అన్ని ఏర్పాట్లను చేస్తున్నామని దీని కోసం ముందస్తు ప్రణాళికలతో పట్టు సాధించామని ఆయన వివరించారు.

భారీగా గంజాయి పట్టివేత

కుత్బుల్లాపూర్: కారులో గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పేట్‌బషీరాబాద్ పోలీసులు అరెస్టు చేసి పెద్ద మొత్తంలో సరుకు స్వాధీనం చేసుకున్నారు. సీఐ ప్రశాంత్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. సోమవారం ఇద్దరు వ్యక్తులు కారులో గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పేట్‌బషీరాబాద్ పోలీసులు సుచిత్ర వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నిజామాబాద్ వెళ్తున్న కారును ఆపి సోదా చేయగా 41 బ్యాగ్‌ల్లో 82 కిలోల గంజాయిని గుర్తించారు. కారు డిక్కీ, టాప్ మధ్యలో ప్రత్యేక అరను ఏర్పాటు చేసి గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నాంపల్లికి చెందిన అమర్‌నాథ్, చత్తీస్‌గఢ్‌కు చెందిన సంజీవ్‌లను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.



గంజాయి తరలిస్తున్న కారు..


స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు..

ఓటరుకు మరో ఛాన్స్


ఓటరు జాబితాలో పేరును చూసుకుంటున్న ఓటరు

- ఈ నెలాఖరు వరకు అవకాశం
- నవంబర్ 15న తుది ఓటరు జాబితా
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు

బంజారాహిల్స్: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం ముగిసింది. ఈనెల 4వ తేదీన తుది ఓటరు జాబితా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ అధికారులు వెల్లడించారు. ఖైరతాబాద్ నియోజక వర్గంలో 2,89,558, జూబ్లీహిల్స్ నియోజక వర్గంలో 3,75,430 ఓటర్లు ఉన్నట్లు తేల్చారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 31వ తేదీ వరకు కొత్తగా ఓటర్లుగా చేరేందుకు మరో అవకాశం కల్పించారు. తమ ఓటును బదిలీ చేసుకునేందుకు కూడా వెసులుబాటు కల్పించారు. కొత్తగా ఓటర్లు నమోదు చేసుకుంటే నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు అవకాశం దక్కనుంది. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకునేందుకు మరోసారి అవకాశం ఇచ్చిన నేపథ్యంలో జాబితాలో పేరులేని వారంతా ముందుకు రావాలని ఎన్నికల అధికారులు కోరుతున్నారు. ఇప్పటికే అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక సవరణ కార్యక్రమాలను బూత్ లెవల్ స్థాయిలో ఇంటింటికి తిరిగి పకడ్బందీగా చేపట్టడంతో ఈ ఫలితాలు వెలుగు చూశాయి. మొత్తం మీద అధికారులు క్షేత్ర స్థాయి సిబ్బంది ఇంటింటికీ తిరిగి పురుషులు, మహిళలతో పాటు థర్డ్ జెండర్ ఓటర్ల నమోదుకు తీవ్రంగా కృషి చేశారు.

నమోదుకు ఫారం–6, బదిలీకి ఫారం –8..

ముసాయిదా జాబితాతో పోలిస్తే తుది జాబితాలో ఓటర్లు పెరిగినా.. పోలింగ్ తేదీ నాటికి 18 ఏళ్లు దాటిన వారందరికీ మరో అవకాశం కల్పించాలని నిర్ణయించారు. ఇప్పటికే రిటర్నింగ్ అధికారులకు ఈ ప్రక్రియపై సూచనలు జారీ చేశారు. ఈనెల 31 వరకు బీఎల్ఓలు, సహాయ రిటర్నింగ్ అధికారుల ద్వారా ఫారం–6 పొంది కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించారు. ఓటరు జాబితాలో పేర్లు ఉండి ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన వారు తమ ఓటును ఆయా నియోజకవర్గాల్లో బదిలీ చేసుకునేందుకు ఫారం–8లో అవకాశం కల్పించారు. ఈ నెలాఖరు వరకు ఎన్నికల అధికారుల వద్ద సంబంధిత సమాచారం, సదరు ఫారాలు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. వీటిని ఆన్‌లైన్‌లో సమర్పించి ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. ఫారాలను జీహెచ్ఎంసీ కార్యాలయాలు, బీఎల్ఓల యాప్‌లో మీసేవా కేంద్రాల ద్వారా నమోదుకు అవకాశం ఉంది.

ఓటు తొలగిస్తే ఏం చేయాలి..?

30 ఏళ్లున్న వారు గతంలో ఏదైనా నియోజక వర్గంలో ఓటరుగా నమోదై ఉంటారు. ఇలాంటి వారిలో కొందరు ప్రస్తుతం మరో నియోజక వర్గంలో నివసిస్తుంటారు. వారు గతంలో ఓటువేసిన నియోజకవర్గంలో ఓటు తొలగించి ఉంటే తమ ఓటరు గుర్తింపు కార్డు చూపించి ప్రస్తుతం నివాసం ఉంటున్న నియోజకవర్గంలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఇందుకు ఫారం–6లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు.

జంగ్ తెలంగాణ 2023

ప్రజలకు ఉచిత విద్య, వైద్యం

దళిత బహుజన పార్టీ మేనిఫెస్టో విడుదల


మేనిఫెస్టోను విడుదల చేస్తున్న దృశ్యం

హిమాయత్‌నగర్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోను దళిత బహుజన పార్టీ (డీబీపీ) విడుదల చేసింది. ఈ మేరకు హిమాయత్‌నగర్‌లోని దళిత బహుజన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు క్రిష్ణ స్వరూప్ మాట్లాడుతూ.. దళిత సామాజిక వర్గం నుండి సీఎం పదవిని సాధించడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజలందరికీ విద్య, వైద్యం ఉచితంగా అందచేస్తామన్నారు. రాజ్యాంగాన్ని ఖచ్చితంగా అమలు చేస్తామని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సామాజిక వర్గాలకు జీవన ప్రమాణాలు, సామాజిక రంగాల్లో సోషల్ జస్టిస్ అమలు చేస్తామని స్పష్టం చేశారు.

◆ కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన, మహిళా మేధావుల హక్కులు అమలు చేస్తామని, వ్యవసాయం, పారిశ్రామిక, పర్యావరణ రంగాల అభివృద్ధే లక్ష్యమన్నారు.

◆ భూమిలేని పేదలందరికీ 2 ఎకరాల వ్యవసాయ భూమిని పంపిణీ చేయడంతో పాటు నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగకల్పన తదితర అంశాలు తమ పార్టీ మ్యానిఫెస్టోలో ఉన్నాయని వివరించారు. పార్టీ అసెంబ్లీ ఎన్నికల కమిటీ అధ్యక్షుడు డాక్టర్. వీ.ఎల్.రాజు, డిప్యూటీ చైర్మన్ జే.ఎన్.రాజు, కో–ఆర్డినేటర్స్ దేవునూరి శ్రీనివాస్, బీరం సతీష్‌కుమార్, ఎన్నికల కమిటీ సభ్యులు ఎండీ. హుస్సేన్, పల్లవి, సాంబయ్య వడ్డెర, నక్కా రాజేందర్‌రావు, గంధం శంకర్, మద్దెల ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

క్లుప్తంగా...

బాబాకు విశేష పూజలు



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12లోని విశ్వసాయి మందిరంలో కొలువుదీరిన శ్రీసాయి బాబా వారి మహాసమాధి ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. బాబావారి పుణ్యతిథిని పురస్కరించుకుని విశేష అభిషేకం నిర్వహించారు. అనంతరం బాబా దివ్య అలంకారాన్ని భక్తులు దర్శించుకున్నారు. ఈనెల 15న మహాసమాధి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

నియామకం

బంజారాహిల్స్: ఖైరతాబాద్ బీజేపీ ఎన్నికల క్యాంపెయిన్ ఇన్‌చార్జ్‌గా పంజాగుట్ట ప్రతాప్‌నగర్‌కు చెందిన పార్టీ సీనియర్ నేత గెల్లబోయిన శ్రవణ్‌కుమార్‌యాదవ్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖైరతాబాద్‌లో కాషాయ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా తమ ప్రచారం ఉంటుందని, క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రతి ఓటరును కలుసుకుంటామన్నారు. అవకాశం కల్పించిన అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

బంజారాహిల్స్: దసరా పండుగ సందర్భంగా జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ బస్తీల్లో గత కొన్నేళ్లుగా స్వచ్ఛత కోసం పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కాటూరి రమేష్ చీరలు పంపిణీ చేసి సూపర్‌వైజర్లను సన్మానించారు. పండుగ సందర్భంగా ప్రతి ఏటా పారిశుద్ధ్య కార్మికులకు కానుకలు పంపిణీ చేసి వారిని సత్కరించడం ఆనవాయితీగా వస్తుందని ఆయన వివరించారు.

రోహిణ్‌రెడ్డికి పండుగ శుభాకాంక్షలు


శుభాకాంక్షలు తెలుపుతున్న స్థానిక నేతలు

బంజారాహిల్స్: ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డికి దసరా పండుగను పురస్కరించుకొని ఖైరతాబాద్ నియోజకవర్గ నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే కాలనీలోని ఆయన నివాసంలో శుభాకాంక్షలు తెలిపారు. భారీ సంఖ్యలో హాజరైన కార్యకర్తలతో ఆయన నివాసం సందడి నెలకొంది.

మధురానగర్ పీఎస్ భేష్

వెంగళరావునగర్: మధురానగర్ పోలీస్ స్టేషన్ పనితీరును నగర కమిషనర్ మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా వెస్ట్ జోన్‌లో మధురానగర్ పోలీస్‌స్టేషన్ పనితీరు బాగుందని అభినందించారు. వివరాల ప్రకారం.. నగర పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య మంగళవారం మధురానగర్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇన్‌స్పెక్టర్ రూమ్‌లో కూర్చుని వివిధ రకాల ఫైల్స్‌పై ఆరా తీశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌ను వివిధ రకాల విషయాలు అడిగి తెలుసుకున్నారు. సీపీ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అక్రమంగా మద్యం సరఫరా, నగదు పంపిణీ, రవాణా తదితర విషయాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి అలజడులు లేకుండా నిరంతరం అన్ని బస్తీలు, కాలనీల్లో పహారా కాయాలని తెలియజేశారు.

రావణ దహనం

రహమత్‌నగర్: రావణదహన కార్యక్రమం బోరబండ, రహమత్‌నగర్ డివిజన్‌లలో సోమవారం రాత్రి కనుల పండువగా జరిగింది. ఎస్పీఆర్ హిల్స్ స్థానిక యువజన నాయకుడు వేముల జగన్ నేతృత్వంలో ఈ దహన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పాల్గొన్నారు. రహమత్‌నగర్ పోలీస్ అవుట్ పోస్టు వద్ద నవ్ నిర్మాణ్ సంస్థ వ్యవస్థాపకుడు నవీన్‌యాదవ్ ఆధ్వర్యంలో రావణదహనం వైభవంగా జరిగింది. చిన్నారుల వేషధారణ ఆకట్టుకుంది. చిన్న శ్రీశైలంయాదవ్, రమేష్ యాదవ్, వెంకట్‌యాదవ్ తదితరులున్నారు.

రావణదహన వేడుకల్లో విజయారెడ్డి



బంజారాహిల్స్: దసరా పర్వదినం సందర్భంగా బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 2లోని ఇందిరానగర్ కట్టమైసమ్మ దేవాలయ ఆవరణలో రావణ దహన వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా జరిగాయి. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి. విజయారెడ్డి కాంగ్రెస్ నేతలు మోహన్‌యాదవ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రావణదహనం వేడుకలను చూసేందుకు స్థానికులు పెద్దసంఖ్యలో రావడంతో ఇక్కడ జాతర వాతావరణం అలుముకుంది.

ఎమ్మెల్యేకు వినతి


వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల నేతలు

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర యువసేన అధ్యక్షుడు నల్ల శివమాదిగ ఆధ్వర్యంలో దళిత సంఘాల నేతలు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిసి విన్నవించారు. గృహలక్ష్మి, దళితబంధు, డబుల్ బెడ్రూంలతోపాటు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల కేటాయింపులో మాదిగలకు పథకాలు సరిగ్గా అందలేదని ఆరోపించారు. జనాభా దామాషా ప్రకారం ఉన్న దళిత వర్గాలకు ఈ పథకాలు సమపాళ్లలో కేటాయించలేదని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేను వారు కోరారు.

నిమ్స్‌లో అన్నదానం

లక్డీకాపూల్: చెడు మీద మంచి సాధించిన విజయానికి దసరా చిహ్నమని పలువురు వక్తలు అన్నారు. నిమ్స్ ఆసుపత్రిలో 4 రోజుల పాటు వైభవంగా దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు జరిగాయి. ఈ క్రమంలో నిమ్స్ సెక్యూరిటీ కార్యాలయంలో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగర బీరప్ప, మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణ, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్లు డాక్టర్ ఎన్. లక్ష్మీభాస్కర్, కేవీ.కృష్ణారెడ్డి తదితరులున్నారు. అనంతరం కూరపాటి లక్ష్మీనారాయణ సహకారంతో పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. సెక్యూరిటీ సిబ్బంది దసరా వేడుకలకు మ్యాన్‌పవర్ ఏజెన్సీ సంస్థల నిర్వాహకులు సీతారామయ్య, రవికిరణ్ తదితరులు చేయూతనందించారు.



సోమేష్‌కుమార్‌ను కలిసిన బీసీ నాయకులు


సన్మానిస్తున్న వి.కృష్ణమోహన్ తదితరులు

లిబర్టీ: సీఎం కేసీఆర్ ముఖ్య సలహాదారులు ఎం.సోమేష్‌కుమార్‌ను తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వి.కృష్ణమోహన్‌రావు, బీసీదళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్రు కుమారస్వామి మంగళవారం కలిశారు. విజయదశమి సందర్భంగా వారు సోమేష్‌కుమార్‌ను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపి ఆత్మీయ సత్కారం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జీహెచ్ఎంసీ కమిషనర్‌గా నగర రాష్ట్ర అభివృద్ధి కోసం సోమేష్‌కుమార్ ఎంతగానో కృషి చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆయన సేవలను తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి వినియోగించుకోవాలని సంకల్పంతో సీఎం చీఫ్ అడ్వైజర్‌గా సోమేష్‌కుమార్‌ను నియమించడం అభినందనీయమన్నారు. రాష్ట్రాభివృద్ధికి ప్రజా సంక్షేమం కోసం తాను నిరంతరం కృషి చేస్తానని సోమేష్ వారికి హామీ ఇచ్చారు.

'మన ఓట్లు మన సీట్లు' నినాదంతో ముందుకెళ్తున్నాం



లిబర్టీ: మన ఓటు మన సీట్లు అన్న నినాదంతో దళిత బహుజనులను చట్టసభల్లోకి పంపాలని బహుజన లెఫ్ట్‌ఫ్రంట్ తెలంగాణ రాష్ట్ర శాఖ చైర్మన్ నల్ల సూర్యప్రకాష్ కోరారు. విడిపోతే పడిపోతాం కలిసి ఉంటే రాజ్యాధికారం సాధించవచ్చని ఆయన నొక్కి చెప్పారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆలోచన విధానంతో గౌతమ బుద్ధిని తాత్విక వెలుగులో బహుజన సమతా రాజ్యాన్ని నిర్మించాల్సిన అవశ్యకత ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు సంఘటితమై ఎన్నికల్లో గెలిపించాలన్నారు. ఎంసీపీఐ నాయకులు ఎం.మార్టిన్ మాట్లాడుతూ.. దళిత బహుజనులు ఐక్యంగా ఉండి బీఎల్ఎఫ్ అభ్యర్థుల విజయం కోసం పనిచేయాలని సూచించారు. ప్రస్తుతం కీలకంగా మారిన ఎన్నికల నేపథ్యంలో విజయం తీరాలకు చేరాల్సిన అవసరం ఉందన్నారు.

బహుజనులు రాజ్యాధికారంలోకి రావాలి

లిబర్టీ: అంబేడ్కర్ ఆలోచన విధానంతో గౌతమ బుద్ధుని తాత్విక వెలుగులో దళిత బహుజన రాజ్యాన్ని నిర్మిస్తామని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వి.కృష్ణస్వరూప్ అన్నారు. సమతా రాజ్యాంగ నిర్మాణం కావాలంటే దళిత బహుజనులను చట్ట సభల్లోకి పంపాల్సిన అవసరం ఉందన్నారు. డబ్బు, మద్యం, దళిత బహుజనులు అమ్ముడుపోకుండా 'ఓట్లు మావే సీట్లు మావే' అన్న నినాదంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

వెంగళరావునగర్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. యూసుఫ్‌గూడ సమీపంలోని వివిధ ప్రాంతాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఆయా ప్రాంతాల్లో దాడులు నిర్వహించగా.. యూసుఫ్‌గూడ సమీపంలోని పోచమ్మ దేవాలయం వద్ద చర్లపల్లి ఎల్లమ్మ అనే మహిళ మద్యం విక్రయిస్తున్నట్లుగా గుర్తించారు. దీంతో ఆమెను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద ఉన్న 40 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

శుభాకాంక్షల వెల్లువ

బంజారాహిల్స్: దసరా పండుగ సందర్భంగా ఖైరతాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఫిలింనగర్‌లోని పద్మాలయ అంబేడ్కర్‌నగర్ బస్తీలో మహిళలతో కలిసి దాండియా కోలాటాలు ఆడి సందడి చేశారు. ఆయనకు బస్తీవాసులు ఘన స్వాగతం పలికారు. ఆటపాటలతో ఆయన గంటపాటు స్థానికులతో గడిపారు.


ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

ఎమ్మెల్యే మాగంటికి శుభాకాంక్షలు

వెంగళరావునగర్: మధురానగర్‌కాలనీ నిరంతరం అభివృద్ధి చెందడానికి ఎంతో కృషి చేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు రుణపడి ఉంటామని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు పేర్కొన్నారు. దసరా సందర్భంగా వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు మంగళవారం ఎమ్మెల్యే మాగంటిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడె సాంబశివరావు, కళ్యాణ చక్రవర్తి, కోశాధికారి ఉప్పలయ్య, శ్రీనివాసరాజు, అంబటి రామకృష్ణ తదితరులున్నారు.

దత్తాత్రేయకు శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ నేతలు..

వెంగళరావునగర్: కేంద్ర మాజీ మంత్రి, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయను దసరా సందర్భంగా యూసుఫ్‌గూడకు చెందిన పలువురు బీజేపీ నేతలు ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జ్ఞానేశ్వర్, పులిరామ్, బడుగు సతీష్, ఈ.రాజేష్, నాగార్జున తదితరులున్నారు.


దసరా వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దానం


దత్తాత్రేయకు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

సీపీఎం నేతకు ఘన నివాళి



వెంగళరావునగర్: కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహావ్యక్తి ఎస్.వి.భాస్కరరావు అని పలువురు సీపీఎం నేతలు కొనియాడారు. సీపీఎం హైదరాబాద్ జిల్లా ప్రథమ కార్యదర్శి భాస్కరరావు 39వ వర్ధంతి వేడుకలు మంగళవారం మధురానగర్‌కాలనీలోని వెల్లంకి ఫుడ్స్ వద్ద ఘనంగా నిర్వహించారు. సీపీఎం నేతలు సీ.హెచ్.చంద్రశేఖర్‌రావు, నాగేశ్వరరావు, దండు సత్యనారాయణ, విజయవాణి, రాపర్తి అశోక్, సోమేష్, ఆసిఫ్, ముత్తయ్య, కృష్ణ, ప్రసాద్, వెంగళరెడ్డి, రవీంద్రబాబు, జితిన్, మల్లికార్జుననాయుడు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ పెద్దమ్మ ఆలయం.. భక్తులతో కిటకిట !


జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి


అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం, మంగళవారం ఆలయానికి భక్తులు పోటెత్తగా.. మంగళవారం ఆలయ పరిసరాలన్నీ భక్తజన సందోహంతో కిటకిటలాడాయి. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు.

పర్వతవర్ధినీ దేవి..

జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 18లోని సీతారామస్వామి దేవాలయంలో కొలువుదీరిన పర్వతవర్ధినీ దేవి అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

దైవసన్నిధానంలో..

ఫిల్మ్‌నగర్ దైవసన్నిధానంలో కొలువుదీరిన రాజరాజేశ్వరీ అమ్మవారిని దర్శించుకున్న భక్తులు అనంతరం సప్తవిధ పుష్పార్చన, శమిపూజ వైభవంగా నిర్వహించారు.

బ్యానర్ల ఏర్పాటుపై ఫిర్యాదు

రహమత్‌నగర్: రహమత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్‌హిల్స్‌లో ఇటీవల జరిగిన పాదయాత్రలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి వారి అనుచరులు ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జీవీజీ నాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా పార్టీ బ్యానర్లు, జెండాలు బస్తీల్లో ఏర్పాటు చేశారని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికార పార్టీ ఎన్నికల నిబంధనలను తుంగలోకి తొక్కి తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు బోరబండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం కార్నర్..

లింక్ ఓపెన్ చేయగానే నగదు మాయం

వెంగళరావునగర్: లింక్ ఓపెన్ చేయాలని చెప్పి ఆన్‌లైన్‌లో ఓ మహిళ నుంచి డబ్బు కాజేసిన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఓ ప్రాంతానికి చెందిన కొత్తపల్లి ఉమారాణి అనే మహిళకు గత రెండు రోజుల క్రితం ఓ నెంబర్ నుంచి కాల్ వచ్చింది. తాము ఒక లింగ్ పంపుతున్నామని, దానిని ఓపెన్ చేస్తే క్యాష్ రివార్డు పాయింట్స్ వస్తాయని, వాటిని నగదుగా మార్చుకోవచ్చని తెలియజేశారు. దీంతో ఆమె వారు పంపిన లింక్‌ను ఓపెన్ చేసి చూసింది. వెంటనే తన ఐసీఐసీఐ క్రెడిట్‌కార్డు నుంచి రూ.89,142లు డెబిట్ అయ్యాయి. మోసపోయానని గ్రహించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

అకారణంగా యువకుడిపై దాడి

వెంగళరావునగర్: అకారణంగా యువకుడిపై నలుగురు వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహమత్‌నగర్ డివిజన్ కార్మికనగర్‌కు చెందిన మహ్మద్ కుతుబుద్దీన్ ఓ టెంట్‌హౌస్‌లో పనిచేస్తున్నాడు. అతడికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి తన పేరు అజీజ్ అని తనతో మాట్లాడాలని ఇంటి నుంచి బయటకు రావాలని కోరారు. దీంతో అతడు బయటకు రాకపోవడంతో తీవ్రంగా దుర్భాషలాడాడు. అనంతరం కుటుంబ సభ్యులను కూడా తిడుతూ మర్యాదగా రావాలని బెదిరించాడు. దీంతో సదరు యువకుడు బయటకు రాగా.. వాహనంపై ఎక్కించుకుని కార్మికనగర్ ఆటోస్టాండ్ వద్దకు తీసుకెళ్లాడు. అప్పటికే అక్కడ ఉన్న మరో నలుగురు కలిసి కుత్బుద్దీన్‌పై దాడికి పాల్పడగా.. తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి స్నేహితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు ఘటనా స్థలానికి చేరుకోగానే నిందితులు పారి పోయారు. ఈ మేరకు మధురానగర్ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోడ్రైవర్‌పై..

వెంగళరావునగర్: ఆటో డ్రైవర్‌పై అకారణంగా దాడికి పాల్పడిన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్‌కు చెందిన మేకల పరమేష్ గత కొంతకాలంగా రహమత్‌నగర్ డివిజన్ ఓంనగర్‌లో నివాసం ఉంటూ.. ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి దాదాపు 11 గంటల సమయంలో తన స్నేహితుడి ఇంటికి వెళ్లి తిరిగి తన నివాసానికి నడుచుకుంటూ వస్తున్నాడు. ఈ క్రమంలో ఓంనగర్‌లోని కన్నడ చర్చి వద్దకు రాగానే అక్కడే నిలుచున్న కొంతమంది వ్యక్తులు పరమేష్‌ను పిలిచారు. తాను వెళ్లకపోవడంతో బూతులు తిట్టడంతో ప్రశ్నించగా దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

పాలపాకెట్ కోసం వెళ్లి మహిళ అదృశ్యం

వెంగళరావునగర్: పాలపాకెట్ తీసుకొస్తానని చెప్పి మహిళ అదృశ్యమైన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరి శివ కళ్యాణ్‌నగర్‌లో నివాసం ఉంటూ సినిమాల్లో అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. ఈనెల 18న తన చిన్నమ్మ జి.పెద్దారి రాజమండ్రి నుంచి నగరానికి వచ్చింది. మూడ్రోజుల పాటు తన వద్దనే ఉండి పండుగను ఆచరించారు. మంగళవారం ఉదయం 9 గంటలకు పాలపాకెట్ తీసుకొస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకొచ్చి తిరిగి రాలేదు. దీంతో ఆమె కోసం పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీజకు రజతం... స్నేహిత్‌కు కాంస్యం



జాతీయ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు చెందిన ఆకుల శ్రీజ మహిళల సింగిల్స్‌లో రజతం, పురుషుల సింగిల్స్‌లో సూరావజ్జుల స్నేహిత్ కాంస్య పతకం సాధించారు. తిరువనంతపురంలో జరిగిన సింగిల్స్ ఫైనల్లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీజ 8-11, 11-5, 5-11, 9-11, 12-14తో దియా చిటాలె (ఆర్‌బీఐ) చేతిలో ఓటమి చవిచూసింది. సెమీఫైనల్లో స్నేహిత్ 7-11, 11-3, 15-13, 4-11, 10-12, 13-11, 7-11తో మానవ్ ఠక్కర్ (పీఎస్‌పీబీ) చేతిలో పోరాడి ఓడిపోయాడు

వెర్‌స్టాపెన్ ఖాతాలో 15వ విజయం



ఫార్ములావన్-2023 సీజన్‌లో రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ 15వ విజయాన్ని అందుకున్నాడు. టెక్సస్‌లో జరిగిన యునైటెడ్ స్టేట్స్ (యూఎస్) గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. 'పోల్ పొజిషన్'తో రేసును ఆరంభించిన వెర్‌స్టాపెన్ నిర్ణీత 56 ల్యాప్‌లను అందరికంటే వేగంగా 1 గంట 35 నిమిషాల 21.362 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. వెర్‌స్టాపెన్ కెరీర్‌లో ఇది 50వ విజయం.



దివికేగిన దిగ్గజం

భారత స్పిన్ లెజెండ్ బిషన్ సింగ్ బేడీ కన్నుమూత



- పుష్కరకాలంపాటు వెలుగు వెలిగిన అలనాటి మేటి స్పిన్నర్
- ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా గుర్తింపు

టి20 క్రికెట్ మాయలో పడి, సత్తా ఉన్నా... ఐదు రోజుల ఆటకు బైబై చెప్పేసి... జస్ట్ నాలుగు ఓవర్లేసే లీగ్‌లకు జైకొట్టే బౌలర్లున్న ఈ రోజుల్లో సంప్రదాయ టెస్టులకే సర్వం ధారపోసిన స్పిన్నర్ బిషన్‌సింగ్ బేడీ. ఆయన మునివేళ్లతో బంతిని సంధిస్తే వికెట్. ఆయన స్పిన్ ఉచ్చు బిగిస్తే ప్రత్యర్థి ఆలౌట్. అంతలా... భారత క్రికెట్‌లో తన స్పిన్‌తో వికెట్లను దున్నేసిన దిగ్గజం బేడీ. ఎరాపల్లి ప్రసన్న, భగవత్ చంద్రశేఖర్‌లతో కలిసి దుర్భేద్యమైన స్పిన్ త్రయంగా ప్రత్యర్థి జట్లను విలవిలలాడించాడు. ఈ త్రయానికి తర్వాత శ్రీనివాస్ వెంకటరాఘవన్ జతయ్యాక బ్యాటర్లకు చిక్కులు, చుక్కలే కనిపించేవంటే అతిశయోక్తి కాదు. క్రికెట్ జగాన్ని స్పిన్ మాయాజాలంతో ఊపేసిన బిషన్ సింగ్ ఆఖరి శ్వాస విడిచి దివికేగాడు. భారత క్రికెట్‌ను కన్నీట ముంచాడు.

న్యూఢిల్లీ: భారత క్రికెట్‌లో స్పిన్‌కే వన్నెలద్దిన బౌలింగ్ దిగ్గజం బిషన్ సింగ్ బేడీ సోమవారం ఢిల్లీలో తుదిశ్వాస విడిచారు. స్పిన్ శకాన్ని శోకసంద్రంలో ముంచి తిరిగిరాని లోకాలకు వెళ్లారు. ఆయన వయస్సు 77 ఏళ్లు. గత రెండేళ్లుగా తీవ్ర అనారోగ్యంతో సతమతమవుతున్నారు. పలు శస్త్రచికిత్సలు కూడా జరిగాయి. నెల క్రితం మోకాలు ఆపరేషన్ జరిగింది. అనారోగ్యంతో సుదీర్ఘకాలంగా పోరాడుతున్న ఆయన సోమవారం ఉదయం తన నివాసంలో కన్నుమూశారు. మోకాలు శస్త్రచికిత్స అనంతరం సోకిన ఇన్ఫెక్షన్ క్రమంగా పెరగడంతోనే మృతి చెందినట్లు ఆయన సన్నిహితుడొకరు వెల్లడించారు. ఈ పంజాబీ క్రికెట్ స్టార్ 1946లో సెప్టెంబర్ 25న అమృత్‌సర్‌లో జన్మించారు. తదనంతరం క్రికెట్‌లో చెరగని ముద్ర వేసి ఢిల్లీలో సెటిలయ్యారు. ఆయనకు భార్య అంజు, కుమారుడు అంగద్ బేడీ (సినీనటుడు) ఉన్నారు. అంగద్ భార్య నేహ ధూపియా బాలీవుడ్ హీరోయిన్. మొదటి భార్య గ్లెనిత్ మైల్స్ ద్వారా ఇద్దరు సంతానం కొడుకు గావసిందర్, కుమార్తె గిలిందర్ ఉన్నారు. స్పిన్నర్లు ఉపఖండానికే పరిమితమనే విమర్శల్ని తన స్పిన్ మంత్రతో విదేశీ గడ్డపై తిప్పికొట్టిన ఘనత బిషన్ సింగ్‌ది. తన కెరీర్ అనంతరం కూడా క్రికెట్‌తో అనుబంధాన్ని కొనసాగించారు. ఢిల్లీ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ)కు విశేష సేవలందించారు. విరాట్ కోహ్లి సహా ఎంతో మంది కుర్రాళ్లకు ఫిట్‌నెస్ గురించి పూర్తిస్థాయి అవగాహన కల్పించారు. కోహ్లి తను ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడానికి బేడీనే కారణమని పలు సందర్భాల్లో చెప్పాడు.

ఇదీ చరిత్ర...

సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్, సౌరవ్ గంగూలీ, విరాట్ కోహ్లి లాంటి బ్యాటర్లు అసలైన క్రికెట్ టెస్టు ఫార్మాటేనని ఘంటాపథంగా చెప్పే సంప్రదాయ క్రికెట్‌లో స్పిన్నర్‌గా బేడీ ఓ వెలుగు వెలిగాడు. ఈ తరం క్రికెటర్లు మెరుపుల టి20లకు అలవాటు పడి టెస్టు క్రికెట్‌ను పక్కన బెడుతున్నారు. మరి బిషన్ సింగ్ ఐదు రోజుల టెస్టుల్లో, నాలుగు రోజుల ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో సుదీర్ఘకాలం దేశానికి, రాష్ట్రానికి సేవలందించాడు. 1967 నుంచి 1979 వరకు తన అంతర్జాతీయ కెరీర్‌లో 67 టెస్టులాడిన స్పిన్ లెజెండ్ 266 వికెట్లను పడగొట్టాడు. ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు 14 సార్లు తీశాడు. ఉత్తమ ప్రదర్శన 7/98. ఇక 370 ఫస్ట్‌క్లాస్ క్రికెట్లో 1,560 వికెట్లను చేజిక్కించుకున్నాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా బిషన్ సింగ్ పేరిటే ఇంకా రికార్డు ఉండటం విశేషం. ఫస్ట్‌క్లాస్ ఫార్మాట్‌లో బిషన్ ఇన్నింగ్స్‌లో 5 వికెట్లను ఏకంగా 106 సార్లు పడగొట్టారు. మ్యాచ్‌లో 10 వికెట్లను 20 సార్లు తీశాడు. ఉత్తమ ప్రదర్శన 7/5. వన్డే ఫార్మాట్‌లో తక్కువగా 10 మ్యాచ్‌లే ఆడాడు. 7 వికెట్లు తీశాడు. 1975 తొలి వన్డే వరల్డ్‌కప్‌లో, 1979 రెండో వన్డే వరల్డ్‌కప్‌లో బేడీ భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. 1975 వరల్డ్‌కప్‌లో ఈస్ట్ ఆఫ్రికాతో జరిగిన తొలి మ్యాచ్‌లో బిషన్ 12 ఓవర్లు వేసి 8 మెయిడెన్లు తీసుకొని కేవలం 6 పరుగులిచ్చి 1 వికెట్ తీశాడు. అంతేకాదు...'బేడీ సాబ్' విజయవంతమైన సారథి కూడా! 22 టెస్టులకు నాయకత్వం వహించి 6 మ్యాచ్‌ల్లో భారత్‌ను గెలిపించాడు. ఇందులో మూడైతే విదేశీ గడ్డపై సాధించిన ఘనవిజయాలున్నాయి. బేడీ కెప్టెన్సీలోనే భారత జట్టు 1976లో పోర్ట్ ఆఫ్ స్పెయిన్‌లో వెస్టిండీస్‌తో జరిగిన టెస్టులో 403 పరుగుల రికార్డు లక్ష్యాన్ని ఛేదించింది. ఈ రికార్డు 27 ఏళ్ల పాటు (2003 వరకు) చరిత్ర పుటల్లో నిలిచింది. 1970లో కేంద్ర ప్రభుత్వం నుంచి 'పద్మశ్రీ' పురస్కారం అందుకున్న బిషన్ సింగ్‌ను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) 2004లో 'సీకే నాయుడు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డుతో సత్కరించింది.

ఇదీ ఘనత...

ఈ భారత స్లో లెఫ్టార్మ్ స్పిన్నర్ అంటే అరివీర ఆజానుబాహులైన విండీస్ బ్యాటర్లకు వణుకే! ముఖ్యంగా 1970వ దశకంలో ప్రపంచ క్రికెట్‌ను తన స్పిన్‌తో శాసించాడు. 1969–70 సీజన్‌లో భారత్, ఆస్ట్రేలియాల మధ్య జరిగిన ముఖాముఖి టెస్టు సిరీస్‌లో 20.57 సగటుతో 21 వికెట్లు పడగొట్టాడు. 1972–73 సీజన్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన ద్వైపాక్షిక సిరీస్‌లో 25.28 సగటుతో 25 వికెట్లు తీశాడు. ప్రత్యర్థి బౌలర్ల పాలిట సింహస్వప్నమయ్యే వెస్టిండీస్ బ్యాటర్లను వారి సొంతగడ్డపై గడగడలాడించిన బౌలర్ ఎవరైన ఉన్నారంటే అది బేడీనే! 1975–76 సీజన్‌లో 25.33 సగటుతో 18 వికెట్లు చేజిక్కించుకున్నాడు. ఆ మరుసటి సీజన్‌లో న్యూజిలాండ్‌ను తిప్పేసి 13.18 సగటుతో 22 వికెట్లు పడగొట్టాడు. ఈ 1976–77 సీజన్‌లోనే ఇంగ్లండ్ మెడకు స్పిన్ ఉచ్చు బిగించి 25 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. 1977–78 సీజన్‌లో ఈసారి ఆస్ట్రేలియా పనిపట్టాడు. 23.87 సగటులో 31 వికెట్లు తీశాడు.

అరుణ్ జైట్లీ పేరుపెడితే నొచ్చుకున్నారు!

ఢిల్లీలోని ఫిరోజ్ షా కోట్లా మైదానంలోని స్టాండ్‌కు బిషన్ సింగ్ బేడీ పేరు పెట్టారు. అయితే మాజీ కేంద్ర మంత్రి, బీజేపీ అగ్రనేత అరుణ్ జైట్లీ మృతి అనంతరం ఆ స్టేడియానికి జైట్లీ పేరు పెట్టడాన్ని తీవ్రస్థాయిలో తప్పుబట్టారు. క్రికెటేతరుడి పేరు పెట్టడాన్ని సహించలేక స్టాండ్‌కు తన పేరు తొలగించాలని బహిరంగంగా డిమాండ్ చేశారు.



ఫ్యాబులస్ ఫోర్: చంద్రశేఖర్, బిషన్‌సింగ్, ప్రసన్న, వెంకటరాఘవన్ (ఫైల్)



బేడీకి కోహ్లి పాదాభివందనం(ఫైల్)

భారత క్రికెట్‌పై చెరగని ముద్ర

బిషన్ సింగ్ మరణ వార్తను తట్టుకోలేకపోయా. స్పిన్‌పై ఆయనకున్న పట్టు, ఆటపై కనబరిచే పట్టుదల అసాధారణం. భావి క్రికెటర్లకు, భవిష్యత్ తరాలకు అతని అంకితభావం స్ఫూర్తిదాయకం. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలి. ఓం శాంతి.
–ప్రధాని నరేంద్ర మోదీ

బేడీ మృతిపట్ల విచారం వ్యక్తం చేస్తున్నా. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాను. –ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అలర్డైస్

స్పిన్ బౌలింగ్‌తో క్రికెట్ పుటల్లోకెక్కారు. భారత క్రికెట్‌లో స్పిన్‌కు మూలస్తంభంలా ఉన్నారు. అలాంటి దిగ్గజం మనమధ్య లేకపోవడం బాధాకరం.
–బీసీసీఐ కార్యదర్శి జై షా

బేడీ మార్గదర్శనం వల్లే ఇంగ్లండ్‌లో నా తొలి శతకం సాకారమైంది. అలాంటి లెజెండ్ ఇప్పుడు లేకపోవడం బాధాకరం.
–బ్యాటింగ్ దిగ్గజం సచిన్

స్పిన్నర్లందరికి ఆయనే స్ఫూర్తి. యువతరానికి దిక్సూచి. బిషన్‌సింగ్ ఆత్మకు శాంతి చేకూరాలి. ఆయన కుటుంబానికి నా సానుభూతి.
–మాజీ స్పిన్నర్ అనిల్ కుంబ్లే

బిషన్ సింగ్ లేరన్న వార్త జీర్ణించుకోలేనిది. భారత క్రికెట్‌కోసం ఎంతో చేశారు. ఆయన కుటుంబానికి దేవుడు స్థయిర్యాన్ని ఇవ్వాలి.
–మాజీ ఓపెనర్ గంభీర్

చాలా బాధగా ఉంది. ముమ్మాటికీ బిషన్‌సింగ్ గ్రేటెస్ట్ క్రికెటర్. యువ క్రికెటర్లు ఎదిగేందుకు ఎంతో పాటుపడ్డారు.
–సీనియర్ స్పిన్నర్ అశ్విన్

బేడీ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్న, ఆయన మృతికి సంతాపం తెలుపుతున్నాను.
–మాజీ కెప్టెన్ అజహరుద్దీన్



అంత్యక్రియలకు హాజరైన కపిల్, సెహ్వాగ్

'సర్దార్ ఆఫ్ స్పిన్' బిషన్ సింగ్ బేడీ పార్థివ దేహానికి 1983 ప్రపంచకప్ కెప్టెన్, దిగ్గజ ఆల్‌రౌండర్ కపిల్ దేవ్, 2011 ప్రపంచకప్ విజేత సభ్యుడు సెహ్వాగ్ తదితర మేటి, మాజీ క్రికెటర్లు నివాళులర్పించారు. స్థానిక లోధి స్మశానవాటికలో మంగళవారం నిర్వహించిన అంత్యక్రియలకు కీర్తి ఆజాద్, మదన్‌లాల్, నెహ్రా, అజయ్ జడేజా, మురళీ కార్తీక్, జహీర్, అజహరుద్దీన్ తదితర క్రికెటర్లు హాజరయ్యారు. కడసారి వీడ్కోలు పలికేందుకు వచ్చిన అభిమానులు, జూనియర్ క్రికెటర్ల అశ్రునయనాల మధ్య పంజాబీ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు జరిగాయి.

దీప్తి 'పసిడి' పరుగు

ఆసియా పారా క్రీడల్లో స్వర్ణం నెగ్గిన తెలంగాణ అథ్లెట్



హాంగ్జౌ: ఆసియా పారా క్రీడల్లో రెండో రోజు భారత క్రీడాకారులు తమ పతకాల వేట కొనసాగించారు. తొలి రోజు సోమవారం 17 పతకాలు నెగ్గిన భారత ప్లేయర్లు... రెండో రోజు మంగళవారం ఏకంగా 18 పతకాలతో అదరగొట్టారు. ఇందులో నాలుగు స్వర్ణ పతకాలు ఉన్నాయి. భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ అమ్మాయి జీవంజి దీప్తి మహిళల 400 మీటర్ల టి20 కేటగిరీలో పసిడి పతకాన్ని సాధించింది. వరంగల్ జిల్లాలోని కల్లెడ గ్రామానికి చెందిన దీప్తి అందరికంటే వేగంగా 400 మీటర్ల దూరాన్ని 56.69 సెకన్లలో పూర్తి చేసి ఆసియా పారా గేమ్స్‌తోపాటు ఆసియా రికార్డును సృష్టించింది. మహిళల కనోయింగ్ ఎల్2 ఈవెంట్‌లో ప్రాచీ యాదవ్ 500 మీటర్ల దూరాన్ని 54.962 సెకన్లలో అధిగమించి భారత్‌కు స్వర్ణ పతకాన్ని అందించింది. పురుషుల డిస్కస్ త్రో (ఎఫ్54/55/56) కేటగిరీలో నీరజ్ యాదవ్ డిస్క్‌ను 38.56 మీటర్ల దూరాన్ని విసిరి విజేతగా నిలిచి పసిడి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. పురుషుల 5000 మీటర్ల (టి13 కేటగిరీ) విభాగంలో శరత్ శంకరప్ప 20ని:18.90 సెకన్లలో రేసును ముగించి బంగారు పతకాన్ని గెల్చుకున్నాడు. రెండో రోజుల పోటీలు ముగిశాక భారత్ 10 స్వర్ణాలు, 12 రజతాలు, 13 కాంస్యాలతో కలిపి మొత్తం 35 పతకాలతో నాలుగో స్థానంలో ఉంది.

గౌస్‌-పూజ జోడీకి స్వర్ణం



షేక్ గౌస్ / పూజ / తరుణ్ / మేఘన రెడ్డి

సాక్షి, అమరావతి: జాతీయ క్రీడల్లో భాగంగా బ్యాడ్మింటన్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు స్వర్ణ పతకం లభించింది. గోవాలో జరుగుతున్న ఈ క్రీడల్లో మంగళవారం ముగిసిన మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో షేక్ గౌస్–పూజ (ఆంధ్రప్రదేశ్) జోడీ విజేతగా నిలిచి పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. ఫైనల్లో షేక్ గౌస్–పూజ ద్వయం 21–8, 21–17తో బొక్కా నవనీత్–కె.మనీషా (తెలంగాణ) జంటను ఓడించింది. ఫైనల్లో ఓడిన నవనీత్–మనీషా జోడీకి రజతం దక్కింది.

తరుణ్‌కు పసిడి పతకం

సింగిల్స్ విభాగంలో తెలంగాణకు రెండు పతకాలు దక్కాయి. పురుషుల సింగిల్స్ విభాగంలో మన్నేపల్లి తరుణ్ స్వర్ణ పతకాన్ని, మహిళల సింగిల్స్‌లో మారెడ్డి మేఘన రెడ్డి కాంస్య పతకాన్ని గెల్చుకున్నారు. ఫైనల్లో తరుణ్ 21–15, 16–21, 21–15తో సౌరభ్ వర్మ (మధ్యప్రదేశ్)పై నెగ్గగా... సెమీఫైనల్లో మేఘన రెడ్డి 21–7, 22–24, 16–21తో అదితి భట్ (ఉత్తరాఖండ్) చేతిలో ఓడిపోయింది. సౌరభ్ వర్మతో 70 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో నిర్ణాయక చివరి గేమ్‌లో తరుణ్ స్కోరు 15–15 వద్ద వరుసగా ఆరు పాయింట్లు గెలిచి గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. సెమీఫైనల్లో తరుణ్ 12–21, 21–14, 22–20తో జాతీయ చాంపియన్ మిథున్ (కర్ణాటక)ను ఓడించడం విశేషం.

సరబ్‌జోత్‌కు కాంస్య పతకం



చాంగ్వాన్ (దక్షిణ కొరియా): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ పతకాల బోణీ చేసింది. మంగళవారం జరిగిన పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో భారత షూటర్ సరబ్‌జోత్ సింగ్ కాంస్య పతకం సాధించాడు. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో సరబ్‌జోత్ 221.1 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచాడు. సరబ్‌జోత్ కాంస్య పతక ప్రదర్శనతో భారత్‌కు షూటింగ్ క్రీడాంశంలో ఎనిమిదో ఒలింపిక్ బెర్త్ ఖరారైంది. అంతకుముందు క్వాలిఫయింగ్ సరబ్‌జోత్ 581 పాయింట్లు స్కోరు చేసి ఎనిమిదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించాడు. ఇప్పటి వరకు భారత్ నుంచి పారిస్ ఒలింపిక్స్‌కు రుద్రాంక్ష్ పాటిల్ (పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్), స్వప్నిల్, అఖిల్ షెరాన్ (పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్), భౌనీష్ మెండిరట్టా (పురుషుల ట్రాప్), మెహులీ ఘోష్ (మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్), సిఫ్ట్ కౌర్ (మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్), రాజేశ్వరి కుమారి (మహిళల ట్రాప్) అర్హత పొందారు. మరోవైపు మహిళల జూనియర్ విభాగం 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత్‌కు చెందిన సంయమ్ 240.6 పాయింట్లు స్కోరు చేసి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది.

శ్రమించి నెగ్గిన సింధు



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ పీవీ సింధు శుభారంభం చేసి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 10వ ర్యాంకర్ సింధు 69 నిమిషాల్లో 12–21, 21–18, 21–15తో ప్రపంచ 7వ ర్యాంకర్ గ్రెగోరియా మరిస్కా టున్‌జంగ్ (ఇండోనేసియా)పై కష్టపడి గెలిచింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం 21–13, 21–13తో లుకాస్ కోర్వీ–రొనన్ లాబర్ (ఫ్రాన్స్) జంటను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది.

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా X నెదర్లాండ్స్
వేదిక: న్యూఢిల్లీ

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	5	5	0	10	1.353
దక్షిణాఫ్రికా	5	4	1	8	2.370
న్యూజిలాండ్	5	4	1	8	1.481
ఆస్ట్రేలియా	4	2	2	4	-0.193
పాకిస్తాన్	5	2	3	4	-0.400
అఫ్గానిస్తాన్	5	2	3	4	-0.969
నెదర్లాండ్స్	4	1	3	2	-0.790
శ్రీలంక	4	1	3	2	-1.048
ఇంగ్లండ్	4	1	3	2	-1.248
బంగ్లాదేశ్	5	1	4	2	-1.253

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

తిలక్ వర్మ సెంచరీ వృథా


బరోడా చేతిలో హైదరాబాద్ పరాజయం



జైపూర్: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ జోరుకు బ్రేక్ పడింది. వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో గెలిచి దూసుకెళ్తున్న హైదరాబాద్‌కు తొలి పరాజయం ఎదురైంది. బరోడా జట్టుతో జరిగిన గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ ఆరు వికెట్ల తేడాతో ఓడిపోయింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 186 పరుగులు చేసింది. కెప్టెన్ తిలక్ వర్మ (69 బంతుల్లో 121 నాటౌట్; 16 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగి అజేయ సెంచరీతో అలరించాడు. అనంతరం బరోడా జట్టు 18.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 187 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. 49 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన బరోడా జట్టును కెప్టెన్ కృనాల్ పాండ్యా (36 బంతుల్లో 64 నాటౌట్; 8 ఫోర్లు, 1 సిక్స్), విష్ణు సోలంకి (37 బంతుల్లో 71 నాటౌట్; 3 ఫోర్లు, 6 సిక్స్‌లు) అజేయ అర్ధ సెంచరీలతో గెలిపించారు.

దక్షిణాఫ్రికా ధమాకా

- బంగ్లాదేశ్‌పై 149 పరుగులతో గెలుపు
- డికాక్ భారీ శతకం
- మహ్మదుల్లా సెంచరీ వృథా



డికాక్

ముంబై: సమష్టి ప్రదర్శనతో దక్షిణాఫ్రికా జట్టు వన్డే వరల్డ్‌కప్‌లో నాలుగో విజయాన్ని సాధించింది. బంగ్లాదేశ్‌తో మంగళవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 149 పరుగులతో గెలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లకు 382 పరుగులు సాధించింది. ఓపెనర్ క్వింటన్ డికాక్ (140 బంతుల్లో 174; 15 ఫోర్లు, 7 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగి ఈ టోర్నీలో మూడో సెంచరీని నమోదు చేశాడు. తాత్కాలిక కెప్టెన్ మార్క్‌రమ్ (69 బంతుల్లో 60; 7 ఫోర్లు) అర్ధ సెంచరీ చేయగా... క్లాసెన్ (49 బంతుల్లో 90; 2 ఫోర్లు, 8 సిక్స్‌లు), డేవిడ్ మిల్లర్ (15 బంతుల్లో 34 నాటౌట్; 1 ఫోర్, 4 సిక్స్‌లు) మెరిపించారు. 383 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్ 46.4 ఓవర్లలో 233 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. ఈ టోర్నీలో బంగ్లాదేశ్‌కిది నాలుగో పరాజయం. మహ్మదుల్లా (111 బంతుల్లో 111; 11 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీతో ఒంటరి పోరాటం చేశాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో మార్కో జాన్సెన్ (2/39), లిజాడ్ విలియమ్స్ (2/56), కొట్జీ (3/62), రబడ (2/42), కేశవ మహరాజ్ (1/32) రాణించారు.

అఫ్గాన్ గర్జన

పాకిస్తాన్‌పై 8 వికెట్లతో సంచలన విజయం



చెన్నై: వన్డే వరల్డ్‌కప్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను కంగుతినిపించిన అఫ్గానిస్తాన్ పట్టుదల ముందు మాజీ చాంపియన్ పాకిస్తాన్ చిత్తయ్యింది. సోమవారం స్పిన్ ట్రాక్ చెపాక్ మైదానంలో జరిగిన ఈ భారీస్కోర్ల మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ 8 వికెట్ల తేడాతో పాక్‌పై జయభేరి మోగించింది. టాస్ నెగ్గి ముందుగా బ్యాటింగ్ చేపట్టిన పాకిస్తాన్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 282 పరుగులు చేసింది. టాపార్డర్‌లో కెప్టెన్ బాబర్ ఆజమ్ (92 బంతుల్లో 74; 4 ఫోర్లు, 1 సిక్స్), షఫీక్ (75 బంతుల్లో 58; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీలు సాధించారు. షాదాబ్ ఖాన్ (38 బంతుల్లో 40; 1 ఫోర్, 1 సిక్స్), ఇఫ్తికార్ (27 బంతుల్లో 40; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుగ్గా ఆడారు. నూర్ అహ్మద్ 3, నవీనుల్ 2 వికెట్లు తీశారు. అనంతరం అఫ్గానిస్తాన్ 49 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి 286 పరుగులు చేసి గెలిచింది. గుర్బాజ్ (53 బంతుల్లో 65; 9 ఫోర్లు, 1 సిక్స్), ఇబ్రహీమ్ జద్రాన్ (113 బంతుల్లో 87; 10 ఫోర్లు), రహ్మత్ షా (84 బంతుల్లో 77 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అఫ్గానిస్తాన్‌ను గెలిపించారు. వన్డే ఫార్మాట్‌లో పాకిస్తాన్‌పై అఫ్గానిస్తాన్‌కిది తొలి విజయం కావడం విశేషం. ఈ మ్యాచ్‌కంటే ముందు పాక్‌తో జరిగిన ఏడు మ్యాచ్‌ల్లోనూ అఫ్గానిస్తాన్ ఓడిపోయింది. టోర్నీలో మూడో ఓటమితో పాకిస్తాన్ సెమీఫైనల్ చేరే అవకాశాలు సంక్లిష్టమయ్యాయి. పాక్ సెమీస్ రేసులో ఉండాలంటే తదుపరి నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలుపొందాలి. ఇతర జట్ల మ్యాచ్‌ల ఫలితాలు సమీకరణాలు కూడా ఆ జట్టుకు కలిసి రావాలి.

సాక్షి బిజినెస్
బుధవారం
25-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (సోమవారం ముగింపు)	సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
	826	261
	64,572	19,282

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	13,179	△ 61
డోజోన్స్	33,087	△ 150
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,390	△ 15
డాక్స్	14,880	△ 80
షాంఘై	2,962	△ 23
నికాయ్	31,062	△ 100

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (24 క్యారట్)	60,250
బంగారం (22 క్యారట్)	57,380
వెండి (కేజీ)	77,550

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ప్రామాణిక	81.36	85.04
£	బ్రిటన్ పౌండ్	ప్రామాణిక	99.30	104.24
€	యూరో	ప్రామాణిక	86.29	90.73
¥	జపాన్ ఎన్ (100)	ప్రామాణిక	43.00	68.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ప్రామాణిక	50.57	55.39
S$	సింగపూర్ డాలర్	ప్రామాణిక	58.56	63.23
SAR	సౌదీ రియాల్	ప్రామాణిక	21.23	22.85
UAE D	యూఏఈ దిర్హామ్	ప్రామాణిక	21.75	23.55
¥	చైనా యువాన్	ప్రామాణిక	10.26	12.33

భారత్.. మూడో అతిపెద్ద ఎకానమీ!

- 2030 నాటికి జపాన్‌ను వెనక్కునెట్టే అవకాశం
- 7.3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఆవిర్భవించే సత్తా
- ఎస్అండ్‌పీ గ్లోబల్ అంచనా



న్యూఢిల్లీ: భారత్ 2030 నాటికి జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే అవకాశం ఉందని ఎస్అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ పేర్కొంది. అప్పటికి భారత్ స్థూల దేశీయోత్పత్తి 7.3 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందన్న విశ్వాసాన్ని వెలిబుచ్చింది. ఇదే జరిగితే ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో చైనా తర్వాత భారత్ ఎకానమీ రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా సైతం ఆవిర్భవిస్తుంది. పటిష్ట ఆర్థిక వ్యవస్థతో ప్రపంచంలో వేగవంతమైన ఎకానమీ వృద్ధి రేటును భారత్ కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. రానున్న దశాబ్ద కాలంలో కూడా ఇదే ధోరణి కొనసాగే వీలుంది. 2024 మార్చితో ముగిసే ఆర్థిక సంవత్సరంలో 6.2 శాతం నుంచి 6.3 శాతం శ్రేణిలో భారత్ ఎకానమీ వృద్ధి సాధిస్తుందన్న అంచనాలు ఉన్నాయి. ఆయా అంశాలకు సంబంధించి ఎస్అండ్‌పీ గ్లోబల్ తాజా నివేదిక ఏమి చెబుతోందంటే..

- 2023, 2024ల్లో ఎకానమీ వృద్ధి రేటు పటిష్టంగా ఉంటుంది. దేశీయంగా బలమైన వినియోగం దీనికి దోహదపడే అంశం.
- గత దశాబ్ద కాలంలో భారతదేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) ప్రవాహం వేగవంతమైంది. భారత ఆర్థిక వ్యవస్థకు అనుకూలమైన దీర్ఘకాలిక వృద్ధి దృక్పథం కొనసాగుతోంది. యువత అధికంగా ఉండడం, వేగంగా పెరుగుతున్న పట్టణ గృహ ఆదాయాలు దేశ పురోగతికి దోహదపడే అంశాలు. మధ్య తరగతి ప్రజల సంఖ్య దేశంలో పెరుగుతుండడం మరో సానుకూల అంశం.
- సేవా రంగంసహా వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశీయ వినియోగ మార్కెట్, పారిశ్రామిక, తయారీ, మౌలిక రంగాలు దేశ పురోగతికి బాటలు వేస్తున్నాయి. ఆయా సానుకూలతలు బహుళజాతి కంపెనీలకు విస్తృతస్థాయిలో పెట్టుబడులు పెట్టడానికి భారత్ గమ్యస్థానంగా మార్చుతోంది.
- ప్రస్తుతం దేశంలో పురోగమిస్తున్న డిజిటలైజేషన్ ఈ–కామర్స్ వృద్ధిని వేగవంతం చేస్తుంది. రాబోయే దశాబ్దంలో రిటైల్ వినియోగదారుల మార్కెట్ ధోరణుల మార్పునకు ఆయా అంశాలు దోహదపడతాయి. ఈ పరిణామాలు టెక్నాలజీ, ఈ–కామర్స్‌లో ప్రముఖ ప్రపంచ బహుళజాతి కంపెనీలను భారత మార్కెట్‌కు ఆకర్షిస్తాయి.
- 2030 నాటికి 110 కోట్ల మందికి ఇంటర్నెట్ అందుబాటులో ఉంటుంది. 2020లో ఇంటర్నెట్ యూజర్ల సంఖ్య దాదాపు 50 కోట్లకు ఇది రెట్టింపు.
- ఈ–కామర్స్ వేగవంతమైన వృద్ధి, 4జీ, 5జీ స్మార్ట్‌ఫోన్ టెక్నాలజీకి వినియోగదారులు అధిక సంఖ్యలో మారడం వంటి అంశాలు ఆన్‌లైన్ ద్వారా సేవలను విస్తృతం చేసే యూనికార్న్ సంస్థల పురోగతికి దోహదపడతాయి.
- భారత్‌లో చోటుచేసుకుంటున్న పలు సానుకూల ఆర్థిక పరిణామాలు ఆటో, ఎలక్ట్రానిక్స్, కెమికల్స్ వంటి తయారీ పరిశ్రమలతో పాటు బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, అసెట్ మేనేజ్‌మెంట్, హెల్త్ కేర్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వంటి సేవా రంగాల పురోగతికి దోహదపడతాయి. పెట్టుబడులకు సంబంధించి బహుళజాతి కంపెనీలకు అత్యంత ముఖ్యమైన దీర్ఘకాలిక వృద్ధి మార్కెట్‌లలో ఒకటిగా దేశం మారుతుంది.

భారత్ పురోగతి బాట పటిష్టం: ఆర్థికశాఖ

భారత్ 2024 మార్చితో ముగిసే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రపంచంలోనే వేగవంతమైన ఎకానమీ హోదాను కొనసాగిస్తుందని ఆర్థిక మంత్రిత్వశాఖ సెప్టెంబర్ నెలవారీ సమీక్షా నివేదిక స్పష్టం చేసింది. ద్రవ్యోల్బణం దిగిరావడంసహా భారత్ ఆర్థిక ఫండమెంటల్స్ పటిష్టంగా ఉన్నట్లు నివేదిక పేర్కొంది. పశ్చిమాసియా సవాళ్లు, పరిణామాలు అంతర్జాతీయ క్రూడ్ ధరలపై ప్రభావం చూపుతాయని అభిప్రాయపడింది. అమెరికా స్టాక్ మార్కెట్లు బలహీన ధోరణిలో ఉన్నట్లు కనిపిస్తోందని, ఇది పూర్తి వాస్తవ రూపం దాల్చితే మిగిలిన మార్కెట్లపైనా ఈ ప్రభావం పడవచ్చని వివరించింది.

ప్రస్తుతం అయిదో స్థానంలో..

భారత్ ప్రస్తుతం ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. 25.5 ట్రిలియన్ డాలర్లతో అమెరికా ప్రస్తుతం ప్రపంచంలో అతిపెద్ద ఎకానమీగా కొనసాగుతోంది. ప్రపంచ మొత్తం జీడీపీలో పావుశాతం వాటాను కలిగి ఉంది. ఇక 17.9 శాతం ప్రపంచ జీడీపీ వాటాతో 18 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా చైనా రెండవ స్థానంలో ఉంది. తరువాతి స్థానాల్లో జపాన్ (4.2 ట్రిలియన్ డాలర్లు), జర్మనీ (4 ట్రిలియన్ డాలర్లు)లు ఉన్నాయి. 3.5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీతో భారత్ ఐదవ స్థానంలో నిలుస్తోంది. 2022 నాటికి భారత్ ఎకానమీ బ్రిటన్, ఫ్రాన్స్‌లను అధిగమించగా, 2023 నాటికి జర్మనీని అధిగమించే అవకాశం ఉందన్న అంచనాలు ఇప్పటికే ఉన్నాయి.

ఈవెంట్ల నిర్వహణకు కోహ్లి కంపెనీ

నిసర్గ పేరుతో ఏర్పాటు



న్యూఢిల్లీ: సెలబ్రిటీ దంపతులు విరాట్ కోహ్లి, ఆయన భార్య అనుష్క శర్మ తాజాగా ఈవెంట్ల నిర్వహణ కోసం కొత్త వెంచర్ ప్రారంభించారు. నిసర్గ పేరుతో దీన్ని ఏర్పాటు చేశారు. తొలుత మోటార్ స్పోర్ట్స్, వినోద కార్యక్రమాల నిర్వహణ సంస్థ ఎ లీట్ ఆక్సేన్‌తో నిసర్గ జట్టు కట్టింది. ఎలీట్ ఆక్సేన్‌కు ది వేలీ రన్ వంటి ఈవెంట్లకు సంబంధించి మేథోహక్కులు (ఐపీ) ఉన్నాయి. ప్రస్తుతం మూడు మోటార్‌స్పోర్టింగ్ ఈవెంట్లు, ఎగ్జిబిషన్లు, ఒక మ్యూజిక్ కాన్సర్ట్ మొద లైనవి నిర్వహించనున్నట్లు నిసర్గ పేర్కొంది. తాహా కోబర్న్ కూటే ఈ సంస్థకు సీఈవోగా, సీవోవోగా అంకుర్ నిగమ్ నియమితులయ్యారు.

విమానాల లీజింగ్ వ్యాపారంలోకి అదానీ పోర్ట్స్



ముంబై: అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనమిక్ జోన్ (ఏపీ సెజ్) తాజాగా విమానాల లీజింగ్ వ్యాపారంలోకి ప్రవేశించింది. ఇందుకోసం సొంతంగా ఉడాన్‌వత్ లీజింగ్ ఐఎఫ్ఎస్‌సీ పేరిట ఒక సంస్థను ఏర్పాటు చేసింది. రూ. 2.5 కోట్లు అధీకృత మూలధనంతో దీన్ని ప్రారంభించినట్లు సంస్థ తెలిపింది. టాటా గ్రూప్‌లో భాగమైన ఎయిరిండియా కూడా ఇటీవలే ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్ (ఐఎఫ్ఎస్‌సీ) గిఫ్ట్ సిటీలో సొంత ఎయిర్‌క్రాఫ్ట్ లీజింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసింది. మరో విమానయాన సంస్థ ఇండిగో కూడా అలాంటి ప్రయత్నాల్లోనే ఉన్నట్లు సమాచారం.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

25-10-2023	
విశాఖ	540–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	531–00
విజయవాడ	531–00
రిటైల్ ధర (డజను)	72.00
24-10-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	511–00
వరంగల్	513–00
రిటైల్ ధర	5.70

ఫ్లిప్‌కార్ట్ నష్టాలు పెరిగాయ్

2022–23లో రూ. 4,891 కోట్లు



న్యూఢిల్లీ: మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సరం (2022–23)లో ఈకామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నికర నష్టం భారీగా పెరిగి రూ. 4,891 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో రూ. 3,371 కోట్ల నష్టం మాత్రమే నమోదైంది. బిజినెస్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ టోఫ్లర్ వివరాల ప్రకారం స్టాండెలోన్ నష్టాలు సైతం 44 శాతం పెరిగి రూ. 4,839 కోట్లను దాటాయి. అంతక్రితం రూ. 3,362 కోట్ల నష్టం ప్రకటించింది. కాగా.. కన్సాలిడేటెడ్ ఆదాయం 9 శాతం పైగా ఎగసి రూ. 56,013 కోట్లకు చేరింది. 2021–22లో మొత్తం ఆదాయం రూ. 51,176 కోట్లుగా నమోదైంది. మొత్తం వ్యయాలు రూ. 60,858 కోట్లకు చేరాయి.

పీఎన్‌బీ హౌసింగ్ లాభం 383 కోట్లు



న్యూఢిల్లీ: పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్ (క్యూ2)లో నికర లాభం 46 శాతం జంప్‌చేసి రూ. 383 కోట్లను తాకింది. వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 263 కోట్ల నికర లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,683 కోట్ల నుంచి రూ. 1,779 కోట్లకు ఎగసింది.

ఫ్లోటింగ్ రేట్ సేవింగ్స్ బాండ్స్‌లో రిటైల్ పెట్టుబడులు

ప్రకటించిన ఆర్‌బీఐ



ముంబై: ఆర్‌బీఐ రిటైల్ డైరెక్ట్ పోర్టల్ ద్వారా 'ఫ్లోటింగ్ రేట్ సేవింగ్స్ బాండ్స్, 2020 (పన్ను వర్తించే)లో రిటైల్ ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టుకునే అవకాశం అందుబాటులోకి వచ్చింది. ఆర్‌బీఐ–రిటైల్ డైరెక్ట్ స్కీమ్‌ను ప్రధాని మోదీ 2021 నవంబర్ 12న ప్రారంభించడం గమనార్హం. ఈ పథకం కింద రిటైల్ ఇన్వెస్టర్లు ఆర్‌బీఐ వద్ద నేరుగా రిటైల్ డైరెక్ట్ గిల్ట్ అకౌంట్‌ను తెరుచుకోవచ్చు. ప్రభుత్వ సెక్యూరిటీల్లో ఈ ఖాతా ద్వారా ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. భారత ప్రభుత్వంతో సంప్రదింపుల అనంతరం ఫ్లోటింగ్ రేట్ సేవింగ్స్ బాండ్స్, 2020లో పెట్టుబడులకు అనుమతిస్తున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించింది. ఇప్పటి వరకు ఆర్‌బీఐ రిటైల్ డైరెక్ట్ పోర్టల్ ద్వారా ప్రభుత్వ సెక్యూరిటీలు, ట్రెజరీ బిల్లులు, రాష్ట్ర ప్రభుత్వాల బాండ్లు, సావరీన్ గోల్డ్ బాండ్లలో పెట్టుబడులకు అవకాశం ఉంది. ఫ్లోటింగ్ రేట్ సేవింగ్స్ బాండ్స్ అనేవి ఏడేళ్ల కాల వ్యవధితో ఉంటాయి. ఇవి ట్రేడ్ అయ్యేవి కావు. వీటిని కేంద్ర ప్రభుత్వం జారీ చేస్తుంది. గడువు ముగిసిన తర్వాత చెల్లింపులు చేస్తారు.

మార్కెట్లకు 'మధ్యప్రాచ్యం' సెగ ..

ఇన్వెస్టర్ల సంపద రూ. 7 లక్షల కోట్లు ఆవిరి

ముంబై: మధ్యప్రాచ్యంలో పరిస్థితులు ఆందోళనకరంగా మారుతుండటంతో సోమవారం దేశీ సూచీలు క్షీణించిన నేపథ్యంలో ఇన్వెస్టర్ల సంపద ఏకంగా ఒకే రోజున ఏకంగా రూ. 7.59 లక్షల కోట్ల మేర తుడిచిపెట్టుకుపోయింది. వరుసగా నాలుగు రోజుల వ్యవధిలో కీలక సూచీల పతనంతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 12,51,700 కోట్ల మేర హరించుకుపోయి రూ. 311,30,724 కోట్లకు క్షీణించింది. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం సెన్సెక్స్ 826 పాయింట్లు (1.26%) క్షీణించి రూ. 64,572 వద్ద, నిఫ్టీ 261 పాయింట్లు (1.34%) తగ్గి 19,282 వద్ద క్లోజయ్యాయి. దసరా సందర్భంగా దేశీ మార్కెట్లు మంగళవారం పని చేయలేదు. గత బుధవారం నుంచి వరుసగా నాలుగు సెషన్లలో సెన్సెక్స్ 1,925 పాయింట్లు పతనమై కీలకమైన 65,000 మార్కు దిగువకు పడిపోయింది. నిఫ్టీ 530 పాయింట్లు తగ్గింది. ఇజ్రాయెల్–హమాస్ మధ్య ఉద్రిక్తతలకు తోడు ద్రవ్యోల్బణం, మరో దఫా వడ్డీ రేట్ల పెంపు అవకాశాలు, అంతర్జాతీయంగా అనిశ్చితి మొదలైన వాటిపై ఇన్వెస్టర్లలో ఆందోళన నెలకొందని, మార్కెట్ సెంటిమెంట్ బలహీనపడిందని కోటక్ సెక్యూరిటీస్ ఈక్విటీ రీసెర్చ్ (రిటైల్) హెడ్ శ్రీకాంత్ చౌహాన్ తెలిపారు. సెన్సెక్స్‌లో జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా మోటార్స్, టాటా స్టీల్, విప్రో, ఎస్‌బీఐ మొదలైనవి క్షీణించాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్ లాభపడ్డాయి.



సినిమా


• చిరంజీవి, సురేఖ, వశిష్ఠ, విక్రమ్

పాటతో ప్రారంభం


చిరంజీవి హీరోగా 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. ఈ ఫ్యాంటసీ అడ్వెంచరస్ సినిమాను యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత అల్లు అరవింద్ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు కె. రాఘవేంద్ర రావు క్లాప్ ఇచ్చారు. చిరంజీవి, ఆయన సతీమణి సురేఖ కలిసి ఈ సినిమా స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందించారు. ఈ సినిమా మ్యూజిక్ రికార్డింగ్స్ ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఈ చిత్ర సంగీత దర్శకుడు ఎమ్ఎమ్ కీరవాణి మాట్లాడుతూ– ''మ్యూజిక్ రికార్డింగ్‌తో పూజా కార్యక్రమాలను ప్రారంభించడం అనేది సంప్రదాయం. ఈ సంప్రదాయాన్ని తిరిగి తీసుకు వస్తూ, చిరంజీవిగారి 156వ సినిమాను మ్యూజిక్ రికార్డింగ్‌తో ప్రారంభించడం జరిగింది. సెలబ్రేషన్ సాంగ్ రికార్డింగ్‌తో పనులు ప్రారంభమయ్యాయి'' అన్నారు. ''అద్భుతమైన పాటలతో వస్తామని హామీ ఇస్తున్నాం. ఈ అరుదైన చిత్రానికి చాన్స్ ఇచ్చిన కీరవాణిగారికి, వశిష్ఠకు, నిర్మాతలకు ధన్యవాదాలు'' అన్నారు రచయిత చంద్రబోస్. ఈ చిత్రానికి కెమెరా: చోటా కె. నాయుడు.

సెలబ్రేషన్స్ టైమ్


• ప్రభాస్ కటౌట్

ప్రభాస్ జన్మదిన (అక్టోబర్ 23) వేడుకను హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి కైతలాపూర్ గ్రౌండ్స్‌లో ఫ్యాన్స్ నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా 'సలార్' చిత్రం లుక్‌తో ప్రభాస్ భారీ కటౌట్‌ను ఆవిష్కరించారు ఫ్యాన్స్. ఈ కార్యక్రమంలో ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు శాస్త్రి, రామకృష్ణ, గోవింద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే.. ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న 'సలార్' చిత్రంలోని తొలి భాగం 'సలార్: సీజ్‌ఫైర్' డిసెంబరు 22న విడుదల కానుంది. మరోవైపు ప్రభాస్ ప్రస్తుతం ఫారిన్‌లో ఉన్నారని, వచ్చే నెల తన మరో చిత్రం 'కల్కి 2898ఏడీ' షూటింగ్‌లో ఆయన పాల్గొంటారని ఫిల్మ్‌నగర్ సమాచారం.

మాస్ అవతార్


• మహేశ్‌బాబు

మహేశ్‌బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా సినిమా 'గుంటూరు కారం'. శ్రీలీల, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం జనవరి 13న విడుదల కానుంది. దసరా సందర్భంగా 'గుంటూరు కారం' నుంచి కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేసి, త్వరలోనే తొలి పాటను విడుదల చేయనున్నామని, ఈ సినిమాలో అల్ట్రా మాస్ అవతార్‌లో మహేశ్‌బాబు ప్రేక్షకులను అలరిస్తారని చిత్ర యూనిట్ వెల్లడించింది. ఈ చిత్రానికి సంగీతం: తమన్.

దీపావళికి జరగండి


• రామ్‌చరణ్

దీపావళికి జరగండి అంటున్నారు రామ్‌చరణ్. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న సినిమా 'గేమ్ చేంజర్'. ఈ చిత్రంలో కియారా అద్వానీ మెయిన్ హీరోయిన్. ఈ చిత్రంలోని 'జరగండి..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను దీపావళికి విడుదల చేయనున్నట్లు శంకర్ దసరా సందర్భంగా వెల్లడించారు. తమన్ ఈ సినిమాకు స్వరకర్త. వచ్చే ఏడాది ఈ చిత్రం విడుదల కానుంది.

హైదరాబాదీ కుర్రాడి ప్రేమ

''**నే**ను నటించిన 'కేరాఫ్ కంచరపాలెం' ప్రివ్యూకి వచ్చిన ఆనంద్ 'లింగొచ్చా'కి నన్ను హీరోగా తీసుకున్నాడు. ఇందులో పక్కా హైదరాబాదీ కుర్రాడిలా కనిపిస్తాను. ఒక వైవిధ్యమైన ప్రేమకథకి వినోదం జోడించి ఆనంద్ ఈ సినిమా తీశాడు'' అన్నారు కార్తీక్ రత్నం. ఆనంద్ బడా దర్శకత్వంలో కార్తీక్ రత్నం, సుప్యర్థ సింగ్ జంటగా నటించిన చిత్రం 'లింగొచ్చా'. జె. నీలిమ సమర్పణలో యాదగిరి రాజు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో ఆనంద్ బడా మాట్లాడుతూ– ''హైదరాబాద్‌లో బిర్యానీ, ఇరానీ ఛాయ్‌లా మా 'లింగొచ్చా' ఫేమస్ అవుతుంది'' అన్నారు. ''కార్తీక్ రత్నం మంచి నటుడని అందరికీ తెలుసు. కానీ ఆయనలో ఉన్న స్టార్ యాక్టర్‌ని ఈ సినిమా ద్వారా మా దర్శకుడు పరిచయం చేశాడు'' అన్నారు యాదగిరి రాజు.


• సుప్యర్థ, కార్తీక్ రత్నం


• నాని

కొత్త మేకోవర్‌తో యాక్షన్

నాని హీరోగా 'సరిపోదా శనివారం' చిత్రం హైదరాబాద్‌లో ఆరంభం అయింది. ఇందులో ప్రియాంకా అరుళ్ మోహన్ హీరోయిన్. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో డీవీవీ దానయ్య, దాసరి కల్యాణ్ ఈ యాక్షన్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి నిర్మాత 'దిల్' రాజు కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు వీవీ వినాయక్ క్లాప్ ఇచ్చారు. దర్శక–నటుడు ఎస్‌జే సూర్య గౌరవ దర్శకత్వం వహించగా, డీవీవీ దానయ్య స్క్రిప్ట్‌ను వివేక్ ఆత్రేయకు అందించారు. ''ఈ సినిమాలోని సూర్య పాత్ర కోసం నాని సరికొత్తగా మేకోవర్ కానున్నారు. ఆయన రగ్డ్ లుక్‌లో కనిపిస్తారు'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, కెమెరా: మురళి .జి.

ఐదు భాషల్లో సుబ్రహ్మణ్య


• అద్వయ్

నటుడు–డబ్బింగ్ ఆర్టిస్ట్–రచయిత–ఫిల్మ్ మేకర్ రవిశంకర్ కుమారుడు అద్వయ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రానికి 'సుబ్రహ్మణ్య' టైటిల్‌ను ఖరారు చేశారు. పి. రవిశంకర్ దర్శకత్వంలో ప్రవీణ కడియాల, రామలక్ష్మి సమర్పణలో తిరుమల్ రెడ్డి, అనిల్ కడియాల ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ''ఈ చిత్రం కోసం అత్యున్నత ప్రమాణాలతో వీఎఫ్ఎక్స్ చేయాల్సి ఉంది. తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: రవి బస్రూర్, కెమెరా: రాజ్‌తోట.


• వెంకటేశ్ మహా, సంపూర్ణేష్ బాబు

సరైన సినిమా పడిందన్నారు

– సంపూర్ణేష్ బాబు

''మార్టిన్ లూథర్ కింగ్' ఓ కొత్త ప్రయోగం. కొన్ని చోట్ల ప్రీమియర్లు వేయగా మంచి స్పందన లభించింది. ఇండస్ట్రీ వారు కూడా 'నీకు సరైన సినిమా పడింది' అన్నారు. ఈ సినిమా చేశాక సమాజం పట్ల నాకు మరింత బాధ్యత పెరిగింది'' అని సంపూర్ణేష్ బాబు అన్నారు. పూజా కొల్లూరు దర్శకత్వంలో సంపూర్ణేష్ బాబు, వీకే నరేశ్, శరణ్య ప్రదీప్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'మార్టిన్ లూథర్ కింగ్'. వైనాట్ స్టూడియోస్, రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పణలో మహాయాన మోషన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా సంపూర్ణేష్ బాబు మాట్లాడుతూ– ''పూజకి ఇది మొదటి సినిమా. నేను చాలా సినిమాలు చేసినా ఈ సినిమా కోసం ఆమె నాతో వర్క్ షాప్ చేయించారు'' అన్నారు. ''ఈ చిత్రంలో ముఖ్య పాత్ర చేయడంతో పాటు స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ అందించి, క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా చేశాను. ప్రజాస్వామ్యం ఎన్ని దేశాల్లో ఉంటే అన్ని దేశాల్లో చూపించాల్సిన సినిమా ఇది. అన్ని భాషల్లోనూ చెప్పాల్సిన కథ'' అన్నారు వెంకటేశ్ మహా.

రక్షిత్ ప్యాషన్‌తో వచ్చాడు

– నాగశౌర్య


• సంకీర్తన, రక్షిత్ అట్లూరి, నాగశౌర్య

''రక్షిత్ పుట్టుకతోనే ధనవంతుడు. సినిమాల్లోకి వస్తున్నాడన్నప్పుడు.. డబ్బుంది కదా సినిమాలు చేస్తాడనుకున్నాను. కానీ డబ్బుందని కాదు ప్యాషన్‌తో రక్షిత్ సినిమాలు చేస్తున్నాడు. వాళ్ల నాన్నగారికీ సినిమాలంటే ఇష్టం. ఇద్దరూ మంచి సినిమాలు చేయాలని ఆలోచిస్తుంటారు'' అని హీరో నాగశౌర్య అన్నారు. 'పలాస' ఫేమ్ రక్షిత్ అట్లూరి హీరోగా సెబాస్టియన్ నోవా ఆకోస్టా జూనియర్ దర్శకత్వం వహించిన చిత్రం 'నరకాసుర'. అపర్ణా జనార్ధన్, సంకీర్తనా విపిన్ హీరోయిన్లు. డాక్టర్ అజ్జా శ్రీనివాస్ నిర్మించిన ఈ సినిమా నవంబర్ 3న తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను నాగశౌర్య విడుదల చేసి, మాట్లాడుతూ– ''రక్షిత్ కొత్త కథలు, గ్రామీణ నేపథ్యంలో చిత్రాలు చేస్తుంటాడు. 'నరకాసుర' పెద్ద హిట్టవుతుందని నమ్ముతున్నాను'' అన్నారు. ''ఈ చిత్రంలో రక్షిత్ అద్భుతంగా నటించాడు'' అన్నారు డా. అజ్జా శ్రీనివాస్. ''మా సినిమా ప్రేక్షకుల్ని తప్పకుండా అలరిస్తుంది'' అన్నారు సెబాస్టియన్ నోవా. ''మా సినిమాలో మంచి వినోదం, విజువల్స్, చక్కని సంగీతం, మంచి కథ ఉన్నాయి. సినిమా చూశాక మేం చెప్పింది నిజం కాదని ప్రేక్షకులకు అనిపిస్తే టికెట్, పాప్‌కార్న్ డబ్బులు తిరిగి ఇస్తాం'' అన్నారు రక్షిత్ అట్లూరి.

సస్పెన్స్‌తో బాగుంది


• భవ్యశ్రీ, కిశోర్

'**బా**గుంది' టీజర్ బాగుంది. కిశోర్ నటన బాగుంది. రామ్‌కుమార్ చక్కగా తీశారు. ఈ సినిమాతో నిర్మాతలకు లాభాలు వచ్చి మరిన్ని చిత్రాలు తీయాలని కోరుకుంటున్నాను'' అన్నారు డైరెక్టర్ వేణు ఊడుగుల. కిశోర్ తేజ, భవ్యశ్రీ జంటగా రామ్‌కుమార్ దర్శకత్వం వహించిన చిత్రం 'బాగుంది'. కట్టా శివ సమర్పణలో రాజనేని వెంకటేశ్వర రావు, డా. మహేంద్ర బాబు నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను డైరెక్టర్ వేణు ఊడుగుల, నిర్మాత సతీష్, ఫస్ట్ లుక్‌ను తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ రిలీజ్ చేశారు. ''సస్పెన్స్ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం చూసి ప్రేక్షకులు థ్రిల్ అవుతారు'' అన్నారు రామ్‌కుమార్. ''మా సినిమా అన్ని వర్గాల వారికి నచ్చుతుంది'' అన్నారు రాజనేని వెంకటేశ్వర రావు.

రాజ్‌భవన్‌లో దసరా సందడి



రాజ్‌భవన్‌లో జరిగిన విజయదశమి వేడుకల్లో గవర్నర్ తమిళిసై పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె శమీపూజ నిర్వహించారు. కార్యక్రమంలో రాజ్‌భవన్ సిబ్బంది పాల్గొన్నారు.


స్వదేశీ ప్రైవేట్ రాకెట్ విక్రమ్-1 సిద్ధం

సాక్షి, హైదరాబాద్: దేశంలోనే తొలి ప్రైవేట్ రాకెట్ ప్రయోగ సంస్థ, హైదరాబాద్‌కు చెందిన 'స్కైరూట్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్' అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. పూర్తిగా దేశీయంగా రూపొందించిన ఏడంతస్తుల పొడవైన, బహుళ దశల లో-ఎర్త్ ఆర్బిట్ రాకెట్ విక్రమ్-1ను అందుబాటులోకి తీసుకొచ్చింది. సుమారు 300 కిలోల వరకు బరువుండే పేలోడ్‌లను ఈ రాకెట్ అంతరిక్షంలోకి మోసుకెళ్లగలదు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్రసింగ్ ఈ రాకెట్‌ను ఆవిష్కరించారు. అలాగే 60 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఆ సంస్థ నూతన కేంద్ర కార్యాలయం 'మ్యాక్స్-క్యూ'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జితేంద్రసింగ్ మాట్లాడుతూ స్కైరూట్ ఏరోస్పేస్‌ను దేశంలోకెల్లా ఒకే గొడుగు కింద ఉన్న అతిపెద్ద ప్రైవేట్ రాకెట్ అభివృద్ధి కేంద్రంగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో స్కైరూట్ ఏరోస్పేస్ సహ వ్యవస్థాపకుడు పవన్ చందన తదితరులు పాల్గొన్నారు.



2024 తొలినాళ్లలో ప్రయోగం

విక్రమ్-1 పూర్తిగా కార్బన్-ఫైబర్‌తో తయారైన రాకెట్. ఇందులో 3డీ ప్రింటెడ్ లిక్విడ్ ఇంజిన్లను అమర్చారు. ఇది బహుళ ఉపగ్రహాలను కక్ష్యలో ఉంచగలదు. 2024 తొలినాళ్లలోనే విక్రమ్-1ను ప్రయోగించాలని సంస్థ నిర్ణయించింది. ఇప్పటికే స్కైరూట్ 2022 నవంబర్ 18న విక్రమ్-ఎస్ రాకెట్‌ని విజయవంతంగా ప్రయోగించింది.





వాహన పూజ చేస్తున్న సీఎం కేసీఆర్

ప్రగతిభవన్‌లో ఘనంగా దసరా సంబురాలు

శమీ, వాహన, ఆయుధ పూజల్లో సీఎం

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధికారిక నివాసం ప్రగతి భవన్‌లో సోమవారం విజయదశమి వేడుకలు ఘనంగా జరిగాయి. సీఎం కేసీఆర్ కుటుంబ సమేతంగా ప్రగతిభవన్‌లోని నల్లపోచమ్మవారి ఆలయంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఎం సతీమణి శోభమ్మ, కుమారుడు మంత్రి కె.తారకరామారావు, కోడలు శైలిమ, మనుమడు హిమాన్షు పాల్గొన్నారు. జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించిన పూజారులు, విజయాలు సిద్ధించాలని ఆశీర్వదించారు. శుభసూచకంగా భావించే పాలపిట్టను సీఎం దర్శనం చేసుకుని వాహన, ఆయుధ పూజల్లో పాల్గొన్నారు. కర్ణాటకలోని శృంగేరీ పీఠం నుంచి తీసుకుని వచ్చిన శారదాదేవి నవరాత్రోత్సవ ప్రసాదాన్ని ముఖ్యమంత్రి దంపతులకు పూజారులు అందజేశారు. కశ్మీర్‌లోని శారద సర్వజ్ఞ పీఠం దేవాలయ జ్ఞాపికను తెలంగాణ మాసపత్రిక ఎడిటర్ అష్టకాల రామ్మోహన్‌రావు సీఎంకు అందజేశారు.

56% యువత, ఉద్యోగులే..

వందేభారత్ ప్రయాణికులపై రైల్వే సర్వే ● తక్కువ ప్రయాణ సమయం.. విలాసవంతమైన అనుభూతే కారణం

పట్టాలెక్కిన కొద్ది నెలల్లోనే ప్రయాణికులను వేగంగా తనవైపు ఆకర్షించుకుంటోంది వందేభారత్ రైలు. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం, బెంగళూరు, తిరుపతి రూట్లలో మూడు వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి. ఈ మూడింటి ఆక్యుపెన్సీ రేషియో 110 శాతానికి పైగానే నమోదవుతోంది. ఆ రూట్లలో రెండో వందేభారత్ రైలును ప్రవేశపెట్టినా, ఆక్యుపెన్సీ రేషియో మెరుగ్గానే ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ తరుణంలో దక్షిణ మధ్య రైల్వే తాజాగా ఈ రైళ్లలో ఎక్కువగా ప్రయాణిస్తున్న కేటగిరీలపై ఓ సర్వే నిర్వహించింది. మొత్తం ప్రయాణికుల్లో 56 శాతం మంది యువకులు, ఉద్యోగులు ప్రయాణిస్తున్నట్టు తేలింది. -సాక్షి, హైదరాబాద్

యువకులే ఎక్కువ

వందేభారత్ రైళ్లలో సగటున 29.08 శాతం యువతీయువకులే ఉన్నారు. 25-34 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారు ఎక్కువ సంఖ్యలో ప్రయాణిస్తున్నట్టు తేలింది. వేగంగా గమ్యం చేరుతుండటంతో ఈ రైలులో ప్రయాణానికే వారు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. చదువు, ఉద్యోగ ప్రయత్నం, టూర్లు.. ఇతర పనులకు వెళ్లేందుకు ఈ రైలు వైపే మొగ్గు చూపుతున్నారు. ప్రయాణ సమయం తక్కువగా ఉండటంతో పనులు వేగంగా చేసుకునే వీలు ఉండటం వీరికి కలిసి వస్తోంది. భద్రత పరంగా మెరుగ్గా ఉండటంతో ఒంటరిగా వెళ్లే యువతులు ఇందులో ప్రయాణించేందుకే ఇష్టపడుతున్నారు. ఈ రైలు ఒకవైపు ఉదయం బయలుదేరి మధ్యాహ్నం వరకు, రెండో వైపు మధ్యాహ్నం బయలు దేరి రాత్రి 11 వరకు గమ్యం చేరుతోంది. దీంతో అది సురక్షిత సమయంగా యువతులు అభిప్రాయపడుతున్నారు.

ఉద్యోగులూ ఎక్కువే

వందేభారత్ రైళ్లలో 26.85 శాతం మంది ఉద్యోగులు ప్రయాణిస్తున్నట్లు సర్వేలో తేలింది. గరుడ ప్లస్ బస్సు చార్జీతో వందేభారత్ రైళ్లలో ప్రయాణించే వెసులుబాటు ఉండటాన్ని ఉద్యోగులు పరిగణిస్తున్నారని రైల్వే అధికారులు చెబుతున్నారు. వందేభారత్ దెబ్బకు కొన్ని ఎయిర్‌లైన్స్ సంస్థలు టికెట్ చార్జీలను సవరించే పరిస్థితి వస్తోందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చని అంటున్నారు. ఈ సర్వే నివేదికను రైల్వే బోర్డు దృష్టికి తీసుకెళ్లామని, దాని ఆధారంగా వందేభారత్ రైళ్లలో మరిన్ని మార్పు చేర్పులు చేసే వీలుందని పేర్కొంటున్నారు. కాగా, 11.81 శాతం మంది వయోవృద్ధులు ఉంటున్నట్టు తేలింది.



ప్రయాణాన్ని ఆస్వాదించండి



వేగంగా గమ్యం చేరటంతోపాటు ప్రయాణికులు విలాసవంతమైన ప్రయాణ అనుభూతిని కల్పించేందుకు వందేభారత్ రైళ్లు ప్రారంభమయ్యాయి. ప్రయాణికుల అవసరాలు గుర్తించి వాటిని ఎప్పటికప్పుడు మరింత ఉన్నతీకరిస్తున్నాం. అనతికాలంలోనే లక్షల మంది వాటిల్లో ప్రయాణించారు. క్రమంగా ప్రయాణికుల సంఖ్య పెరుగుతూనే ఉంది. మిగతా ప్రయాణికులు కూడా వాటి సేవలను పొందాలని ఆశిస్తున్నాం. - అరుణ్‌కుమార్ జైన్, జీఎం, దక్షిణ మధ్య రైల్వే



లెపిడోగాథిస్ జాతికి చెందిన మొక్కను శేషాచలంలో గుర్తించిన వైవీయూ పరిశోధకులు

- నిర్ధారించిన ప్రముఖ పరిశోధక సంస్థలు
- 'లెపిడోగాథిస్ రాజశేఖరే'గా నామకరణం
- పలు చికిత్సలకు ఉపయోగపడుతుందన్న పరిశోధకులు

అరుదైన మొక్కకు 'రాజశేఖరుడి' పేరు

విద్యా రంగానికి దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన సేవలకు గుర్తుగా ఓ అరుదైన మొక్కకు ఆయన పేరు పెట్టి యోగి వేమన యూనివర్సిటీ(వైవీయూ) గౌరవించింది. దీనిని లండన్‌లోని రాయల్ బొటానికల్ గార్డెన్, కోల్‌కతాలోని బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియాతో పాటు మరికొన్ని పరిశోధక సంస్థలు ధ్రువీకరించాయి. వివరాలు.. వైవీయూ వృక్షశాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎ.మధుసూదన్‌రెడ్డి, పరిశోధకుడు, ఢిల్లీలోని ఎస్వీ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.కె.ప్రసాద్‌ల బృందం 2020లో వైఎస్సార్ జిల్లా బాలుపల్లి అటవీ రేంజ్‌లోని మొగిలిపెంట ప్రాంతంలో ఓ మొక్కను గుర్తించింది. శాస్త్రీయ పరిశోధనల అనంతరం అరుదైన మొక్కగా గుర్తించి.. నిర్ధారణ కోసం లండన్‌లోని రాయల్ బొటానికల్ గార్డెన్, కోల్‌కతాలోని బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా, చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, సౌత్ చైనా బొటానికల్ గార్డెన్, గాన్‌డోంగ్ ప్రావిన్స్ సంస్థలకు పంపించింది. ఆయా సంస్థలు మొక్క శాస్త్రీయతను నిర్ధారించి.. అరుదైన మొక్కగా గుర్తింపునిచ్చాయి. న్యూజిలాండ్‌కు చెందిన సైంటిఫిక్ జర్నల్ ఫైటోటాక్సాలో దీనిని కవర్ పేజీగా ప్రచురించారు. ప్రపంచం మొత్తం మీద శేషాచలం అడవుల్లో మాత్రమే లభించే మొక్కగా నిర్ధారణ అవ్వడంతో.. ఈ ప్రాంతానికి సంబంధించిన పేరు పెట్టుకునే వెసులుబాటు లభించింది. దీంతో పరిశోధకులు, అధికారులు చర్చించి.. వైవీయూ వ్యవస్థాపకుడు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా ఎందరో పేద విద్యార్థులకు చదువుకునే అవకాశం కల్పించిన దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు పెట్టారు.

ఔషధ విలువలు అధికం

లెపిడోగాథిస్ జాతికి చెందిన ఈ మొక్కకు ప్రజాతిగా 'రాజశేఖరే'(లాటిన్ భాష) పేరును కలిపి నామకరణం చేశారు. లెపిడోగాథిస్ జాతికి చెందిన మొక్కలు ప్రపంచవ్యాప్తంగా 144 ఉండగా.. ఇప్పుడు 145వ మొక్కగా 'లెపిడోగాథిస్ రాజశేఖరే' గుర్తింపు పొందింది. భారత్‌లో 34 మొక్కలు ఉండగా.. ఇది 35వది. ఏపీలో 8 మొక్కలు ఉండగా.. ఇది తొమ్మిదవది. ఈ జాతికి సంబంధించిన మొక్కలను స్థానిక భాషలో ముళ్లబంతి, సూర్యకాంతం తదితర పేర్లతో పిలుస్తారు. ఔషధ విలువలు కూడా ఉండటంతో.. సంరక్షించాల్సిన జాతుల కింద వీటిని గుర్తించారు. జ్వరం, ఎగ్జిమా, సోరియాసిస్, ఎపిలెప్సీ, దురద, మౌత్ అల్సర్, కీటకాల కాటు, దెబ్బలు తదితర చికిత్సలకు వీటిని వినియోగిస్తారని వైవీయూ వృక్షశాస్త్ర విభాగ ప్రొఫెసర్ డా.ఎ.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ మొక్కలకు మార్చి, ఏప్రిల్ నెలల్లో మాత్రమే పూలు పూస్తాయని చెప్పారు. వైవీయూలోని బొటానికల్ గార్డెన్‌లో సంరక్షిస్తున్నట్లు చెప్పారు. -వైవీయూ (వైఎస్సార్ జిల్లా)

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.